సత్యమేవ జయతే

# సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 131

శుక్రవారం 1-8-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

● యువశక్తి

# ఆకాశమంత ఆశయం

పెహచాన్... ది స్కూల్... బడిలో విద్యార్థులు కూచునేందుకు తరగతి గదులు కానీ, పాఠాలు నేర్చుకునేందుకు నల్లబల్లలు కానీ కనిపించవు. అసలది పేరుకు మాత్రమే బడి... నిజానికది ఓ గుడి ఆవరణలో కొద్ది మంది పిల్లలు తలదాచుకునేందుకు దొరికిన కాసింత ఖాళీ స్థలం మాత్రమే. అయితేనేం...ఆ విద్యాలయంలో కనీసం ఐదువేలమంది పాఠాలు చదువుకుని ప్రయోజకులయ్యారు. చదువుకోవాలన్న కోరిక విద్యార్థులకు, తమకు తెలిసిన పాఠాలను పదిమందికీ నేర్పించాలన్న తపన ఆ వాలంటీర్లకూ ఉంది కాబట్టే అంతమంది చదువుకోగలిగారు.



● టాండన్



ప్రపంచ ఆరోగ్య సంస్థ ఢిల్లీ కార్యాలయం నుంచి కేవలం 50 మీటర్ల దూరంలో దాదాపు 10,000 మంది నివసించే ఒక మురికివాడ ఉంది. ఇది పరిశుభ్రమైన నీరు, ఆరోగ్య సంరక్షణ వంటి ప్రాథమిక అవసరాలకు కూడా నోచుకోని ప్రదేశం. కొన్ని ఏళ్ల క్రితం వరకు, అక్కడి వారికి చదువనేది ఒక అందని మావిపండు.

ఇంతలోనే ఈ క్లిష్టమైన ప్రకృతి చిత్రంలో పరివర్తన కథలు వేళ్ళూనుకున్నాయి, దీనికి సంస్థల ద్వారా కాదు, సామాజిక వ్యవస్థ నుంచే ఒకప్పుడు వెలివేయబడిన పిల్లలే నాయకత్వం వహించారు. వారిలో దీపక్ కుమార్ ఒకరు. ఏమాత్రం విద్యాగంధం లేని మురికివాడ నుంచి 12వ తరగతి బోర్డు పరీక్షలలో 94 శాతం ఉత్తీర్ణత సాధించి ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందిన మొదటి విద్యార్థి అతడే.

అతడి ఆ ప్రయాణం వెనుక 'పెహచాన్: ది స్ట్రీట్ స్కూల్' అనే స్వచ్ఛంద సంస్థ అండగా నిలబడి ఉంది. పదేళ్ల క్రితం మొదటగా పెహచాన్‌లోకి అడుగుపెట్టినప్పుడు తరగతి గదులంటూ లేని ఈ బడి నుంచి తాను కనీసం కళాశాల మెట్లయినా ఎక్కగలనా అనిపించిందంటాడు దీపక్. ఎందుకంటే అతని తండ్రి అక్కడి టీ బంకులకు పాలు పోసే చిరువ్యాపారి. భర్త తెచ్చే కాసింత డబ్బుతో ఇంటిల్లిపాది అవసరాలూ చూసే సామాన్య గృహిణి అతడి తల్లి. 'తరగతి గదులు లేవని దిగులు పడకు. ఈ ప్రాంగణమంతా ఒక పెద్ద కళాశాల అనుకో. చెప్పిన పాఠాలు చక్కగా చదువుకో' అంటూ అక్కడి వాలంటీర్లు ప్రేమగా తన వెన్ను తట్టి శ్రద్ధగా పాఠాలు బోధించారు. ఆసక్తితో ఆ పాఠాలు నేర్చుకున్నాను. అలా పరీక్షలు ఎప్పుడు రాశానో, వాటిలో ఉత్తీర్ణత ఎప్పుడు సాధించానో కూడా గుర్తు పెట్టుకునేలోగానే ఇంటర్‌లో మంచి మార్కులు సాధించి, ప్రతిష్ఠాత్మకమైన ఢిల్లీ యూనివర్సిటీలో బీకాం ఆనర్స్‌లో సీటు తెచ్చుకోవడం, ఏడాది చదువు కూడా అయిపోవడం చూస్తుండగానే జరిగిపోయింది' అంటాడు దీపక్.

'ఈ పాఠశాల నా కుటుంబం లాంటిది. నా 10 సంవత్సరాల ప్రయాణంలో, ఇది నా జీవితంలో చాలా ముఖ్యమైన భాగంగా మారింది. నేను క్రమం తప్పకుండా బడికి వెళ్లాను. ఇక్కడ నాకు పాఠాలతో పాటు చాలా ప్రేమ, సంరక్షణ, మార్గదర్శకత్వం కూడా నేను కోరకుండానే లభించాయి' అని గుర్తు చేసుకుంటాడతను.

**పెహచాన్ ఆర్థిక పునాది**

వ్యక్తిగత విరాళాలు, క్రౌడ్ ఫండింగ్ ప్రచారాలు, కార్పొరేట్ సీఎస్సార్ భాగస్వామ్యాల ద్వారా అందే నిధులే ఇంధనంగా సామాజికంగా బాధ్యతాయుతమైన సంస్థలు, వ్యక్తుల నుండి డిజిటల్ పరికరాలు, స్టేషనరీ వంటి మౌలిక సదుపాయాల సహకారంతో నడిచే ఈ పెహచాన్‌కు పదేళ్ల క్రితం పునాది వేశాడు ఢిల్లీకి చెందిన టాండన్. తనతోపాటు నడిచే కొద్ది మంది వాలంటీర్ల సహకారంతో అల్లరి చిల్లరగా తిరిగే మురికివాడల పిల్లలను చేరదీసి వారికి నాలుగు అక్షరం ముక్కలు చెప్పి, వారి కాళ్ల మీద వాళ్లు గౌరవంగా నిలబడేలా చేస్తున్నాడు.

అవును... ఆశయమే ఇంధనం... సమాజంలో తామూ గౌరవంగా జీవించాలన్న బస్తీ వాసుల ఆశే వారికి పెద్ద విశ్వవిద్యాలయం.

● స్టార్టప్ స్టార్

## రైతు నేస్తం



కేరళలోని అలప్పుజ జిల్లాకు చెందిన రైతు అంబికా చంద్రశేఖర్ కొన్ని సంవత్సరాల క్రితం వచ్చిన వరదల వల్ల చాలా సమస్యలు ఎదుర్కొన్నాడు. విధ్వంసం సృష్టించిన వరదలు నేలలోని సారాన్ని దెబ్బతీశాయి. దీంతో పంట దిగుబడి తగ్గింది. అదే సమయంలో ఆయన కుమారుడు దేవన్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. తన తండ్రిలాగే సమస్యలు ఎదుర్కొంటున్న రైతుల కోసం తన సోదరి దేవికతో కలిసి 'ఫ్యూజిలేజ్' అనే స్టార్టప్‌కు శ్రీకారం చుట్టాడు. అన్‌మ్యాన్‌డ్ ఏరియల్ వెహికిల్స్(యూఏవీ)ను ఆధారం చేసుకొని నిర్మించిన సాంకేతికతలో 'ఫ్యూజిలేజ్' ప్రత్యేకత సాధించింది. మౌలిక సదుపాయాల పర్యవేక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఈ సాంకేతికత ఉపయోగపడుతుంది. క్లిష్టమైన సవాళ్లను పరిష్కరిస్తుంది. పంటలకు సంబంధించిన వివరమైన సమాచారానికి ఉపకరించే ఎఫ్ఐఏ క్యూడీ10, నిరీక్ష అనే రెండు డ్రోన్‌లను తీసుకువచ్చింది కంపెనీ.

ఫండింగ్ నుంచి మౌలిక సదుపాయాల వరకు మొదట్లో రకరకాల సమస్యలను ఎదుర్కొన్నాడు దేవన్.

'ఎంతో మంది ఇన్వెస్టర్‌లు మా ప్రతిపాదనలను తిరస్కరించారు' అని గతాన్ని గుర్తు తెచ్చుకున్నాడు దేవన్. అయితే ఎప్పుడూ నిరాశపడిపోలేదు. చివరికి బ్యాంకు నుంచి రూ.7.5 లక్షల రుణాన్ని తీసుకొని తన స్టార్టప్ కలల ప్రయాణాన్ని ప్రారంభించాడు.

'ఫ్యూజిలేజ్' సాంకేతికతను రైతులు ఉపయోగించుకోవడం వల్ల వ్యవసాయానికి సంబంధించిన ఖర్చులు 70 శాతం తగ్గడం ఒక విశేషం అయితే, పంట దిగుబడి 30 శాతం పెరగడం మరో విశేషం. గత సంవత్సరం కంపెనీ అయిదు కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది.

● మ్యూజిక్ వరల్డ్

## ఆహా... ఇది కదా జీవితం!



ఆమెని చూసిన అతడి జీవితం ఒక్కసారిగా వెలిగిపోయింది. 'ఇది కదా జీవితం!' అనిపించింది. ఆ అమ్మాయిని చూసిన అదృష్టానికి దేవుడికి కృతజ్ఞతలు తెలిపాడు. తాను చూసిన అందమైన ప్రపంచం గురించి దేవుడితో ఇలా అంటాడు...

'ఐ వాంట్ యూ, ఐ నీడ్ యూ, వో గాడ్ డోన్ట్ టేక్ దిస్' బ్యూటీఫుల్ థింగ్స్ దట్ ఐ హ్యావ్ గాట్ ఈ కబుర్లు అన్నీ 'బ్యూటీఫుల్ థింగ్స్' గురించి. బిల్‌బోర్డ్‌లో ఇప్పటికీ టాప్‌లో ఉంది 'బ్యూటీఫుల్ థింగ్స్' సాంగ్. అమెరికన్ సింగర్, సాంగ్ రైటర్ బెన్సన్ పాట ఇది. వేరు వేరు సందర్భాలలో రాసుకున్న రెండు పాటలను 'బ్యూటీఫుల్ థింగ్స్'గా మిక్స్ చేశాడు బెన్సన్. టిక్‌టాక్‌తో పాపులర్ అయిన బెన్సన్ 'ఘోస్ట్ టౌన్' 'ఇన్ ది స్టార్స్' ఆల్బమ్స్‌తో పేరు తెచ్చుకున్నాడు. గత సంవత్సరం వచ్చిన అతడి డెబ్యూ స్టూడియో ఆల్బమ్ 'ఫైర్ వర్క్స్ అండ్ రోలర్ బ్లేడ్స్' సూపర్‌హిట్ అయింది. ఈ సంవత్సరం విడుదల చేసిన రెండో స్టూడియో ఆల్బమ్ 'అమెరికన్ హార్ట్' అదే స్థాయిలో హిట్ అయింది.

● అవును ఇది నిజమే!




● రెస్టారెంట్‌లలో పనిచేసే సర్వర్‌ల కోసం ప్యారిస్‌లో ఒక విచిత్ర పోటీ జరుగుతుంది. 'కోర్స్ డెస్ కఫేస్' అనే ఈ పోటీ సర్వర్‌ల వేగం, దృఢత్వాన్ని పరీక్షిస్తుంది. వందల ఏళ్ల నాటి పోటీ ఇది. పోటీ ఎలా ఉంటుంది అనే విషయానికి వస్తే... ఫుల్ వాటర్ గ్లాస్, కాఫీ కప్పును ట్రేపై పెట్టుకొని, నీళ్లు, కాఫీ ఒలికిపోకుండా ఆ రెండిటినీ బ్యాలెన్స్ చేస్తూ వేగంగా నడవాల్సి ఉంటుంది.



● ప్రొఫెషనల్ టెన్నిస్ బాల్ అఫీషియల్ కలర్... ఆప్టిక్ ఎల్లో. అయితే ఒకప్పుడు మాత్రం అవి తెలుపురంగులో ఉండేవి.




● దంత పరిశుభ్రతకు సంబంధించి అంతరిక్షంలో ఆస్ట్రోనాట్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని 'నాసా' వారు ఫోమ్‌లెస్, ఇన్‌జెస్టిబుల్ టూత్‌పేస్ట్ తయారు చేశారు.

● టెక్ టాక్




## వివో ఎక్స్ ఫోల్డ్ 5

| | |
|---|---|
| డిస్‌ప్లే | : 8.03 అంగుళాలు |
| రిఫ్రెష్‌రేట్ | : 120 హెచ్‌జడ్ |
| మెమొరీ | : 256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 12జీబి ర్యామ్/ 512 జీబి 16జీబి ర్యామ్ |
| వోఎస్ | : ఆండ్రాయిడ్ 15 |
| బ్యాటరీ | : 6000 ఎంఏహెచ్ |

## యూట్యూబ్ ఇమేజ్ టు వీడియో ఫీచర్

'షార్ట్స్' కోసం జనరేటివ్ ఏఐ ఎఫెక్ట్స్‌ని ఉపయోగించుకునే ఫీచర్‌ని తీసుకువచ్చింది యూట్యూబ్. ఈ 'ఇమేజ్-టు-వీడియో' ఫీచర్ ఒక చిత్రాన్ని ఆరు-సెకన్ల వీడియోగా మారుస్తుంది. కొత్త ఏఐ ఎఫెక్ట్స్‌తో యూజర్‌లు తమ డూడుల్స్‌ను ఆర్టిస్టిక్ ఇమేజ్‌లుగా, సెల్ఫీలను వీడియో క్లిప్‌లుగా మార్చవచ్చు.

యూట్యూబ్ ఏఐ ప్లేగ్రౌండ్ సెంటర్ నుంచి యూజర్స్ టూల్స్‌ను యాక్సెస్ చేసుకోవచ్చు. అయితే ప్రస్తుతం ఈ ఫీచర్ యూఎస్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో మాత్రమే అందుబాటులో ఉంది. త్వరలో ఇతర దేశాలలో కూడా అందుబాటులోకి రానుంది.




## థర్డ్-జనరేషన్ ఎకో షో 5



అలెక్సాతో కలిపి థర్డ్-జనరేషన్ ఎకో షో 5 స్మార్ట్ డిస్‌ప్లేను లాంచ్ చేసింది అమెజాన్. అప్‌గ్రేడెడ్ స్పీకర్, ఇన్-బిల్ట్ కెమెరా, స్మార్ట్ హోమ్ కంట్రోల్స్‌తో ఈ సరికొత్త ఎకో షో 5 థర్డ్ జెన్ వచ్చింది. మ్యూజిక్, పాడ్‌కాస్ట్స్, ఆడియోబుక్స్ వినడానికి సంబంధించి సరికొత్త అనుభవాన్ని అందిస్తుంది. ● 5.5 అంగుళాల టచ్ స్క్రీన్ ● 1.7 అంగుళాల రియర్-ఫేసింగ్ స్పీకర్ సౌండ్ సిస్టమ్

# సాక్షి సినిమా



● కియారా, హృతిక్ రోషన్

## నీ గుండె గుమ్మంలోకి...

"నీ గుండె గుమ్మంలోకి ప్రతిరోజూ... నీ గుండె గుమ్మంలోకి ప్రతిరోజూ వస్తూ పోతుంట ఊపిరి ఊయలగా...' అంటూ సాగుతుంది 'వార్ 2'లోని 'ఊపిరి ఊయలగా...' పాట. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ హీరోలుగా నటించిన స్పై యాక్షన్ డ్రామా 'వార్ 2'. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్‌లో భాగంగా ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 14న తెలుగు, హిందీ, తమిళ భాషల్లో విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'ఊపిరి ఊయలగా..' అంటూ సాగే రొమాంటిక్ సాంగ్ విడుదల చేశారు. హృతిక్ రోషన్ - కియారా అద్వానీ కాంబినేషన్‌లో ఈ పాట ఉంటుంది. గురువారం (జూలై 31) కియారా అద్వానీ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ పాట తెలుగు, తమిళ, హిందీ వెర్షన్‌లను రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు ప్రీతమ్ సంగీత సారథ్యంలో తెలుగు వెర్షన్‌కు చంద్రబోస్ సాహిత్యం అందించగా, శాశ్వత్ సింగ్, నిఖితా గాంధీ పాడారు.

## వాస్తవ ఘటనలతో...

వాస్తవ ఘటనల ఆధారంగా 'చేతబడి' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని దర్శకుడు సూర్యాస్ తెలిపారు. నందకిశోర్ ఈ సినిమాకు నిర్మాత. ఈ సినిమా గురించి సూర్యాస్ ఇంకా మాట్లాడుతూ- "16వ శతాబ్దంలో ఇండియాలో చేతబడి మొదలైంది. 1953లో గిరిడ అనే గ్రామంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా కథ సిద్ధం చేశా. చేతబడి గురించి గత సినిమాల్లో వచ్చినదాని కంటే భిన్నంగా మా సినిమాలో చూపిస్తాం" అని చెప్పారు. "ఒకప్పుడు బాణామతి భయం వల్ల రాజకీయ, సామాజిక, మానసిక సమస్యలు తలెత్తాయి. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న కొందరి గురించి ఈ 'చేతబడి' చిత్రంలో రియలిస్టిక్‌గా చూపించనున్నాం" అన్నారు నందకిశోర్.






● అశ్విన్ బాబు

## గౌతమ్ యాక్షన్

అశ్విన్ బాబు హీరోగా మామిడాల ఎం.ఆర్. కృష్ణ దర్శకత్వంలో టి. గణపతి రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'వచ్చినవాడు గౌతమ్'. అశ్విన్ బాబు పుట్టినరోజు (ఆగస్టు 1) సందర్భంగా గురువారం ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీ నుంచి కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. "సరికొత్త కథాంశంతో రూపొందిస్తున్న ఈ చిత్రం కోసం భారీ బడ్జెట్‌తో ఇటీవల హై ఓల్టేజ్ క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరించాం. ఇప్పటికే విడుదల చేసిన మా చిత్రం టీజర్‌కి మంచి స్పందన లభించింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తాం" అని చిత్రబృందం పేర్కొంది. రియా సుమన్ హీరోయిన్‌గా, సాయి రోణక్ అతిథి పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో అయేషా ఖాన్, మురళీ శర్మ, సచిన్ ఖేడేకర్ తదితరులు ముఖ్య పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: గౌర హరి, కెమేరా: ఎం.ఎన్. బాల్ రెడ్డి.



● సత్యదేవ్, విజయ్ దేవరకొండ, నాగవంశీ, వెంకటేశ్

## అన్నా... హిట్ కొట్టినం అంటున్నారు

- విజయ్ దేవరకొండ

"కింగ్‌డమ్' సినిమాకి అమెరికా ప్రీమియర్ల నుంచే పాజిటివ్ టాక్ వచ్చింది. బుధవారం రాత్రి నుంచి ఫోన్లు వస్తున్నాయి. చాలా మంది ఫోన్ చేసి 'అన్నా మనం హిట్ కొట్టినం' అని భావోద్వేగానికి గురవుతున్నారు" అని విజయ్ దేవరకొండ తెలిపారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే జోడీగా నటించిన చిత్రం 'కింగ్‌డమ్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ- "నా తెలుగు ప్రజలు నా వెనక ఎంత ఉన్నారో చూస్తున్నాం. అభిమానులు ఈ సినిమా కోసం ఎంతలా మొక్కుకున్నారో, ఈ విజయాన్ని ఎంతలా సెలబ్రేట్ చేస్తున్నారో చూస్తున్నాను. ఆ వెంకన్న స్వామి ఆశీస్సులు, మీ ప్రేమ వల్లే ఇదంతా సాధ్యమైంది. గురువారం విడుదలంటే మొదట భయపడ్డాను. కానీ, నాగవంశీ ఈ సినిమాని నమ్మి, విడుదల చేశారు. ఆయన నమ్మకం నిజమైంది" అని చెప్పారు. "విజయ్‌గారి ఫ్యాన్స్ కోరుకున్నట్లు ఈ సినిమాతో ఆయన హిట్ సాధించడం హ్యాపీగా ఉంది" అని తెలిపారు సూర్యదేవర నాగవంశీ. "'కింగ్‌డమ్' ఇచ్చిన ఉత్సాహంతో మరిన్ని మంచి సినిమాలు అందిస్తాం" అన్నారు సత్యదేవ్. "ఈ చిత్రానికి, నా పాత్రకు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందనకు హ్యాపీ" అని వీపీ వెంకటేశ్ పేర్కొన్నారు.

## చర్చలు సఫలమయ్యేనా?

కార్మికుల వేతనాలు పెంచాలంటూ తెలుగు సినీ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, నిర్మాతల మండలి ప్రతినిధులు, తెలుగు సినీ వర్కర్స్ ఫెడరేషన్ నాయకుల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయని తెలిసింది. ప్రతీ మూడేళ్లకోసారి 30 శాతం వేతనాలు పెంచాలనే నిబంధన జూన్ 30తో ముగియడంతో వేతనాల పెంపు చేపట్టాలని సినీ వర్కర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు కోరగా, 5 శాతం పెంచేందుకు నిర్మాతల మండలి ప్రతినిధులు ముందుకొచ్చారట. ఇందుకు ఫెడరేషన్ అంగీకరించలేదట. సినీ కార్మికుల వేతనాల పెంపు విషయంపై చర్చించేందుకు కార్మిక శాఖ కమిషనర్‌ను రెండు రోజులు గడువు కోరారట ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, నిర్మాతల మండలి ప్రతినిధులు. ఇందుకు కమిషనర్ సమ్మతించారని సమాచారం. ఛాంబర్ ప్రతినిధులు, ఫెడరేషన్ ప్రతినిధులతో రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తామని, అంత వరకు షూటింగ్స్ ఆపవద్దని ఫెడరేషన్ ప్రతినిధులను కోరారట కమిషనర్. మరి.. ఇరు వర్గాల చర్చలు సఫలమవుతాయా? లేదా అనేది వేచి చూడాలి.

## ప్లీజ్... వినండి




● నారా రోహిత్, శ్రీదేవి విజయ్‌కుమార్

నారా రోహిత్ హీరోగా నటించిన చిత్రం 'సుందరకాండ'. వృతీ వాఘాని హీరోయిన్‌గా నటించగా, శ్రీదేవి విజయ్‌కుమార్, నరేశ్ విజయ కృష్ణ, వాసుకీ ఆనంద్ కీలక పాత్రల్లో నటించారు. వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకత్వంలో సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 27న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి 'ప్లీజ్...ప్లీజ్...ప్లీజ్...మేమ్... వినండి కొంచెం...' అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఈ పాటకు శ్రీ హర్ష ఇమాని సాహిత్యం అందించగా, అర్జున్ చాందీ, దీపక్ బ్లూ, అరవింద్ శ్రీనివాస్, సాయిశరణ్, రేష్మా శ్యామ్, హరిప్రియా, లవితా లోబో పాడారు. విశ్వ రఘు ఈ పాటకు కొరియోగ్రాఫర్. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్.

## సంక్రాంతి బరిలో..?

వచ్చే సంక్రాంతి పండక్కి రాజా సాబ్ థియేటర్స్‌కు రానున్నాడా? అంటే అవుననే సమాధానమే ప్రస్తుతం ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ది రాజా సాబ్'. ఈ హారర్ కామెడీ ఫ్యాంటసీ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధీ కుమార్ హీరోయిన్లుగా నటిస్తుండగా, సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. మారుతి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రభాస్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కాగా ఈ సినిమాను డిసెంబరు 5న రిలీజ్ చేయనున్నట్లుగా ఇటీవల మేకర్స్ ప్రకటించిన సంగతి గుర్తుండే ఉంటుంది. కానీ రిలీజ్ వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని భోగట్టా. వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 9న రిలీజ్ చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారన్నది తాజా టాక్. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



● ప్రభాస్



● మృణాల్ ఠాకూర్


## జూలియట్ ప్రతీకారం

అడివి శేష్, మృణాల్ ఠాకూర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'డెకాయిట్'. ప్రేమ - ప్రతీకారం నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాకు షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. శుక్రవారం (ఆగస్టు 1) మృణాల్ ఠాకూర్ బర్త్ డే. ఈ సందర్భంగా 'డెకాయిట్'లో జూలియట్ పాత్రలో మృణాల్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, గురువారం ఆమె కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. "ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ చేసిన జూలియట్ పాత్ర తెలుగులో ఇప్పటివరకు చూసిన హీరోయిన్స్ పాత్రల కంటే విభిన్నంగా ఉంటుంది. ఈ కథలో జూలియట్ కేవలం ప్రేయసి మాత్రమే కాదు, పగ, ప్రతీకారానికి సెంట్రల్ క్యారెక్టర్" అని చిత్రబృందం పేర్కొంది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 25న విడుదల కానుంది. ఈ సినిమాకు సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

## హ్రీం సినిమా విజయం సాధించాలి

- సందీప్ కిషన్

పవన్ తాత, చమిందా వర్మ జంటగా రాజేశ్ రావూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'హ్రీం'. శివమ్ మీడియా పతాకంపై సుజాత సమర్పణలో శివ మల్లాల నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి రాజీవ్ కనకాల కెమెరా స్విచ్ఛాన్ చేయగా, హీరో-నిర్మాత సందీప్ కిషన్ క్లాప్ ఇచ్చారు. నటులు అలీ, బెనర్జీ, ఆడిటర్ విజయేంద్ర రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ పర్వతనేని రాంబాబు కలిసి దర్శకుడు రాజేశ్‌కి స్క్రిప్ట్ అందించి, ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో సందీప్ కిషన్ మాట్లాడుతూ- "ఈ సినిమా విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని అన్నారు. "ఈ సినిమాలో చాలా మంచి పాత్రల్లో నటిస్తున్నాం" అని తెలిపారు రాజీవ్ కనకాల, బెనర్జీ. ఈ సినిమాకు సంగీతం: మార్కస్ యం, కెమెరా: అరవింద్.



● పవన్ తాత, చమిందా వర్మ, సందీప్ కిషన్




సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 131

శుక్రవారం 1-8-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





**తొలిరోజు తడబాటు**

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 204/6. ఆదుకున్న కరుణ్ నాయర్ -15లో



**సూచీలకు సుంకాల నష్టాలు**

సెన్సెక్స్ 296 పాయింట్ల పతనం.. రెండ్రోజుల లాభాలకు బ్రేక్ -15లో



**'సవరణ'పై సభా సమరం**

బిహార్ ఓటర్ల జాబితా సమగ్ర సవరణను తక్షణం నిలిపివేయాలన్న విపక్షాల డిమాండ్లతో పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి.

- వివరాలు 6లో ▶



**ప్రజ్ఞ, పురోహిత్ నిర్దోషులు**

మాలెగావ్ పేలుడు ఘటనలో ప్రజ్ఞా ఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్ సహా ఏడుగురిపై ప్రత్యేక కోర్టు కేసులను కొట్టేసింది.

- వివరాలు 6లో ▶



**ఎన్‌డీఏతో పన్నీర్ కటీఫ్**

తమిళనాడు మాజీ సీఎం ఒ.పన్నీర్ సెల్వం.. బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏతో తెగదెంపులు చేసుకుంటున్నట్లు ప్రకటించారు.

- వివరాలు 6లో ▶



**యూకే ఏటీసీలో సమస్య..**

ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌లో సమస్యతో దక్షిణ ఇంగ్లండ్‌లోని విమానాశ్రయాల్లో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

- వివరాలు 6లో ▶

# 3 నెలల్లో తేల్చండి

## పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో నిర్ణయం తీసుకోండి

### తెలంగాణ స్పీకర్ కార్యాలయానికి సుప్రీంకోర్టు ఆదేశాలు



ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసుకు సంబంధించి స్పీకర్‌కు ఆదేశాలు జారీచేయడం రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ లక్ష్యాన్ని నీరుగార్చుతుంది. అలాగని మేం ఇప్పుడు ఏ ఆదేశాలూ జారీ చేయకపోతే.. 'ఆపరేషన్ సక్సెస్-పేషెంట్ డెడ్' అన్నట్లుగా ఉంటుంది. స్పీకర్ తన ప్రస్తు త వైఖరిని పునరావృతం చేయడానికి దోహదపడినట్లు అవుతుంది..

– సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్

- అనర్హతలపై నిర్ణయాధికారం స్పీకర్‌దేనని స్పష్టీకరణ
- అలాగని తామెలాంటి ఆదేశాలూ ఇవ్వకపోతే 'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డెడ్' అన్నట్టవుతుందని వ్యాఖ్య
- అనర్హతల విషయంలో స్పీకర్‌కున్న నిర్ణయాధికారాన్ని పార్లమెంట్ పునఃపరిశీలించాలని సూచన
- ఫిరాయింపులు అడ్డుకోకపోతే ప్రజాస్వామ్య పునాదులకే ముప్పంటూ ఆందోళన.... స్పీకర్ నిర్ణయాలు న్యాయ సమీక్షకు పూర్తిగా అతీతం కాదన్న సర్వోన్నత న్యాయస్థానం
- స్పీకర్ ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తున్నప్పటికీ రాజ్యాంగపరమైన రక్షణ పొందలేరని వెల్లడి
- హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు కొట్టివేత
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్లపై సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌ల ధర్మాసనం తుది తీర్పు

2లో

### సుప్రీం తీర్పుపై నిపుణులు ఏమంటున్నారు?

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పును వెలువరించిన నేపథ్యంలో అనేక చట్ట, న్యాయ, రాజకీయ అంశాలు చర్చకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిపుణులు ఏమంటున్నారంటే..

2లో

### 'ఎమ్మెల్యేల అనర్హత' ఎప్పుడు.. ఏమిటి?

బీఆర్‌ఎస్ నుంచి పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు విషయంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ వద్ద దాఖలైన, హైకోర్టు, సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ల కాలక్రమం వివరాలు..

2లో

### స్పీకర్ కింకర్తవ్యం?

- సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఉత్కంఠ
- అనర్హత వేటు వేస్తారా..? సాక్ష్యాలు లేవంటారా..?... అందరిపై నిర్ణయం ఉంటుందా? ఒక్కరిద్దరిపైనేనా..?
- రాజకీయ పార్టీల్లో చర్చ

2లో



హైకోర్టు న్యాయమూర్తులుగా చలపతిరావు, మొహియుద్దీన్, రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్‌తో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్

# బాధ్యతలు చేపట్టిన కొత్త జడ్జీలు

## నలుగురితో ప్రమాణం చేయించిన హైకోర్టు సీజే జస్టిస్ ఏకే సింగ్

### తొలిరోజే విచారణ చేపట్టిన జస్టిస్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ రామకృష్ణా రెడ్డి, జస్టిస్ చలపతిరావు, జస్టిస్ మొహియుద్దీన్

సాక్షి, హైదరాబాద్

హైకోర్టులో కొత్తగా నియమితులైన నలుగురు జడ్జీలు అదనపు న్యాయమూర్తులుగా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. గాడి ప్రవీణ్ కుమార్, రామకృష్ణారెడ్డి, సుద్దాల చలపతిరావు, గౌస్ మీరా మొహియుద్దీన్‌తో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణం చేయించారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాల్‌లో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో పాటు కొత్త జడ్జీల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. బాధ్యతలు చేపట్టిన కొత్త జడ్జీలు తొలిరోజు సీనియర్ న్యాయమూర్తులతో కలసి కేసుల విచారణలో పాల్గొన్నారు. వీరి నియామకంతో హైకోర్టులో జడ్జీల సంఖ్య 30కి పెరిగింది. ఇంకా 12 ఖాళీలున్నాయి. ఈ నలుగురిని న్యాయవాదుల కోటాలో జడ్జీలుగా నియమిస్తూ గత నెల 28న కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.



## మూడు సంపుటాలు.. వేయి పేజీలు

### రాష్ట్ర ప్రభుత్వానికి అందిన 'కాళేశ్వరం' నివేదిక

- ఇరిగేషన్ ముఖ్య కార్యదర్శికి సమర్పించిన జస్టిస్ ఘోష్ కమిషన్
- బరాజ్‌ల వైఫల్యానికి అంశాల వారీగా బాధ్యుల గుర్తింపు..!
- నేడు సీఎం ముందుకు నివేదిక

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై సుదీర్ఘ విచారణ నిర్వహించిన జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. జస్టిస్ పినాకి చంద్రఘోష్ గురువారం తన కార్యాలయంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు సీల్డ్ కవర్‌లో నివేదికను అందజేశారు. మూడు సంపుటాల్లో నివేదికను సిద్ధం చేశారు. 650కిపైగా పేజీలతో ప్రధాన నివేదిక అందజేసినట్లు మిగతా 14వ పేజీలో ▶



## 'బనకచర్ల' వెనక్కి

### ఏపీ ప్రతిపాదనను తిరస్కరించిన కేంద్ర ప్రభుత్వం

- తెలంగాణ అభ్యంతరాల నేపథ్యంలో కీలక నిర్ణయం
- రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ప్రశ్నకు కేంద్ర పర్యావరణశాఖ సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావ అంచనా అధ్యయనానికి టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్) మంజూరు చేయాల్సిందిగా ఏపీ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను తిరస్కరించింది. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ గురువారం అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ మిగతా 14వ పేజీలో ▶

# కొత్త తరానికి చేరువవుదాం!

## విద్యార్థులు, యువత లక్ష్యంగా పార్టీ కార్యాచరణ

### ఎర్రవల్లి నివాసంలో ముఖ్యనేతలతో కేసీఆర్



- అన్ని జిల్లా కేంద్రాల్లో విస్తృత స్థాయి భేటీలు... రేవంత్ సర్కారును టీడీపీ, బీజేపీ నడిపిస్తున్నాయి
- కరీంనగర్ బీసీ సభ ద్వారా కాంగ్రెస్‌ను ఎండగట్టాలి
- ఫిరాయింపుదారులపై చర్య తీసుకునేలా ఒత్తిడి చేద్దాం
- స్థానిక ఎన్నికలపై దృష్టి పెట్టండి

సాక్షి, హైదరాబాద్: ఉద్యమ పార్టీగా ప్రస్థానం ప్రారంభించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం పదేళ్లపాటు అధికారంలో కొనసాగి ప్రస్తుతం ప్రతిపక్ష పాత్రకు పరిమితమైన బీఆర్‌ఎస్ కొత్త తరానికి చేరువ అయ్యేందుకు అనుసరించాల్సిన వ్యూహానికి పదును పెడుతోంది. తెలంగాణ అస్తిత్వ పోరాటాలు, రాష్ట్ర సాధన ఉద్యమంలో బీఆర్‌ఎస్ పాత్ర, నదీ జలాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం, బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన ఆవశ్యకత తదితరాలను విద్యార్థులు, యువతకు నూరిపోయాలని భావిస్తోంది. టీఆర్‌ఎస్‌గా అవిర్భవించి గత 25 ఏళ్లుగా బీఆర్‌ఎస్ సాగిస్తున్న ప్రస్థానం, ఉద్యమ నాయకుడిగా, ప్రభుత్వాధినేతగా కేసీఆర్ చేసిన కృషిని వివరించాలని భావిస్తోంది. ఈ నెల 26న హైదరాబాద్‌లో మిగతా 14వ పేజీలో ▶

### ఉప ఎన్నికలకు బీఆర్‌ఎస్ సిద్ధం: కేటీఆర్

2లో

# బీసీ రిజర్వేషన్ల సాధనకు కలిసి రండి

### ప్రజల కోసమే జనహిత పాదయాత్ర

- కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్
- వచ్చే రెండేళ్లలో 35 వేల ఉద్యోగాల భర్తీ: పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్..
- పరిగిలో మహాజన పాదయాత్ర

- వివరాలు 3లో



## గర్భిణులను గాలించి.. ఎరవేసి..!

- 'సృష్టి'వ్యవహారాలపై కొనసాగుతున్న దర్యాప్తు
- పాత కేసులను వెలికి తీస్తున్న పోలీసులు
- ఐదు రోజుల పోలీసు కస్టడీకి డాక్టర్ నమ్రత

13లో




## అవి డెడ్ ఎకానమీలు

### రష్యా, భారత్‌లపై విమర్శలు ఎక్కుపెట్టిన డొనాల్డ్ ట్రంప్

- జట్టుకట్టి మరింత దిగజారుతున్నాయని విమర్శ
- ఆ రెండు దేశాలు ఎంత వాణిజ్యం చేసుకున్నా పట్టించుకోనని వ్యాఖ్య

6లో





బాగానే ప్లాన్ చేశారు కానీ 'ఓటుకు కోట్లు' కేసులోలాగా దొరికిపోవద్దు సార్!

# ఎగుమతులకు టారిఫ్‌ల సెగ

### అమెరికా సుంకాలతో పలు రంగాలపై తీవ్ర ప్రభావం

- టెక్స్‌టైల్స్, రత్న ఆభరణాలు తదితర పరిశ్రమలకు దెబ్బ
- ఉపాధి అవకాశాలపైనా ఎఫెక్ట్..
- నిపుణులు, పరిశ్రమ వర్గాల విశ్లేషణ

16లో



భారత ఎగుమతులపై అమెరికా ఎకాయెకిన 25 శాతం టారిఫ్‌లు ప్రకటించడం దేశీ పరిశ్రమలకు శరాఘాతంగా తగిలింది. దీనితో అమెరికన్ మార్కెట్‌పైనే ఎక్కువగా ఆధారపడుతున్న రత్నాభరణాలు, టెక్స్‌టైల్స్, ఫార్మా తదితర పలు పరిశ్రమలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందనే భయాలు నెలకొన్నాయి. అమెరికాకు కనీసం 25 శాతం ఎగుమతులు తగ్గినా, వాణిజ్య ఆదాయాలపరంగా ఏటా 21.75 బిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లుతుందని అంచనా.

## దేశ ప్రయోజనాలను పరిరక్షిస్తాం



- వివరాలు 6లో

### ట్రంప్ ప్రకటించిన అదనపు టారిఫ్ భారంపై తగు చర్యలు తీసుకుంటాం

- పార్లమెంట్‌లో వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్ భరోసా
- సుంకాల ప్రభావాలపై అధ్యయనం చేస్తున్నామని వెల్లడి

## ట్రంప్ చెప్పింది నిజమే.. మన ఆర్థిక వ్యవస్థ ఖతం

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్

- అమెరికా అధ్యక్షుడికి నచ్చినట్లే వాణిజ్య ఒప్పందం కుదురుతుంది
- ట్రంప్ చెప్పిందే మోదీ చేస్తారని ఎద్దేవా



6లో

# 3 నెలల్లో తేల్చండి

## పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో నిర్ణయం తీసుకోండి

### తెలంగాణ స్పీకర్ కార్యాలయానికి సుప్రీంకోర్టు ఆదేశాలు

**సాక్షి, న్యూఢిల్లీ:** పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకునే అధికారం శాసనసభ స్పీకర్‌కే ఉందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తెలంగాణలో పార్టీ మారి అనర్హత పిటిషన్లు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విషయంలో తీర్పు వెలువరించిన రోజు నుంచి మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలంటూ సభాపతి కార్యాలయానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అనర్హత పిటిషన్లు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు ఎవరూ విచారణను ఆలస్యం చేయడాన్ని అనుమతించకూడదని పేర్కొంది. విచారణను ఆలస్యం చేసేందుకు ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తే తీవ్రంగా పరిగణించాలని చెప్పింది. మరోవైపు అనర్హత విషయంలో స్పీకర్ నిర్ణయాధికారాన్ని పార్లమెంట్ పునః పరిశీలించాలని సూచించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేసింది.

**ఏడు నెలలు.. 9 సార్లు విచారణ**

పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై త్వరగా చర్యలు తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ ఈ ఏడాది జనవరి 15న బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌లపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్‌లు స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ) దాఖలు చేశారు. మిగిలిన ఏడుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తదితరులు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లు దాఖలైన తర్వాత దాదాపు ఏడు నెలల్లో తొమ్మిది సార్లు సుప్రీంకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, మోహిత్ రావు, స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, తదితరులు వాదనలు వినిపించారు. గత ఏప్రిల్ 3న విచారణ ముగించి తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం.. గురువారం తీర్పు వెలువరించింది.

**ఎంత సమయం కావాలని ముందే అడిగాం..**

'2025 జనవరి 15న సుప్రీంకోర్టు ముందు కేసు దాఖలైన తర్వాత 16న తొలిసారిగా మేం కొందరికి నోటీసులు జారీ చేశాం. ఫిబ్రవరి 3న జరిగిన విచారణ సందర్భంగా.. ఫిబ్రవరి 4న మరి కొందరికి నోటీసులు జారీ చేశాం. జనవరి 31న తొలుత ఈ కేసు విచారణకు వచ్చినప్పుడే అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేందుకు స్పీకర్‌కు ఎంత సమయం అవసరమో తెలుసుకోవాల్సిందిగా మేము సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గికి సూచించాం..' అని ధర్మాసనం తెలిపింది.

**'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ నాట్ డెడ్'లా ఉండాలి**


'10 షెడ్యూల్ కింద స్పీకర్ ట్రిబ్యునల్‌గా పని చేస్తున్నప్పటికీ, ఆయన ఎటువంటి రాజ్యాంగపరమైన రక్షణ (కానిస్టిట్యూషనల్ ఇమ్యూనిటీ)ను పొందలేరు. నిజానికి ఈ కేసును విచారించిన సింగిల్ జడ్జి అనర్హత పిటిషన్లపై విచారించేందుకు సమయాన్ని నిర్ణయించమని స్పీకర్‌కు సూచించారు. అందుకు నాలుగు వారాల గడువిచ్చారు. అంతేకానీ పిటిషన్లపై నిర్ణయం తీసుకోమని ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. అయినప్పటికీ.. హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకుని సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని చెప్పడం ద్వారా డివిజన్ బెంచ్ తప్పిదానికి పాల్పడింది. ఎలాంటి వ్యతిరేక వ్యాఖ్యలు లేకపోయినా తెలంగాణ శాసనసభ కార్యదర్శి సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేయడం సరైంది కాదు. ఇకపై ఈ కేసు 'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ నాట్ డెడ్' లా ఉండాలి..' అని సుప్రీంకోర్టు (నవ్వుతూ) వ్యాఖ్యానించింది.

**విచారణను పొడిగించేందుకు అనుమతి వద్దు**

'అనర్హత పిటిషన్లను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విచారణను పొడిగించడానికి స్పీకర్ అనుమతించకూడదు. స్పీకర్ నిర్ణయాలపై న్యాయ సమీక్షకు అధికారాలు (కిహోటో హోల్లోహన్ (10వ షెడ్యూల్ సమర్థించిన) కేసులో తీర్పు నిష్పత్తిని ప్రస్తావిస్తూ) ఇరుకైన పరిధిలో (న్యారో కంపాస్) ఉన్నాయి. అలాగే స్పీకర్ నిర్ణయాలు న్యాయ సమీక్షకు పూర్తిగా అతీతం కాదు. స్పీకర్లు అనర్హత పిటిషన్లను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచే పరిస్థితిని రాజ్యాంగ ధర్మాసనం ఊహించి ఉండకపోవచ్చు. అనర్హత పిటిషన్లను స్పీకర్ మూడు నెలల్లోగా నిర్ణయించాలని కీషమ్ మేఘచంద్ర సింఘ్ కేసులో తీర్పు ఉంది. శివసేన, ఎన్సీపీ ఎమ్మెల్యేల ఫిరాయింపుల పిటిషన్లను నిర్ణీత సమయంలోగా నిర్ణయించాలని మహారాష్ట్ర స్పీకర్‌కు జారీ అయిన ఆదేశాలను కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది..' అని న్యాయమూర్తులు తెలిపారు.

**జాతీయ ఆందోళనకు సంబంధించిన అంశం**

'అనర్హత పిటిషన్లపై నిర్ణయాధికారం స్పీకర్‌కే ఇచ్చాం. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ ఎమ్మెల్యేలపై అనర్హత విషయంలో స్పీకర్ తగిన సమయంలో స్పందించాల్సిన అవసరం ఉంది. అయితే అనర్హత విషయంలో స్పీకర్ నిర్ణయాధికారాన్ని పార్లమెంట్ పునఃపరిశీలించాలి. రాజకీయ ఫిరాయింపులు అనేవి జాతీయ ఆందోళనకు సంబంధించిన అంశం. మనం దీనిని ఎదుర్కొనకపోతే ప్రజాస్వామ్యానికి పెద్ద ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది..' అని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు.



> అనర్హతల విషయంలో స్పీకర్ నిర్ణయాధికారాన్ని పార్లమెంట్ పునః పరిశీలించాలి. రాజకీయ ఫిరాయింపులు అనేవి జాతీయ ఆందోళనకు సంబంధించిన అంశం. వీటిని ఎదుర్కొనకపోతే మన ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. 10 షెడ్యూల్ కింద స్పీకర్ ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తున్నప్పటికీ..ఆయన ఎటువంటి ''రాజ్యాంగపరమైన రక్షణ''ని పొందలేరు. అనర్హత పిటిషన్లను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విచారణను స్పీకర్ పొడిగించుకుంటూ పోవడానికి వీల్లేదు..
>
> \- సుప్రీంకోర్టు ధర్మాసనం

### షెడ్యూల్ 10 ఏం చెబుతోంది..

ఇది పార్టీల నుంచి ఫిరాయింపులను నిరోధించడానికి రూపొందించింది. దీన్ని ఫిరాయింపుల నిరోధక చట్టం అని కూడా అంటారు. రాజకీయ స్థిరత్వం, ప్రజాస్వామ్య ప్రక్రియ పరిరక్షణ, విలువలను కాపాడటం కోసం దీన్ని ఉద్దేశించారు. ప్రజాప్రతినిధులు పార్టీలు ఫిరాయించకుండా నిరోధించడం దీని ముఖ్య ఉద్దేశం. దీని ప్రకారం..పార్టీ ఆదేశాలు చట్టసభల సభ్యులు పాటించాలి. పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా ఓటు వేసినా లేదా పార్టీ నుంచి వైదొలిగినా చట్టసభల సభ్యులను అనర్హులుగా ప్రకటించవచ్చు. ఫిరాయింపుల అంశాల్లో కోర్టులకు అధికార పరిధి ఉండదు. స్పీకర్ లేదా చైర్మన్ నిర్ణయమే అంతిమం. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలో చేరితే సభలో సభ్యుడిగా ఉండటానికి అనర్హుడు. ఒకవేళ ఒక పార్టీ మరో పార్టీలో పూర్తిగా విలీనమైతే అనర్హత వర్తించదు. సభ్యుని అనర్హతపై ఏ కోర్టుకు అధికార పరిధి ఉండదు.

### బీఆర్ఎస్ నేతల అభ్యర్థన తోసిపుచ్చిన ధర్మాసనం

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టే నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు చేసిన అభ్యర్థనను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. కిహోటో హోల్లోహన్, సుభాష్ దేశాయ్ తదితరుల కేసులకు సంబంధించి రాజ్యాంగ బెంచ్ తీర్పును ప్రస్తావించింది. ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌కే ఉందని స్పష్టం చేసింది. 'అయితే, ఫిరాయింపులు జరిగినప్పుడు అనర్హత అంశాన్ని తేల్చే ముఖ్యమైన బాధ్యతను స్పీకర్‌కు లేదా చైర్మన్‌కు అప్పగించే యంత్రాంగం వల్ల రాజకీయ ఫిరాయింపులను సమర్థవంతంగా అరికట్టగలుగుతున్నామా.. లేదా? అనే అంశాన్ని మాత్రం పార్లమెంట్ పరిశీలించాలి. ప్రజాస్వామ్య పునాదులు బలంగా ఉండాలంటే, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలంటే ప్రస్తుత యంత్రాంగం సరిపోతుందా? లేదా? అనే విషయం కూడా పార్లమెంటే తేల్చాలి..' అని ధర్మాసనం స్పష్టం చేసింది. అనర్హత పిటిషన్లపై తేల్చే అత్యంత ముఖ్యమైన బాధ్యతను పార్లమెంట్ స్పీకర్‌కు అప్పగించినప్పుడు ఆ హోదాలో ఉన్నవారు ఎంతవేగంగా చర్యలు తీసుకున్నారనేది ప్రధానమని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

## నిపుణులు ఏమంటున్నారంటే?

### స్పీకర్ రాజ్యాంగేతర శక్తి కాదు

ప్రొ.మాడభూషి శ్రీధర్, న్యాయనిపుణుడు



'ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు నిర్ణయాత్మక ఆదేశాలిచ్చింది. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లో స్పష్టమైన నిబంధనలున్నా 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి ఫిరాయించారు. స్పీకర్ సహేతుక సమయంలో నిర్ణయం తీసుకోవాలని.. ఆయనకు నిరోధక శక్తి లేదని ఈ తీర్పు తెలియజేస్తుంది. ఇది తక్షణమే అనర్హతపై చర్య తీసుకునేలా చేయకపోయినా.. సత్వర తీర్పు, జవాబుదారీతనాన్ని నిర్ధారించే శక్తివంతమైన చట్రాన్ని నిర్దేశిస్తుంది. స్పీకర్ స్పందించి నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయే తప్పించి వాటి పరిశీలనలో జాప్యం చేయాలని పేర్కొనలేదని రాజకీయవేత్తలు గ్రహించాలి. స్పీకర్ రాజ్యాంగేతర శక్తి కాదు.. ట్రిబ్యునల్‌తో సమాన విధులు నిర్వర్తిస్తూ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. శాసనసభ ప్రత్యేక హక్కులు, ఫిరాయింపుల చట్టంతో స్పీకర్ రక్షణ పొందలేరని చెప్పింది. అసెంబ్లీ పదవీకాలం ముగిసే వరకు పిటిషన్లు పరిష్కారం కాకుంటే.. అది ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసినట్లేనని నొక్కి చెప్పింది. చర్య తీసుకోవాలనే ఒత్తిడి ఉన్నా స్పీకర్‌కు ఇప్పటికీ అర్హతలపై విచక్షణాధికారం ఉంటుంది. స్పీకర్ సత్వర నిర్ణయం తీసుకుంటే ఉప ఎన్నికలు రావొచ్చు. అసెంబ్లీ ఎన్నికల వరకు వాయిదా వేసుకుంటూ పోతే అనే ప్రశ్నలు ఉదయిస్తాయి. అనర్హతలు సంభవిస్తే.. ప్రభావిత ఎమ్మెల్యేలు అప్పీల్ చేసుకోవచ్చు.

### న్యాయస్థానాలకు సమీక్షించే అధికారం ఉంది

ప్రొ. కె.నాగేశ్వర్, మాజీ ఎమ్మెల్సీ



'ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు ఇచ్చిన కీలకమైన తీర్పు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ఇది వర్తించనుంది. ఫిరాయింపులపై గడువులోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు చెప్పిందే తప్ప.. ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో పేర్కొనలేదు. పార్టీ విధించిన విప్‌ను ఉల్లంఘిస్తే లేదా ఓ పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకుంటే ఎమ్మెల్యేపై అనర్హత వేటు వేయొచ్చు. ఈ అంశంపై కోర్టుకు వెళితే ప్రొసీజర్స్ జాప్యం కారణంగా ఆలస్యమయ్యే అవకాశం ఉందని సత్వర నిర్ణయం కోసం రాజ్యాంగం పదో షెడ్యూల్‌లో నిర్ణయాధికారం స్పీకర్‌కు ఇచ్చారు. అయితే దేశవ్యాప్తంగా స్పీకర్లు ఇందులో ఎప్పటిలోగా నిర్ణయం తీసుకోవాలో పేర్కొలేదు కాబట్టి అసెంబ్లీ కాలపరిమితి ముగిసే వరకు వేచిచూస్తున్నారు. రాజ్యాంగంలో న్యాయవ్యవస్థ,, చట్టసభలు వేటి పరిధిలో అవి చర్యలు తీసుకోవాలని, తామే అనర్హత విధించలేమని పేర్కొంది. స్పీకర్ అధికారాల్లో తాము జోక్యం చేసుకోబోమని అందువల్లే ఏ నిర్ణయం తీసుకోవాలనే దానిపై ఎలాంటి డైరెక్షన్ ఇవ్వకుండా త్వరగా నిర్ణయం తీసుకోమని చెప్పింది. స్పీకర్ నిర్ణయాల్లో కోర్టులు జోక్యం చేసుకోవని అయితే చట్టవిరుద్ధమైనవి లేదా రాజ్యాంగ విరుద్ధమైనవి ఏవైనా ఉంటే మాత్రం న్యాయస్థానాలు సమీక్షించే అధికారాన్ని రాజ్యాంగం కల్పించింది.

\- సాక్షి, హైదరాబాద్

### చరిత్రాత్మక తీర్పు

న్యాయవాది మోహిత్‌రావు



**సాక్షి, న్యూఢిల్లీ:** ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతలకు సంబంధించి 3 నెలల్లోగా కచ్చితంగా నిర్ణయం తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని ఈ కేసులో బీఆర్ఎస్ తరఫు న్యాయవాది మోహిత్‌రావు పేర్కొన్నారు. గురువారం సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేలు ఎవరూ విచారణను ఆలస్యం చేయడాన్ని స్పీకర్ కార్యాలయం అనుమతించకూడదని, ఒకవేళ ఎమ్మెల్యేలు ఆలస్యం చేస్తే తీవ్రంగా పరిగణించాలని కూడా సూచించిందన్నారు. స్పీకర్ 3 నెలల్లో నిర్ణయం తీసుకోకపోతే కోర్టును ధిక్కరించడమే అవుతుందన్నారు.



# స్పీకర్ కింకర్తవ్యం?

**సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఉత్కంఠ**

- అనర్హత వేటు వేస్తారా..? సాక్ష్యాలు లేవంటారా..?
- అందరిపై నిర్ణయం ఉంటుందా? ఒక్కరిద్దరిపై చర్యలు తీసుకుంటారా?
- రాజకీయ పార్టీల్లో చర్చ
- స్పీకర్ ఏదో ఒక నిర్ణయం తీసుకోవడం తప్పనిసరి అంటున్న న్యాయ నిపుణులు

**సాక్షి, హైదరాబాద్:** బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హత అంశంపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో.. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కింకర్తవ్యం ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టు విధించిన మూడు నెలల కాల వ్యవధికి అనుగుణంగా స్పీకర్ నిర్ణయం తీసుకుంటారా? ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తారా? లేక ఒక్కో ఎమ్మెల్యే కేసును విడివిడిగా పరిశీలించి ఒకరిద్దరిపై నిర్ణయం తీసుకునే అంశాన్ని పరిశీలిస్తారా? పార్టీ మారినట్లు సాక్ష్యాలు లేవంటూ అనర్హత వేటు వేయకుండా అందర్నీ బయటపడేస్తారా..? అన్న చర్చ రాజకీయవర్గాల్లో జోరుగా సాగుతోంది. పార్టీ ఫిరాయింపులపై గతంలో సుప్రీంకోర్టు తీర్పుల నేపథ్యంలో మహారాష్ట్ర, మణిపూర్ స్పీకర్లు తీసుకున్న నిర్ణయాలపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ న్యాయ నిపుణులతో చర్చించి ఒక నిర్ణయానికి వస్తారా అనే చర్చ కూడా జరుగుతోంది. స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఆయన నిర్ణయం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశం అవుతుందా? రాజ్యాంగ చర్చకు దారితీస్తుందా? అన్న ఆసక్తి నెలకొంది. పది మంది ఎమ్మెల్యేలపై ఎలాంటి జాప్యం చేయకుండా అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నాయకత్వం డిమాండ్ చేస్తోంది. దీనిపై ఒత్తిడి పెంచే యోచన చేస్తోంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి.

**ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిందే?!**

న్యాయనిపుణులు మాత్రం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఏదో ఒక నిర్ణయం స్పీకర్ తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని, జాప్యం చేయడానికి వీల్లేదని స్పష్టం చేస్తున్నారు. సుప్రీంతీర్పు నేపథ్యంలో స్పీకర్ ఎదుట మూడు అంశాలు న్నాయని చెబుతున్నారు. అందులో మొదటిది మూడు నెలల్లోగా ఎమ్మెల్యేల వాదనలు విని అనర్హతపై ఒక నిర్ణయాన్ని ప్రకటించడం. రెండోది అనర్హత వేటు వేయడం లేదా తిరస్కరించడం. ఇంకా కాలయాపన చేసేందుకు ఏమైనా అవకాశాలున్నాయా? అనేది మూడోది. అయితే వీటిల్లో ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కారణాలను కూడా స్పీకర్ వెల్లడించక తప్పనిసరి పరిస్థితి ఇప్పుడు ఏర్పడిందని న్యాయ నిపుణులంటున్నారు. స్పీకర్ సహజంగానే అధికారపార్టీకి అనుకూలంగా ఉంటారన్న అభిప్రాయం నేపథ్యంలో అనర్హత వేటు వేయకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్నా.. బీఆర్ఎస్ ఇచ్చే సాక్ష్యాలను స్పీకర్ ఏ విధంగా పరిగణనలోకి తీసుకుంటారన్నది కూడా ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే పార్టీ ఫిరాయింపులపై ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. కాగా పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తాము పార్టీ మారలేదని అఫిడవిట్లు సమర్పించినట్లు సమాచారం. కాగా ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేయడం పార్టీ ఉల్లంఘనగానే పరిగణనలోకి తీసుకుంటారా.? అన్నది చూడాల్సి ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఇలావుండగా.. సీఎం సమక్షంలోనే పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకున్న ఫొటోలు, కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాల్గొన్నట్లుగా ఉన్న సాక్ష్యాలు, ఆధారాలను స్పీకర్ ఎదుట బీఆర్ఎస్ ఉంచే అవకాశాలున్నాయి.


**మణిపూర్‌లో ఏమి జరిగింది?**

మణిపూర్ ఎమ్మెల్యే థౌనాజం శ్యామ్ కుమార్ సింగ్ అనర్హత విషయంలో సుప్రీంకోర్టు గతంలో కీలక చర్యలు తీసుకుంది. 2017లో కాంగ్రెస్ టికెట్‌పై ఆంద్రో నియోజకవర్గం నుంచి గెలిచిన శ్యామ్ కుమార్, ప్రమాణ స్వీకారం చేయకముందే బీజేపీలో చేరి, ఎన్. బిరెన్ సింగ్ నేతృత్వంలోని బీజేపీ కూటమి ప్రభుత్వంలో మంత్రిగా చేరారు. కాంగ్రెస్ పార్టీ ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరుతూ 2017లో స్పీకర్ వద్ద పిటిషన్లు దాఖలు చేసింది. కానీ స్పీకర్ వై.ఖేమ్‌చంద్ సింగ్ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేశారు. దీంతో కాంగ్రెస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో 2020 జనవరి 21న జస్టిస్ రోహిన్టన్ ఎఫ్. నారిమన్, జస్టిస్ ఎస్.రవీంద్రభట్ నేతృత్వంలోని ధర్మాసనం నాలుగు వారాల్లోపు నిర్ణయం తీసుకోవాలంటూ స్పీకర్‌ను ఆదేశించింది. నాలుగు వారాలు గడిచినా స్పీకర్ నిర్ణయం తీసుకోకపోవడంతో మార్చి 18న సుప్రీంకోర్టు అసాధారణ చర్యగా ఆర్టికల్ 142 కింద తనకున్న అధికారాలను ఉపయోగించి ఆయనను మంత్రివర్గం నుంచి తొలగించాలని, శాసనసభలోకి అడుగుపెట్టకుండా నిషేధించాలని ఆదేశించింది.

**మహారాష్ట్రలో ఏమి జరిగింది?**

మహారాష్ట్రలో గత అసెంబ్లీ సమయంలో శివసేన రెండు వర్గాలుగా విడిపోయింది. అందులో ఒకటి ఏక్‌నాథ్ షిండే వర్గం.. మరొకటి ఉద్ధవ్ ఠాక్రే వర్గం. ఈ రెండు వర్గాలు తమ వైరివర్గ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ స్పీకర్‌ను ఆశ్రయించాయి. అయితే వీరిపై ఎంతకు అనర్హత వేటు వేయకుండా స్పీకర్ కాలయాపన చేయడంతో ఈ పార్టీలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. దీనితో తగిన నిర్ణీత వ్యవధిలో నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలపై నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ జాప్యం చేశారు. అనర్హత వేటు వేయకుండా..ఈ రెండు గ్రూపుల్లో ఏక్‌నాథ్ షిండే గ్రూపు అసలైనదిగా ప్రకటించారు.

### తీర్పు చూశాక అన్నీ చెబుతా: స్పీకర్



**సాక్షి, హైదరాబాద్:** సుప్రీంకోర్టు తీర్పు కాపీని చూసిన తర్వాత, న్యాయ నిపుణులతో మాట్లాడిన అనంతరం అన్ని విషయాలు చెబుతానని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చెప్పారు. గురువారం సుప్రీం తీర్పుపై మీడియాతో మాట్లాడుతూ.. తాను అన్ని విషయాలూ చెబుతానని, ఏదీ దాచుకునేది లేదని అన్నారు.

### వేడెక్కిన రాజకీయాలు

స్పీకర్ న్యాయనిర్ణేతగా ఉన్నందున ఈ విషయంలో రాజ్యాంగ రక్షణ ఉండదని దేశ అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేయడం గమనార్హం. కాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉప ఎన్నికలు వచ్చే అవకాశం లేదంటూ పలుమార్లు శాసనసభలో, బయటా స్పష్టం చేశారు. దీంతో ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా స్పీకర్ నిర్ణయం తీసుకునే అవకాశం లేదనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తం అవుతోంది. ఒకవైపు త్వరలోనే స్థానిక ఎన్నికలు జరుగుతాయని అందరూ భావిస్తున్న సమయంలో.. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల వ్యవహారంపై తీర్పు వెలువడటం, ఎమ్మెల్యేల అనర్హత తీవ్రస్థాయిలో చర్చనీయాంశం కావడంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అన్ని రాజకీయ పార్టీలు సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూనే.. ఏ పార్టీకి ఆ పార్టీ తమకు అనుకూలంగా వ్యాఖ్యానాలు చేయడం గమనార్హం.

### ఎన్నికలకు వెళ్లడంపై కాంగ్రెస్‌లో చర్చ

ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అనుకూల పవనాలు వీస్తున్నాయని, రాజకీయ పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయని అధికార పార్టీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో అవసరమైతే ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడకుండా వారితో రాజీనామా చేయించి తిరిగి ఎన్నికలకు వెళ్తే ఎలా ఉంటుందన్న దానిపైనా పార్టీలో చర్చ జరుగుతున్నట్టు సమాచారం. ఎమ్మెల్యేలపై అనర్హత అంశం తేలడానికి ముందుగానే జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక వస్తుందని, అందులో విజయం సాధించిన తర్వాత ఈ 10 స్థానాల గురించి చూసుకోవచ్చనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో అంత సాహసానికి అధికార పార్టీ సిద్ధం అవుతుందా అన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

## 'ఎమ్మెల్యేల అనర్హత' ఎప్పుడు.. ఏమిటి?

**సాక్షి, హైదరాబాద్:** బీఆర్ఎస్ నుంచి పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు విషయంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ వద్ద దాఖలైన, హైకోర్టు, సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్లకు సంబంధించిన కాలక్రమం ఈ విధంగా ఉంది..

**నవంబర్ 30, 2023:** తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 64 స్థానాల్లో గెలుపొంది అధికారం చేపట్టింది. బీఆర్ఎస్ 38 స్థానాల్లో విజయం సాధించి ప్రధాన ప్రతిపక్ష పార్టీగా నిలిచింది.

**మార్చి 2024– జూలై 2024**ః బీఆర్ఎస్ టికెట్‌పై గెలుపొందిన 10 మంది ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలె యాదయ్య, ఎం.సంజయ్ కుమార్, కృష్ణమోహన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరెకపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

**మార్చి 18, 2024:** దానం నాగేందర్‌పై అనర్హత వేటు కోసం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు బీఆర్ఎస్ వినతిపత్రం

**ఏప్రిల్ 10, 2024:** దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

**ఏప్రిల్ 24, 2024:** తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరిని అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ ఎమ్మెల్యే వివేకానంద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు శారు.

**జూన్ 25 – జూలై 16, 2024:** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కూన పాండు వివేకానంద్, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ స్పీకర్ వద్ద అధికారికంగా పిటిషన్లు దాఖలు చేశారు.

**సెప్టెంబర్ 9, 2024:** తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ (జస్టిస్ బి.విజయసేన్ రెడ్డి) నాలుగు వారాల్లో అనర్హత పిటిషన్లపై విచారణ షెడ్యూల్ నిర్ణయించాలని, ఆ షెడ్యూల్‌ను హైకోర్టుకు తెలియజేయాలని స్పీకర్‌ను ఆదేశించింది. ఒకవేళ స్పీకర్ నుండి ఈ మేరకు సమాచారం అందకపోతే, కోర్టు స్వయంగా కేసును తిరిగి తెరిచి తగిన ఆదేశాలు జారీ చేస్తుందని పేర్కొంది.

**నవంబర్ 22, 2024 :** తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఆదేశాలను రద్దు చేసింది. స్పీకర్ అనర్హత పిటిషన్లపై 'సరైన సమయంలో' నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

**జనవరి 16, 2025:** ఫిరాయింపులపై బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేసింది. ముగ్గురు ఎమ్మెల్యేలపై స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ), మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలపై రిట్ పిటిషన్ దాఖలయ్యాయి. స్పీకర్, అసెంబ్లీ సెక్రటరీ నాలుగు వారాల్లో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకునేలా ఆదేశించాలని పిటిషనర్లు కోరారు.

**ఫిబ్రవరి 3, 2025 :** విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు బెంచ్ స్పీకర్‌ను ఉద్దేశించి 'సరైన సమయం' అంటే ఏమిటని ప్రశ్నించింది. అనర్హత పిటిషన్లపై స్పీకర్ చర్యలు తీసుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది.

**ఫిబ్రవరి 10, 2025:** సుప్రీంకోర్టు మరోసారి స్పీకర్ చర్యలపై ప్రశ్నలు సంధించింది. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడానికి సరైన కాలపరిమితిపై విచారించింది.

**మార్చి 4, 2025:** నిర్ణయం తీసుకోవడంలో స్పీకర్ చేస్తున్న ఆలస్యంపై సుప్రీంకోర్టు స్పందించింది. ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటం ప్రజాస్వామ్యానికి హానికరమని పేర్కొంది. ఈ సందర్భంలోనూ 'ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డెడ్' అనే పరిస్థితి ఉండకూడదని వ్యాఖ్యానించింది.

**ఏప్రిల్ 3, 2025:** ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తీర్పును సుప్రీంకోర్టు రిజర్వు చేసింది.

**జూలై 31, 2025:** చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ ఏజీ మసీహ్‌తో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ తీర్పు వెలువరించింది.

# ఉప ఎన్నికలకు బీఆర్ఎస్ సిద్ధం

**ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మరింత విచారణ అవసరం లేదు**

- స్పీకర్ వెంటనే అనర్హత వేటు వేయాలి: కేటీఆర్ డిమాండ్



**సాక్షి, హైదరాబాద్:** పార్టీ మారిన 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విషయంలో మరింత విచారణ జరపాల్సిన అవసరం లేదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారిక కార్యక్రమాల్లో ప్రతిరోజూ పాల్గొంటున్న ఫిరాయింపు ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తూ స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందిగా అసెంబ్లీ స్పీకర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఆ 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే ఉప ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధమవుతోందని కేటీఆర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంలో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. కొంతమంది ప్రజాప్రతినిధులు అడ్డదారులు తొక్కినంత మాత్రాన భారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థ నాశనం కాదని సుప్రీం కోర్టు నిరూపించింది. గత ఎన్నికల సందర్భంగా 'పాంచ్ న్యాయ్' పేరిట పార్టీ మారిన ఎమ్మెల్యే సభ్యత్వం రద్దు చేయాలని చెప్పిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ.. ప్రస్తుత సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తారని ఆశిస్తున్నాను. రాహుల్‌గాంధీ చెప్పే మాటలకు కట్టుబడి ఉంటారని భావిస్తున్నాను. రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ స్పీకర్ పదవిని అడ్డం పెట్టుకొని భారత రాజ్యాంగాన్ని మరింత కాలం అవహేళన చేయబోరని ఆశిస్తున్నాను. 10 మంది ఎమ్మెల్యేలు ప్రలోభాలకు లొంగి పార్టీ మారినా, కష్టకాలంలో పార్టీ వెంట నిలిచిన లక్షల మంది కార్యకర్తలకు ధన్యవాదాలు. అంతిమంగా సత్యం, ధర్మం గెలిచింది.' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

**స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరతారా?**

'రాహుల్‌గాంధీ గారూ.. మీ తండ్రి రాజీవ్‌గాంధీ 52వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశపెట్టిన రాజకీయ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం తెలంగాణ స్పీకర్‌ను చర్యలు తీసుకోవాలని కోరతారా? లేక రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకోవడం కేవలం ఎన్నికల ఉపాయం మాత్రమేనా?' అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు.

## స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



**సాక్షి, హైదరాబాద్:** బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా అసెంబ్లీ స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు సూచించారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసులో స్పీకర్ మూడు నెలల్లోగా తుది నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించటం మంచి పరిణామమని అన్నారు. గురువారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు తెచ్చిన పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి కాంగ్రెస్ మార్పులు చేయడమే కాకుండా...దానిని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ మాదిరిగానే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ చేపట్టిన 'జనహిత పాదయాత్ర'ప్రజలను మోసం చేసేందుకేనని ఆరోపించారు. 2008 మాలేగావ్ పేలుళ్ల కేసులో ముంబైలోని ఎన్ఐఏ కోర్టు... కుట్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులను నిర్దోషులుగా ప్రకటించడాన్ని స్వాగతించారు.

## నాడు ఎమ్మెల్యేలను పశువుల్లా కొన్నది బీఆర్ఎస్సే..

- ఇప్పుడు కేటీఆర్ హరిశ్చంద్రుడిలా మాట్లాడుతున్నారు
- రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**నల్లగొండ:** బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొనుగోలు చేసి, ఇప్పుడు పార్టీ ఫిరాయింపులపై ఆ పార్టీ నేత కేటీఆర్ హరిశ్చంద్రుడిలా మాటలు మాట్లాడుతున్నారని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. గురువారం నల్లగొండలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నాడు ఇతర పార్టీల్లో గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డిలకు మంత్రి పదవులు ఎలా ఇచ్చారో సమాధానం చెప్పాలని కేటీఆర్‌ను ప్రశ్నించారు. తాము బీఆర్ఎస్ తరహాలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేయలేదని, వారు ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలమనే చెప్పుకుంటున్నారని గుర్తుచేశారు. ఉప ఎన్నికలు వచ్చినా, స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చినా ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు వేసి గెలిపిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఉంటుందో పోతుందో తెలియని పరిస్థితి ఉందని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు ఇతర అంశాలపై జరుగుతున్న విచారణలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ.. 'సినిమా 3 గంటలు నడుస్తుంది. విలన్ చివరిలో చనిపోతాడు. బీఆర్ఎస్ నేతల అవినీతి మీద విచారణలు నడుస్తున్నాయి. పోయే కాలం వస్తే పోతారు' అని వ్యాఖ్యానించారు.

# పాలనలో విఫలం.. బాబులో భయం

## మా పార్టీ వాళ్లను నేను కలవడానికి ఇన్ని ఆంక్షలెందుకు?

## తీవ్ర ప్రజా వ్యతిరేకతతో రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు

## నెల్లూరు పర్యటనలో నిప్పులు చెరిగిన వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఏపీలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుతో ఎమర్జెన్సీ పరిస్థితులు కనిపిస్తున్నాయని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం మీద తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని, అందుకే తన పాలన చూసి తానే భయపడుతున్నాడని చెప్పడానికి ఇంతకన్నా వేరే నిదర్శనాలు అవసరం లేదన్నారు. ఎవరైనా బ్రహ్మాండమైన పాలన అందించి, ప్రజల మన్ననలు, ఆశీస్సులు పొందాల్సింది పోయి.. పాలన మొదలైనప్పటి నుంచి అన్నీ అబద్ధాలే చెబుతున్నారని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్‌లు, సూపర్ సెవెన్లు అంటూ ప్రజలకు వెన్నుపోటు పొడిచారని ధ్వజమెత్తారు. ఇలాంటి దుర్మార్గపు పాలన ఎన్నడూ, ఎక్కడా చూడలేదని పాలనంతా అబద్ధాలు మోసాలేనని నిప్పులు చెరిగారు. తన పార్టీ వాళ్లను పరామర్శించడానికి వస్తే తప్పేముందని, ఇన్ని ఆంక్షలేంటని నిలదీశారు. గురువారం ఆయన నెల్లూరు పర్యటనలో తొలుత అక్రమ కేసుల్లో అరెస్ట్ అయ్యి జిల్లా సెంట్రల్ జైల్లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్ అయ్యారు. అనంతరం మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి వెళ్లి, ఆ కుటుంబాన్ని పరామర్శించారు. వారింట్లో జరిగిన దారుణ విధ్వంసం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పరిస్థితులు, అనేక ఘటనలు ఎమర్జెన్సీ పరిస్థితులను కళ్లకు కడుతున్నాయన్నారు. 'నిజంగా ఒక ప్రతిపక్ష నాయకుడిని చూసి ఇంతగా భయపడుతున్నందుకు చంద్రబాబు బావిలో దూకాలి. ప్రతిపక్ష నాయకుడిని చూసేందుకు వస్తున్న ఆయన అభిమానులను ఆపడం కోసం, ప్రజలను ఆపడం కోసం రోడ్లను తవ్విన చరిత్ర ఒక్క చంద్రబాబునాయుడికే దక్కుతుంది. ఈ రోజు 2 వేలకు పైగా పోలీసులు, లెక్కలేనంత మంది డీఎస్పీలను పెట్టారు. డీఐజీ కూడా ఇక్కడే తిష్ట వేశాడట. వారంతా నా సెక్యూరిటీ కోసం కాదు.. నా అభిమానులను ఆపడం కోసం వారంతా పని చేస్తున్నారు' అని నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..



నెల్లూరులో తనను కలిసేందుకు వచ్చిన భారీ జనసందోహానికి అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

### గొంతు నొక్కేందుకే రెడ్‌బుక్

- వ్యవస్థలన్నీ నీరుగారిపోయాయి. స్కూళ్ల నాశనం అయిపోయాయి. విద్యా దీవెన, వసతి దీవెన లేదు. ఆరు క్వార్టర్ల విద్యా దీవెన పెండింగ్. ఫీజులు అందడం లేదు. దాంతో పిల్లలు చదువులు మానేస్తున్నారు. నాడు–నేడు ఆగిపోయింది. నాడు గోరుముద్ద పేరుతో రోజుకో మెనూతో పిల్లలకు మంచి పౌష్టికాహారం ఇచ్చాం. ఈ రోజు స్కూళ్లలో తిండి తినడానికి పిల్లలు భయపడుతున్నారు. ఇంగ్లిష్ మీడియం ఆగిపోయింది.
- మా ప్రభుత్వ హయాంలో ఇంగ్లిష్ మీడియం, టోఫెల్ క్లాసులు పెడితే వాటిని ఎత్తేశారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. నెలకు రూ.300 కోట్లు కావాలి. దాదాపు రూ.4,200 కోట్లు బకాయి పెట్టాడు. ఆరోగ్య ఆసరా లేనే లేదు. ఆరోగ్యశ్రీ కింద ఆస్పత్రులు వైద్య సేవలు అందించడం లేదు.
- ఏ పంటకు గిట్టుబాటు ధర లేదు. ఉచిత పంటల బీమా లేదు. రైతులకు పెట్టుబడి సాయం లేదు. వారికి రైతు భరోసా అందడం లేదు. దాన్ని చంద్రబాబు ఖూనీ చేశారు. చంద్రబాబు పాలనలో రైతులకు ఆత్మహత్యలే శరణ్యం అన్నట్లుగా వ్యవసాయం మారింది. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దిగజారిపోయింది. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది. సూపర్ సిక్స్‌లు, సూపర్ సెవెన్లు మోసాలయ్యాయి. జగన్ పథకాలన్నీ రద్దు చేయడంతో పేదలు అల్లాడుతున్నారు. ప్రజలకు చంద్రబాబు సమాధానం చెప్పుకోలేక, వారు ప్రశ్నిస్తే ఆ గొంతును నొక్కడానికి చేస్తున్న ప్రయత్నమే ఈ రెడ్‌బుక్ రాజ్యాంగం.

### అంతులేని అవినీతి, ఎక్కడికక్కడ దోపిడీ

- రాష్ట్రంలో అవినీతి ఏ స్థాయిలో జరుగుతుందో అందరికీ తెలుసు. అంతటా లిక్కర్ మాఫియా. ఎక్కడ చూసినా, ఆ ప్రాంత ఎమ్మెల్యేలే అందులో ఉంటున్నారు. వారే అక్కడ లిక్కర్ మాఫియా బాస్‌గా ఉన్నారు. వేలం పాట పాడి మరీ బెల్టు షాప్‌లు కేటాయిస్తున్నారు. అక్కడ ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. ఇల్లీగల్ పర్మిట్ రూమ్‌లతో లిక్కర్ అమ్ముతున్నారు. డీఐజీ ఆధ్వర్యంలో డీఎస్పీలు, డీఎస్పీల ఆధ్వర్యంలో సీఐలు.. ఇలా లంచాలు తీసుకొని ఎమ్మెల్యేలకు ఇంత, చంద్రబాబుకు ఇంత అంటూ పంచుకుంటున్నారు.
- రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో చూసినా ఇసుకను యథేచ్ఛగా దోచుకుంటున్నారు. ఇదే నెల్లూరు జిల్లాలో సిలికా, క్వార్ట్జ్ యథేచ్ఛగా దోచుకుంటున్నారు. సిలికా ఓనర్లంతా కోర్టుకెళ్లారు. ఇక్కడ లోకల్ లీడర్ వీపీఆర్ (వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి) ద్వారానే సిలికా అమ్మాలంట! ఎవరికీ కూడా మైనింగ్ పర్మిట్ ఇవ్వడం లేదు. ఇందులో నారా లోకేశ్, చంద్రబాబుకు వీపీఆర్ లంచాలు పంపిస్తున్నాడు. ప్రతి మైన్స్‌లో కూడా ఎమ్మెల్యేను కలవాలి. కొంత పోలీసులకు ఇవ్వాలి.
- ఏ నియోజకవర్గంలో చూసినా విచ్చలవిడిగా పేకాట క్లబ్‌లు నడుపుతున్నారు. గోదావరి జిల్లాల్లో అయితే పేకాట క్లబ్‌లకే కోటి రూపాయలు ఇస్తున్నారు. నియోజకవర్గంలో ఏ పరిశ్రమ ఉన్నా కూడా ఎమ్మెల్యేకు, పోలీసులకు డబ్బు ఇవ్వాల్సిందే. లేదంటే ఎమ్మెల్యే మనుషులను పంపించి పరిశ్రమల ఉత్పత్తి ఆపేస్తున్నారు. రాష్ట్రంలో ఈ స్థాయిలో అవినీతి జరుగుతున్నా ఎవరూ మాట్లాడకూడదు.

### మీ విత్తనమే రేపు వృక్షం అవుతుంది..

- అయ్యా చంద్రబాబూ.. నీవు ఒక తప్పుడు సంప్రదాయానికి విత్తనం విత్తుతున్నావు. ఇదే విత్తనం రేపు పొద్దున వృక్షం అవుతుంది. నీవు ఏదైతే విత్తుతావో అదే పండుతుంది. ఎల్లకాలం నువ్వు ముఖ్యమంత్రిగా ఉండవు. మరో మూడేళ్ల తర్వాత వచ్చేది మా ప్రభుత్వమే. అప్పుడు ఇదే చంద్రబాబు, ఆయన అడుగులకు మడుగులు ఒత్తిన తప్పుడు అధికారులు.. ఎవరైతే అన్యాయాలు చేశారో, తప్పులు చేశారో అందరి లెక్కలు తీస్తాం. అందరినీ చట్టం ముందు నిలబెడతాం. మీరు విత్తిన విత్తనం మాదిరిగానే రెండింతలుగా మీకు రాబోయే రోజుల్లో జరుగుతుంది.
- ఇప్పటికైనా మేలుకోమని చెబుతున్నా. మీ నైజం, మీ వైఖరి మార్చుకోమని కోరుతున్నా. అలా చేయకపోతే రేపు పొద్దున జరిగే పరిణామాలకు మాత్రం కచ్చితంగా మీరే బాధ్యత వహించాల్సి వస్తుందని చంద్రబాబుకు, ఆయన అడుగులకు మడుగులు ఒత్తే అధికారులందరికీ చెబుతున్నాను.
- కొంత మంది అధికారులు రిటైర్ అవుతాం.. లేదా వీఆర్ఎస్ తీసుకొని విదేశాలకు వెళ్తామని అనుకోవచ్చు. సప్త సముద్రాల అవతల దాక్కున్నా వదలి పెట్టం. ప్రతి ఒక్కరినీ పిలిపించి, మీరు చేసిన ప్రతి పనికి సంబంధించి చట్టం ముందు నిలబెడతాం. తప్పు చేసిన ప్రతి ఒక్కరికీ కచ్చితంగా శిక్ష పడేలా అడుగులు పడతాయి.

## మహబూబ్‌నగర్ క్లస్టర్ అభివృద్ధికి రూ. 986 కోట్లు

### కేంద్రమంత్రి ఖట్టర్‌కు ఎంపీ అరుణ విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: మహబూబ్‌నగర్ క్లస్టర్ అభివృద్ధికి రూ.986 కోట్లు మంజూరు చేయాలని కేంద్రాదనికి బీజేపీ ఎంపీ డీకే అరుణ విజ్ఞప్తి చేశారు. కేంద్ర బడ్జెట్ 2025–26లో ప్రకటించిన విధంగా అర్బన్ చాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) నిధులు మంజూరు చేయాలని ఆమె కోరారు. ఈ మేరకు బుధవారం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు అరుణ వినతిపత్రం అందజేశారు. కాగా, మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరికి కూడా అరుణ వినతిపత్రం అందజేశారు.






## ఎవరి భాష్యం వారిదే!

- ఎమ్మెల్యేల అనర్హత అంశంలో సుప్రీం తీర్పుపై కాంగ్రెస్, బీఆర్ఎస్ భిన్న స్పందన

సాక్షి, హైదరాబాద్: పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత అంశంపై మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పరస్పర భిన్నంగా స్పందించాయి. గత శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన 38 మంది శాసనసభ్యుల్లో 10 మంది కాంగ్రెస్‌లో చేరడం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్లమెంటు ఎన్నికల్లో ఏకంగా సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోగా, స్టేషన్ ఘన్‌పూర్ నుంచి గెలిచిన కడియం శ్రీహరి కూతురు కావ్య వరంగల్ కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. వారిద్దరూ కాంగ్రెస్ కండువాలతోనే ప్రచారంలో పాల్గొన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరారు. ప్రతిపక్ష పార్టీకి కేటాయించే పీఏసీ చైర్మన్ పదవిని ఇవ్వడం ద్వారా ఆయన ఏ పార్టీకి చెందిన వారనే మీమాంసను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సృష్టించారు. మరో ఏడుగురు సభ్యులు కాంగ్రెస్‌లో చేరినప్పటికీ సుప్రీంకోర్టులో కేసు నేపథ్యంలో ఇంతకాలం అటుఇటుగా వ్యవహరిస్తూ వచ్చారు. తాజాగా సుప్రీం తీర్పును ఇరు పార్టీల నేతలు ఎవరికి తగ్గట్లుగా వారు అన్వయించుకున్నారు.

### ఎదురుదెబ్బ.. ఎదురుదాడి..

చట్టసభలకు సంబంధించిన అంశాల్లో కోర్టులు జోక్యం చేసుకోవనే ధీమాతో ఉన్న అధికార కాంగ్రెస్‌కు సుప్రీం తీర్పుతో ఎదురుదెబ్బ తగిలిందని బీఆర్ఎస్ వ్యాఖ్యానించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలను స్పీకర్ మూడు నెలల్లోగా అనర్హులుగా ప్రకటించాల్సిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడిందని ఆ పార్టీ నేతలు చెప్పుకొచ్చారు. బీజేపీతోపాటు పలువురు రాజకీయ విశ్లేషకులు సైతం ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యాఖ్యానించారు. అయితే కాంగ్రెస్ నేతలు మాత్రం బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన ఘటనలను ఉటంకిస్తూ ఎదురుదాడి ప్రారంభించారు. టీడీపీ నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ నుంచి గెలిచిన సబితా ఇంద్రారెడ్డి బీఆర్ఎస్‌లో చేరి ఏకంగా మంత్రులుగా ఐదేళ్లు కొనసాగిన విషయాన్ని గుర్తుచేశారు. అయినా సుప్రీంకోర్టు పార్టీ మారిన వారిపై అనర్హత వేటు వేయాలని ఆదేశించలేదని.. అనర్హతపై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని మాత్రమే సూచిస్తూ తుది నిర్ణయం స్పీకర్‌కే కట్టబెట్టిందని చెప్పుకొచ్చారు. ఇదే తమ పార్టీకి కలిసి వస్తుందని ఓ ముఖ్య నేత వ్యాఖ్యానించారు. సుప్రీం తీర్పు వల్ల కాంగ్రెస్ పార్టీకి 2028 వరకు వచ్చే నష్టమేమీ లేదని మరో నేత పేర్కొన్నారు.



ఆది శ్రీనివాస్



అద్దంకి

### సుప్రీం తీర్పుతో బీఆర్ఎస్‌కు చుక్కెదురు: ఆది శ్రీనివాస్

### స్పీకర్ అధికారాలను సుప్రీం ప్రశ్నించలేదు: అద్దంకి

సాక్షి, హైదరాబాద్: పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయించాలనుకొని పగటి కలలు గన్న బీఆర్ఎస్‌కు సుప్రీంకోర్టు తీర్పుతో చుక్కెదురైందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. అధికారంలో ఉన్న పదేళ్లలో 60 మందిని పార్టీలో చేర్చుకున్న బీఆర్ఎస్.. ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ అధికారాలను సుప్రీంకోర్టు ప్రశ్నించలేదని, కేవలం డైరెక్షన్ మాత్రమే ఇచ్చిందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నట్లు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ తీర్పు బీఆర్ఎస్‌కు చెంపపెట్టు వంటిదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు వారు సీఎల్పీలోని మీడియా సెంటర్‌లో మాట్లాడారు.

## బీసీ రిజర్వేషన్ల సాధనకు కలిసి రండి

**ప్రజల కోసమే జనహిత పాదయాత్ర**

- కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్
- వచ్చే రెండేళ్లలో 35 వేల ఉద్యోగాల భర్తీ: పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్
- పరిగిలో మహాజన పాదయాత్ర



మాట్లాడుతున్న మీనాక్షి నటరాజన్. చిత్రంలో మహేశ్‌కుమార్‌గౌడ్, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

వికారాబాద్, పరిగి: ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్లని.. అందుకే వారి కోసం పాదయాత్ర చేస్తున్నామని ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. వికారాబాద్ జిల్లా పరిగిలో కాంగ్రెస్ చేపట్టిన జనహిత పాదయాత్ర, రోడ్‌షోలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో కలిసి ఆమె గురువారం పాల్గొన్నారు. మండల పరిధిలోని రంగాపూర్ నుంచి పరిగి పట్టణం వరకు ఆరు కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక కొడంగల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో మీనాక్షి మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం కేంద్రంతో పోరాడుతున్నామని, ప్రజలు సైతం ఇందులో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేని అభివృద్ధి తెలంగాణలో జరుగుతోందని తెలిపారు.

### 65 వేల ఉద్యోగాలిచ్చాం..

పాదయాత్రలకు కాంగ్రెస్ పెట్టింది పేరు అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకే జనహిత పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు. కేసీఆర్ పాలనలో చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే సంక్షేమం, అభివృద్ధిని కొనసాగిస్తున్నామని వెల్లడించారు. తాము అధికారంలోకి వచ్చాక 65 వేల ఉద్యోగాలిచ్చామని తెలిపారు. వచ్చే రెండేళ్లలో మరో 35 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తమ అధినాయకత్వం డిమాండ్ చేస్తుంటే.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముఖం చాటేస్తోందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 5, 6, 7 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలకు రావాలని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులను కోరారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డి పథకాన్ని పూర్తి చేసి తీరుతామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, బి.మనోహర్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీర్‌రెడ్డి, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ చైర్మన్ రామచల్ల సిద్ధేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రధానితో బీఆర్ఎస్ ఎంపీ భేటీ

### హైదరాబాద్‌లో ఆస్పత్రి ప్రారంభోత్సవానికి ఆహ్వానం

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు, హెటిరో సంస్థల అధినేత బండి పార్థసారథి రెడ్డి గురువారం ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. తన కుటుంబ సభ్యులతో కలిసి మోదీతో సమావేశమైన పార్థసారథిరెడ్డి, తన కుమార్తె కృష్ణ సింధూరి జ్ఞాపకార్థం హైదరాబాద్‌లో నిర్మించిన 1,400 పడకల అత్యాధునిక ఆస్పత్రి ప్రారంభోత్సవానికి రావాలని ప్రధానిని ఆహ్వానించారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఆస్పత్రిని నిర్మించామని ఆయన వివరించారు.

## ఈనెల 19 నుంచి సీపీఐ మహాసభలు

- 4 రోజుల పాటు మేడ్చల్ జిల్లా గాజులరామారంలో నిర్వహణ
- మహాసభల పోస్టర్ ఆవిష్కరించిన పార్టీ కార్యదర్శి కూనంనేని



సాక్షి, హైదరాబాద్: భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర 4వ మహాసభలను ఆగస్టు 19 నుంచి 21వ తేదీ వరకు మూడు రోజులపాటు మేడ్చల్ జిల్లా గాజులరామారంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు తెలిపారు. మహాసభలు జరిగే ప్రాంతానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, దివంగత బాలమల్లేశ్ పేరుతో 'ఎస్.బాలమల్లేష్ నగర్'గా నామకరణం చేసినట్లు చెప్పారు. సీపీఐని ప్రజలతో మరింత మమేకం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర మహాసభలు కొనసాగుతాయని ఆయన ప్రకటించారు. మహాసభల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ గడిచిన ఈ మూడేళ్లలో బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద, ఫాసిస్టు విధానాలను వెలుగులోకి తీసుకురావడంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారన్నారు. రాష్ట్రంలో పోడు భూములకు సంబంధించి సీపీఐ నిర్వహించిన ఉద్యమాలతో 75 శాతం ఈ సమస్య పరిష్కారమైందని చెప్పారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, పశ్యపద్మ, వి.ఎస్.బోస్ తదితరులు పాల్గొన్నారు.

**పార్టీ మారితే వెంటనే అనర్హత వేటు..**

పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు తీర్పు ఆహ్వానించదగిందేనని, అయితే చట్టంలోని లొసుగుల వల్ల సాధ్యాసాధ్యాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఎమ్మెల్యే కూనంనేని వ్యాఖ్యానించారు. ఒక పార్టీలో గెలిచి, మరో పార్టీలోకి ఫిరాయించిన వెంటనే వారిపై అనర్హత వేటు పడేలా చట్టాన్ని మరింత పటిష్టం చేయాలని అన్నారు. కాళేశ్వరంపై ఘోష్ కమిషన్ నివేదికను అందజేసిన నేపథ్యంలో బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కాగా, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బీసీ బిల్లుకు పెద్ద అడ్డంకి బీజేపీనేనని కూనంనేని వ్యాఖ్యానించారు.





సాక్షి

శుక్రవారం, 1 ఆగస్టు 2025

# సుంకాలు... శాపనార్థాలు!

రాక తప్పదనుకుంటున్న ముప్పు ముంగిట్లోకొచ్చింది. అమెరికా అధ్యక్షపీఠం అధిష్ఠించింది మొదలు నిలకడలేనితనంతో, పొంతనలేని వ్యాఖ్యలతో మిత్రుల్ని, వ్యతిరేకుల్ని కూడా సమానంగా ఇరకాటంలో పడేస్తున్న డోనాల్డ్ ట్రంప్... గతంలో హెచ్చరించినట్టే సుంకాల మోత మోగించారు. శుక్రవారం నుంచి భారత్ నుంచి వచ్చే సరుకులపై 25 శాతం సుంకాలు విధిస్తామని, ఇవిగాక రష్యా నుంచి ముడిచమురు, రక్షణ సామగ్రి కొంటున్నందుకు అదనంగా జరిమానా ఉంటుందని ప్రకటించారు. అది ఎంత శాతమో చెప్పకపోయినా రష్యాతో వాణిజ్యం సాగించే భారత్, చైనాలపై 500 శాతం వరకూ అదనపు సుంకాలుంటాయని ఆయన లోగడ ప్రకటించారు. కనుక ఈ సుంకాల కన్నా జరిమానా వాటాయే ఎక్కువుంటుందని అంచనా వేయొచ్చు. తన ఆదేశాలను బేఖాతరు చేయనందుకు మన ఆర్థిక వ్యవస్థను 'మృత ఆర్థిక వ్యవస్థ'గా దూషించారు. అనాల్సిన వన్నీ అన్నాక 'ఇంకా భారత్‌తో చర్చలు జరుగుతున్నాయి. ఏం జరుగుతుందో చూద్దాం' అని ముక్తాయించారు. ఆయన హుకుం అమలైతే వస్త్రాలు, రొయ్యలు, ఆభరణాలు, వజ్రాలు, తోలు ఉత్పత్తులు వగైరాలపై తీవ్ర ప్రభావం పడుతుందనీ, ఆ రంగాల్లో ఉపాధి దెబ్బతింటుందనీ నిపుణుల అంచనా. ఈ రంగాల్లో 8,700 కోట్ల డాలర్ల విలువైన ఎగుమతులుంటున్నాయి. ఈ ఏడాది జీడీపీ 6.5 శాతానికి మించి వుండొచ్చని అంచనాలున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో అది బాగా తగ్గవచ్చంటున్నారు.

ట్రంప్‌కు దౌత్య మర్యాదల సంగతి అటుంచి వ్యక్తిగా ఎలా మెలగాలో కూడా తెలియదు. బహిరంగ బెదిరింపులకు దిగటం, అన్యాయమని అందరికీ తెలిసేలా ప్రవర్తించటం ఆయన నైజం. బ్రెజిల్ సంగతే తీసుకుంటే అక్కడ ఆ మధ్య అధికారం కోల్పోయిన బోల్సొనారో ఆయనకు ఇష్టుడు. కనుక అతనిపైవున్న నేరారోపణలు ఉపసంహరించి వదిలేయమని తాఖీదు పంపారు. అంగీకరించనందుకు అదనపు సుంకాలు విధించారు. దేశాలకు సార్వభౌమత్వం ఉంటుందనీ, దానికి లోబడి సంబంధాలు నెరపాలనీ ఆయన భావించరు. వాణిజ్య ఒప్పందాలు సాకారం కావాలంటే వాటిని కుదుర్చుకోదల్చుకున్న రెండు పక్షాలకూ పరస్పర విశ్వాసం, నమ్మకం ఉండాలి. ఓపిగ్గా చర్చించాలి. బ్రిటన్‌తో మనకు ఇటీవల కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందమే ఇందుకు ఉదాహరణ. దాదాపు మూడేళ్లపాటు ఆ ఒప్పందంపై చర్చలు సాగాయి. ఒప్పందం అన్నాక ఇచ్చిపుచ్చుకోవడాలుంటాయి. 'మేం పుచ్చుకుంటాం... ఇవ్వం' అంటున్నారు. 'మాతో ఒప్పందానికి భారత్ సుముఖంగా వుంది... ఇక సంతకాలే తరువాయి' అంటూ చాన్నాళ్ల క్రితమే మన ప్రభుత్వం తరఫున తానే ప్రకటించారు.

ట్రంప్ ఆగ్రహావేశాలకు వేరే కారణాలున్నాయి. మన సాగు, పాడి రంగాలను పరిరక్షించేందుకు అమెరికా నుంచి వచ్చే ఆ ఉత్పత్తులపై మన దేశం అధిక సుంకాలు విధిస్తోంది. ఇందులో సహేతుకత ఉంది. అమెరికాలో ఆ రంగాలకు భారీ సబ్సిడీలుంటాయి. దాంతో తమ ఉత్పత్తుల్ని వేరే దేశాల్లో కారుచౌకగా అమ్ముకోవటానికి వీలుంటుంది. అమెరికాతో పోలిస్తే మన సబ్సిడీలు చాలా తక్కువ. అవి రైతులకు లాభదాయకం కాకపోగా, ఆ రెండు రంగాల్లోనూ వ్యయం విపరీతంగా పెరిగింది. రైతులు అధిక వడ్డీకి బయట అప్పులు చేయాల్సి వస్తోంది. తీరా గిట్టుబాటు ధర లభించక, అప్పులు తీరక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ట్రంప్ ఒత్తిడి చేస్తున్నట్టు అధిక సుంకాలు తొలగిస్తే ఈ సంక్షోభం మరింత పెరుగుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఆసరాగా ఉన్న ఆ రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. నిజానికి ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)లో చేరినప్పుడే మన పాలకులు నిక్కచ్చిగా ఉండాల్సింది. కానీ దాటవేత ధోరణి ప్రదర్శించారు.

రష్యాతో వాణిజ్యంపైనా ఇంతే. అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలన్నట్టు ఉంటే వేరుగా ఉండేది. కానీ మన దేశం వారి ఆదేశాలు పాటించింది. 2009-13 మధ్య మన ఆయుధ కొనుగోళ్లలో రష్యా వాటా 76 శాతం. అదిప్పుడు 36 శాతానికి పడిపోయింది. దీన్ని ఆపేయాలని, తన ఎఫ్-35 యుద్ధ విమానాలు, ఎంక్యూ-9బి డ్రోన్లు, పీ-81 సాగర ప్రాంత గస్తీ విమానాలు కొనితీరాలని అమెరికా ఒత్తిడి తెస్తోంది. నిజానికి భారత్‌కు ఆయుధ అమ్మకాలపై 1960 ప్రాంతాల్లో అమెరికా నిషేధం విధించబట్టే రష్యాపై ఆధారపడటం పెరిగింది. ముడి చమురు విషయానికొస్తే మొన్న ఫిబ్రవరికి రష్యా నుంచి కొనుగోళ్లు 25 శాతం మేర పడిపోయాయి. అదే సమయంలో అమెరికా నుంచి కొనుగోళ్లు వంద శాతం పెరిగాయి. తన అంధభక్త గణాన్ని సంతృప్తిపరచటం కోసం, ఓటుబ్యాంకు పెంచుకోవటం కోసం ట్రంప్ దశాబ్దాల తరబడి ఎంతో ఓపిగ్గా నిర్మించుకుంటూ వచ్చిన ఇరు దేశాల సంబంధాలపైనా గొడ్డలి వేటు వేశారు. దీని పర్యవసానాలు మనపై ఉన్నట్టే, అమెరికాపైనా ఉంటాయి. ఆయన ధోరణి మారకపోతే మన ఆర్థిక వ్యవస్థ మాటేమోగానీ... అమెరికా ఆర్థిక వ్యవస్థ 'మృతప్రాయం' కావటం ఖాయం.

## గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, **తిథి:** శు.అష్టమి పూర్తి (24 గంటలు). **నక్షత్రం:** స్వాతి రా.3.24 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** ఉ.7.01 నుండి 8.47 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.07 వరకు, తదుపరి ప.12.30 నుండి 1.20 వరకు, **అమృత ఘడియలు:** సా.5.40 నుండి 7.24 వరకు.

సూర్యోదయం : 5.42
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

## సోషల్ మీడియా

### శక్తికి మూలం



ఒకే రోజు మూడు వేర్వేరు కోర్టులలో నాలుగు కేసులు పూర్తయ్యాయి – అన్నీ భోజనానికి ముందే! ఒక సహోద్యోగి అడిగారు: మీకు ఇంతటి శక్తి ఎక్కడి నుంచి వస్తుంది? అని. నా ధ్యానం నుంచి, నా రన్నింగ్ నుంచి... అని ప్రశాంతంగా సమాధానమిచ్చాను.

– స్వాతి ఎస్. మాలిక్, న్యాయవాది, మారథాన్ రన్నర్

### ఏమైనా అనేస్తారా!



ఇండియా స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటు 6.4 శాతం. అమెరికా స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటు 1.5 శాతం. అయినప్పటికీ, ట్రంప్ ఆత్మ విశ్వాసం చూడండి: 'ఇండియా ఈజ్ డెడ్ ఎకానమీ' అంటున్నారు!

– బోరింజు వెలియత్, ఈక్విటీ ఇంటెలిజెన్స్ ఇండియా సీఈవో

### ఎదురొస్తే బాగుండు!



ఆగ్రా ట్రాఫిక్ ఎస్పీ, తప్పిపోయిన తన పిల్లిని వెతికించటం కోసం నలుగురు హోమ్ గార్డ్‌లను నియమించారు. అంతేకాదు, పిల్లికి ఏమైనా జరిగితే ఆ నలుగుర్నీ సస్పెండ్ చేస్తానని కూడా హెచ్చరించారు. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో ఇంకానా... ఇలాంటివి?

– దీపికా నారాయణ్ భరద్వాజ్, హక్కుల కార్యకర్త

### రిస్క్ తీసుకోండి!



ఒక వ్యవస్థాపకుడికి ఉండాల్సిన లక్షణం... రిస్క్ తీసుకోగలగటం! రిస్క్, శ్రమ కలిస్తేనే భారతదేశంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే పెద్ద కంపెనీలు ఏర్పడతాయి.

– అనిల్ అగర్వాల్, ఛైర్మన్, వేదాంత గ్రూప్

### సొంత మనుషులు



లోక్‌సభలో ప్రధాని మోదీని పలకరించకుండా గడ్కరీ వెనకే నిలబడి పోయారు. మోదీ ఆయనను తదేకంగా చూశారు. అయినా కూడా గడ్కరీ పట్టనట్లు ఉండిపోయారు. మీ సొంత మంత్రులు మీ పట్ల గౌరవం చూపటం మానేసినప్పుడు, మీరు కోల్పోయేది నైతిక అధికారాన్ని మాత్రమే కాదు, ఆదేశించే శక్తిని కూడా!

– గౌరవ్ పాంధీ, ఏఐసీసీ సెక్రెటరీ

### పాపం... చిన్నారి!



డబ్బు కోసం మగవాళ్ల ముందు ఒక చిన్నమ్మాయి నాట్యం చేయటం చూసి నా గుండె బద్దలైంది. ఆమెకు బాల్యం, విద్య, భవిష్యత్తు అవసరం.

– ఫజల్ అఫ్గాన్, జెండర్ యాక్టివిస్ట్

# సభాపతులకు సుప్రీమ్ పాఠం

సందర్భం



దిలీప్ రెడ్డి

**పార్టీ మార్పిళ్ల నిరోధక చట్టానికి సుప్రీం కోర్టు తాజా తీర్పు పదును తెచ్చింది. తెలంగాణలో పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేల అనర్హతపై పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను, ఎట్టి పరిస్థితుల్లో మూడు నెలలు దాటకుండా పరిష్కరించాలని స్పీకర్‌కు గడువు నిర్దేశిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. చాలా కాలంగా ఏర్పడిన ఒక రాజ్యాంగ ప్రతిష్టంభన దీంతో తొలగిపోయినట్టయింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ స్పీకర్లు, మండలి ఛైర్మన్ల నిర్ణయ జాప్యం, తాత్సారం వల్ల చట్టం స్ఫూర్తికి ఇన్నాళ్లూ తూట్లు పడుతూ వచ్చింది. తాజా తీర్పుతో పార్టీ మార్పిళ్ల నిరోధక చట్టానికి జవం, జీవం వచ్చినట్టయింది. ఇప్పుడిక, తెలంగాణలో పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు తప్పదా? అదే జరిగితే బీఆర్ఎస్ ఆశిస్తున్నట్టు ఉప ఎన్నికలు తప్పవా? ఆ ఉప ఎన్నికలను తమ ఏడాదిన్నర పాలనకు రెఫరెండమ్‌గా స్వీకరించడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందా?**

ఇదివరకటి రాజ్యాంగ ధర్మాసనాలు ఇదే అంశంపై వెల్లడించిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, భారత అత్యున్నత న్యాయస్థానం వెల్లడించిన తాజా తీర్పు పార్టీ మారిన పదిమంది తెలంగాణ శాసన సభ్యులను కలతకు గురిచేసేదే! శాసన వ్యవస్థ గొడుగు కింద రాజ్యాంగం తమకు కల్పించిన విశేష రక్షణ (ఇమ్యూనిటీ) ఈ విషయంలో వర్తించదని సుప్రీంకోర్టు ఇచ్చిన అన్వయం స్పీకర్లకు పాఠమే! 'అనర్హత పిటిషన్ల విషయంలో ఎప్పటిలోగా నిర్ణయం ప్రకటించాలో న్యాయస్థానాలు తమకు గడువు విధించజాలవు' అన్న స్పీకర్ల వాదన ఇక నిలువదు. ఎన్నికలు ముగిసిన స్వల్ప కాలంలోనే బీఆర్ఎస్ నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలోకి మారిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), తెల్లం వెంకట్రావ్ (భద్రాచలం), దానం నాగేందర్ (ఖైరతాబాద్)లను పార్టీ మార్పిళ్ల నిరోధక చట్టం (1985) కింద అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి (హుజూరాబాద్), కె.పి.వివేకానంద (కుత్బుల్లాపూర్) స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ స్పందించక పోవడంతో వారు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఒక పార్టీ నుంచి గెలిచి, కనీసం ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ పార్టీ తరఫున దానం నాగేందర్ సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీ చేయడాన్ని తప్పుపడుతూ బీజేపీ శాసన సభాపక్ష నేత అయిన మహేశ్వరరెడ్డి విడిగా న్యాయస్థానంలో మరో పిటిషన్ వేశారు. అదే క్రమంలో మరో ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాసరెడ్డి (బాన్సువాడ), ఎం. సంజయ్ కుమార్ (జగిత్యాల), కాలె యాదయ్య (చేవెళ్ల), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్‌చెరు), టి.ప్రకాశ్ గౌడ్ (రాజేంద్ర నగర్), ఆరెకపూడి గాంధీ (శేరిలింగం పల్లి) కూడా విపక్ష బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ శిబిరం చేరారు.

చట్టంలోని ఒక నిబంధన ప్రకారం ఒక రాజకీయ పార్టీలోని ప్రజాప్రతినిధుల్లో మూడింట రెండొంతుల మంది వేరొక పార్టీలో చేరితో దాన్ని 'విలీనం' కింద ప్రకటించుకోవచ్చు. అప్పుడు వారికి అనర్హత వర్తించదు. అంటే, 26 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు (ఎన్నికైన 39లో మూడోవంతు) కాంగ్రెస్‌లోకి మారితే అది 'విలీనం' అవుతుంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్, జూబ్లీహిల్స్‌లో తగ్గిన సంఖ్య తర్వాత అది 25కి తగ్గుతుందన్నా మరో 15 మంది (ఇప్పటికే పార్టీ మారిన పదిమందికి తోడు) మారాల్సి ఉంటుంది. ఇప్పుడున్న



పరిస్థితుల్లో అది అయ్యే పని కాదు.

పార్టీ మారిన పదిమందిని అనర్హులుగా ప్రకటించకుండా స్పీకర్ ముందు మరే ప్రత్యామ్నాయమైనా ఉందా? బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్‌ను తిరస్కరించవచ్చు. ఆ నిర్ణయం ఆధారంగా వారు మళ్లీ న్యాయస్థానాన్ని సంప్రదిస్తారు. అప్పుడది కోర్టుల న్యాయ సమీక్షకు నిలబడాలి. ఒక్క నాగేందర్ తప్ప మిగతా సభ్యులు, తాము పార్టీ మారనే లేదు, ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని, స్పీకర్ తమను వ్యక్తిగతంగా సంప్రదించినపుడు చెప్పొచ్చు. తనపై లేనిపోని దుష్ప్రచారాలు చేస్తున్నారు తప్ప, తాను పార్టీయే మారలేదని కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల) ఇదివరకు ఇలా ప్రకటించారు.

### ఎవరి ఎత్తుగడ ఏముంటుందో?

ఎట్టి పరిస్థితుల్లో ఉప ఎన్నిక తెచ్చి తీరాలని విపక్ష నేత కె. చంద్రశేఖర రావు పట్టుదలగా ఉన్నారు. పదిమంది పార్టీ మారి కాంగ్రెస్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్టు, తమ పార్టీ విప్‌ను ధిక్కరించినట్టు నిరూపించే ఆధారాలను స్పీకర్‌కు సమర్పించవచ్చు. పార్టీ మార్పిళ్ల నిరోధక చట్టంలో గతంలో మూడింట ఒక వంతు సభ్యులు బయటకు వచ్చి ఇతర పార్టీలో చేరినా వారిని 'చీలిక' వర్గంగా గుర్తించే వెసులుబాటుండేది. కానీ 2003లో జరిగిన ఒక రాజ్యాంగ సవరణ ద్వారా ఆ నిబంధనను తొలగిస్తూ, చట్ట సవరణ చేశారు. దాంతో 'చీలిక'ను గుర్తించే వీలు లేదు. పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేల అనర్హత కోరిన పిటీషన్లను స్పీకర్ తిరస్కరించే సాహసానికి పార్టీ నాయకత్వం ఒడిగడుతుందా? అన్నది అనుమానమే!

సుప్రీం కోర్టు తాజా తీర్పు, సమయ, నిర్బంధం దృష్ట్యా దేశ వ్యాప్తంగా అందరి దృష్టీ తెలంగాణ స్పీకర్ నిర్ణయంపైనే ఉంటుంది.

ప్రజా న్యాయస్థానాల్లో పార్టీ ఫిరాయింపుదారులకు ఎప్పుడూ చుక్కెదురే! 2014, 2018 ఎన్నికల్లో ఇతర పార్టీలో గెలిచి, తన పార్టీలోకి వచ్చిన ఎందరో ఎమ్మెల్యేలకు కేసీఆర్ తర్వాత ఎన్నికల్లో టిక్కెట్లిచ్చినా, వారిని ప్రజలు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఏపీలో ప్రత్యర్థి వైఎస్సార్సీపీలో గెలిచిన 21 మంది ఎమ్మెల్యేల్ని చంద్రబాబు నాయుడు తన పార్టీలోకి తీసుకొని తర్వాత ఎన్నికల్లో టిక్కెట్లిచ్చినా, వారికీ ప్రజాకోర్టుల్లో ఘోరంగా చుక్కెదురైంది.

### స్పీకర్లు ఇంకా రోగుల్ని చంపలేరేమో?

'వీలయినంత త్వరగా మూడు నెలలు మించకుండా పిటిషన్లను పరిష్కరించాల్సిందే' అని తీర్పిస్తూ సుప్రీంకోర్టు కొన్ని వ్యాఖ్యలు చేసింది. "ఈ పరిస్థితుల్లో మేం ఏ నిర్దేశం ఇవ్వకుంటే రాజ్యాంగంలో పదో షెడ్యూల్ పొందుపరిచిన లక్ష్యమే చిన్నబోతుంది" అని వ్యాఖ్యానించింది. "తాము ఏ నిర్దేశమూ ఇవ్వకుంటే, 'చికిత్స విజయవంతమైంది, కానీ, రోగి చచ్చాడు' అన్న పంథాలో స్పీకర్లు/ఛైర్మన్లు సాగించే ప్రక్రియను మేం అనుమతించినట్టవుతుంది" అని కూడా అన్నది. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు సముచితంగా ఉండిందని, హైకోర్టు ధర్మాసనమే సదరు తీర్పులో కల్పించుకోవాల్సిన అవసరమే లేకుండిందని పేర్కొంది. చట్ట సభాపతుల నిర్ణయాలకు కాలపరిమితి విధించవచ్చా? లేదో అన్న ఇన్నినాళ్ల సందేహాలను పటాపంచలు చేస్తూ ఒక అంశం వెల్లడించింది. అనర్హత పిటిషన్లను పరిష్కరించే క్రమంలో స్పీకర్/ఛైర్మన్‌లు న్యాయాధికారులుగా, రాజ్యాంగ పదో షెడ్యూల్, పేరా 6(1) ప్రకారం, ట్రిబ్యునల్ హోదాతో, అధికరణం 226, 227 కింద, హైకోర్టు పరిధిలోకి, అధికరణం 136 కింద సుప్రీంకోర్టు పరిధిలోకి వస్తారని స్పష్టం చేసింది. 'రాజేంద్రసింగ్ రాణా' కేసుతో సహా పలు కేసుల్లో రాజ్యాంగ ధర్మాసనాలు వెల్లడించిన అభిప్రాయాల ప్రకారం న్యాయాధికారులుగా వ్యవహరించేటప్పుడు స్పీకర్లు/ఛైర్మన్లకు రాజ్యాంగంలోని అధికరణాలు 122, 212 కింద రక్షణ లభించదనీ స్పష్టం చేసింది. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా అనుచిత జాప్యాలకు కారణమవుతున్న సభాపతులకు సుప్రీం తాజా తీర్పు గట్టి పాఠమే!

వ్యాసకర్త పొలిటికల్ ఎనలిస్ట్, పీపుల్స్ పల్స్ రిసెర్చ్ సంస్థ డైరెక్టర్

# నైపుణ్యమే నాణ్యమైన డిగ్రీ

అభిప్రాయం



డా॥ బెల్లి యాదయ్య

స్థితిమంతులు, ఐశ్వర్యవంతులు, సంపన్నులు అనే ఈ మాటలన్నీ ఇప్పుడు వాడుక తప్పాయి. వాటి స్థానంలో సక్సెస్ ఫుల్ పర్సన్స్, విన్నర్స్, విజేతలు అనే మాటలు స్థిరపడ్డాయి. వెనుకటికి వ్యక్తులు, కుటుంబాలు విజయవంతం అయ్యేందుకు కమ్యూనిటీ మద్దతు, సంప్రదాయ వనరులు, జ్ఞానం, ప్రతిభ, ఆధ్యాత్మిక విశ్వాసాలు, నైతిక స్వభావం వగైరాలు ఆధార భూతంగా ఉండేవి. ఇప్పుడంతా మారిపోయింది. నైపుణ్య సముదాయం (స్కిల్ సెట్) ఉంటే చాలు, జీరో నుంచి మొదలై వ్యక్తులు తాము అనుకున్న రంగాల్లో వంద శాతం సమున్నతంగా ఎదగవచ్చు.

ఇది ఆటోమేషన్ యుగం, ఆవిష్కరణల యుగం, వ్యవస్థాపనల యుగం. ప్రపంచం అంతటా 'స్కిల్ ఫస్ట్ హైరింగ్' విధానం నడుస్తోంది. వృత్తి, ఉద్యోగం, వ్యాపారం ఇత్యాది రంగాల్లో విజయం సాధించాలంటే సంప్రదాయ డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లు, వాటిల్లోని గ్రేడ్లు ఎంత మాత్రం సరిపోవడం లేదు. నేడంతా స్కిల్ బేస్డ్ ఎడ్యుకేషన్. రివాంప్డ్ కరిక్యులం, ఇండస్ట్రీ అలైన్‌మెంట్ వంటివి వ్యక్తి అభివృద్ధిని, సంస్థల పురోగతిని శాసిస్తున్నాయి. ప్రపంచంలో ఏ మూలన ఉన్నా 'నైపుణ్యాల సముదాయం' సరిపడా ఉన్నవాళ్లకే



సాంప్రదాయిక కోర్సుల్లో విద్యార్థుల చేరిక గణనీయంగా పడిపోయిన నేపథ్యంలో– విశ్వవిద్యాలయాలు పూర్తి స్థాయిలో నైపుణ్య శిక్షణ కోర్సులతో డిగ్రీ విద్యను తిరిగి రూపొందించ వలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపాధి, ఉద్యోగాలు లభిస్తున్నాయి. వరల్డ్ ఎకనమిక్ ఫోరం–2025 ఉద్యోగాల నివేదికను బట్టి డిగ్రీల కంటే స్కిల్ సెట్‌కే మార్కెట్లో డిమాండు ఉందన్నది అర్థమవుతుంది. మరీ ముఖ్యంగా కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ స్పెషలిస్టులు; డేటా ఎనలిస్టులు, సైబర్ సెక్యూరిటీ నిపుణులకు పుష్కలమైన అవకాశాలున్నాయి. కంపెనీలు సంప్రదాయ డిగ్రీలను పక్కకు పెట్టి తమకు కావలసిన సిబ్బందిని నైపుణ్యాధారిత కొలమానాల ద్వారా నియమించుకుంటున్నాయి. ఈ మేరకు ఆ యా ఉన్నత విద్యా సంస్థలు, కళాశాలలు 'ఇంటర్ డిసిప్లినరీ ప్రోగ్రాము'లకు, స్కిల్ బేస్డ్ కోర్సులకు, అప్‌డేటెడ్ అస్సెస్‌మెంట్ విధానానికి అనుసంధానం అవుతున్నాయి.

కేవలం డిగ్రీల వల్ల ప్రయోజనం లేనందున నేటి 'జడ్' జనరేషన్ పిల్లలు ఉన్నత విద్యాసంస్థలపై పునరాలోచనలో ఉన్నారు. కంపెనీలే ప్రత్యేకంగా మైక్రో సర్టిఫికేషన్, బూట్ క్యాంప్స్, షార్ట్ టర్మ్ కోర్సుల్లో శిక్షణనిచ్చి ఉద్యోగుల పని సామర్థ్యాలను పెంచుకుంటున్నాయి. జాతీయ విద్యా విధానం–2020, విద్యార్థికి మిడిల్ స్కూల్ నుండి ప్రారంభించి అన్ని స్థాయుల్లో వృత్తి విద్యను నైపుణ్య శిక్షణను సమగ్రపరచాలని బలంగా సంకల్పించింది. ప్రభావవంతమైన మౌలిక సదుపాయాలతో పాటు, ప్రత్యామ్నాయ వినూత్న విద్యా కేంద్రాలను నెలకొల్పాలని లక్ష్యంగా పెట్టుకుంది.

నైపుణ్య ఆధారిత విద్య అన్ని వయసుల వారికీ అనుకూలంగా ఉంటుంది. విద్యార్థికైనా, పని చేసుకునే ప్రొఫెషనల్‌కైనా లేదా కెరీర్ మార్పు కోరుకునే వ్యక్తికైనా నైపుణ్య ఆధారిత విద్య కొత్త నైపుణ్యాలను సంపాదించడానికి, ఉన్న నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి, మారుతున్న డిమాండ్లకు అనుగుణంగా మారడానికి విలువైన అవకాశాలను కల్పిస్తుంది. ముఖ్యంగా ఇప్పుడు ఉద్యోగ మార్కెట్‌లో అత్యంత కీలకమైన 'టాలెంట్ మొబిలిటీ'ని సమకూరుస్తుంది.

వ్యాసకర్త ప్రధానాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నకిరేకల్, నల్లగొండ జిల్లా


# మన సాహితీ కిరణం!

ఇన్ బాక్స్

కన్నడంలో బాను ముష్తాక్ రాసిన కథా సంకలనానికి దీపా భాస్తి ఇంగ్లిష్ అనువాదమైన 'హార్ట్ ల్యాంప్' ఇటీవలే 2025 అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ (అనువాదాలకు ఇచ్చేది) గెలుచుకుంది. ఇప్పుడు మరో భారతీయ రచయిత్రి కిరణ్ దేశాయి రాసిన 'ద లోన్లీనెస్ ఆఫ్ సోనియా అండ్ సన్నీ' నవల 2025 బుకర్ ప్రైజ్‌కు (ఇంగ్లిష్ రచనలకు ఇచ్చేది) మరోమారు లాంగ్‌లిస్ట్ అయ్యింది. కిరణ్ దేశాయి గతంలో రాసిన 'ది ఇన్ హెరిటెన్స్ ఆఫ్ లాస్' నవల ఆమెకు 2006లోనే అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. ప్రతిష్ఠాత్మక 'మాన్ బుకర్' బహుమతినీ, నేషనల్ బుక్ క్రిటిక్స్ సర్కిల్ ఫిక్షన్ అవార్డునూ గెలుచుకుంది.

ప్రముఖ రచయిత్రి అనితా దేశాయి కుమార్తే కిరణ్. తన 14 ఏళ్ల వయసులో తల్లితో కలిసి ఇంగ్లండ్ వెళ్లారు. ఆ తర్వాత అమెరికాకు వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. కొలంబియా యూనివర్సిటీలో సృజనాత్మక రచనలపై కోర్సు చేశారు. కిరణ్ మొదటి నవల 'హల్లాబలూ ఇన్ ది గ్వావా ఆర్చర్డ్' 1998లో వెలువడింది. అది ఒక వ్యంగ్యాత్మక రచన. ఈ నవల సంపత్ చావ్లా అనే యువకుడి చుట్టూ తిరుగుతుంది. సమాజపు ఆశలు, ఆధ్యాత్మికత, మానవ స్వభావం లాంటి అంశాలను ఇతివృత్తంగా తీసుకుని రాసిన ఈ నవల సల్మాన్ రష్దీ వంటి సాహితీ వేత్తల నుండి ప్రశంసలు అందుకోవడమే కాకుండా బెట్టీ ట్రాస్క్ అవార్డునూ గెలుచుకుంది. కిరణ్ రెండవ నవల 'ది ఇన్‌హెరిటెన్స్ ఆఫ్ లాస్'. 1980లలో న్యూయార్క్‌లోని వలస జీవితాలు, వారి సాంస్కృతిక గుర్తింపు, ప్రపంచీకరణ, ఫలితంగా కోల్పోయే






కిరణ్ దేశాయి : 'ద లోన్లీనెస్ ఆఫ్ సోనియా అండ్ సన్నీ' నవల

వ్యక్తిగత స్వేచ్ఛ తదితర అంశాల్ని ఇతివృత్తంగా తీసుకుని రాశారు. వివిధ సంస్కృతుల మధ్య చిక్కుకున్న పాత్రలను చిత్రించారు.

కిరణ్ రచనల్లో ధ్వనించే కథన శైలి, సజీవ చిత్రణ, సంక్లిష్ట ఇతివృత్తాల అన్వేషణ అంతర్జాతీయ గుర్తింపును పొందాయి. ముఖ్యంగా 35 ఏళ్ల వయసులోనే బుకర్ బహుమతిని గెలుచుకున్న అతి పిన్న వయస్కురాలిగా గుర్తింపును అందుకున్నారు. 2025 బుకర్ ఫైనల్ విజేతగా కిరణ్ నిలవాలని కోరుకుందాం!

– వారాల ఆనంద్ । కేంద్ర సాహిత్య అకాడెమీ అనువాద పురస్కార గ్రహీత



డేటా పాయింట్

## మనవాళ్లే ఎక్కువ!

అమెరికాకు నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాల ద్వారా... అంటే విద్య, వ్యాపారం, పర్యాటకం వంటి వాటికోసం ఎంతోమంది విదేశీయులు వెళ్తుంటారు. అలా 2023లో వెళ్లినవారిలో అత్యధికులతో మన దేశం నాలుగో స్థానంలో ఉంది. ఈ విషయంలో యూరోపియన్ దేశాలన్నీ మన తరవాతే ఉండటం విశేషం.

దేశాల వారీగా పర్యాటకుల సంఖ్య (లక్షల్లో)

| దేశం | సంఖ్య |
|---|---|
| మెక్సికో | 197 |
| కెనడా | 136 |
| యూకే | 43 |
| భారత్ | 26 |
| జర్మనీ | 20 |
| ఫ్రాన్స్ | 20 |
| దక్షిణ కొరియా | 17 |

ఆధారం: యూఎస్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ

# భగవంతుడి సృష్టి

జ్యోతిర్మయం

ఈ విశ్వంలో భూమి ఉంది, కాబట్టి మనం ఇక్కడ పుట్టాం. భూమి ఉండటానికి మానవులు ఏమైనా చేశారా? లేదు, ఏదో ఒక శక్తి భూమిని సృష్టించింది. మనం పుట్టిన తర్వాత జీవించటానికి ప్రాణవాయువు అవసరం. ఆ ప్రాణవాయువు ఏర్పడటానికి మానవులేమైనా చేశారా? లేదే! ఏదో ఒక శక్తి దాన్ని పుష్కలంగా లభింపచేసింది. ఈ భూమిపైన ఎప్పుడూ గాఢాంధకారం ఉండి ఉంటే జీవించటం సాధ్యమా? వెలుతురు ఉండాలి. ఆ వెలుతురు ఉండాలంటే సూర్యుడుండాలి. ఆ సూర్యుడు అక్కడ ఉండటానికి మనుషులు ఏం చేశారు? ఏదో ఒక శక్తి ఆ సూర్యుణ్ణి సృష్టించింది. మనం జీవించటానికి నీరు అత్యంత ముఖ్యం. మరి నీటిని మనుషులెవరైనా చేశారా? ఏదో ఒక శక్తి సముద్రాలను ఏర్పరచి వాటిని నీటితో నిల్వచేసి నిరంతరం మనకు అందుబాటులోనికి తెచ్చి పెడుతున్నది. ఆహారం తీసుకొంటేనే మనం జీవించగలం. మరి ఆ ఆహారాన్ని మనుషులెవరైనా ఏ లోకం నుంచైనా భూమిపైకి తెచ్చిపెట్టి మనకు సరఫరా చేస్తున్నారా?

మనం వివేకాన్ని వినియోగించి యోచిస్తే ఇదంతా స్వచ్ఛమైన సత్యమని తెలుస్తుంది. ఈ సత్యాన్ని తెలిపే గ్రంథం మానవ సమాజానికి శ్రేయస్సును కలిగించేదవుతుంది. '**అన్నాద్భవన్తి భూతాని, పర్జన్యాదన్న సంభవః.**' అంటే ప్రాణులు అన్నము వలన కలుగుచున్నవి, అన్నము మేఘము వలన కలుగుచున్నది, ఆ మేఘము యజ్ఞం వలన కలుగు చున్నది. అంత ముఖ్యమైన యజ్ఞాన్ని జరిపే బాధ్యత అల్పజ్ఞులైన మానవులపై ఉంచక ఆ దైవం ముఖ్యమైన కార్యాలన్నీ తానే జరిపించినట్లే ఆ యజ్ఞాన్ని కూడా ఆయనే జరిపిస్తున్నాడని భగవద్గీత చెబుతోంది. '**తపామ్యహమహం వర్షం నిగృహ్ణామ్యుత్సృజామి చ**' అంటాడు భగవానుడు. 'నేను (సూర్య కిరణములను) తపింప చేయుచున్నాను, వర్షమును కురుపించుచున్నాను, వర్షమును నిలుపుదల చేయుచున్నాను. (**గీతామకరందము–శ్రీ విద్యాప్రకాశానంద గిరి స్వామి**). మనిషి జీవించటానికి అవసరమైన భూమి, గాలి, ఎండ, నీరు, ఆహారం అన్నీ ఆ కరుణామయుడే సమకూర్చాడు. వాటిని కలుషితం చేయకుంటే ఆయురారోగ్యాలు కల్గుతాయి.

– రాచమడుగు శ్రీనివాసులు

# 20 వరకు ఇంటర్ ప్రవేశాల గడువు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల గడువును ఆగస్టు 20 వరకు పొడిగించినట్లు ఇంటర్మీడియట్ బోర్డు గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు సైతం వెల్లడి కావడంతో గడువు తేదీని ఖరారు చేశామని, ఇకపై గడువు పొడిగింపు ఉండదని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రవేశాలు తీసుకోవాలని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, ప్రైవేట్ అన్ ఎయిడెడ్, కో-ఆపరేటివ్, గురుకుల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీ ప్రిన్సిపాళ్లకు సూచించింది.





# కబ్జా స్థలాల్ని స్వాధీనం చేసుకుంటాం

## హైదరాబాద్‌లో 131 ఎకరాల ఇరిగేషన్ భూముల కబ్జా

- వాటి స్వాధీనానికి ఇరిగేషన్, హైడ్రా, రెవెన్యూ శాఖలు కలిసి పనిచేయాలి
- క్వార్టర్లలో అక్రమంగా తిష్టవేసిన వారినీ ఖాళీ చేయించాలి
- ప్రాజెక్టుల స్థలాల్లో సౌరవిద్యుత్ ప్లాంట్ల ఏర్పాటును పరిశీలించాలి
- నీటిపారుదల శాఖ భూముల పరిరక్షణపై సమీక్షలో మంత్రి ఉత్తమ్


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: ఆక్రమణలకు గురైన తమ శాఖ భూముల్లో అంగుళం స్థలాన్ని కూడా వదిలిపెట్టకుండా యుద్ధప్రాతిపదికన స్వాధీనం చేసుకుంటామని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రూ. వందల కోట్ల విలువైన భూములు కబ్జాలకు గురయ్యాయని.. దీన్ని ఉపేక్షించకుండా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. భవిష్యత్తులో ఆక్రమణలకు చెక్ పెట్టేందుకు ఆ భూముల చుట్టూ కంచెల ఏర్పాటుతోపాటు చట్టపరమైన చర్యలూ తీసుకుంటామని చెప్పారు. నీటిపారుదల శాఖ భూముల పరిరక్షణపై సచివాలయంలో గురువారం ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఈఎన్సీ (జనరల్) అంజాద్ హుస్సేన్, ఈఎన్సీ అడ్మిన్ రమేశ్ బాబు, భూసేకరణ కమిషనర్ శివకుమార్ నాయుడు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌తో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. కాల్వలకు ఇరువైపులా ఉన్న భూములతోపాటు ప్రాజెక్టుల స్థలాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు.

**కోర్టుల్లో వాదనలకు ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది..**

హైదరాబాద్‌లోని గండిపేట, రాజేంద్రనగర్ పరిధిలోని హిమాయత్‌సాగర్, కిస్మత్‌పుర, వాలంతరి, ఇంజనీరింగ్ ల్యాబ్ (టీజీఈఆర్‌ఎల్)కు చెందిన 426.3 ఎకరాలకుగాను 131.31 ఎకరాలు కబ్జాకు గురైనట్లు గుర్తించామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఐటీఐఆర్ అధీనంలోని 81.26 ఎకరాల స్థలంపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా మిగిలిన 50.13 ఎకరాలు కబ్జాకు గురయ్యాయన్నారు. వాటిపై జిల్లా కోర్టులో 20 కేసులు, హైకోర్టులో 2 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. భూముల పరిరక్షణలో న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాదిని నియమించాలని నిర్ణయించామన్నారు. ఈ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు నీటిపారుదల శాఖ, హైడ్రా, రెవెన్యూ, ఆర్ అండ్ ఆర్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించామని చెప్పారు.

**నీటిపారుదల భూముల్ని గుర్తించండి..**

నీటిపారుదల శాఖ ప్రాజెక్టులకు సంబంధించిన క్వార్టర్లలో అక్రమంగా నివసిస్తున్న వారిని ఖాళీ చేయించి తక్షణమే సమగ్ర సమాచారం తన ముందు ఉంచాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా నీటిపారుదల శాఖ భూములను సత్వరం గుర్తించాలన్నారు. తమ శాఖ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై ఇటీవలి మంత్రి వర్గ సమావేశంలో చర్చించామన్నారు. దీంతో రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలకు అవసరమైన విద్యుత్‌ను నీటిపారుదల శాఖ స్వయంగా ఉత్పత్తి చేసుకోవచ్చని చెప్పారు.

## క్లిష్టమైన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రాజెక్టుల నిర్మాణం: ఉత్తమ్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత క్లిష్టమైన సాంకేతిక పరిజ్ఞానంతో నీటిపారుదల ప్రాజెక్టులను నిర్మిస్తోందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ఫ్రాన్స్‌కు చెందిన ప్రఖ్యాత మెట్రో డిజైన్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ సంస్థ సిస్ట్రాకు చెందిన గ్లోబల్ డిజిటల్ టూల్స్ సెంటర్‌ను గురువారం మంత్రి ప్రారంభించారు. 70 దేశాలలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సిస్ట్రా గత సంవత్సరం 1.25 యూరో బిలియన్ల ఆదాయం గడించిందన్నారు. యావత్ ప్రపంచంలో నిర్మితమైన మెట్రో ప్రాజెక్టుల్లో ఈ సంస్థకు భాగస్వామ్యం ఉందన్నారు. భారత్‌లో 80 శాతం మెట్రో ప్రాజెక్టులు ఈ సంస్థ రూపొందించినవేనని చెప్పారు. ఇలాంటి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్ మహానగరం ప్రపంచ స్థాయికి ఎదిగిందని, ప్రజల జీవన ప్రమాణాలు, వాతావరణం కారణంగా బహుళ జాతి సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిస్ట్రా ఇండియా సీఈఓ హరి పాల్గొన్నారు.

# నాడు కోళ్ల ఫారాల్లోనే హాస్టళ్లు

- గత ప్రభుత్వ విధానాలతో విద్యావ్యవస్థ పతనం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


సైకిల్ తొక్కుతున్న మంత్రి పొంగులేటి, కలెక్టర్ అనుదీప్

కూసుమంచి: విద్యావ్యవస్థ పతనం, విద్యార్థుల ఇక్కట్లకు గత ప్రభుత్వ తీరే కారణమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో రూ.5.50 కోట్లతో నిర్మించే ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా 76 సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పెద్దలు కొందరు సంక్షేమ వసతి గృహాలపై విమర్శలు చేస్తున్నారని.. కానీ ఈ పరిస్థితికి వారి పరిపాలనే కారణం కాదా? అని ప్రశ్నించారు. అన్ని వసతులతో సంక్షేమ వసతిగృహాలు నిర్మిస్తున్నామని ప్రగల్భాలు పలికి.. కోళ్లఫారాలు, రైస్‌మిల్లుల్లో ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు. హాస్టల్ భవనాలకు కనీసం అద్దె కూడా కట్టలేని దుస్థితిలో నాటి పాలన ఉండేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత పాఠశాలలు నిర్మిస్తున్నామని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 8 నుంచి 10వ తరగతి బాలికలకు తమ ట్రస్ట్ ద్వారా ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నామని ప్రకటించారు. అలాగే, కూసుమంచి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ల వేతనం ట్రస్ట్ నుంచి చెల్లిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు.

# నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

- బీసీ గురుకులంలో గద్వాల కలెక్టర్ సంతోష్ ఆకస్మిక తనిఖీ
- డిప్యూటీ వార్డెన్, సూపర్‌వైజర్‌పై సస్పెన్షన్ వేటు

అలంపూర్/ఉండవెల్లి: గురుకుల పాఠశాలలో విద్యార్థుల భద్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్ హెచ్చరించారు. అలంపూర్ చౌరస్తాలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకులంలో నెలకొన్న సమస్యలను కలెక్టర్‌కు విన్నవించేందుకు బుధవారం విద్యార్థులు కాలినడకన జిల్లా కేంద్రానికి వెళ్తుండగా.. మార్గమధ్యంలోనే అధికారులు నచ్చజెప్పి తిరిగి గురుకులానికి పంపించారు. ఈ నేపథ్యంలో గురువారం కలెక్టర్ సంతోష్ గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన డిప్యూటీ వార్డెన్ రజిత, సూపర్‌వైజర్ నవీన్‌లపై సస్పెన్షన్ వేటు వేశారు. ప్రిన్సిపాల్, వార్డెన్, హౌస్ మాస్టర్‌లకు మెమో జారీ చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. అలాగే ఉండవెల్లి మండలంలోని కలుగోట్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు.

# అవి డెడ్ ఎకానమీలు

## రష్యా, భారత్‌లపై నోరు పారేసుకున్న ట్రంప్

- జట్టుకట్టి మరింత దిగజారుతున్నాయని విమర్శ
- ఆ రెండు దేశాల వాణిజ్య బంధాన్ని పట్టించుకోనని వ్యాఖ్య

**వాషింగ్టన్/న్యూఢిల్లీ/మాస్కో:** ఆంక్షలు విధిస్తామని భయపెట్టినా గత కొంతకాలంగా రష్యా నుంచి భారీ ఎత్తున చమురు కొనుగోళ్లను తగ్గించుకోని భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. భారత్‌కు చమురును సరఫరాచేస్తున్న శత్రు దేశం రష్యాను సైతం ట్రంప్ తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. భారత్, రష్యా రెండూ కలిసి సాధించేది ఏమీ ఉండదని ఎద్దేవాచేశారు. జట్టుకట్టి అనవసరంగా రెండు దేశాల ఆర్థికవ్యవస్థలను మరింత నిర్వీర్యంచేస్తున్నాయని ఇరు దేశాల ప్రభుత్వాలపై విమర్శల బురద చల్లారు. భారత్‌పై పాతికశాతం టారిఫ్ ఆర్థిక భారం మోపిన ట్రంప్ గురువారం భారత్, రష్యాల వాణిజ్యబంధంపై తన అక్కసును వెళ్లగక్కుతూ సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో పలు పోస్టులు పెట్టారు.

### ఐ డోంట్ కేర్..

'' రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటోందీ, రష్యాతో భారత్‌కు ఉన్న సత్సంబంధాలు ఏంటి అనేవి నాకు అస్సలు అవసరం లేదు. అత్యంత కీలకమైన అమెరికాతో వాణిజ్యం అత్యల్ప స్థాయిలో చేసుకుంటూ భారత్ సొంత ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యంచేసుకుంటోంది. ఇక రష్యా సంగతి చెప్పనక్కర్లేదు. రష్యాతో అమెరికాకు ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవు. ఇలాంటి రష్యా, భారత్‌లో కూడబలుక్కుని సాధించింది ఏమీ లేదు. అవి రెండూ డెడ్ ఎకానమీలు (నిర్వీర్యమైన ఆర్థిక వ్యవస్థలు). ఉమ్మడిగా పతనమవుతున్నాయి. ఈ దేశాలను నేనసలు పట్టించుకోను. భారత్‌తో మేం చాలా తక్కువ స్థాయిలో వాణిజ్యం చేస్తున్నాం. భారత్ మాపై విధించే అధిక టారిఫ్‌లే ఇందుకు ప్రధాన కారణం. భారత్ విధించే దిగుమతి సుంకాలు చాలా ఎక్కువగా ఉంటాయి. ప్రపంచంలో అత్యధిక దిగుమతి సుంకాలు వసూలుచేస్తున్న దేశాల్లో భారత్ కూడా ఒకటి. భారత్‌తో వ్యవహారాలు ఒక్కోసారి సవ్యంగా ఉండవు. దాని పర్యవసానమే ఈ 25 శాతం దిగుమతి సుంకాలు. వీటికి పెనాల్టీ(జరిమానా) అదనం. ఇవన్నీ ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమలుచేసి వసూలు మొదలెడతా'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ''భారత వాణిజ్య విధానాలు అసంపూర్ణంగా, అస్పష్టంగా ఉంటాయి. దానికితోడు భారత్‌తో పరస్పర సరుకుల విలువను మాత్రమే జమకట్టే నగదుయేతర వాణిజ్య అవరోధాలు చాలా ఉన్నాయి. మేం వద్దు అని వారిస్తున్నా, హెచ్చరిస్తున్నాసరే రష్యా నుంచి ఆయుధ, ఇంధన ఉత్పత్తులను భారీ ఎత్తున భారత్ కొనుగోలుచేస్తోంది. ఇలా వచ్చిన ఆదాయాన్ని పరోక్షంగా ఉక్రెయిన్ యుద్ధం కోసం రష్యా వినియోగిస్తోంది'' అని ట్రంప్ ఆరోపించారు.



### మెద్వెదేవ్, ట్రంప్ మాటల యుద్ధం

భారత్‌ను విమర్శించిన ట్రంప్ పనిలోపనిగా రష్యాపైనా, రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రీ మెద్వెదేవ్‌పైనా విమర్శలు గుప్పించారు. దీంతో మెద్వెదేవ్ సైతం ప్రతివిమర్శలు చేశారు. తొలుత మెద్వదేవ్‌నుద్దేశిస్తూ ట్రంప్ వ్యంగ్య పోస్ట్ చేశారు. ''రష్యా అధ్యక్షుడిగా పేలవంగా పాలించిన మాజీ అధ్యక్షుడు మెద్వదేవ్ ఇంకా రష్యాకు అధ్యక్షుడినే అని అనుకుంటున్నారేమో. ఏదైనా మాట్లాడేముందు చూసి మాట్లాడండి. అమెరికాపై మాట్లాడే దుస్సాహసం చేయొద్దు'' అని హెచ్చరించారు. దీనిపై రష్యా భద్రతా మండలి ఉపాధ్యక్షుడి హోదాలో మెద్వదేవ్ ఘాటుగా జవాబిచ్చారు. ''ట్రంప్ ఎలా స్పందించినాసరే రష్యా తన పంథాను వీడబోదు. డెడ్ ఎకానమీ అని నోటికొచ్చినట్లు మాట్లాడటంకాదు. సోవియట్ కాలంలోనే రష్యా అణుబాంబును తయారుచేసిందన్న విషయం మర్చిపోవద్దు. అయినా 'డెడ్' అనే పదానికి 'ది వాకింగ్ డెడ్' అనే సినిమాకు, 'డెడ్ హ్యాండ్' అనే 'వ్యవస్థ'కు ఉన్న శక్తి ట్రంప్‌కు తెలీదనుకుంటా'' అని మెద్వదేవ్ వ్యాఖ్యానించారు. శత్రుదేశం దాడిచేసి రష్యా నాయకత్వాన్ని అంతమొందించినాసరే తిరిగి అణు బాంబులు ప్రయోగించేలా రష్యా రూపొందించిన ఆటోమేటిక్ దాడి వ్యవస్థ పేరే డెడ్ హ్యాండ్.


మాట్లాడుతున్న మంత్రి గోయల్

# దేశ ప్రయోజనాలను పరిరక్షిస్తాం

- ట్రంప్ ప్రకటించిన అదనపు టారిఫ్ భారంపై తగు చర్యలు తీసుకుంటాం
- పార్లమెంట్‌లో వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్ భరోసా

**న్యూఢిల్లీ:** అరడజను సార్లు అమెరికా, భారత ప్రతినిధులు భేటీ అయినా చర్చలు ఓ కొలిక్కిరాకపోవడంతో విసుగుచెందిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్షంగా, ఇష్టారీతిక విధించిన 25 శాతం దిగుమతి సుంకంపై భారతసర్కార్ పార్లమెంట్ సాక్షిగా స్పందించింది. భారతదేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తామని లోక్‌సభ, రాజ్యసభలో వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. నేటి నుంచి 25 శాతం టారిఫ్‌లతోపాటు పెనాల్టీలను భారత్‌పై మోపుతానని ట్రంప్ బుధవారం ప్రకటించిన నేపథ్యంలో గురువారం లోక్‌సభ, రాజ్యసభల్లో గోయల్ కీలక ప్రకటక చేశారు. '' హఠాత్తుగా ఏకపక్షంగా ట్రంప్ మనపై అదనపు టారిఫ్‌లను మోపారు. దీని దుష్ప్రభావాలపై విస్తృతస్థాయి అధ్యయనం చేస్తున్నాం. ఇందులోభాగంగా టారిఫ్‌ల భారం పడే రైతులు, ఎగుమతిదారులు, కార్మికులు, వ్యాపారులు, సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమలు, పలు పరిశ్రమల సమాఖ్యలు, సంఘాలతో మంతనాలు జరుపుతున్నాం. పెను ప్రభావం తాలూకు పరిణామాలపై విశ్లేషణ చేపడుతున్నాం. దేశ ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తున్నాం. పౌర ప్రయోజనాల పరిరక్షణకు పాటుపడతాం'' అని గోయల్ అన్నారు. '' కేవలం దశాబ్దకాలంలోనే దుర్బల ఆర్థిక వ్యవస్థ నుంచి సుదృఢ ఆర్థికవ్యవస్థగా భారత్ అవతరించింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థగా భారత్ తయారైంది. 11వ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ ర్యాంక్ నుంచి టాప్–5 ర్యాంక్‌లోకి భారత్ ఎగబాకింది. మన కర్షకులు, కార్మికులు, సూక్ష్మ,చిన్న, మధ్యతరహా పరిశ్రమల కృషి, మా ప్రభుత్వ పట్టుదల ఈ ప్రగతికి కారణం. భవిష్యత్తులో భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం ఖాయం. ప్రపంచ తయారీరంగ హబ్‌గా భారత్‌ను తీర్చిదిద్దేందుకు గత దశాబ్దకాలంగా కృషిచేస్తున్నాం. మేక్ ఇన్ ఇండియా పథకం ద్వారా భారతీయ ఉత్పత్తుల గణనీయ పెరుగుదలకు పాటుపడ్డాం. నైపుణ్య మానవ వనరులు, యువత కారణంగానే భారతీయ పరిశ్రమల్లో పోటీతత్వం, నవకల్పనలు ఎక్కువయ్యాయి. గత 11 సంవత్సరాలుగా మన ఎగుమతులు పెరుగుతున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బ్రిటన్, ఆస్ట్రేలియాలతో భారత్ లాభదాయకమైన వాణిజ్య ఒప్పందాలు చేసుకుంది. రైతులు, భారత సాగు రంగం బాగు కోసం, ఆహార భద్రత కోసం ప్రభుత్వం పాటుపడుతోంది. ఇకమీదటా అదే పనిచేస్తాం. అమెరికా టారిఫ్‌ల అంశంలో భారత ప్రయోజనాలకు పణంగా పెట్టే ప్రసక్తే లేదు'' అని గోయల్ వ్యాఖ్యానించారు.

### డెయిరీ విషయంలో మరింత అప్రమత్తంగా..

డెయిరీ రంగానికి సంబంధించి ప్రభుత్వం ఇంతవరకూ ఏ దేశంతోనూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోలేదు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 70 కోట్ల జనాభా దేశ సాగురంగంపై ఆధారపడిన నేపథ్యంలో ఆహారభద్రత సంక్షోభంలో పడకుండా ప్రభుత్వం పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. అందులోభాగంగానే ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకున్నా సాగురంగంపై ప్రతికూల ప్రభావం పడకుండా ప్రభుత్వం ఓ కంట కనిపెడుతోంది. 2021–25 వాణిజ్యగణాంకాల ప్రకారం భారత్‌కు అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. భారత్ నుంచి మొత్తం ఎగుమతుల్లో దాదాపు 18 శాతం ఎగుమతులు అమెరికాకే వెళ్తున్నాయి.

# ట్రంప్ చెప్పింది నిజమే.. మన ఆర్థిక వ్యవస్థ ఖతం

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్య
- అమెరికా అధ్యక్షుడికి నచ్చినట్లే వాణిజ్య ఒప్పందం కుదురుతుంది
- ట్రంప్ చెప్పిందే మోదీ చేస్తారని ఎద్దేవా

**న్యూఢిల్లీ:** తాము విధించిన టారిఫ్‌ల దెబ్బకు భారత్ ఆర్థిక వ్యవస్థ ఖతమేనంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు సరైనవేనని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఆయన నిజమే చెప్పారన్నారు. ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మినహా దేశ ప్రజలందరికీ ఈ విషయం తెలుసు, మీకు తెలియదా అని ఆయన విలేకరులను ప్రశ్నించారు. రాహుల్ గురువారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో మీడియాతో మాట్లాడారు. ట్రంప్ చెప్పినట్లుగానే మన దేశం అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటుందని, అమెరికా అధ్యక్షుడు ఏది చెబితే అదే ప్రధాని మోదీ అదే చేస్తారంటూ రాహుల్ వ్యాఖ్యానించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్థికంగా, రక్షణపరంగా, విదేశాంగ విధానాల విషయంలోనూ దేశాన్ని నాశనం చేసి, ఒక్క అదానీకి మాత్రమే సాయం చేస్తోందంటూ ధ్వజమెత్తారు. ప్రభుత్వ విధానాల కారణంగా దేశంలోని అన్ని రకాల చిరు వ్యాపారాలు నాశనమైపోయాయని దుయ్యబట్టారు. 'మనది అద్భుతమైన విదేశాంగ విధానం అంటూ విదేశాంగ మంత్రి అంటున్నారు. కానీ, ఒక వైపు అమెరికా బెదిరింపులకు పాల్పడుతోంది. మరోవైపు చైనా మన వెంటబడుతోంది. మన ప్రభుత్వం ప్రపంచ దేశాలకు దౌత్య ప్రతినిధులను పంపినా ఏ ఒక్క దేశం కూడా పాక్ చర్యలను ఖండించలేదు. వీరికి దేశాన్ని ఎలా నడపాలో తెలియదు. అంతటా గందరగోళమే'అని రాహుల్ తీవ్ర విమర్శలు గుప్పించారు. మంగళవారం లోక్‌సభలో ప్రధాని మోదీ చేసిన ప్రసంగంపై రాహుల్ స్పందిస్తూ, ప్రధానమంత్రి తన ప్రసంగంలో ట్రంప్ పేరును గానీ, చైనాను గురించి గానీ ఒక్కమాట కూడా మాట్లాడలేదని గుర్తుచేశారు. 'పాకిస్తాన్ ఉగ్ర చర్యలను ఏ దేశమూ ఖండించలేదన్న విషయాన్ని మోదీ చెప్పలేదు. పహల్గాం దాడి వెనుక ఉన్న పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌కు ట్రంప్ వైట్‌హౌస్‌లో విందు ఇచ్చారు. ఘన విజయం సాధించామంటూ వారిద్దరూ ప్రకటించారు. ఏమిటా విజయం?'అని రాహుల్ ప్రశ్నించారు. 'భారత్, పాకిస్తాన్‌ల మధ్య కాల్పుల విరమణ తన వల్లేనంటూ ట్రంప్ 30 సార్లు ప్రకటించుకున్నారు. భారత్ ఐదు విమానాలు నష్టపోయిందని చెప్పిన ట్రంప్..భారత్‌పై ఇప్పుడు 25 శాతం టారిఫ్‌లను ప్రకటించారు. దీనికి మోదీ సమాధానం ఇవ్వలేకపోయారు. ఎందుకని మీరు అడిగారా? ఇందుకు కారణం ఏమిటి? మోదీ ఎవరి కంట్రోల్‌లో ఉన్నారు?'అని రాహుల్ వాగ్బాణాలు సంధించారు. 'భారత్–అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదురుతుంది. ప్రస్తుతం కొనసాగుతున్న చర్చల్లో అంతా ట్రంప్ చెప్పినట్లుగా జరుగుతుంది'అని రాహుల్ పేర్కొన్నారు. అనంతరం రాహుల్ 'ఎక్స్'లో..'భారత ఆర్థిక వ్యవస్థ చచ్చిపోయింది. మోదీయే చంపేశారు. 1. అదానీ–మోదీ భాగస్వామ్యం. 2. నోట్ల రద్దు, లోపభూయిష్ట జీఎస్టీ. 3. విఫలమైన తయారీరంగం 4. నాశనమైన చిన్న పరిశ్రమలు 5. దోపిడీకి గురైన రైతులు. వీటన్నిటితోపాటు ఉద్యోగావకాశాలు కల్పించకుండా మోదీ దేశ యువత భవిష్యత్తును నాశనం చేశారు'అని రాహుల్ ఆరోపించారు.



## ఎన్‌డీఏతో పన్నీర్ కటీఫ్



**చెన్నై:** తమిళనాడు మాజీ సీఎం, ఏఐఏడీఎంకేలోని చీలిక వర్గం నేత ఒ.పన్నీర్ సెల్వం సంచలన నిర్ణయం తీసుకున్నారు. బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏతో తెగదెంపులు చేసుకుంటున్నట్లు ప్రకటించారు. చాలాకాలంగా ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం పళనిస్వామితో ఉప్పూనిప్పుగా ఉంటున్న పన్నీర్ సెల్వం ఏఐఏడీఎంకే కేడర్స్ రైట్స్ రిట్రీవల్ కమిటీ పేరిట వేరు కుంపటి పెట్టుకున్నారు. ఈ గ్రూపులో ఉన్న సీనియర్ నేత ఎస్ రామచంద్రన్ గురువారం మీడియాతో మాట్లాడారు. తమ కమిటీ ఇకపై ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉండబోదని ప్రకటించారు. ఇది ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయమన్నారు. ప్రజలను సరైన దిశలో నడిపించేందుకు భవిష్యత్తులో సరైన కూటమిలో చేరుతామన్నారు. గురువారం మార్నింగ్ వాక్ సమయంలో సీఎం స్టాలిన్‌ను కలిసినట్లు పన్నీరు సెల్వం చెప్పారు. ఆయన తనకు అభినందనలు తెలిపి వెళ్లిపోయారన్నారు. నాలుగు రోజుల క్రితం తమిళనాడు పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ.. పళనిస్వామితో భేటీ అయ్యారు. పన్నీరు సెల్వంకు మాత్రం అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని సమాచారం. ఇటీవల రాష్ట్రంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న హోం మంత్రి అమిత్ షా సైతం పన్నీరు సెల్వంకు ఆహ్వానం పంపలేదు. 2022లో ఏఐఏడీఎంకే నుంచి బహిష్కరణకు గురైన పన్నీరు సెల్వం, పార్టీపై పెత్తనం విషయంలో పళనిస్వామితో పోరాటం సాగిస్తూనే ఉన్నారు. కాగా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నటుడు విజయ్ స్థాపించిన టీవీకేతో పన్నీరు సెల్వం పొత్తు పెట్టుకునే అవకాశాలున్నాయని చెబుతున్నారు.


సమీర్ కులకర్ణి | రిటైర్డ్ మేజర్ రమేశ్ | కల్నల్ పురోహిత్ | ప్రజ్ఞా ఠాకూర్ | అజయ్ రహిర్కర్

# ప్రజ్ఞా ఠాకూర్, కల్నల్ పురోహిత్‌లు నిర్దోషులు

**మాలెగావ్ పేలుడు కేసులో ప్రత్యేక న్యాయస్థానం తీర్పు • మొత్తం ఏడుగురు నిందితులకూ విముక్తి**

**ముంబై:** మహారాష్ట్రలోని మాలెగావ్ పట్టణంలో 17 ఏళ్ల క్రితం ఆరుగుర్ని బలి తీసుకున్న పేలుడు ఘటనకు సంబంధించి ముంబైలోని ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బీజేపీ మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్ సహా ఈ కేసులోని మొత్తం ఏడుగురు నిందితులపై కేసులను కొట్టివేసింది. వీరికి వ్యతిరేకంగా ఎటువంటి నమ్మదగిన, బలమైన సాక్ష్యాధారాలు లేవని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఉగ్రవాదానికి మతం లేదు, అనుభవం, సమాచారం ప్రాతిపదికన దోషులుగా తేల్చలేమని తెలిపింది. 2008 సెప్టెంబర్ 29వ తేదీన మాలెగావ్‌లోని ఓ మసీదు వద్ద మోటారు సైకిల్‌కు అమర్చిన బాంబు పేలి ఆరుగురు చనిపోగా 101 మంది గాయాలపాలయ్యారు. పేలుడు పదార్థం మోటారు సైకిల్‌కు అమర్చిందేనని, ఆ మోటారు సైకిల్ ఠాకూర్‌దే అని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని తీర్పు సందర్భంగా ఎన్ఐఏ స్పెషల్ కోర్టు జడ్జి ఏకే లహోటీ పేర్కొన్నారు. ఈ కేసులో చాలా లోపాలున్నాయని, సరైన ఆధారాలు లేకపోవడంతో సంశయలాభం నిందితులకే అనుకూలంగా ఉందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ కేసును చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం(ఉపా) నిబంధనలను వర్తింపజేయలేమని చెప్పారు. పేలుడులో చనిపోయిన ఆరుగురి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులైన 101 మందికి రూ.50 వేల చొప్పున పరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. కాగా, తీర్పు సందర్భంగా కోర్టు పరిసరాల్లో భారీగా బందోబస్తును ఏర్పాటు చేశారు. బెయిల్‌పై ఉన్న నిందితులందరూ కోర్టుకు హాజరయ్యారు. నిందితులపై ఐపీసీ, ఆయుధాల చట్టంతోపాటు ఉపా కింద కేసులు నమోదయ్యాయి. ఈ పేలుడుకు 'అభినవ్ భారత్' గ్రూపునకు చెందిన హిందూ అతివాదులే కారణమని, స్థానిక ముస్లింలను భయభ్రాంతులకు గురిచేయడమే వీరి లక్ష్యమని ప్రాసిక్యూషన్ వాదించింది. ఈ కేసు దర్యాప్తును ఎన్ఐఏ చేపట్టింది. 2018లో మొదలైన కేసు విచారణ ఈ ఏడాది ఏప్రిల్ 19వ తేదీన ముగియగా గురువారం తీర్పు వెలువరించింది. ఈ పేలుడుతో ఠాకూర్‌కు సంబంధం లేదని ఎన్ఐఏ ఇప్పటికే స్పష్టీకరించినప్పటికీ ఆమెకు వ్యతిరేకంగా ప్రాథమిక ఆధారాలున్నాయని కోర్టు పేర్కొంది. మత విద్వేషాలను పెంచడం, స్థానిక ముస్లింలలోని ఒక వర్గాన్ని భయభ్రాంతులకు గురిచేయడమే కుట్రదారుల లక్ష్యమని ఎన్ఐఏ కోర్టులో వాదనలు వినిపించింది. మొత్తం 323 మంది సాక్షులను విచారించారు. తీర్పునిచ్చిన న్యాయమూర్తికి ప్రజ్ఞా ఠాకూర్, కల్నల్ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. 'ఇది నాకు మాత్రమే కాదు, యావత్ కాషాయ దళానికి దక్కిన విజయం. ఈ కేసు కారణంగా గత 17 ఏళ్లుగా నా జీవితం నాశనమైంది. సన్యాసి అయినందునే మనుగడ సాగించగలిగా. కాషాయాన్ని అవమానించిన వారిని ఆ దేవుడే శిక్షించాడు'అని ప్రజ్ఞా ఠాకూర్ పేర్కొన్నారు. ఎలాంటి సంబంధం లేకున్నా తనను ఈ కేసులో ఇరికించారని కల్నల్ ప్రసాద్ పురోహిత్ పేర్కొన్నారు. ఎప్పటి మాదిరిగానే దేశ సేవను ఇకపైనా కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

### సోనియా, రాహుల్ క్షమాపణ చెప్పాలి

పేలుడు సమయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏ ఆధారాలూ లేకున్నా ప్రజ్ఞా ఠాకూర్, కల్నల్ ప్రసాద్ పురోహిత్‌లపై అనవసర ఆరోపణలు చేసిందని బీజేపీ ఆరోపించింది. పార్టీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు ఇప్పుడు క్షమాపణ చెప్పాలని నిలదీసింది.

## చమురు నిల్వల పెంపు లక్ష్యంగా పాక్‌తో డీల్

### ప్రకటించిన ట్రంప్

**న్యూయార్క్/ఇస్లామాబాద్:** పాకిస్తాన్‌తో నూతన వాణిజ్య ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. భవిష్యత్తులో భారత్‌కు సైతం పాక్ చమురును విక్రయించిన ఆశ్చర్యపోనక్కర్లేదని ఈ సందర్భంగా ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత దిగుమతులపై 25 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించిన కొన్ని గంటలకే ట్రంప్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. ''పాక్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా ఇరుదేశాలు చమురు నిల్వలను పెంచుకోవడంపై దృష్టిసారిస్తాయి. ఇందుకోసం అనువైన చమురు సంస్థను ఎంచుకునే పనిలో బిజీగా ఉన్నాం. ఇది వాస్తవ రూపం దాల్చితే భారత్‌కు సైతం పాక్ చమురును విక్రయించే రోజు వస్తుంది'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే పాకిస్తాన్ లోని ఏ చమురు నిల్వలను ట్రంప్ ప్రస్తావించారనే వివరాలు తెలియరాలేదు. అయితే పాక్‌లోని చమురును వెలికితీసే డ్రిల్లింగ్ కాంట్రాక్ట్‌ను అమెరికన్ కంపెనీకి కట్టబెట్టేందుకు సంబంధించి అమెరికా, పాక్ మధ్య ఒప్పందం కుదిరి ఉంటుందని అంతర్జాతీయ చమురురంగ నిపుణులు భావిస్తున్నారు. '' వాణిజ్య ఒప్పందాలకు సంబంధించి అనేక దేశాల నాయకులతో మాట్లాడా. అమెరికాకు లాభం చేకూర్చేందుకు ఆయా దేశాలు ఉవ్విళ్లూరుతున్నాయి. మరికొన్ని దేశాలు టారిఫ్‌ల భారం తగ్గించాలిన ప్రాథేయపడుతున్నాయి'' అని అన్నారు. తాజా ఒప్పందంపై పాక్ ప్రధాని షెహ బాజ్ షరీఫ్ స్పందించారు. ''ట్రంప్‌కు కృతజ్ఞతలు. ఈ ఒప్పందం భవిష్యత్తులో ఇరు దేశాల భాగస్వామ్యం బలోపేతానికి బాటలు వేయనుంది'' అని 'ఎక్స్'లో షెహబాజ్ ఒక పోస్ట్ పెట్టారు.

## పాలస్తీనాను గుర్తిస్తాం: కెనడా

**ఒట్టావా:** ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో పాలస్తీనాను గుర్తించే విషయంలో ఫ్రాన్స్, యూకేల బాటలో పయనించాలని కెనడా నిర్ణయించుకుంది. గాజాలో ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న అరాచకాలకు నిరసనగా పాలస్తీనా దేశాన్ని గుర్తించాలనుకుంటున్న కెనడా ప్రధాని మార్క్ కార్నీ బుధవారం ప్రకటించారు. శాంతియుతంగా చర్చల ద్వారా ఇజ్రాయెల్– పాలస్తీనా సమస్యకు పరిష్కారం దొరుకుతుందని తమకు నమ్మకం పోయిందని ఆయన వివరించారు. అందుకే సెప్టెంబర్‌లో జరిగే ఐరాస జనరల్ అసెంబ్లీ 80వ సెషన్‌లో పాలస్తీనా దేశాన్ని గుర్తించాలని అనుకుంటున్నామన్నారు. అయితే, సంస్కరణలతో, 2026లో సాధారణ ఎన్నికలు జరిపేందుకు పాలస్తీనా అథారిటీ నుంచి గట్టి హామీ లభించాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో పాలస్తీనాలో హమాస్‌కు ఎటువంటి పాత్ర ఉండరాదని, ఎన్నికల్లో పాల్గొనరాదని కూడా ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి బదులుగా శాంతిని కోరుకునే ప్రజలందరి కోసమే రెండు దేశాల విధానాన్ని బలపరుస్తున్నామని కార్నీ తెలిపారు.

## యూకే ఏటీసీలో సమస్య.. 100 విమానాలపై ప్రభావం

**లండన్:** ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌లో సమస్య తలెత్తడంతో గురువారం దక్షిణ ఇంగ్లండ్‌లోని పలు విమానాశ్రయాల్లో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కనీసం 100 విమాన సర్వీసులు, ఆలస్యంగా నడవడం లేదా రద్దవడం సంభవించాయి. దీంతో వేలాదిగా ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. హీత్రూ, గాట్విక్, బర్మింగ్‌హామ్, మాంచెస్టర్, కార్డిఫ్, ఎడిన్‌బరో తదితర విమానాశ్రయాల్లో పలు విమానాలను తాత్కాలికంగా రద్దు చేశారు. సుమారు 20 నిమిషాల తర్వాత సమస్యను పరిష్కరించినప్పటికీ ఆ ప్రభావం సాయంత్రం వరకు కొనసాగింది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా తాము వెళ్లాల్సిన విమానాలను అధికారులు రద్దు చేయడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి దరిద్రంగా మారిందంటూ వ్యాఖ్యలు చేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు నిర్విరామంగా పనిచేస్తున్నామని నేషనల్ ఎయిర్‌ట్రాఫిక్ సర్వీసెస్(ఎన్ఏటీఎస్) తెలిపింది.

# సవరణపై సభా సమరం

- బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ ఆపాల్సిందేనన్న విపక్షాలు
- ప్రభుత్వం ఆ మేరకు నిర్ణయం తీసుకోవాలంటూ డిమాండ్
- కొనసాగిన విపక్షసభ్యుల ఆందోళనలు, నినాదాలు
- అర్ధంతరంగా వాయిదాపడిన ఇరుసభలు

**న్యూఢిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన వివాదాస్పద ఓటర్ల జాబితా సమగ్ర సవరణ క్రతువును తక్షణం నిలిపివేయాలన్న విపక్షాల డిమాండ్లతో పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లిపోయాయి. గురువారం ఉదయం రాజ్యసభలో సభాకార్యకలాపాలు మొదలవగానే విపక్షసభ్యులు తమ డిమాండ్లను నినాదాల రూపంలో వినిపించారు. ఆపరేషన్ సిందూర్‌పై 16 గంటల చర్యకు ప్రధాని మోదీ ఎందుకు రాజ్యసభలో సమాధానం ఇవ్వలేదని విపక్ష సభ్యులు ప్రశ్నిస్తూ సభాకార్యకలాపాలను అడ్డుకున్నారు. బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను ఈసీ వెంటనే ఆపేయాలనీ విపక్ష సభ్యులు డిమాండ్‌చేశారు. దీంతో సభను సభాధ్యక్షుడు మధ్యాహ్నం 2 గంటలవరకు వాయిదావేశారు. తర్వాత సభ మొదలైనా మళ్లీ ఇదే విపక్షాల డిమాండ్ల పర్వం కొనసాగింది. వెంటనే ప్రధాని మోదీ సభకు వచ్చి ఆపరేషన్ సిందూర్‌పై సమాధానం ఇవ్వాలని విపక్ష సభ్యులు నినాదాలుచేశారు. ఈ సందర్భంగా రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడేందుకు సభాధ్యక్షుడు సస్మిత్ పాత్రా అనుమతించారు. '' 2008లో ముంబై ఉగ్రదాడులపై నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ రాజ్యసభలో వివరణ ఇవ్వనప్పుడు నాటి హోం మంత్రి వివరణ ఇచ్చారు. అంతేగానీ హోం మంత్రి అమిత్ షా లాగా '' నేనొక్కడినే మీ అందరినీ అదమాయించగలను. హ్యాండిల్ చేస్తాను'' అని అందర్నీ తూలనాడలేదు. ఇప్పటికైనా ప్రధాని మోదీ సభకు వచ్చి మాట్లాడాలి'' అని ఖర్గే డిమాండ్‌చేశారు. ఈయన మాటలకు విపక్షసభ్యులు గొంతు కలిపారు. దీంతో చేసేదిలేక సభను సాయంత్రం నాలుగున్నర గంటలదాకా వాయిదావేశారు. 4.30 గంటలకు సభ మొదలయ్యాక ట్రంప్ చేసిన 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలకు వాణిజ్యమంత్రి గోయల్ ఘాటుగా స్పందిస్తూ ప్రకటనచేశారు. అయినాసరే విపక్షసభ్యులు తమ నినాదాలను ఆపకపోవడంతో చివరకు సభను శుక్రవారానికి వాయిదావేశారు.

### లోక్‌సభలోనూ అదే తీరు..

లోక్‌సభలోనూ ఇవే దృశ్యాలు కనిపించాయి. లోక్‌సభ ఉదయం మొదలుకాగానే జీఎస్ఎల్‌వీ రాకెట్ ద్వారా నైసార్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన శాస్త్రవేత్తలకు సభ అభినందించింది. తర్వాత వెంటనే బిహార్ అంశంపై విపక్ష సభ్యులు నినాదాలు మొదలెట్టారు. '' ఇలా నినాదాలు చేయడానికి మనల్ని ఓటర్లు ఓట్లేసి గెలిపించుకున్నారా? దయచేసి మీమీ సీట్లలో కూర్చోండి'' అని లోక్‌సభ స్పీకర్ బిర్లా మందలించారు. అయినా విపక్షసభ్యులు వినిపించుకోలేదు. తొలుత రెండు గంటల దాకా సభ వాయిదాపడింది. తర్వాత ఇదే పునరావృతంకావడంతో అప్పుడు సభాధ్యక్ష స్థానంలో కూర్చున్న అవదేశ్ ప్రసాద్ సభను నాలుగు గంటలకువాయిదావేశారు. నాలుగు గంటలకు సభ మొదలవగానే మంత్రి పియూశ్ గోయల్ మాట్లాడారు. ఆ తర్వాత నినాదాలు కొనసాగడంతో స్పీకర్ బిర్లా సభను శుక్రవారానికి వాయిదావేశారు.

## బఫూన్లకు బాస్ ట్రంప్

**అమెరికా అధ్యక్షుడి టారిఫ్ వ్యాఖ్యలపై ఒవైసీ ఆగ్రహం**

**న్యూఢిల్లీ:** రష్యాతో వాణిజ్యం చేస్తున్నదనేసాకు చూపుతూ భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లు విధించడంపై ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా మండిపడ్డారు. భారత ప్రభుత్వాన్ని వేధిస్తున్న ట్రంప్‌ను ఆయన 'బఫూన్ ఇన్ చీఫ్'గా అభివర్ణించారు. 'వైట్ హౌస్‌లోని బఫూన్ ఇన్ చీఫ్ నా దేశ ప్రభుత్వాన్ని వేధిస్తుండటం విచారం కలిగిస్తోంది. ఇలాంటి బెదిరింపులకు లొంగటానికి సామంత రాజ్యం కాదు.. భారత్ సార్వభౌమత్వం కలిగిన దేశం అని స్పష్టం చేశారు. అత్యధిక టారిఫ్‌లతో మన ఆర్థిక వ్యవస్థకు తీరని నష్టం వాటిల్లుతుందని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ టారిఫ్‌ల పెంపుపై ప్రధాని మోదీ మౌనంగా ఉండటాన్ని కూడా ఆయన తప్పుబట్టారు. మోదీ వైఖరి దారుణమన్నారు.

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 1 । ఆగస్టు । 2025





**నేటి నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ**

హైదరాబాద్‌లో కొత్తరేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. వరుసగా మూడు రోజుల పాటు లబ్ధిదారుల కుటుంబాలకు వీటిని పంపిణీ చేయనున్నారు. -8లో



**నీ స్నేహం.. ఓ సంబరం..**

ఫ్రెండ్‌షిప్ డే అంటే కేవలం బహుమతులు ఇచ్చి పుచ్చుకోవడమో లేదా ఇన్‌స్టాలో కథలు చెప్పడమో కాదు. ఈ వేడుక రేపటి జ్ఞాపకాలుగా మారే అనుభవాల వేదిక. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
31.0/24.0

**వాతావరణం**

నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 31, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.



# కళా బోనం!

బోనాల నృత్య రూపకం ఆహూతులను ఆకట్టుకుంది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టింది. గురువారం రవీంద్ర భారతిలో శ్రీ మహాకాళి మహేష్ గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురికి బోనాల పురస్కారాలను హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ట్రస్ట్ చైర్మన్ కె.ప్రవీణ్‌కుమార్, అధ్యక్షుడు అరవింద్‌కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. – గన్‌ఫౌండ్రీ







# చిరుత చిక్కింది

## ట్రెక్ పార్కులోనే బోనులోకి వచ్చి..

- ఉదయం గమనించిన సిబ్బంది
- తొలుత జూపార్క్‌కు తరలింపు
- అక్కడి నుంచి నల్లమల అడవుల్లోకి..
- నేటి నుంచి తెరుచుకోనున్న ట్రెక్ పార్కు



బోనులో చిక్కిన చిరుతపులి

**మణికొండ:** కొద్దిరోజులుగా భయభ్రాంతులకు గురిచేసిన చిరుత పులి ఎట్టకేలకు మంచిరేవుల ట్రెక్‌పార్కులోనే బోనులో చిక్కింది. జూలై 7వ తేదీన మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ వనమూళిక వనం నుంచి మొదలైన దాని ప్రస్థానం పోలీస్ గ్రేహౌండ్స్, ట్రెక్ పార్కు, రాందేవ్‌గూడ మిలిటరీ ఏరియా, తిరిగి ట్రెక్ పార్కుకు వచ్చిన విషయం తెలిసిందే. బుధవారం అర్ధరాత్రి దాటాక ఆకలితో మేకను తినేందుకు బోనులోకి దూరి బందీ అయ్యింది. ప్రతి రోజూ మాదిరిగానే ఉదయం సిబ్బంది బోనులను తనిఖీ చేస్తున్న క్రమంలో ఒకదాంట్లో చిరుత గాండ్రింపులు విని భయాందోళన చెందారు. అంతలోనే తేరుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించి బోను చుట్టూరా పరదాలను కట్టి నగరంలోని జూపార్కుకు తరలించారు. అక్కడ దాని గాయాలకు చికిత్సతో పాటు పూర్తి స్థాయి వైద్య పరీక్షలు చేసిన తర్వాత నల్లమల అటవీ ప్రాంతంలో వదిలిపెట్టినట్టు జిల్లా అటవీశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, చిలుకూరు రేంజ్ అధికారి లక్ష్మణ్ తెలిపారు.

**చిరుత మూతికి గాయం...**

బోనులో చిక్కుకున్న చిరుత అందులోనుంచి బయటికి వచ్చేందుకు శతవిధాలా ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో దాని మూతి బోను ఇనుప చువ్వలకు తాకడంతో గాయమైంది. బోనులో చిక్కుకున్న భయంలో అది అందులో ఏర్పాటు చేసిన మేకను సైతం తినకుండా ఉండిపోయింది. చిరుత వయసు సుమారు 5 ఏళ్లు ఉంటాయని, యుక్త వయసులో ఉండటంతో పెద్దగా గాండ్రించటం, బెదిరించటం చేసిందని అటవీ అధికారులు తెలిపారు. చిరుతపులి ఎట్టకేలకు అటవీ అధికారులు ఏర్పాటు చేసిన బోనులో చిక్కిందనే విషయాన్ని తెలుసుకున్న మంచిరేవుల, గంధంగూడ, బైరాగిగూడ, నార్సింగి, కోకాపేట, రాందేవ్‌గూడ, ఇబ్రహీంబాగ్ తదితర గ్రామాల ప్రజలు దాన్ని చూసేందుకు ట్రెక్ పార్కు వద్దకు వచ్చారు. శుక్రవారం నుంచి యథావిధిగా ట్రెక్ పార్కును తెరుస్తామని, వాకింగ్ చేసేవారు రావచ్చని అధికారులు తెలిపారు.



బోనుకు పరదాలు కట్టి తరలిస్తున్న అటవీ అధికారులు

# పన్నెండేళ్లకు పచ్చజెండా!

- త్వరలో పాటిగడ్డ-నెక్లెస్ రోడ్డు ఆర్‌ఓబీ పనులు
- పుష్కర కాలం నాటి ప్రతిపాదనలకు మోక్షం
- ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.80 కోట్లు

## బేగంపేట్‌లో తప్పనున్న ట్రాఫిక్ చిక్కులు

**సాక్షి, సిటీబ్యూరో:** పుష్కరకాలం నాటి ప్రతిపాదనలు తిరిగి పట్టాలకెక్కనున్నాయి. హైదరాబాద్- సికింద్రాబాద్‌లను కలిపే బేగంపేట్ రోడ్- రాణిగంజ్ క్రాస్‌రోడ్స్ మార్గానికి ప్రత్యామ్నాయంగా ఎస్‌పీ రోడ్ -నెక్లెస్ రోడ్‌ను కలుపుతూ పాటిగడ్డ మీదుగా ఆర్‌ఓబీ (ఫ్లై ఓవర్) ప్రాధాన్యతతో నిర్మించేందుకు జీహెచ్‌ఎంసీ, దక్షిణమధ్య రైల్వే అంగీకారానికి వచ్చాయి. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 80 కోట్లు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు.



**సమన్వయం, సహకారం లోపంతో..**

- ఇక్కడి ఆర్‌ఓబీ ప్రతిపాదన ఈనాటిది కాదు. నగరంలో మెట్రో రైలు పనులు ప్రారంభం కావడాని కంటే ఎంతోకాలం ముందే ఈ ప్రతిపాదన ఉన్నప్పటికీ, ఆయా ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం, సహకార లోపంతో కాగితాలు దాటి పనులు మొదలు కాలేదు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే బేగంపేట వైపు నుంచి ఖైరతాబాద్, సెక్రటేరియట్‌ల వైపు వచ్చే వారికి ఎంతో సమయం ఆదా అవుతుంది. సెక్రటేరియట్- ట్యాంక్‌బండ్- ప్యారడైజ్‌కు ప్రత్యామ్నాయ మార్గంగా ఉంటుంది. అప్పటి అంచనా వ్యయం రూ.25 కోట్లు ప్రస్తుతం రూ. 80 కోట్లయింది.
- ఈ ఫ్లైఓవర్ పనులు పూర్తయితే అటు ఎస్‌పీ రోడ్, ఇటు ఎంజీ రోడ్‌లోనూ ట్రాఫిక్‌కు ఎంతో ఉపశమనం కలుగుతుంది. అప్పట్లోనే రైల్వే శాఖ నుంచి అనుమతులున్నా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. దాదాపు 7.5 మీటర్లుండే ఫ్లై ఓవర్‌పై రెండు వైపులా క్యారేజ్‌వేలతోపాటు ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియన్‌లు గత ప్రతిపాదనల్లో ఉన్నాయి. అవసరమైతే మార్పుచేర్పులు చేయనున్నారు.

**ఫ్లైఓవర్ ఫ్లాష్‌బ్యాక్ ఇలా..**

2009లో ఉమ్టా సమావేశంలో ఈ ప్రాజెక్టు కయ్యే వ్యయాన్ని జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ చెరిసగం భరించాలని, పనులు హెచ్‌ఎండీఏ చేయాలని నిర్ణయించారు. జీహెచ్‌ఎంసీ ఇవ్వాల్సిన నిధులు జీహెచ్‌ఎంసీ ఇవ్వలేదు. హెచ్‌ఎండీఏ సైతం నిధులివ్వలేమని, ప్రాజెక్టు పని చేయలేమని, పనుల్ని జీహెచ్‌ఎంసీకి బదలాయించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరింది. అనంతరం మెగాసిటీ ప్రాజెక్ట్ కింద చేపట్టాలనుకున్నారు. ఏదీ కాలేదు. బేగంపేట, ఎంజీరోడ్ మార్గాల్లో ట్రాఫిక్ ఒత్తిడిని దృష్టిలో ఉంచుకొని ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ, రైల్వే అధికారుల సమావేశంలో ఏకాభిప్రాయానికి వచ్చినట్లు కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. ఫ్లై ఓవర్ పనులు పూర్తయితే అటు బేగంపేట, ఇటుఎంజీ రోడ్లలో రద్దీ తగ్గనున్నందున మెహిదీపట్నం- సికింద్రాబాద్ రాకపోకల సమయం సైతం తగ్గనుందని అధికారులు పేర్కొన్నారు.

# శ్రద్ధతో శుద్ధి!

## డయల్- ఎ- సెప్టిక్ ట్యాంక్

- తాజాగా ఓఆర్‌ఆర్ పరిధిలో సైతం..
- అందుబాటులో 50 వాహనాలు
- టోల్‌ఫ్రీ నంబర్- 155313/14420

**సాక్షి, సిటీబ్యూరో:** నగర శివారు ఓఆర్‌ఆర్ పరిధిలో సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాల నిర్వహణ, క్లినింగ్ కోసం జలమండలి డయల్-ఎ-సెప్టిక్ ట్యాంక్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. సెప్టిక్ ట్యాంకుల వ్యర్థాల క్లీనింగ్, డంపింగ్ కోసం సుమారు 50 వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. నివాస, వాణిజ్య సముదాయాల్లోని సెప్టిక్ ట్యాంకులను క్లీనింగ్ చేసి వ్యర్థాలను తీసుకెళ్లేందుకు వీటిని ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఉత్పన్నమయ్యే సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను.. చెరువులు, కాలువలు, కుంటల్లో పారబోస్తే ఇటు పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపేది. దీనిని నివారించడానికి సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను శుభ్రపరిచే వాహనాలను అందుబాటులో తీసుకొని వచ్చింది. జీహెచ్‌ఎంసీ అవతల, ఓఆర్‌ఆర్ లోపలి 7 కార్పొరేషన్‌లు, 18 మున్సిపాలిటీలతో పాటు 18 గ్రామాల్లోని సెప్టిక్ ట్యాంక్ మానవ వ్యర్థాలను శుద్ధి చేయనుంది. సెప్టిక్ ట్యాంక్ క్లినింగ్ వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అమర్చి పనితీరు పర్యవేక్షించేలా చర్యలు చేపట్టింది.



అస్కీలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాల ప్రారంభం (ఫైల్)

**వ్యర్థాల క్లీనింగ్‌పై శిక్షణ**

సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాల క్లీనింగ్ నిర్వహణపై వాహనాల ఆపరేటర్లకు అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ ఇచ్చారు. సెప్టిక్ ట్యాంక్‌ను క్లీనింగ్ చేసి వ్యర్థాలను ప్రతిపాదిత ఎస్టీపీలు, ఎఫ్ఎస్టీపీల్లో ఎస్టీపీల్లో డంపింగ్ చేసి, శుద్ధి చేసేలా జలమండలి చర్యలు చేపట్టింది. సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనం కోసం 155313/14420కు కాల్ చేయవచ్చు.

**శుద్ధి కేంద్రాలు ఇలా..**

జలమండలి పరిధిలో అంబర్‌పేట్, నల్లచెరువు, నానక్ రామ్‌గూడ, ఖాజాగూడ ఎస్టీపీల వద్ద 40 కేఎల్‌డీ సామర్థ్యం గల కో-ట్రీట్మెంట్ ప్లాంట్లను నిర్మించింది. ఇప్పటి వరకు 84 మిలియన్ లీటర్ల సెప్టేజ్ కో- ట్రీట్మెంట్ ప్లాంట్లలో శుద్ధి చేశారు.

# గోల్కొండ రోప్‌వే పై సాంకేతిక అధ్యయనం

## ఆర్‌ఎఫ్‌పీ కోసం ఈ నెల 6 వరకు బిడ్డింగ్

- ప్రీ బిడ్డింగ్ సమావేశంలో పాల్గొన్న పలు సంస్థలు
- రూ.100 కోట్లతో హెచ్‌ఎండీఏ ప్రతిపాదనలు

సాక్షి, సిటీబ్యూరో

గోల్కొండ టూంబ్స్ నుంచి కోట వరకు ప్రతిపాదించిన రోప్‌వేపై గురువారం హెచ్‌ఎండీఏలో ప్రీబిడ్డింగ్ సమావేశం జరిగింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురయ్యే సాంకేతిక సవాళ్లపై హెచ్‌ఎండీఏ దృష్టి సారించింది. సుమారు 1.5 కి.మీ మార్గంలో నిర్మించనున్న రోప్‌వే కోసం ఇప్పటికే రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ (ఆర్‌ఎఫ్‌పీ) టెండర్‌లను ఆహ్వానించారు. ఆసక్తిగల కన్సల్టెన్సీ సంస్థలు ఈ నెల 6 వరకు దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం కల్పించారు. ఈ క్రమంలోనే గురువారం ప్రీబిడ్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆర్‌ఎఫ్‌పీ బిడ్డింగ్ కోసం కోసం దరఖాస్తు చేసుకున్న పలు సంస్థలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిడ్డింగ్ గడువును పెంచాలని పలువురు ప్రతినిధులు హెచ్‌ఎండీఏ అధికారులను కోరారు. సాంకేతికంగా ఈ ప్రాజెక్టుపై మరింత అవగాహన అవసరమని, అందుకోసం బిడ్డింగ్ గడువును పెంచాలని అధికారుల దృష్టికి తెచ్చినట్లు సమాచారం.


**ప్రతిష్టాత్మక ప్రాజెక్టు..**

నిత్యం వేలాది మంది జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులు సందర్శించే చారిత్రక గోల్కొండ కోటను, టూంబ్స్‌ను కలిపేలా నిర్మించనున్న రోప్‌వే ప్రాజెక్టును హెచ్‌ఎండీఏ ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. రూ.100 కోట్ల అంచనాలతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో నిర్మించనున్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోప్‌వేలు, స్కైవేలపై విస్తృత అధ్యయనం చేస్తున్న హెచ్‌ఎండీఏ అనుబంధ సంస్థ హుమ్టా గోల్కొండ కోట నుంచి 1.5 కి.మీ దూరంలోని కుతుబ్‌షాహీల సమాధుల వరకు రోప్‌వే కోసం ఇప్పటికే ప్రణాళికలను రూపొందించింది. ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం సైతం పచ్చజెండా ఊపింది. దీంతో ఆర్‌ఎఫ్‌పీ బిడ్డింగ్‌కు అధికారులు చర్యలు చేపట్టారు. రోప్‌వేకు అనుకూలమైన మార్గాన్ని నిర్ధారించడంతో పాటు, రక్షణశాఖ నుంచి ఏ రకమైన సహాయ సహకారాలు అవసరమనే అంశం పైనా ఎంపికైన కన్సల్టెన్సీ అధ్యయనం చేయాల్సి ఉంటుంది. వివిధ దేశాల్లో రోప్‌వేలు, కేబుల్ కార్ల నిర్వహణపైనా అధ్యయనం చేసి హెచ్‌ఎండీఏకు నివేదికను అందజేయాల్సి ఉంటుంది.



**కేబుల్ కారులో సందర్శన..**

గోల్కొండ కోట నుంచి పర్యాటకులు రోడ్డు మార్గంలో టూంబ్స్ వరకు వెళ్లడం ఇబ్బందిగా మారింది. ఇరుకైన రోడ్డు, వాహనాల రద్దీ దృష్ట్యా చాలామంది గోల్కొండ కోట నుంచి టూంబ్స్ వరకు వెళ్లకుండానే వెనుదిరుగుతున్నట్లు అంచనా. ఈ క్రమంలో పర్యాటకుల రాకపోకలను సులభతరం చేయడంతో పాటు రోప్‌వే ద్వారా కేబుల్ కార్లలో ప్రయాణం చేయడం ఒక ప్రత్యేక ఆకర్షణగా మారనుంది. ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు 10 వేల మందికి పైగా ఈ రెండు ప్రాంతాలను సందర్శిస్తున్నారు. వీరిలో 3000 మంది వరకు విదేశీ టూరిస్టులు ఉంటారని అంచనా. రోప్‌వేను ఏర్పాటు చేయడం వల్ల పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో నిర్మించడం వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా పర్యాటకులకు మెరుగైన సదుపాయం కల్పించినట్లవుతుందని అధికారులు భావిస్తున్నారు.



# జాతీయ స్థాయిలో బతుకమ్మ కుంట ఓ నమూనా

## హైడ్రా కృషిని అభినందించిన కేంద్ర బృందం

**సాక్షి, సిటీబ్యూరో:** కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఓహెచ్‌యూఏ) అధికారుల బృందం గురువారం అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను సందర్శించింది. ఒకప్పుడు చెత్త, నిర్మాణ వ్యర్థాలతో నిండిన ఈ ప్రాంతం చెరువులా రూపాంతరం చెందిన పాత చిత్రాలను చూసి అధికారులు ఆశ్చర్యచకితులయ్యారు. చెరువుల పరిరక్షణకు జాతీయ స్థాయిలో బతుకమ్మ కుంట ఒక నమూనా అవుతుందని బృందానికి నాయకత్వం వహించిన కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అడిషనల్ చీఫ్ టౌన్ ప్లానర్ మోనీస్ ఖాన్ పేర్కొన్నారు. కబ్జాల చెర నుంచి విముక్తి కల్పించి, మండు వేసవిలో రెండు మీటర్ల లోతు నీరు ఉబికి వచ్చే వీడియోలను చూసిన ఆయన ఆశ్చర్యపోయారు. హైడ్రా కృషిని అభినందించారు. చెరువు చుట్టూ ఇంకా అభివృద్ధి చేయాల్సిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. చెరువుకు ఆనుకుని సాగే మురుగు కాల్వలోంచి వరద నీరు మాత్రమే వచ్చేలా ఇన్‌లెట్‌ను నిర్మించడంపై హర్షం వెలిబుచ్చారు. ఇటీవల కురిసిన వర్షాల సమయంలో వరద నీరు ఎలా వచ్చి చేరిందో వీడియోల ద్వారా హైడ్రా అధికారులు కేంద్ర బృందానికి చూపించారు. చెరువు ఔట్‌లెట్‌ను సైతం పరిశీలించారు. కేంద్ర గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ అసోసియేట్ టౌన్ ప్లానర్ సందీప్ రావుతో పాటు.. హైడ్రా అధికారులు మోహనరావు, బాలగోపాల్, విమోస్ టెక్నో క్రాట్ ఎండీ పి.యూనస్, జీహెచ్‌ఎంసీ అడిషనల్ చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, సిటీ ప్లానర్ ఉమాదేవి తదితరులు కేంద్ర బృందంతో ఉన్నారు.



బతుకమ్మ కుంట వద్ద అధికారుల బృందం

# ప్రజా ఉద్యమాలే ఊపిరిగా సాగిన గద్దర్

**లక్డీకాపూల్:** ప్రజాస్వామిక హక్కుల కోసం నిరంతరం పోరాడిన గద్దర్ జీవితం ప్రజా ఉద్యమాలే ఊపిరిగా సాగిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గద్దర్ ఫౌండేషన్ నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి తదితరులు పాల్గొన్నారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు గద్దర్ ఉద్యమించారన్నారు. ఆయన చూపిన మార్గంలో రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గద్దర్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రత్యేక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు ఫౌండేషన్ కార్యదర్శి సూర్య పేర్కొన్నారు. ఈ నెల 6న రవీంద్ర భారతిలో జరిగే కార్యక్రమంలో గద్దర్ చేసిన కృషి, ఆచరించిన విలువలపై ఆయన స్మృతిలో పాదధార పాట పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్టు తెలిపారు.

# పారిశుద్ధ్య ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

**గచ్చిబౌలి:** వర్షాకాల పారిశుద్ధ్య ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. గురువారం శేరిలింగంపల్లి జోన్ పరిధిలో ఉదయం వర్షాకాలం పారిశుద్ధ్య ప్రత్యేక కార్యక్రమాన్ని జోనల్ కమిషనర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావుతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట ఆయన మాదాపూర్‌లోని కావూరి హిల్స్‌లో తనిఖీలు చేశారు. ఆ తర్వాత పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. కాలనీలలో పరిశుభ్రతా చర్యలు ప్రభావవంతంగా చేపట్టాలన్నారు. డిప్యూటీ కమిషనర్, స్థానిక అధికారులతో కలిసి పారిశుద్ధ్య పనులను సమీక్షించాలన్నారు. అనంతరం పటాన్ చెరువును సందర్శించారు. క్షేత్ర స్థాయిలో అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ పారిశుద్ధ్య పనులను వేగంగా చేపట్టాలన్నారు.



శేరిలింగంపల్లి జోన్‌లో కర్ణన్ తనిఖీలు

# ఫార్మాసిటీలో మరోసారి సర్వే


రైతులతో మాట్లాడుతున్న ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి

**సర్వేనంబర్ల వారీగా భూమి గుర్తింపు**
- అడ్డుకున్న నక్కర్తమేడిపల్లి రైతులు
- ఉద్రిక్త వాతావరణం
- భారీ పోలీసు బందోబస్తు

**యాచారం:** ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో అధికారులు మరోసారి సర్వేకు సిద్ధం కావడం ఉద్రిక్తతకు దారితీసింది. రెండు నెలల క్రితం ఫార్మాసిటీ బౌండరీని సర్వే చేసి, ఫెన్సింగ్ పనులు పూర్తి చేశారు. తాజాగా గురువారం బౌండరీ లోపల హద్దులను గుర్తించే ప్రక్రియను ప్రారంభించారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో సర్వే నంబర్ల వారీగా గుర్తించే పనులను మొదలుపెట్టారు. గ్రామంలోని పలు అసైన్డ్, పట్టా భూముల సర్వేనంబర్ల వారీగా ఎంత మంది రైతులకు, ఎన్ని ఎకరాలకు పరిహారం అందజేశామనే వివరాలతో కూడిన రికార్డుల ప్రకారం హద్దులు గుర్తిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. తమ భూముల వద్దకు రావద్దని అడ్డుకున్నారు.

### అభ్యంతరం చెప్పడం సరికాదు

నిర్వాసితులకు పరిహారంతో పాటు తాజాగా మీరాఖాన్‌పేటలోని టీజీఐఐసీ వెంచర్‌లో లాటరీ తీసి ప్లాట్ల కబ్జాలు ఇచ్చామని ఆర్డీఓ అనంత్‌రెడ్డి తెలిపారు. అయినా రైతులు అభ్యంతరం తెలపడం సరికాదన్నారు. పరిహారం అందజేసిన, రికార్డులు మారిన భూములన్నీ ప్రభుత్వాని వేనని, ఆ భూముల్లోకి ఎవరూ రావొద్దని సూచించారు. కోర్టు కేసులున్న భూముల్లోకి వెళ్లమని హామీ ఇచ్చారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్వే చేస్తున్న భూముల వద్దకు రైతులెవరినీ వెళ్లనీయకుండా అడ్డుకున్నారు.

### బందోబస్తు మధ్య ఫార్మా ఫెన్సింగ్

**కందుకూరు:** ఫార్మాసిటీ కోసం మండలంలోని ముచ్చర్ల రెవెన్యూ సర్వే నంబర్ 123కు సంబంధించి గురువారం అధికారులు పోలీసు బందోబస్తు మధ్య ఫెన్సింగ్ పనులు చేపట్టారు. దీంతో సర్వే నంబర్‌ను ఆనుకుని ఉన్న దెబ్బడగూడ రెవెన్యూ సర్వే నంబర్ 31లోని గిరిజన రైతులు పనులను అడ్డుకున్నారు. తమ భూమిలోకి జరిపి ఫెన్సింగ్ ఎలా వేస్తారంటూ నిలదీశారు. సర్వే చేసిన తర్వాతే ఫెన్సింగ్ వేసుకోవాలని పట్టుబట్టారు. ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్, అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ జానకీరెడ్డి, సీఐ సీతారాం రైతులతో మాట్లాడారు. పది రోజుల్లో దెబ్బడగూడ సర్వే నంబర్ 31ని సర్వే చేయిస్తామని, అప్పటి వరకు ఫెన్సింగ్ పనులు ఆపొద్దని అన్నారు. భూమి మీకు వస్తే తిరిగి ఇచ్చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.


పోలీస్ పహారా

# నేటి నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ

55,378 కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు ● హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా



**హైదరాబాద్ కొత్త రేషన్ కార్డుల మంజూరు ఇలా**

| నియోజక వర్గం | మంజూరైన కార్డులు |
|---|---|
| మలక్‌పేట | 3,926 |
| యాకుత్‌పురా | 3,174 |
| చార్మినార్ | 4,738 |
| చాంద్రాయణగుట్ట | 6,461 |
| బహద్దూర్‌పురా | 5,287 |
| గోషామహల్ | 3,028 |
| కార్వాన్ | 5994 |
| అంబర్‌పేట | 3,358 |
| ఖైరతాబాద్ | 1,953 |
| జూబ్లీహిల్స్ | 5,284 |
| నాంపల్లి | 5,157 |
| ముషీరాబాద్ | 2,672 |
| సనత్‌నగర్ | 1,393 |
| కంటోన్మెంట్ | 1,150 |
| సికింద్రాబాద్ | 1,803 |

**నగరంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ షెడ్యూల్ ఇలా...**

| తేది | నియోజకవర్గం | సమయం | వేదిక |
|---|---|---|---|
| ఆగస్టు 1 | ఖైరతాబాద్ | ఉదయం 10 గంటలు | బంజారా భవన్ |
| .. | కంటోన్మెంట్ | మధ్యాహ్నం 12 గంటలు | లే ప్యాలెస్ |
| ... | జూబ్లీహిల్స్ | మధ్యాహ్నం 3గంటలు | రహమత్ నగర్ |
| ఆగస్టు 2 | అంబర్‌పేట | ఉదయం 10గంటలు | అంబర్‌పేట |
| .. | ముషీరాబాద్ | మధ్యాహ్నం 12 గంటలు | ముషీరాబాద్ |
| .. | సికింద్రాబాద్ | 3.00 గంటలు | సికింద్రాబాద్ |
| ఆగస్టు 3 | చార్మినార్ | ఉదయం 10 గంటలు | చార్మినార్ |
| .. | కార్వాన్ | మధ్యాహ్నం 12 గంటలు | కార్వాన్ |
| .. | చాంద్రాయణ గుట్ట | మధ్యాహ్నం 3 గంటలు | చాంద్రాయణ గుట్ట |

**సాక్షి,సిటీ బ్యూరో:** ఎట్టకేలకు హైదరాబాద్‌లో కొత్త రేషన్ (ఆహార భద్రత) కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. వరసగా మూడు రోజుల పాటు కొత్త రేషన్ కార్డులు మంజూరైన లబ్ధిదారుల కుటుంబాలకు వాటిని పంపిణీ చేయనున్నారు. శుక్రవారం హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ బంజారాహిల్స్‌లోని బంజారా భవన్ కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించి లబ్ధి కుటుంబాలకు అందజేయనున్నారు. తొలి విడతగా రోజుకు మూడు అసెంబ్లీ నియోజకవర్గాల చొప్పున మూడు రోజుల్లో తొమ్మిది అసెంబ్లీ నియోజక వర్గాల్లో కొత్తగా రేషన్ కార్డులను పంపిణీ చేస్తారు. రెండో విడతలో మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో పంపిణీ చేసే విధంగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు.

### కొత్తగా 55,378 రేషన్‌కార్డులు

హైదరాబాద్ జిల్లాలో సుమారు 55,378 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి. మొత్తం మీద సుమారు 2,26, 272 కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం మీ సేవా ద్వారా పౌరసరఫరాల శాఖకు దరఖాస్తు చేసుకోగా, ఇప్పటి వరకు 89,919 దరఖాస్తులపైన మాత్రమే క్షేత్ర స్థాయి విచారణ పూర్తికాగా, మిగిలిన 1,36,353 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటి వరకు జరిగిన విచారణలో సుమారు 3,910 కుటుంబాలను అనర్హులుగా గుర్తించారు. మిగిలిన అర్హత సాధించిన దరఖాస్తుల్లో 55,378 కుటుంబాలకు కార్డులు మంజూరు కాగా, ప్రస్తుం ఎసీఎస్‌ఓ లాగిన్‌లో 6,090, డీసీఎస్‌ఓ లాగిన్‌లో 24,541 దరఖాస్తులు ఆమోదానికి పెండింగ్‌లు ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవంగా గత ఆరు నెలలుగా కొత్త రేషన్ కార్డుల కోసం మీ సేవ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నప్పటికి క్షేత్ర స్థాయి విచారణ మాత్రం నత్తలకే నడక నేర్పిస్తోంది. తాజాగా జీహెచ్ఎంసీ బృందాలు రంగంలోకి దిగడంతో కార్డుల వెరిఫికేషన్ వేగవంతమైనట్లు సమాచారం.

### వర్షాకాల సమస్యలకు బైద్యనాథ్

**సాక్షి, సిటీబ్యూరో:** వర్షాకాలంలో వచ్చే జలుబు, ఫ్లూ, దగ్గు, జ్వరం, విరేచనాలు, మలేరియా తదితర అనారోగ్య సమస్యలను నివారించేందుకు బైద్యనాథ్ పలు చికిత్సలు అందిస్తోందని బ్రాండ్ ప్రతినిధులు తెలిపారు. జలుబు, దగ్గు, తరచుగా తుమ్ములు, ఆకలి లేకపోవడం, శరీర నొప్పులు వంటివి ఉంటే లక్ష్మీవిలాస్ రస (నార్దియా)ను,, బైద్యనాథ్ కసమృత్‌ను తీసుకోవాలని సూచించారు. దగ్గు తీవ్రత ఎక్కువగా ఉంటే, అర టీస్పూన్ సితోపలాడి చూర్ణాన్ని, జ్వరం వస్తే, బైద్యనాథ్ మహాసుదర్శన్ ఘన్ బటి తీసుకోవాలన్నారు. విరేచనాలతో ఇబ్బంది పడితే సంజీవని బటి, ఐ టాబ్లెట్‌ను,, విరేచనాలు శ్లేష్మం కడుపు తిమ్మిరి ఉన్న సందర్భాల్లో, బైద్యనాథ్ అమీబికా టాబ్లెట్‌ను, బైద్యనాథ్ కుటజారిష్ట తీసుకోవాలన్నారు. ఆకలి లేకపోవడం, మూత్రం కళ్లు పసుపు రంగులోకి మారడం. జరిగితే బైద్యనాథ్ పునర్నవాది మండూర్ తీసుకోవాలని సూచించారు.

### మహిళ మెడలో గొలుసు చోరీ

**హస్తినాపురం:** షాపులో ఒంటరిగా ఉన్న మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని యువకుడు లాక్కెళ్లిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హరిహరపురం కాలనీకి చెందిన నవనీత కిరాణా దుకాణం నిర్వహిస్తోంది. గురువారం ఆమె ఒంటరిగా షాపులో కూర్చుని ఉండటాన్ని గుర్తించిన గుర్తు తెలియని యువకుడు ఆమె మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వనస్థలిపురం పోలీపులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

**అరగంటలో పట్టేశారు..**

బంగారు గొలుసు లాక్కెళ్లిన గుర్తు తెలియని వ్యక్తిని పోలీసులు అరగంటలోనే అదుపులోకి తీసుకున్నారు. ఫిర్యాదు అందిన వెంటనే వనస్థలిపురం డీఐ రాజేశ్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. జరిగిన పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడు ప్రవీణ్ రెడ్డిగా గుర్తించి అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు.దీంతో అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

### స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి


నాగరాజు (ఫైల్)

**మియాపూర్:** స్కూల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అమలాపురం ప్రాంతానికి చెందిన దోనిపాటి నాగరాజు(35), వినోద దంపతులు ఏఎస్ రాజునగర్ రోడ్డు నంబర్ -3లో నివాసముంటున్నారు. నాగరాజు క్యాల్షియం హాస్పిటల్ ల్యాబ్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం అతను బ్లడ్ శాంపుల్స్ తీసుకుని హాస్పిటల్‌కు తీసుకువస్తుండగా గోపాల్‌రావునగర్ కాలనీలోని ప్రధాన రహదారిపై మాదాపూర్ గ్లోబల్ హెడ్జ్ పాఠశాల బస్సు అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య వినోద ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### జనహితయాత్రకు ఘన స్వాగతం



**చేవెళ్ల/మొయినాబాద్:** వికారాబాద్ జిల్లా పరిగి నుంచి ప్రారంభించే జనహిత పాదయాత్రకు వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు పార్టీ శ్రేణులు మొయినాబాద్‌లో ఘన స్వాగతం పలికాయి. హిమాయత్‌నగర్ చౌరస్తాకు చేరుకోగానే పెద్ద ఎత్తున టపాసులు పేల్చారు. అక్కడే ఉన్న అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాలకు మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్, శ్రీధర్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు వారికి భారీ గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, దర్శన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

**చిలుకూరులో పూజలు**

చిలుకూరు బాలాజీ దేవాలయంలో మీనాక్షి నటరాజన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీలు హన్మంతరావు, రాజయ్య తదితరులతో కలిసి ఆమె ఆలయానికి చేరుకున్నారు. స్వామివారిని దర్శించు కున్న అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

**వర్గపోరు మరోసారి బట్టబయలు**

పార్టీలో వర్గపోరు కొనసాగుతుందని మరోసారి బట్టబయలైంది. ఎమ్మెల్యే కాలె యాదయ్య, నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ మధ్య సయోధ్య లేకపోవటంతో ఇరు వర్గీయులు వేర్వేరుగా స్వాగత కార్యక్రమాలు నిర్వహించారు.

### డీ అడిక్షన్ సెంటర్ సిబ్బందికి శిక్షణ


మాట్లాడుతున్న డీజీ సౌమ్య మిశ్రా

**చంచల్‌గూడ:** మత్తు మందులు లేని సమాజాన్ని నిర్మించే దిశగా అడుగులు వేస్తున్న తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖకు నషాముక్త భారత్ అభియాన్‌లో భాగంగా మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ శాఖ నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. జైళ్ల శాఖ నిర్వహిస్తున్న డీ అడిక్షన్ సెంటర్లలో విధులు నిర్వహించేందుకు గత నెలలో కాంట్రాక్ట్ పద్ధతిన 28 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారికి గురువారం చంచల్‌గూడలోని సీకా సంస్థలో శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా మాట్లాడుతూ డీ అడిక్షన్ కేంద్రాల ద్వారా మత్తు పదార్థాలకు బానిసలైన ఖైదీలకు వైద్య చికిత్స, కౌన్సెలింగ్, పునరావాసం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. డీ అడిక్షన్ కేంద్రాల్లో ఉండే వారితో ఎలా మెలగాలో, వారిలో పరివర్తన ఏ విధంగా తీసుకురావాలి అనే అంశంపై సిబ్బంది అంటీ డ్రగ్స్, నార్కోటిక్, మానసిక వైద్య కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఐజీ మురళీబాబు, సీకా ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అమెరికన్ కాన్సులేట్‌లో వెయిటింగ్ ఏరియా ప్రారంభం


అమెరికన్ కాన్సులేట్‌లో వెయిటింగ్ ఏరియాను ప్రారంభిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జెన్నీ ఫర్ లార్సన్

**రాయదుర్గం:** నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని అమెరికా కాన్సుల్ జనరల్ హైదరాబాద్ క్యాంపస్‌లో వెయిటింగ్ ఏరియాను గురువారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అమెరికన్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ వెయిటింగ్ ఏరియాను తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ నిర్మించింది. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ అమెరికాతో భాగస్వామ్యం, కొత్త ఆవిష్కరణలు, పురోగతి ప్రజల సంక్షేమానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని అన్నారు. అమెరికాకు చెందిన పలు సంస్థలు తమ కార్యకలాపాలను హైదరాబాద్‌లో నిర్వహిస్తూ రెండు ప్రాంతాల మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. జెన్నీఫర్ లార్సన్ మాట్లాడుతూ ఈ వెయిటింగ్ ఏరియా నిర్మాణంతో అమెరికా వీసాలను సమర్థవంతంగా పరీక్షించడానికి, ప్రాసెస్ చేయడానికి యూఎస్ ప్రభుత్వ సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. వేలాదిమంది వీసా దరఖాస్తుదారులకు, ప్రతిరోజు కాన్సులేట్‌ను సందర్శించే కుటుంబాలకు సౌకర్యం, సౌలభ్యాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికారులు, టీజీఐఐసీ సంస్థ ఉన్నతాధికారులు, అమెరికన్ కాన్సులేట్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఎవరిని పెళ్లి చేసుకున్నా చంపేస్తా..

**యువతికి మాజీ ప్రియుడి బెదిరింపులు..**

**సనత్‌నగర్:** ఎవరినైనా పెళ్లి చేసుకుంటే ఆ వ్యక్తిని చంపేస్తానంటూ ఓ యువతిని బెదిరించిన ఆమె మాజీ ప్రియుడిపై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..ఫతేనగర్ ఎల్‌బీఎస్‌నగర్‌కు చెందిన యువతికి రవికుమార్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా ప్రేమగా మారింది. అయితే రవికుమార్ కొన్నాళ్లుగా ఆమెను వేధిస్తుండడంతో కుటుంబ సభ్యులకు చెప్పింది. దీంతో పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టగా ఇరువురూ మళ్లీ కలవబోమని అంగీకరించారు. ఇదిలా ఉండగా సదరు యువతికి ఇటీవల పెళ్లి కుదిరింది. ఈ విషయం తెలుసుకున్న రవికుమార్.. వరుడికి ఫోన్ చేసి ఆమె గురించి చెడుగా చెప్పాడు. అంతేకాకుండా బాధితురాలికి ఫోన్ చేసి ఎవరినైనా పెళ్లి చేసుకుంటే అతడిని చెంపేస్తానంటూ బెదిరించాడు. దీంతో బాధితురాలు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### 28 మంది పోలీసు అధికారుల ఉద్యోగ విరమణ


ఉద్యోగ విరమణ పొందిన అధికారులతో పరిమళ హనా నూతన్..

**బంజారాహిల్స్:** హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనరేట్ పరిధిలో గురువారం 28 మంది పోలీసు అధికారులు పదవీ విరమణ చేశారు. వీరిలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ వెంకటేశ్వరరావు, నలుగురు ఎస్ఐలు, 21 మంది ఏఎస్ఐలు, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరిని జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (అడ్మిన్) పరిమళ హనా నూతన్ ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం భగవంతుడు అందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, శేష జీవితం కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని కోరారు. పోలీసు శాఖకు వారు అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీనివాస్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శంకర్ రెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# భార్య స్కెచ్ వేసింది.. భర్త అమలు చేశాడు..

**నగల దుకాణం ఉద్యోగి కిడ్నాప్ కేసులో యువతితో సహా నలుగురు అరెస్టు..**

**బంజారాహిల్స్:** భర్తతో కలిసి ఓ కిలాడీ లేడీ పక్కా స్కెచ్ వేసి సినీ ఫక్కీలో ఓ నగల దుకాణం ఉద్యోగిని కిడ్నాప్ చేసి నగదు, నగలు దోచుకోవడమేగాకుండా నగ్న వీడియోలు తీసి బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడింది. ఈ ఘటనలో యువతితో సహా నలుగురు కిడ్నాపర్లను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. అత్తాపూర్‌కు చెందిన సచిన్‌దూబే బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని తిబారుమల్ జ్యువెలర్స్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. తరచూ పబ్‌లకు వెళ్లే అతడికి కూకట్‌పల్లిలోని కింగ్స్ అండ్ క్వీన్స్ పబ్‌లో బార్ డ్యాన్సర్‌గా పనిచేస్తున్న డింపుల్‌యాదవ్‌తో పరిచయం ఏర్పడింది. గత శనివారం తమ పబ్‌లో ప్రత్యేక కార్యక్రమం ఉందని సచిన్‌దూబేను ఆహ్వానించింది. దీంతో సచిన్ తన బైక్‌ను నగల దుకాణం వద్దనే పార్కు చేసి క్యాబ్‌లో పబ్‌కు వెళ్లాడు. పథకం ప్రకారం డింపుల్‌యాదవ్ డ్యాన్స్ చేస్తూ సచిన్‌ను రెచ్చగొడుతూ పీకలదాకా మద్యం తాగేలా చేసి మత్తులోకి దింపింది. అర్ధరాత్రి తర్వాత తూలుతూ, తూగుతూ బయటకు వచ్చిన సచిన్‌ను తాను బైక్‌పై దింపుతానంటూ తన స్కూటీ వెనుక ఎక్కించుకుని బంజారాహిల్స్‌కు వచ్చింది. అప్పటికే పథకంలో భాగంగా డింపుల్ భర్త తన ముగ్గురు స్నేహితులతో కలిసి కారులో సచిన్, డింపుల్ వెళ్తున్న స్కూటీని అనుసరించాడు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-3లోని టీవీ9 చౌరస్తా వద్దకు రాగానే కిడ్నాపర్లు రోడ్డుకు అడ్డంగా కారును ఆపి ఇంత రాత్రిపూట ఎక్కడికి వెళ్తున్నారంటూ బెదిరించడమే కాకుండా తాము టాస్క్‌ఫోర్స్ పోలీసులమని వెనుక కూర్చొన్న సచిన్‌ను కారులో ఎక్కించుకుని ఫిర్జాదీగూడ వైపు తీసుకెళ్లారు. మార్గమధ్యలో అతడికి నిద్ర మాత్రలు కలిపిన కూల్‌డ్రింక్ తాగించడంతో పూర్తిగా స్పృహ తప్పాడు. అనంతరం సచిన్ మెడలో ఉన్న గొలుసు, పర్సులో ఉన్న డబ్బులు లాక్కుని మంచంపై పడుకోబెట్టారు. అక్కడే ఉన్న అపరిచిత యువతితో సచిన్ బట్టలు తొలగించి నగ్న వీడియోలు తీయించారు. ఉదయం 6 గంటల సమయంలో సచిన్‌ను అత్తాపూర్‌లోని ఇంటి సమీపంలో వదిలిపెట్టి వెళ్లిపోయారు. ఇంటికి వెళ్లిన గంట తర్వాత సచిన్ భార్యకు ఫోన్ చేసి తాము పోలీసులమని, రాత్రి మద్యం మత్తులో మీ భర్త ఒక మహిళను హత్య చేశాడని, తమ వద్ద వీడియోలు ఉన్నాయని బెదిరించడమే కాకుండా, రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీడియోలు బయటపెడతామని బ్లాక్‌మెయిల్ చేశారు. అయితే ఆమె భయపడకుండా హత్య చేస్తే ఇంటికి వచ్చి తన భర్తను అరెస్టు చేసుకోవచ్చని చెప్పింది. వారం రోజులుగా కిడ్నాపర్లు ఆమెకు ఫోన్లు చేస్తూ చివరకు రూ.2 లక్షలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు కూకట్‌పల్లిలోని పబ్ వద్ద విచారణ చేపట్టి బార్ డ్యాన్సర్ డింపుల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా గుట్టురట్టయ్యింది.


సచిన్‌దూబే కిడ్నాప్‌నకు వాడిన కారు

**పథకం ప్రకారమే..**

కూకట్‌పల్లిలోని కింగ్స్ అండ్ క్వీన్స్ పబ్‌లో బార్ డ్యాన్సర్‌గా పనిచేస్తున్న డింపుల్ యాదవ్ భర్త పవన్‌కుమార్‌యాదవ్ గతంలో అదే పబ్‌లో బౌన్సర్‌గా పనిచేశాడు. అయితే వీరి స్వస్థలం ఢిల్లీ కాగా హైదరాబాద్‌కు మకాం మార్చి అంబర్‌పేటలో అద్దెకు ఉంటున్నారు. ఈజీ మనీ కోసం అమాయకుడైన సచిన్‌ను మద్యం మత్తులో దింపి కిడ్నాప్ నాటకం ఆడి అడ్డంగా బుక్కయ్యాడు. డింపుల్‌యాదవ్, పవన్‌కుమార్‌యాదవ్‌తో పాటు కిడ్నాప్‌లో పాల్గొన్న సాయిప్రసాద్, హరికిషన్, అంగార సుబ్బారావులను పోలీసులు అరెస్టు చేశారు. కిడ్నాప్‌నకు వాడిన కారుపై లా ఆఫీసర్ ఎయిమ్స్ బీబీనగర్ అని ఉండడంతో పోలీసులు ఎవరూ అనుమానించకూడదనే ఇలా రాసినట్లుగా వెల్లడైంది. నిందితులు వాడిన బైక్‌లతో పాటు సచిన్ నుంచి నుంచి లాక్కున్న బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. తనను మద్యం మత్తులోకి దింపి పథకం ప్రకారమే కిడ్నాప్ చేసి నగ్న వీడియోలు తీసి రూ.10 లక్షలు ఇవ్వకపోతే సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామంటూ బ్లాక్ మెయిల్ చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## సందడిగా ఎల్లో కలర్ డే




**శ్రీనగర్‌కాలనీ:** మోతీనగర్ సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో ఎల్లో కలర్ డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఎల్లో కలర్ డ్రెస్సులు వేసుకొని ఆటలాడుతూ, పాటలుపాడుతూ సందడిగా గడిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారులకు కలర్స్ గురించి తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు స్కూల్ సీఈఓ మోహనవంశీ తెలిపారు.

## ఎమ్మెల్యే కాలనీలో భారీ బందోబస్తు


ఎమ్మెల్యేకాలనీలో పోలీసుల బందోబస్తు

**బంజారాహిల్స్:** బంజారాహిల్స్ రోడ్ నెం.12 లోని ఎమ్మెల్యే కాలనీలో వారం రోజులుగా ఆలయానికి సంబంధించి ధర్నాలు, గొడవలు జరుగుతున్న నేపథ్యంలో బంజారాహిల్స్‌లో గురువారం కాలనీకి వెళ్లే అన్ని మార్గాల్లో పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 200 మందికి పైగా పోలీసులు బందోబస్తులో ఉన్నారు. కాలనీకి వెళ్లే అన్ని మార్గాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అనుమానిత వ్యక్తులను విచారించారు. వాహనాలను పరిశీలించిన తర్వాతే కాలనీలోకి అనుమతించారు.

## జనహిత పాదయాత్ర జయప్రదం కావాలి


రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మహేష్‌కుమార్‌గౌడ్‌తో నవీన్‌యాదవ్

**శ్రీనగర్‌కాలనీ:** కాంగ్రెస్ పార్టీతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని నమ్మి భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీని గెలిపించారని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ప్రారంభించిన జనహిత పాదయాత్ర జయప్రదం కావాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకులు నవీన్‌యాదవ్ ఆకాంక్షించారు. రంగారెడ్డి జిల్లా పరిగిలో గురువారం ప్రారంభమైన జనహిత పాదయాత్రకు మద్దతుగా నవీన్‌యాదవ్ వెళ్లి రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు సైతం ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## హెచ్‌వైసీ ఆధ్వర్యంలో ఉచిత అంబులెన్స్ సేవలు



**రహమత్‌నగర్:** పేదలకు అత్యవసర వాహన సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ యూత్ కరేజ్ (హెచ్‌వైసీ) ముందుకొచ్చింది. ఈ మేరకు రెండు ఉచిత అంబులెన్స్‌లను రహమత్‌నగర్, ఎర్రగడ్డ డివిజన్‌లలో అందుబాటులో ఉంచి సేవలు అందిస్తోంది. రహమత్‌నగర్ డివిజన్ హెచ్‌ఎఫ్ నగర్ వద్ద ఒకటి, ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్ వద్ద మరో అంబులెన్స్ 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని హెచ్‌వైసీ ఫౌండర్ సల్మాన్ తెలిపారు. డ్రైవర్ నంబర్: 9121 212 108.

## దారి దోపిడీకి పాల్పడిన దొంగల అరెస్టు

**ఫిలింనగర్:** దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరు దొంగలను ఫిలింనగర్ పోలీసులు ఘటన జరిగిన 24 గంటల్లోగా పట్టుకొని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. షేక్‌పేట సమీపంలోని ద్వారకా నగర్‌లో పండ్ల వ్యాపారం చేసుకునే శ్రీనివాస్ అనే వ్యాపారి బుధవారం తెల్లవారుజామున తన స్నేహితుడితో కలిసి నడుచుకుంటూ వెళ్తుండగా ఆటోలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు బలవంతంగా శ్రీనివాస్‌ను ఆటోలోకి లాగి నగదు తస్కరించి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఫిలింనగర్ పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను పట్టుకున్నారు. అరెస్టయిన దొంగల్లో నగేష్ రాథోడ్, వెంకటేష్ రాథోడ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మరో ఇద్దరు మైనర్ బాలురను పునరావాస కేంద్రానికి తరలించారు. నగదు, ఆటో స్వాధీనం చేసుకున్న ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# 6,967 కొత్త రేషన్‌కార్డులు..
# నేటి నుంచి పంపిణీకి శ్రీకారం

● నందినగర్, బోరబండలో ప్రత్యేక కార్యక్రమాలు ● పాల్గొననున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు

**బంజారాహిల్స్:** కొత్తగా మంజూరైన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీకి పౌర సరఫరాల శాఖ అధికారులు రంగం సిద్ధం చేశారు. ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడమే కాకుండా కార్డులు కూడా ఆయా సర్కిళ్లకు పంపిణీ చేసింది. దీంతో రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధి కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 81 రేషన్ దుకాణాల పరిధిలో కొత్తగా 6,967 రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. ప్రజాపాలన నుంచి తాజాగా మీ–సేవ కేంద్రాల్లో తీసుకున్న దరఖాస్తులన్నింటినీ రేషనింగ్ అధికారులు 360డిగ్రీల కోణంలో విచారణ చేపట్టి అర్హులైన వారిని గుర్తించారు. కొత్తగా మంజూరైన 6,967 మంది లబ్ధిదారులకు శుక్రవారం నుంచి రేషన్ కార్డుల పంపిణీ చేపట్టనున్నారు.

- ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధిలో మొత్తం 22,511 దరఖాస్తులు కొత్త రేషన్‌కార్డుల కోసం వచ్చాయి. ఇందులో 360 డిగ్రీల కోణంలో తనిఖీల అనంతరం 6,967 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు.
- 1,226 దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి.
- 11,146 దరఖాస్తులు విచారణలో పెండింగ్‌లో ఉన్నాయి.
- 2,772 దరఖాస్తులు సహాయ సరఫరాల అధికారి, రేషనింగ్ ఇన్‌స్పెక్టర్ల లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్నాయి.
- ఆగస్టు 1వ తేదీన బంజారాహిల్స్ రోడ్డు నంబర్–10లోని బంజారాభవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గానికి సంబంధించి రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది. మంత్రి పొన్నం ప్రభాకర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.
- జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో బోరబండలోని హబీబ్ ఫాతిమానగర్‌లో మధ్యాహ్నం 1 నుంచి కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు.
- లబ్ధిదారులకు ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిజిటల్ కార్డులు పంపిణీ చేయనున్నారు. అయితే కొంతమందికి మాత్రమే మొదటి రోజున డిజిటల్ కార్డులు అందజేస్తారు. మిగతా వారికి రేషన్‌కార్డుల పత్రాలను పంపిణీ చేయనున్నారు.
- విడతల వారీగా సమావేశాలు ఏర్పాటుచేసి లబ్ధిదారులందరికీ రేషన్ పత్రాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు.



కొత్తగా పంపిణీ చేయనున్న నమూనా రేషన్‌కార్డు

## స్థానిక ఎన్నికల్లో వైశ్యులకు వాటా కల్పించాలి

● 3న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో వైశ్య రాజకీయ రణభేరి
● వైశ్య వికాస వేదిక అధ్యక్షుడు కాచం సత్యనారాయణ గుప్తా


రణభేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాచం సత్యనారాయణగుప్తా

**హిమాయత్‌నగర్:** జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు వాటా కల్పించాలని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డా.కాచం సత్యనారాయణ గుప్తా అన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో గురువారం వేదిక ఆధ్వర్యంలో 'మేమెంతో మాకంత' వైశ్యుల ఆత్మగౌరవం హక్కుల సాధనకు ఆగస్టు 3న చలో హైదరాబాద్ పేరిట నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగే వైశ్య రాజకీయ రణభేరికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు నమశ్శివాయ, ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి అధ్యక్షుడు ప్రేమ్‌గాంధీ తదితర నాయకులతో కలిసి మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలో ఎంపీటీసీ 30, జెడ్పీటీసీ 30, జెడ్పీ చైర్మన్ ఒకటి, మేయర్ ఒకటి, మున్సిపల్ చైర్మన్ 15 స్థానాలకు అవకాశం కల్పించాలన్నారు. అదేవిధంగా ఈడబ్ల్యూఎస్‌లో వర్గీకరణతో పాటు వైశ్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. స్కిల్ యూనివర్సిటీలో 25 శాతం సీట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. విదేశీ విద్యా సహాయ నిధిని ఏర్పాటు చేసి వైశ్య విద్యార్థులకు తోడ్పాటు అందించాలన్నారు. ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(ఆవోప), ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి(ఏసీపీఎస్) సంపూర్ణ మద్దతు తెలపడం అభినందనీయమన్నారు. వేదిక ప్రతినిధులు ఈశ్వరయ్య, ఉపేందర్, నాగేందర్, నాగరాజు, స్రవంతి, సతీష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'ముస్లింలే లక్ష్యంగా బీజేపీ దాడులు'

**హిమాయత్‌నగర్:** ముస్లింలే లక్ష్యంగా దాడులకు పాల్పడుతూ హిందూ, ముస్లింల విద్వేషాలు రెచ్చగొట్టి బీజేపీ రాజకీయ పబ్బం గడుపుకుంటోందని ఆలిండియా ఆజాద్ కాంగ్రెస్ పార్టీ(ఏఏసీపీ) వ్యవస్థాపక అధ్యక్షురాలు షహనాజ్ తబస్సుమ్ ఆరోపించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీకి అధికారం చేజిక్కిన తర్వాత ముస్లింలకు వ్యతిరేకంగా చట్టాలను తీసుకొచ్చారని ఆరోపించారు. ముఖ్యంగా ముస్లింలను అణిచివేతగానే బీజేపీ పని చేస్తోందని చెప్పారు. ఏఐఏసీపీ 2014లో రిజిస్టర్ అయ్యిందని, వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. మైనార్టీల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఆలిండియా ఆజాద్ కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందన్నారు. ఏఐఏసీపీ జాతీయ సెక్రటరీ అదిల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి వై.సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి అకేపోగు ప్రమోద్ మహారాజ్, రాష్ట్ర యూత్ అధ్యక్షులు వాషిక్ నుమాన్ అజాద్, అధికార ప్రతినిధి సయ్యద్ వాలీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీసీ అభ్యర్థిని నిలబెట్టాలి

– బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్


బీసీ సంఘాల నేతలతో బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్

**బంజారాహిల్స్:** రాష్ట్రంలో ప్రస్తుతం ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయ వ్యవస్థగా బీసీవై(భారత చైతన్య యోజన) పార్టీ రూపాంతరం చెందనుందని బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని సాగర్ సొసైటీలో బీసీవై పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీసీలను అడ్డం పెట్టుకొని పార్టీలు పబ్బం గడుపుకుంటున్నాయని, నియంత కుటుంబం నుంచి వచ్చిన వారు బీసీల కోసం ఉద్యమం చేయడం సిగ్గు చేటన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీసీ అభ్యర్థిని ఆయా పార్టీలు నిలబెట్టకపోతే బీసీవై పార్టీ ఖచ్చితంగా పోటీలోకి దిగుతుందని, ఒక వేళ ఇతర పార్టీలు బీసీ అభ్యర్థులను నిలబెడితే వారికి మద్దతు ఇస్తామన్నారు. రాష్ట్రంలో అణిచివేతకు గురైన అన్ని వర్గాలను కలుపుకొని పోవడమే బీసీవై పార్టీ లక్ష్యమని ఆయన అన్నారు.

## 'సనాతన అవతార్' పుస్తక ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డా.దినేష్ షహ్రా, ప్రదీప్ చౌదరి, సుశీల్ గొయాంక

**హిమాయత్‌నగర్:** సనాతన్ అవతార్ ఆవిష్కరణ కేవలం ఒక పుస్తకం ఆవిష్కరణ కాదని, ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చే ఆధ్యాత్మిక వారసత్వం వేడుక అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక విలువలతో పాటు ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ జీ జీవితానికి 'సనాతన అవతార్' పుస్తకం అద్దం పడుతుందన్నారు. ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ తెలంగాణ, దినేశ్ షహ్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ సర్దార్ పటేల్ ఆడిటోరియంలో ముంబైకి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ దినేష్ షహ్రా రచించిన 'సనాతన అవతార్' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా ఫ్రీడమ్ ఆయిల్ డైరెక్టర్ ప్రదీప్ చౌదరి, పారిశ్రామికవేత్త సుశీల్ గోయాంక హాజరై ఆవిష్కరించారు. ముందుగా రవిశంకర్ జీ చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అతిథులను ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్లు రవికుమార్ రావు, సంతోష్ రావు, భామిని రావు ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన 'శ్రావణ సత్సంగ్' కార్యక్రమానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు పెద్దఎత్తున హాజరయ్యారు. అతిథులు మాట్లాడుతూ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ఒత్తిడి లేని, హింస లేని జీవనానికి ప్రపంచ ఉద్యమంగా కొనసాగుతోందన్నారు. ఈ పుస్తకం కేవలం జీవిత చరిత్ర కాదని, ఇది అన్వేషకుడి హృదయం నుండి వచ్చిన సమర్పణ అన్నారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు కృష్ణ మూర్తి, ఎస్.ఆనంద్, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

## నిమ్స్‌లో ఉద్యోగ విమరణ

ఘనంగా సన్మానించిన డైరెక్టర్



**లక్డీకాపూల్:** నిమ్స్ ఉద్యోగులు పలువురు గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో వారిని డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప ఘనంగా సత్కరించి, ఆస్పత్రి అభివృద్ధికి వారు చేసిన సేవలను కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో యూరాలజీ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డా.సీహెచ్. రాంరెడ్డి, సీనియర్ సెక్రటేరియల్ అసిస్టెంట్ నసీమ్ భాను, సీనియర్ ఏఎస్ఎమ్ వలియబీ షేక్ ఉన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ప్రొ.శాంతివీర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు దయాకర్, సుజాత, ఏఎన్ జ్యోతి శైలజ, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్, శ్రీనివాసులు, భరత్ భూషణ్, మార్తా రమేష్, శాంతి, వివిధ ఉద్యోగుల సంఘ నాయకులు, ఉద్యోగులు పాల్గొని సత్కరించారు.

## ఏసీఈ–2025 అవార్డును అందుకున్న ఓయూ వీసీ

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ వీసీ ప్రొ.కుమార్ ఏసీఈ–2025 అవార్డును అందుకున్నారు. గురువారం గురుగ్రామ్‌లో జరిగిన ఆల్ ఇండియా సర్క్యులర్ ఎకానమి నిర్వహించిన కార్యక్రమంలో ఉన్నత విద్యలో ప్రమాణాలకు గాను అవార్డు లభించినట్లు ఓయూ అధికారులు తెలిపారు. ప్రతి రోజు 2 టన్నుల వ్యర్థాలతో బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి కాలుష్య రహితంగా పచ్చదనాన్ని పెంపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.

## వెలగని వీధిలైట్లు

**అమీర్‌పేట:** సనత్‌నగర్ డివిజన్‌లోని ఈఎస్‌ఐ ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రోడ్డులో ఉన్న విద్యుత్ దీపాలు అలంకారప్రాయంగా మారాయి. నెల రోజుల నుండి లైట్లు వెలగక పోవడంతో వాహనచోదకులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈఎస్‌ఐ ఆసుపత్రి నుండి సూపర్ స్పెషాలిటి ఆసుపత్రికి రోడ్డులో కొద్ది చీకటి పడిదంటే చాలు ఈ మార్గంలో నడిచి వెళ్లలేని సరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

## ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలు తొలగిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

**ఫిలింనగర్:** ఫిలింనగర్‌లోని అపోలో జనరల్ ఆస్పత్రి లైన్‌లో సురుచి హోటల్ చౌరస్తా నుంచి దీన్ దయాళ్‌నగర్ ఏబీఎన్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ ఆక్రమణలను జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సమన్వయంతో గురువారం ఉదయం స్పెషల్ డ్రైవ్ చేపట్టి తొలగించారు. వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ పర్యవేక్షణలో జూబ్లీహిల్స్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ అదనపు ఇన్‌స్పెక్టర్ శేఖర్ ఈ ఆక్రమణలను జేసీబీలు, క్రేన్ సహాయంతో తొలగించారు. సురుచి చౌరస్తా నుంచి ఫిలింనగర్ దైవ సన్నిదానం గేటు మీదుగా ఏబీఎన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్, రోడ్డు ఆక్రమణలు ట్రాఫిక్‌కు అంతరాయంగా మారాయని, పాదచారులు ప్రమాదకరమైన రీతిలో నడవాల్సి వస్తోందని పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ట్రాఫిక్ పోలీసులు ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. సుమారు 60 ఫుట్‌పాత్ ఆక్రమణలు పూర్తిగా తొలగించి రోడ్డంతా క్లీన్ చేశారు. ఆక్రమణల తొలగింపుతో పాదచారులు, వాహనదారులకు మార్గం సుగమమైంది. ట్రాఫిక్ పోలీసుల చొరవను స్థానికులు అభినందించారు. మళ్లీ ఫుట్‌పాత్ ఆక్రమణ కాకుండా చూడాలని వాహనదారులు విజ్ఞప్తి చేశారు.



ఫిలింనగర్ అపోలో జనరల్ ఆస్పత్రి వైపు ఆక్రమణలు నేలమట్టం చేస్తున్న హైడ్రా సిబ్బంది

## బంజారాహిల్స్ పెద్దమ్మ గుడి కూల్చివేత వ్యవహారంపై ఫిర్యాదు


నగర అడిషనల్ కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్‌కు ఫిర్యాదు చేస్తున్న చింతల రామచంద్రారెడ్డి

**బంజారాహిల్స్:** బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12 లోని ఎమ్మెల్యే కాలనీలోని పెద్దమ్మ గుడి కూల్చివేత వ్యవహారంలో చర్యలు తీసుకోవాలని హిందూ ధార్మిక సంస్థలు విశ్వ హిందూ పరిషత్ బజరంగ్‌దళ్ ప్రతినిధులతో కలిసి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం నగర అడిషనల్ పోలీసు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్‌కు ఫిర్యాదు చేశారు. దేవాలయం కూల్చివేత జరిగిన అనంతరం ఘటన స్థలంలో అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన హిందువులపై పోలీసులు అన్యాయంగా కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేచినేని శ్రీనివాసరావు, హిందూ సంఘాల నాయకులు గిరిధర్, కుమారస్వామి, జీవన్, రామారావు, ముఖేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే దోమలకు చెక్


దోమల మందు పోయిస్తున్న ఉప కమిషనర్ రజినీకాంత్‌రెడ్డి

**వెంగళరావునగర్:** ప్రతి ఇంటి నివాసితులు తమ ఇళ్లలో దోమలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 ఉప కమిషనర్ రజినీకాంత్‌రెడ్డి అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని సిద్ధార్థనగర్‌కాలనీలో గురువారం ప్రజారోగ్యశాఖ సిబ్బందితో కలిసి పర్యటించారు. ఇందులో భాగంగా కాలనీలో పాదయాత్ర చేపట్టి కాలనీవాసులకు అవగాహన కల్పించారు. వానాకాలంలో దోమలు పెరగకుండా ఉండాలంటే ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిలిచే ప్రాంతాలు, డస్ట్ బిన్స్ ఏర్పాటు చేసుకున్న ఏరియాల్లో దోమల మందు పిచికారి చేయాలని సూచించారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో దోమల నివారణ మందులను పిచికారి చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట్‌కిషన్, ఎస్‌ఎఫ్‌ఏలు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రేమ్‌నగర్‌లో జీహెచ్‌ఎంసీ అధికారుల పర్యటన


ప్రేమ్‌నగర్ బస్తీవాసులకు అవగాహన కల్పిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

**బంజారాహిల్స్:** ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 అధికారులు, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది గురువారం బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా డీసీ సమ్మయ్యతో పాటు పారిశుద్ధ్య విభాగం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మహిళలకు అవగాహన కల్పిస్తూ చెత్తను రోడ్లపై పడవేయవద్దని, ఇంటికే వచ్చే స్వచ్ఛ ఆటోకు అందజేయాలని కోరారు. ఇష్టానుసారంగా చెత్తను బయటపడేయడం వల్ల అనారోగ్య సమస్యలు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, దీని వల్ల వైరల్ ఫీవర్స్ వ్యాప్తి చెందుతున్నాయని అన్నారు.

## రాడ్‌తో ఆటోడ్రైవర్‌పై దాడి

**సనత్‌నగర్:** గొడవపడుతున్న ఇద్దరు మహిళలను శాంతింపజేసిన పాపానికి ఓ మహిళ భర్త రాడ్‌తో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. మల్కాజిగిరి ఐఎన్‌నగర్ తుకారంగేట్‌కు చెందిన నేనావత్ రమేష్(25) ఆటో డ్రైవర్. ఈ నెల 29న మధ్యాహ్నం రమేష్ ఫతేనగర్‌లో ఉండే తన సోదరి పార్వతి ఇంటికి వచ్చాడు. అదే సమయంలో సోదరి పార్వతితో పొరుగున ఉండే శారద గొడవ పడటంతో పాటు కొట్టడం చూశాడు. దీంతో ఇరువురికి సర్దిచెప్పి వారిని శాంతింపజేశాడు. అయితే రమేష్‌పై శారద భర్త స్టీల్‌రాడ్‌తో దాడి చేశాడు. వెంటనే అతన్ని సమీపంలోని ఆస్పత్రికి తరలించగా తలపై ఏడు కుట్లు పడ్డాయి. తనపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## ఉత్సాహంగా 'గ్రామపంచాయతీ–ప్రజాస్వామ్యం'

జేబీఎస్ విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు



'గ్రామపంచాయతీ–ప్రజాస్వామ్యం' అమలు తీరును చూపిస్తున్న చిన్నారులు

**ఫిలింనగర్:** జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం 'గ్రామపంచాయతీ –ప్రజాస్వామ్యం అమలు' పేరిట ఉత్సాహభరితమైన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదో తరగతి విద్యార్థులకు స్థానిక స్వపరిపాలనలో ఆచరణాత్మక అనుభవాన్ని అందించడమే ముఖ్య ఉద్దేశ్యంగా కార్యక్రమం కొనసాగింది. 2గంటల సమయంలో పంచాయతీ వ్యవస్థ గురించి చేసిన అనుకరణ జీవం పోసినట్లుగా సాగింది. నామినేషన్లు, ప్రచారం నుంచి బ్యాలెట్ బాక్స్ ఓటింగ్, పంచాయతీ ఏర్పాటు వరకు ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి దశను కవర్ చేశారు. విద్యార్థులు సర్పంచ్, వార్డు సభ్యులు,గ్రామస్తులు, ఎన్నికల కమిషనర్ వంటి పాత్రలు పోషించారు. పారిశుద్ధ్య, మౌలిక సదపాయాలు, మహిళా సాధికారతపై చర్చల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఎన్నికలు, ఓటరు విద్య, ప్రత్యక్ష ఓటింగ్ సెషన్, పంచాయతీరాజ్ రోల్–ప్లే సమావేశం ప్రధానంగా నిర్వహించారు. పాఠశాల ప్రెసిడెంట్ మురళీముకుంద్ కార్యక్రమాన్ని వీక్షించి చిన్నారుల అపూర్వ ప్రతిభ, ప్రదర్శనలను అభినందించారు. నాయకులు నిజాయితీగా ఉండాలని, వారి హోదాలకు న్యాయం చేయాలని, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలన్నారు. ప్రభుత్వం సజావుగా పనిచేయడానికి పౌర సంస్థలను చూసుకోవాలన్నారు. సర్పంచ్, అతడి బృందం సమాజానికి సేవ చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ ఇచ్చిన సందేశంతో కార్యక్రమం ముగిసింది.

## 'ఐఎస్‌బీ'లో మరో కోర్సుకు శ్రీకారం

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో నూతనంగా మరో కోర్సుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు వ్యాపార నిర్వహణలో కొత్త కోర్సును ప్రారంభించారు. కెరీర్ నిపుణులు, ఉద్భవిస్తున్న వ్యాపార నాయకుల కోసం ఈ కోర్సును రూపొందించినట్లు వర్సిటీ అధికార వర్గాలు వెల్లడించాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచ వ్యాపార దృశ్యాన్ని అంచనా వేయడానికి అవసరమైన వ్యూహాత్మక అంతర్‌దృష్టి, నైపుణ్యాన్ని అందించడమే దీని లక్ష్యమని ఐఎస్‌బీ ఎడ్యుకేషన్ అండ్ డిజిటల్ లెర్నింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్ సూద్ అన్నారు. అన్ని రంగాల్లో మేనేజర్లు, వ్యవస్థాపకులు, కన్సల్టెంట్లు, డొమైన్ నిపుణుల కోసం ఈ ప్రత్యేక కోర్సు రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ కోర్సు మొదటి కోహార్ట్ సెప్టెంబర్ 28న ప్రారంభం అవుతుందని, 31 వారాల ఆన్‌లైన్ అభ్యాసం, ఐఎస్‌బీ క్యాంపస్‌లో రెండు రోజులపాటు నిర్వహించే అంశాల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

## ట్రిపుల్ ఐటీలో 'ఫ్యాబ్ ల్యాబ్' ఏర్పాటు



ఫ్యాబ్ ల్యాబ్‌ను ప్రారంభించిన ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్

రాయదుర్గం: ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో కొత్తగా 'మైక్రో ఫ్యాబ్రికేషన్ అండ్ సెమీ కండక్టర్ క్యారెక్టరైజేషన్ ఫ్యాబ్ ల్యాబ్'ను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌ను గురువారం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్, పీయూఆర్ఎస్ఈ(పర్స్) గ్రాంట్ కోఆర్డినేటర్ డాక్టర్ అఫ్తాబ్ హుస్సేన్ సమక్షంలో ప్రారంభించారు. ఆరోగ్య సంరక్షణ అప్లికేషన్లపై దృష్టి సారించిన బయోసెన్సర్లు, బయోయాక్చుయేటర్ల అభివృద్ధి కోసం ప్రమోషన్ ఆఫ్ యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ సైంటిఫిక్ ఎక్స్‌లెన్స్ (పీయూఆర్ఎస్ఈ) పథకం కింద కేంద్ర శాస్త్ర, సాంకేతికత శాఖ మద్దతుతో ఈ 'ఫ్యాబ్ ల్యాబ్' రూపుదిద్దుకుంది. ల్యాబ్‌ను పరిశీలించి కోఆర్డినేటర్, ఇతర ఫ్యాకల్టీ ప్రతినిధులు, పరిశోధక విద్యార్థులను డైరెక్టర్ అభినందించారు. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ కోసం 'పర్స్' గ్రాంట్ అత్యాధునిక సౌకర్యంతో మెటీరియల్ సైన్స్ అండ్ వీఎల్ఎస్ఐ పరిశోధనలకు ఒక ప్రధాన ప్రోత్సాహకంగా ఉంటుందని డాక్టర్ అఫ్తాబ్ హుస్సేన్ అన్నారు. సెమీ కండక్టర్ ఫ్యాబ్రికేషన్, క్యారెక్టరైజేషన్ డొమైన్‌లో నైపుణ్యం కలిగిన మానవశక్తికి శిక్షణ ఇవ్వడం దీని లక్ష్యాలలో ఒకటి అని అన్నారు.

## లాలాగూడ క్యారేజి వర్క్‌షాపు పరిశీలన



సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ గురువారం లాలాగూడలోని క్యారేజి వర్క్‌షాప్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు క్యారేజి వర్క్‌షాప్ ఇంజనీర్ డాక్టర్ అమిత్ గుప్త, లాలాగూడ క్యారేజి వర్క్‌షాప్ మేనేజర్ జి.సుమన, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. జనరల్ మేనేజర్ క్యారేజి వర్క్‌షాప్‌ను సమగ్రంగా తనిఖీ చేశారు. సెంటర్ బఫర్ కప్లర్(సీబీసీ) షాప్, స్ప్రింగ్ షాప్, ఎయిర్‌బ్రేక్ షాప్, ఎల్‌హెచ్‌బీ బోగీ షాప్‌లను ఆయన పరిశీలించారు. వర్క్‌షాప్ చేపట్టిన వివిధ కొత్త ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో చర్చించారు. వర్క్‌షాప్ సాధించిన విజయాలు, వర్క్‌షాప్ లేఅవుట్, ప్రస్తుత కార్యకలాపాలపై మేనేజర్ సుమన వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది పనితీరును జీఎం అభినందించారు.

### నగరంలో నేడు

- సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

# కుప్పలు తెప్పలు.. జనం తిప్పలు

- పేరుకుపోతున్న ఘన, బయో, నిర్మాణ, ఈ-వేస్ట్
- రోజుకు 60.3 కోట్ల లీటర్ల కలుషిత జలాల విడుదల
- 11,522 టన్నుల ఘన, 1,300 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సైతం..
- ఏటా 74,339 టన్నుల ఈ- వేస్ట్ పారబోత
- కాలుష్య నియంత్రణ మండలి గణాంకాల వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో ఎక్కడ చూసినా వ్యర్థాలు కుప్పలుతెప్పలుగా పేరుకుపోతున్నాయి. ఎలక్ట్రానిక్ వేస్ట్‌తోపాటు ఘన, బయో, నిర్మాణ, ప్లాస్టిక్ వ్యర్థాలు విపరీతంగా పోగవుతున్నాయి. జీవరాశులకు ప్రాణాధారమైన గాలి, నీరు, భూమిని కలుషితం చేస్తున్నాయి. మానవాళితో పాటు సకల జీవరాశుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. రాష్ట్రంలో ఏటేటా పరిశ్రమల నుంచి వ్యర్థాల విడుదల గణనీయంగా ఉందనే విషయాన్ని కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయితే వ్యర్థాల నియంత్రణ, నిర్వహణ, శుద్ధి చేయాల్సిన పీసీబీకి ప్రభుత్వం ఒక్క రూపాయి నిధులను కూడా కేటాయించకపోవడం గమనార్హం. 2014–15 సంవత్సరం నుంచి ప్రభుత్వం పీసీబీకి నిధులు, గ్రాంట్లను కేటాయించడం లేదు. కేవలం ఆపరేషన్, రెన్యూవల్ కన్సెంట్ రూపంలో ఆసుపత్రులు, పరిశ్రమలు చెల్లించే ఫీజులే పీసీబీకి ఆదాయం వనరులుగా మారాయి.

### పరిశ్రమల నుంచి కలుషిత జలాలు..

రాష్ట్రంలో పరిశ్రమలను రెడ్, ఆరెంజ్, గ్రీన్, వైట్ అనే నాలుగు కేటగిరీలుగా విభజించారు. ఇందులో రెడ్ కేటగిరీ అత్యంత హానికారక పరిశ్రమల కిందికి వస్తుంది. రాష్ట్రంలో 3,838 రెడ్ కేటగిరీ పరిశ్రమలు ఉన్నాయి. 4,330 ఆరెంజ్, 1,332 గ్రీన్, 2,692 వైట్ కేటగిరీ పరిశ్రమలు ఉన్నాయి. 2,193 పరిశ్రమలు రోజుకు 60.3 కోట్ల లీటర్ల కలుషిత జలాలను విడుదల చేస్తున్నాయి. ఈ వ్యర్థాలు నీరు చెరువులు, కాలువలు, పంట పొలాలు, భూగర్భంలోకి ఇంకుతున్నాయి. 3,024 పరిశ్రమలు ఏటా 3.17 లక్షల టన్నుల ప్రమాదకర వ్యర్థాలను విడుదల చేస్తున్నాయి. ఇందులో 94,131 టన్నులు పునర్వినియోగించదగిన వ్యర్థాలు కాగా.. 2,085 టన్నులు దహనం చేయగల వ్యర్థాలు, 1,10,930 టన్నులు కో-ప్రాసెసింగ్, 1,09,943 టన్నులు భూమిలో నింపే వ్యర్థాలు.

### ఘన వ్యర్థాలూ ఘనమే..

రోజుకు 11,522 టన్నుల ఘన వ్యర్థాలు విడుదలవుతున్నాయి. ఇందులో జీహెచ్ఎంసీ పరిధిలో 7,206 టన్నులు కాగా.. 4,316 టన్నులు మున్సిపాలిటీ, పంచాయతీల నుంచి విడుదల అవుతున్నాయి. రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ కేంద్రాల నుంచి శుద్ధి చేయని బయో మెడికల్ వ్యర్థాలు విడుదల కావడం లేదు. ఇతర వ్యర్థాల మిశ్రమంతో బయో వేస్ట్ విడుదల అవుతున్నాయి. 10,292 ఆరోగ్య సంరక్షణ కేంద్రాల నుంచి రోజుకు 26,316 కిలోల బయో మెడికల్ వేస్ట్ విడుదల అవుతోంది. ఇందులో 17,184 కిలోలు దహించలేని బయో మెడికల్ వేస్ట్ కాగా.. 9,132 కిలోలు ఆటో క్లేవ్ వ్యర్థాలు.

### ఈ-వేస్ట్..

కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు వంటి ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల వ్యర్థాలు కూడా గణనీయంగా పేరుకుపోతున్నాయి. రాష్ట్రంలో ఏటా 74,339 టన్నుల ఈ-వేస్ట్ విడుదలవుతోంది. 31 ఈ-వేస్ట్ కేంద్రాల్లో ఏటా 1,83,668 టన్నుల ఈ-వేస్ట్ శుద్ధి అవుతోంది. రాష్ట్రంలో రోజుకు 2,255 టన్నుల నిర్మాణ వ్యర్థాలు విడుదల అవుతున్నాయి. ఇందులో జీహెచ్ఎంసీ పరిధిలో 1,763 టన్నులు, మున్సిపాలిటీ, పంచాయతీల్లో 492 టన్నుల వ్యర్థాలు ఉన్నాయి. జీడిమెట్ల, ఫతుల్‌గూడ, శామీర్‌పేట, శంషాబాద్‌లో వ్యర్థాల శుద్ధి కేంద్రాలు ఉన్నాయి. ఏటా వీటి సామర్థ్యం 2 వేల టన్నులు. రాష్ట్రంలో 251 ప్లాస్టిక్ తయారీ కేంద్రాలు నమోదయ్యాయి. వీటి నుంచి రోజుకు 1,300 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాల విడుదల అవుతుండగా.. 900 టన్నులు మాత్రమే ప్రాసెస్ అవుతోంది.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

– మంత్రి వివేక్‌వెంకట స్వామి



కార్మికనగర్‌లో పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న మంత్రి వివేక్

రహమత్‌నగర్: అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో సుమారు కోటి రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా భారం అయినప్పటికీ ఆరు గ్యారంటీలను అమలు పరుస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాసమస్యలను గాలికి వదిలి కమీషన్ల కోసం కక్కుర్తి పడి కోట్లాది రూపాయల ప్రజాధనం దారి మళ్లించిందని ఆరోపించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలపై దృష్టి సారించామని, ఇందులో భాగంగానే రూ.కోటి నిధులతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సీఎన్‌రెడ్డి, బాబా ఫసియుద్దీన్, జీహెచ్ఎంసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రి వివేక్ కార్మికనగర్ కూడలిలో ఉన్న బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

**సంతలో పర్యటించి... బజ్జీలు తినిపించి..**

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి వివేక్ కార్మికనగర్ సంతలో పర్యటించారు. వ్యాపారులతో మాట్లాడుతూ విక్రయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికంగా ఉన్న మిర్చి బండి వద్ద డబ్బులు చెల్లించి స్థానిక నాయకులతోపాటు తాను కూడా బజ్జీలు తిన్నారు.

# విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట



ఉత్తమ విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

– శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్

మైలార్‌దేవ్‌పల్లి: యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కాటేదాన్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో సీఎస్ఎం, టీఎస్ఎస్‌వో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ విద్యార్థి అభినందనసభలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది తెలంగాణ బడ్జెట్‌లో ప్రత్యేకంగా ఏడు శాతం (రూ.21 వేల 292 కోట్లు) నిధులు కేటాయించారన్నారు. అమ్మ ఆదర్శ పథకం ద్వారా పాఠశాలలో సౌకర్యాలు మెరుగుపరిచారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా పదివేల మంది ఉపాధ్యాయులను, ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల్లో నూతన అధ్యాపకులను నియమించిందని పేర్కొన్నారు. అన్ని యూనివర్సిటీలకు వీసీలను నియమించిందని అన్నారు. ఆధునిక, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దటానికి టాటా గ్రూప్ సహకారంతో ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీలతో మెరుగుపరుస్తోందని వెల్లడించారు. ముఖ్యమంత్రితోపాటు ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పెద్ద మొత్తంలో రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకువస్తున్నారని, ఈ పరిశ్రమలు ఏర్పాటుతో లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని అన్నారు. ఆడపిల్లలు చదువుతోపాటు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ సీఎస్ఎం ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు 5 వేల రూపాయల చొప్పున అందిస్తున్న సానెం శ్రీనివాస్‌గౌడ్‌ను అభినందించారు. స్పీకర్‌తో కలిసి ఉత్తమ విద్యార్థులకు మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్‌లోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపకార వేతన ఆధారిత విద్యతోనే సాధికారత

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి



మాట్లాడుతున్న అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్: ఉపకారవేతన ఆధారిత విద్యాభ్యాసంతోనే ప్రతి విద్యార్థికి సాధికారత లభిస్తుందని అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి అన్నారు. చదువుతోపాటు నైపుణ్యాన్ని పెంపొందిస్తూ స్టైపెండ్ అందిస్తూ వారి కాళ్లపై వారే నిలబడే విధంగా యూనివర్సిటీ రిటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ విద్యార్థులకు స్టైపెండ్ నెలకు కనీసంగా రూ.7 వేల నుంచి గరిష్టంగా రూ.24 వేల వరకు వారి నైపుణ్యాన్ని బట్టి అంతకంటే ఎక్కువ సంపాదించుకునే అవకాశం ఉందన్నారు. ప్రతి విద్యార్థికి చదువుతోపాటు స్కిల్స్ పెంపొందించడం, ఉద్యోగ అవకాశం కల్పించడం, వ్యాపారవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యమని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రానున్న రోజుల్లో ప్రఖ్యాత సంస్థలతో మరిన్ని ఉద్యోగ మేళాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల్లో సరికొత్త ఆవిష్కరణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ద్వారా వారిలో ఆర్థిక సామర్థ్యాన్ని పెంపొందించవచ్చని వివరించారు. టి-హబ్‌తో అంబేడ్కర్ వర్సిటీ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుందని గుర్తుచేశారు. వ్యూహాత్మక నైపుణ్య సహకారాలను అందించే భాగస్వామ్యాలతో స్వామి రామానందతీర్థ రూరల్ ఇనిస్టిట్యూట్ ద్వారా గ్రామీణ, గిరిజన విద్యార్థులకు స్వల్పకాలిక వృత్తి విద్యా కోర్సులను అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో రిటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నాణ్యత పరిశోధన విభాగాధిపతి సమీర్, చందా వడ్డే, అకాడమిక్ డైరెక్టర్ పుష్పాచక్రపాణి, రిజిస్ట్రార్ ఎల్.విజయకృష్ణారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, రవీంద్రనాథ్ సోలమన్, పల్లవీ కాబ్డే, వడ్డాణం శ్రీనివాస్, వై.వెంకటేశ్వర్లు, దయాకర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



ఉప్పల్‌లో పర్యటిస్తున్న సీపీ సుధీర్‌బాబు, ఏసీపీ చక్రపాణి తదితరులు

ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన రాచకొండ సీపీ

ఉప్పల్: ఉప్పల్‌లో మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం రాచకొండ సీపీ సుధీర్ బాబు సందర్శించారు. స్టేషన్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణికి సూచించారు. ఆలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని, అవసరమైతే మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉప్పల్ అమ్మవారి గుడి ప్రాంతాలను కలియతిరిగి పరిశీలించారు. ఫలహారం బండ్ల ఊరేగింపు వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు.

# ఇస్తే తీసుకుంటాం.. లేదంటే గుంజుకుంటాం



బీసీ కార్యాచరణ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

బీసీల 42 శాతం రిజర్వేషన్లపై తీన్మార్ మల్లన్న

పోచారం: సమాజంలో బీసీలతోపాటు అగ్రవర్ణ పేదలకు కూడా అన్యాయం జరుగుతోందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. బీసీల వాటా బీసీలకు ఇస్తే తీసుకుంటామని, లేదంటే గుంజుకుంటామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అంటూ.. ఇదే అంశం చుట్టూ బతుకమ్మ ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. గురువారం కొర్రెముల్‌లోని జేకే కన్వెన్షన్‌లో బీసీ పొలిటికల్ జేఏసీ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ సూదగాని హరిశంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన 'బీసీ రాజ్యాధికార సాధనకు కార్యాచరణ సమావేశం'లో తీన్మార్ మల్లన్న మాట్లాడారు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో రాజ్యాధికారంలో బీసీలకు రావాల్సిన వాటాపై చర్చ సాగుతోందన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా కేవలం రాజ్యాధికారం కోసం బీసీ ఉద్యమం నడుస్తోందని పేర్కొన్నారు. అన్ని సంస్థల్లో వినిపిస్తున్న బీసీ నినాదం సింగరేణికి కూడా పాకిందన్నారు. రాజకీయ పార్టీల్లో బీసీ సెల్ ఉంటే, త్వరలో రాబోయే బీసీ పార్టీలో ఓసీ సెల్ ఉంటుందని చెప్పారు. బీసీల అభివృద్ధి కోసం పాటుపడినవారి కాళ్లు కడిగి నెత్తిన చల్లుకుంటామని ప్రశంసిస్తూనే.. వ్యతిరేకంగా పనిచేసిన వారిని తరిమి కొడతామని అన్నారు.

**22 టోల్ గేట్ల వద్ద బైఠాయిస్తాం**

బీసీలకు అన్యాయం జరిగితే రాష్ట్రంలోని 22 టోల్ గేట్స్ వద్ద బైఠాయిస్తామని తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. ఈ రాజకీయ పార్టీలు బీసీలకు కిరాయి ఇళ్ల వంటివని అన్నారు. 2026లో వచ్చే మహిళా బిల్లులో బీసీ మహిళలకు ఏవిధంగా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో బీసీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, తినబోతూ రుచి ఎందుకన్నట్లు పార్టీ పేరును ఇప్పుడే చెప్పనని అన్నారు. సమావేశంలో ఉద్యమ నాయకులు వీజీఆర్ నారగోని, సూర్యారావు, నర్సయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు, రేపు స్వగృహ ఫ్లాట్లకు లాటరీ

– ఏర్పాట్లను పరిశీలించిన ఎండీ గౌతమ్

పోచారం: పోచారంలో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ నిర్మించిన సద్భావన టౌన్‌షిప్‌లో ఫ్లాట్లను కొనుగోలుదారులకు కేటాయించేందుకు శుక్ర, శనివారాల్లో లాటరీ తీస్తున్నారు. ఈ మేరకు సద్భావన టౌన్‌షిప్‌ను రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతమ్ గురువారం సాయంత్రం సందర్శించి లాటరీ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించారు. దరఖాస్తులు సమర్పించడానికి క్యూలైనులో నిలిచి ఉన్నవారితో ఆయన మాట్లాడారు. పూర్తి పారదర్శక విధానంలో, దరఖాస్తుదారులు అందరికీ సమాన అవకాశాలు ఉండేలా లాటరీ విధానంలో ఫ్లాట్లను కేటాయిస్తామని చెప్పారు. శుక్రవారం డబుల్ బెడ్ రూమ్, శనివారం సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లకు లాటరీ నిర్వహించనున్నట్లు తెలిపారు. లాటరీ ప్రక్రియను ఆన్‌లైన్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని, దరఖాస్తుదారులు చూసేందుకు వీలుగా ప్రాజెక్టు ప్రాంగణంలో ప్రత్యేక స్క్రీన్ ఏర్పాటు చేశామన్నారు.

## హెచ్‌పీఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి,సిటీ బ్యూరో: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతి ప్రవేశం నిమిత్తం షెడ్యూల్డ్ కులాల బాలబాలికలు నుంచి 2025–26 విద్యా సంవత్సరానికిగాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుడు యు.ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట్ – రామంతపూర్‌లో ఒకటో తరగతిలో ప్రవేశాల నిమిత్తం గిరిజన బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజనుల సంక్షేమ అధికారి ఆర్.కోటాజి మరొక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఇరువురు పేర్కొన్నారు.

## ఇరిసెట్‌ను సందర్శించిన రైల్వే అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: తార్నాకలోని ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్ అండ్ టెలికమ్యూనికేషన్స్(ఇరిసెట్)ను రైల్వే బోర్డు సభ్యులు (మౌలిక సదుపాయాలు), కేంద్ర ప్రభుత్వ ఎక్స్-అఫీషియో కార్యదర్శి నవీన్ గులాటి గురువారం సందర్శించారు. ఇరిసెట్‌తోపాటు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ చేపడుతున్న వివిధ కార్యకలాపాలను పరిశీలించారు. ఇరిసెట్ డైరెక్టర్ జనరల్ శరద్ కుమార్ శ్రీవాస్తవ, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రైల్వే బోర్డు సీనియర్ అధికారులైన అదనపు సభ్యులు(సిగ్నల్) విజయలక్ష్మి కౌశిక్, ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సౌరభ్ బందోపాధ్యాయ తదితరులు ఈ పర్యటనలో ఉన్నారు. వివిధ సిగ్నల్, టెలి కమ్యూనికేషన్ కార్యకలాపాలతోపాటు భారతీయ రైల్వేలలో కవచ్ అమలు తీరుపైన సమీక్షించారు.



# ఆ ఉద్యోగుల సేవలు మరువలేనివి

జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘుప్రసాద్




కోటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పురోగతిలో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సేవలు మరువలేనివని అడిషనల్ కమిషనర్(శానిటేషన్, హెల్త్) సీఎన్ రఘుప్రసాద్ అన్నారు. చీఫ్ ఇంజనీర్, సూపరింటెండింగ్ ఇంజనీర్‌సహా జీహెచ్ఎంసీలోని 18 మంది అధికారులు, ఉద్యోగులు గురువారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా వారికి ఏర్పాటు చేసిన ఆత్మీయ సత్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఉద్యోగికి తాను అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులందరూ తమ ఉద్యోగ జీవితంలో ఎంతో నిబద్ధత, అంకిత భావంతో సేవలందించారన్నారు. వారి కృషి, అందించిన సేవలు సహచర ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన వారిలో వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం(ఎస్ఎన్‌డీపీ) చీఫ్ ఇంజనీర్ ఎం.కోటేశ్వరరావు, సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.నరేందర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పి.రవీందర్, సూపరింటెండెంట్ బి.స్వామి తదితరులున్నారు.

# ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలి

– బక్కి వెంకటయ్య



పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొన్న బక్కి వెంకటయ్య తదితరులు

కీసర: ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం నాగారం మున్సిపల్ పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని కాలనీలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులకు భంగం కలిగినప్పుడు చట్టం ద్వారా బాధితులకు జరిగే న్యాయంపై అవగాహన కల్పించారు. అనంతరం ఇందిరా ప్రియదర్శిని కాలనీలో నెలకొన్న వివిధ సమస్యలను కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో మౌలిక వసతులు, అంగన్‌వాడీ కేంద్రం, బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డీసీపీ పద్మజ, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు బిట్ల వెంకటేశ్వర్లు, కాలనీవాసులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ ఉద్యోగులకు వెయిటేజీని విరమించుకోవాలి

బీఈడీ నిరుద్యోగ అభ్యర్థుల ఫోరం కన్వీనర్ కవిత డిమాండ్



సాక్షి,సిటీబ్యూరో: ఉపాధ్యాయ నియామకాల్లో కేజీబీవీ ఉద్యోగులకు వెయిటేజీ ప్రతిపాదన వెంటనే విరమించుకోవాలని బీఈడీ నిరుద్యోగ అభ్యర్థుల ఫోరం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లో ఫోరం కన్వీనర్ అయిలి కవిత విలేకరులతో మాట్లాడుతూ వెయిటేజీ ప్రతిపాదన నిబంధనలకు విరుద్ధమని, ఇది బీఈడీ అభ్యర్థులకు శాపంగా పరిణమించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేజీబీవీ ఉద్యోగులకు అవసరమైతే ఇతర మార్గాల ద్వారా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. వెయిటేజీ ప్రతిపాదన వల్ల పోస్టుల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో విద్యాశాఖ ప్రతిపాదించిన అంశాన్ని ప్రభుత్వం తిరస్కరించాలని డిమాండ్ చేశారు. వెయిటేజీ ప్రతిపాదన డీఎడ్, బీఈడీ నిరుద్యోగులలో తీవ్ర ఆందోళన లేపుతుందన్నారు. ఒక విభాగంలోని ఉద్యోగులకు ఇలా వెయిటేజీ ఇస్తే రాబోయే కాలంలో ఇతర విభాగాల్లోని కాంట్రాక్టు ఉద్యోగులు కూడా ఇదే విధంగానే డిమాండ్ చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. గతంలో పనిచేసిన విద్యా వాలంటరీలు, ప్రీ ప్రైమరీ టీచర్లు కూడా వెయిటేజీ ప్రకటించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. వెయిటేజీ అంశంపై పునరాలోచించి తక్షణమే ప్రభుత్వం ప్రతిపాదనను విరమించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన తప్పదని అన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, శుక్రవారం, 1, ఆగస్టు, 2025





## ఇదొక ఫుడ్ లవ్ స్టోరీ..

రీన్ ది చెఫ్స్ స్టూడియో వేదికగా బెంగాల్ 'ప్రీతిర్ కోతా'

- నగరంలోని ఫుడ్ లవర్స్‌కు విభిన్న రుచుల పరిచయం
- కలినరీ కల్చర్‌కు అద్భుత వేదిక హైదరాబాద్: ప్రముఖ చెఫ్ గౌరవ్ సిర్కార్

సాక్షి, సిటీబ్యూరో: నగర జీవన వైవిధ్యంలో విభిన్న సంస్కృతులకు చెందిన ఆహారం కూడా కీలక పాత్ర పోషిస్తుంది. దీనికి అనుగుణంగానే దేశంతో పాటు విభిన్న ప్రాంతాలకు చెందిన కాంటినెంటల్ డిషెస్ సైతం నగరంలో ఆదరణ పొందుతున్నాయి. ఇందులో భాగంగానే నగరంలోని లీలా-రీన్ ది చెఫ్స్ స్టూడియో బెంగాల్ ప్రెసిడెన్సీ కాలం నాటి వంటకాలకు ఆధునికతను జోడించి 'ప్రీతిర్ కోతా' రుచులను నగరవాసులకు చేరువ చేస్తున్నారు. ఈ చెఫ్స్ స్టూడియోలో ఆగస్టు 3వ తేదీ వరకు కొనసాగనున్న ఫుడ్ ఫెస్ట్‌లో ప్రముఖ చెఫ్ గౌరవ్ సిర్కార్.. ప్రీతిర్ కోతా ఫుడ్ పాప్-అప్‌తో అలరించనున్నారు.



### వంటకానికో కథ..

బెంగాల్ ఫుడ్‌కు నగరంలో ఇస్తున్న ఆదరణ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.. ఇందులో భాగంగానే ఇక్కడి బెంగాల్ ఫుడ్ లవర్స్‌కు సరికొత్త రుచులను పరిచయం చేయనున్నట్లు ప్రముఖ చెఫ్ గౌరవ్ సిర్కార్ తెలిపారు. బెంగాల్ గ్రామీణ ప్రాంతాల్లోని జాక్ ఫ్రూట్ కుడుములు మొదలు స్ట్రీట్ క్లాసిక్ ఫుడ్ భెట్కి, ప్రాన్ కబీరాజీ.. రాజ్-యుగ వంటకాలు స్టీమర్ డక్ కర్రీ, ఆల్‌టైమ్ ఫేవరెట్ ధోకర్‌దల్నా-రాధా బల్లవితో పాటు ఠాకూర్‌బరిర్ శుక్తో వంటి విభిన్న రుచులను నగరంలో వండి వారుస్తున్నామని తెలిపారు. ది ఒబెరాయ్ సెంటర్ ఆఫ్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ పూర్వ విద్యార్థి అయిన చెఫ్ గౌరవ్ సిర్కార్.. న్యూఢిల్లీలోని ది ఒబెరాయ్ 'ఓమ్య', ది బాంబే క్యాంటీన్ వంటి ప్రముఖ సంస్థలతో తన కలినరీ అనుభవాన్ని విస్తరింపజేశారు. ప్రతి వంటకంతో ఒక కథ చెప్పడం అతని పాక శాస్త్ర వైవిధ్యం. ఈ పాప్-అప్ చారిత్రాత్మక కలయికలతో పాటు ప్రాంతీయ రుచులను సమకాలీన భోజన వినూత్నత్వాన్ని మిళితం చేస్తుంది.



## నీ స్నేహం.. ఓ సంబరం..

### ఫ్రెండ్ షిప్ డే వేడుకలకు నగరం సన్నద్ధం

కేఫ్స్ నుంచి ఎమ్యూజ్‌మెంట్ పార్క్స్ వరకూ రెడీ | మ్యూజిక్ బీట్స్‌తో వర్క్ షాప్స్‌లో సందడి | ఫేవరెట్ ప్లేస్‌లో మీట్ – ట్రీట్ అంటున్న ఫ్రెండ్స్ | అనుభూతిని పంచే జ్ఞాపకాల వేదికలు ముస్తాబు

కొంత కాలం కిందట బ్రహ్మ దేవుని ముంగిట.. రెండు ఆత్మలు కోరుకున్నవి ఓ వరం.. రూపురేఖలు వేరట.. ఊపిరొకటే చాలట.. ఆ వరాన్నే స్నేహమంటున్నాం మనం .. కంటిపాపను కాపు కాసే జంట రెప్పల కాపలాగా.. నిండు చెలిమికి నువ్వు నేను నీడ నివ్వాలి.. స్నేహమంటే రూపులేని ఊహ కాదని.. లోకమంతా నిన్ను నన్ను చూడగానే నమ్మి తీరాలి.. అని సిరివెన్నెల రచించిన పాట అందరికీ సుపరిచితమే.. అయితే ఇప్పుడు దీని గురించి ఎందుకు చెప్పుకోవాల్సి వచ్చిందంటే!.. అదే 'ఫ్రెండ్‌షిప్ డే'.. ఫ్రెండ్‌షిప్ డే అంటే కేవలం బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం లేదా ఇన్‌స్టాలో కథలు చెప్పడం మాత్రమే కాదు. నిజానికి, ఈ వేడుక రేపటి జ్ఞాపకాలుగా మారే అనుభవాలకు వేదిక. ట్రెడిషన్, ట్రెండ్‌ను మిళితం చేసే హ్యాపెనింగ్ సిటీ అయిన మన భాగ్య నగరంలో ఆ జ్ఞాపకాల సృష్టికి అనువైన ప్రదేశాలెన్నో.. అలాంటి కొన్ని ప్రదేశాలు, ఈవెంట్ల వివరాలు, అనువైన ప్రదేశాలను కోరుకునే ఫ్రెండ్‌షిప్ కోసం..

– సాక్షి, సిటీబ్యూరో



ప్రతి యేడాదిలానే ఈ యేడాది కూడా ఆగస్టు నెల్లో తొలి ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే జరుపుకోనున్నారు స్నేహితులు. ఇందుకు నగరంలో పలు వేదికలు సిద్ధమవుతున్నాయి. ఇది స్నేహితులతో రోజూ మాదిరి సరదాగా కాకుండా మరింత ప్రత్యేకంగా గడపడానికి సరైన సందర్భం.. అందుకు అనువైన ప్రదేశాలెన్నో నగరంలో వేదిక కానున్నాయి.

- ఫ్రెండ్స్.. జంతు ప్రేమికులైతే బంజారాహిల్స్‌లోని పెట్ కేఫ్ లాంటివి సరైన ఎంపిక. ఇక్కడ పిల్లులను కౌగిలించుకోవచ్చు, అందమైన శునకాలను పలకరించవచ్చు. ఇది స్నేహితుల రోజువారీ ఒత్తిడిని తగ్గించడానికి అనువైన ప్రదేశం.
- నగరంలో మొట్టమొదటి ఆర్ట్ థెరపీ స్పాట్ జూబ్లీహిల్స్‌లోని లైజుర్-ఆర్ట్ కేఫ్, లైజుర్ పెయింటింగ్, టఫ్టింగ్, కుండలు, టీ-షర్ట్ పెయింటింగ్, కొవ్వొత్తుల తయారీ లాంటివెన్నో అందిస్తుంది. కళాభిమానులైన స్నేహితులు ఆర్ట్ జామింగ్ లేదా సృజనాత్మక సెషన్‌లను ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు. బ్రష్‌స్ట్రోక్స్ లేదా టఫ్టింగ్ సెషన్ మధ్య కాఫీని ఆస్వాదించవచ్చు.
- జూబ్లీహిల్స్‌లోని బోర్డ్ కేఫ్‌లో స్క్రాబుల్ వంటి క్లాసికల నుంచి తంబోలా వంటి పార్టీ గేమ్‌ల వరకూ 700 కంటే ఎక్కువ గేమ్స్ ఉన్నాయి. ఆటలకు కొత్తవారైతే హోస్ట్‌ల ద్వారా సహాయం అందుకోవచ్చు. ఇక్కడ గంటల తరబడి నవ్వుతూ, స్నేహితులతో సరదా పోటీలతో గడపవచ్చు.
- జూబ్లీహిల్స్‌లోని బేస్ కాఫీ, పికిల్ బాల్ కేఫ్.. నగరంలో కొత్త జీవనశైలిలో ఒకటైన పికిల్ బాల్ కాఫీలని విలీనం చేస్తుంది. స్నేహితులు బాల్ గేమ్స్ ఆడవచ్చు, ఆ తరువాత కోల్డ్ బ్రూలు స్నాక్స్‌తో రీఛార్జ్ కావచ్చు.

### ప్రత్యేక కార్యక్రమాలు..

- కోకాపేట్‌లోని ది రాబిట్ లాంజ్‌లో ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా డీజే కిమ్, డీజే సినాయ్‌లు సందడి చేయనున్నారు. లిక్విడ్ డ్రమ్స్, సాక్సాఫోన్, దర్బూకా.. వంటి వెరైటీ సంగీత పరికరాలు ఆకట్టుకోనున్నాయి.
- నగర శివార్లలో ఉన్న ఎమ్యూజ్‌మెంట్ పార్క్స్‌లో ఫ్రెండ్‌షిప్ డే వినోదభరితంగా జరగనుంది. శని, ఆదివారాలు రెండు రోజులపాటు వేడుకలు ప్లాన్ చేశారు. వేవ్ పూల్ డీజే సెట్‌లు, ఫోమ్ పార్టీలు, ఇంటరాక్టివ్ గేమ్‌లు సూర్యాస్తమయం నుంచి రాత్రి వరకూ కొనసాగే నృత్యోత్సవాలను నిర్వహిస్తున్నారు.
- గచ్చిబౌలిలోని థర్డ్ వేవ్ కాఫీలో 'సొంత ఫ్రెండ్‌షిప్ డే బ్యాండ్స్ తయారు చేసుకోండి' పేరిట శనివారం వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి ఈ కార్యక్రమం ఉంటుంది.
- ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా హిప్-హాప్ పార్టీ విత్ జినీ లైవ్ ప్రోగ్రామ్‌ను సోమాజిగూడలోని ఆక్వా ది పార్క్‌లో ఆదివారం నిర్వహిస్తున్నారు. దీని కోసం మిజోరాంకు చెందిన ఆర్టిస్ట్ నగరానికి వస్తున్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి ఈ ప్రోగ్రామ్ ఉంటుంది.



- ప్రకృతిని, ప్రశాంతతను ఇష్టపడే ఫ్రెండ్స్ ప్రప్రథమ గార్డెన్ థీమ్డ్ అర్బన్ నెమో కేఫ్‌ని ఎంచుకోవచ్చు. ఇది పచ్చని మొక్కలతో రిలాక్స్‌డ్ ఓపెన్-ఎయిర్ సీటింగ్ బొటానికల్ డెకార్‌ను అందిస్తుంది. ఈ కేఫ్ ఫ్రెండ్‌షిప్ డే కార్యకలాపాలను ప్రత్యేకంగా నిర్వహించనప్పటికీ.. పచ్చదనంతో పాటు అల్లుకున్న ప్రశాంతత నిశ్శబ్దంగా ఫ్రెండ్‌షిప్ డేని ఆస్వాదించడానికి సరిపోతుంది.
- సృజనాత్మక కో-వర్కింగ్, వర్క్‌షాప్‌లు లేదా ఈవెంట్‌లతో కూడిన హైబ్రిడ్ స్పేస్ మిక్సింగ్ కేఫ్ ఛార్జీ. ఇక్కడ ఓపెన్ మైక్ నైట్స్, ఇండీ బ్రాండ్ పాప్-అప్‌లు, రైటింగ్ సర్కిల్స్, ఆర్ట్ వర్క్‌షాప్‌లు లేదా స్టాండ్-అప్ కామెడీని స్నేహితులతో కలిసి ఎంజాయ్ చేయవచ్చు.





## అతిగా చేస్తే.. ప్యాకైపోతారు..



శరీరాకృతిపై నేటి తరం యువతలో ఆసక్తి పెరుగుతోంది. అయితే ఇది ఓ క్రమ పద్ధతిలో చేస్తే లక్ష్యాన్ని సునాయాసంగా చేరుకోవచ్చు. ఇందుకు ఆహార అలవాట్లలోనూ అనేక జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. కానీ ఇవేవీ పాటించకుండా ఓవర్‌నైట్‌లో కండలు, సిక్స్ ప్యాక్స్ సొంతం చేసుకోవాలనే అపోహతో అతిగా సాధన చేస్తున్నారు. గంటల తరబడి బరువులు ఎత్తుతూ సొంతంగా అనర్థాలకు కారకులవుతున్నారని పలువురు జిమ్ ట్రైనర్స్, వైద్యులు చెబుతున్న మాట. ఇటీవల నగరంలో పలువురు అనారోగ్యానికి గురైన సంఘటనలే దీనికి నిదర్శనం. ఈ తరహా ప్రమాదాలు రెగ్యులర్‌గా జరుగుతున్నాయని, పరిస్థితి దెబ్బతిన్నతర్వాత తమను సంప్రదిస్తున్నారని వైద్యులు చెబుతున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

- శరీరాకృతిపై యువతలో పెరుగుతున్న క్రేజ్
- అవసరానికి మించి ఫిట్‌నెస్‌పై దృష్టి
- ఓవర్‌నైట్‌లో కండలు, ప్యాక్స్ కోసం కసరత్తు
- క్రమపద్ధతి పాటించాలంటున్న నిపుణులు
- ఆహార అలవాట్లలోనూ మార్పులు అవసరం
- సరైన జాగ్రత్తలతో లక్ష్యం చేరడం సులువు
- అతి అనర్థాలకు దారితీస్తుందంటున్న వైద్యులు

నగరంలో సుమారు 1.4 కోట్ల మంది జనాభా ఉన్నారు. ఉద్యోగం, వ్యాపారం, కుటుంబ ఒత్తిడులతో నిత్యం బిజీగా గడిపేస్తున్నారు. వీరిలోనూ ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ, కొన్ని ప్రయివేటు రంగ సంస్థల్లో పనిచేవారిలో ఎక్కువ మంది రోజుకు 8 నుంచి 9 గంటల పాటు కుర్చీలకే పరిమితమవుతున్నారు. ఈ కారణంగా శరీరాకృతిలో భారీగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఎక్కువ శారీరక శ్రమ లేకపోవడం ఒకెత్తయితే.. పని ఒత్తిడి, స్ట్రెస్ మరో ఎత్తు.. దీంతో తమ శరీరంలో పేరుకుపోయిన కేలరీలు తగ్గించుకునేందుకు వీలు చిక్కినప్పుడల్లా తమకు అందుబాటులో ఉన్న జిమ్ములు, పార్కులు, ఆట స్థలాల్లో తమకు తోచిన రీతిలో వ్యాయామాలు చేస్తున్నారు. కొందరైతే వీటికి ప్రత్యామ్నాయంగా ఆటలు, డ్యాన్స్ వంటి వాటిని సాధన చేస్తున్నారు.

### పొంచి ఉన్న ముప్పు..

క్రమ పద్ధతి పాటించకుండా అతిగా వ్యాయామం చేయడం, తగినంత విశ్రాంతి తీసుకోకపోవడం వల్ల తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. హార్మోన్ల సమతుల్యత దెబ్బతినడం, కండరాల్లో దీర్ఘకాలిక అలసట, నొప్పులు, రోగ నిరోధక శక్తి తగ్గిపోవడం, నీరసం, ఆందోళన, నిరుత్సాహం, శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు రావచ్చని నిపుణులు చెబుతున్నారు. రోజువారీ పనులు చేసుకోడానికి కూడా బద్ధకం అనిపిస్తుంది. కార్టిసాల్, టెస్టోస్టిరాన్ వంటి హార్మోన్ల పనితీరుపై ప్రభావం చూపిస్తుంది. నిద్రలేమి సమస్య తలెత్తుతుంది. శరీరానికి ఎక్కువ శ్రమ కలిగించడం వల్ల గుండె పనితీరుపై ప్రభావం చూపిస్తుంది. ఫలితంగా కార్డియాక్ అరెస్ట్‌కు దారితీయవచ్చు.. ఇటీవల తరచూ కనిపిస్తున్న కేసుల్లో 90 శాతం ఈ తరహా సమస్యలే ఎక్కువని, క్రీడలు, వ్యాయామం చేస్తుండగానే కుప్పకూలిపోతున్నారన్న విషయం తెలిసిందే..





### లైఫ్‌స్టైల్ మేనేజ్‌మెంట్ అవసరం..

లైఫ్‌స్టైల్ మేనేజ్‌మెంట్‌లో శరీరానికి విశ్రాంతి ఎంత అవసరమో.. వ్యాయామం, ఆహారపు అలవాట్లు అంతే అవసరం.. ఒక్కసారిగా సన్నబడిపోవాలని ఎక్కువగా జిమ్ చేయడం, అలసిపోయే వరకూ క్రీడల్లో పాల్గొనడం కార్డియాక్ అరెస్ట్‌కు కారణం కావచ్చు. ఆహారం తగ్గించి ప్రొటీన్ పౌడర్ తీసుకోవడం మంచిది కాదు. జిమ్, క్రీడా మైదానాల్లో ఇంప్లాంటబుల్ కార్డియో వర్టర్ డీఫిబ్రిలేటర్ (ఐసీడీ) అనే పరికరం వినియోగిస్తే గుండె లయను క్రమబద్ధీకరిస్తుంది. ఎయిర్ పోర్టు, మాల్స్‌లో ఏఈడీ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. గుండె ఆగిపోయినప్పుడు షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చే అవకాశం ఉంటుంది. ఇలాంటివి కమ్యూనిటీల్లోనూ అందుబాటులోకి తీసుకురావాలి. విద్యార్థి దశ నుంచే సీపీఆర్‌పై శిక్షణ ఇస్తే అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ భార్గవి, కార్డియాలజిస్ట్, రెయిన్‌బో హార్ట్ ఇన్‌స్టిట్యూట్



## నేడు ఫ్యూజన్ ఈస్ట్ మీట్స్ వెస్ట్..

- నగరంలో అరుదైన నృత్య ప్రదర్శన
- న్యూయార్క్ బ్యాలీ, తెలంగాణ పేరిణీ సమ్మిళిత నృత్య ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: సంప్రదాయానికి ఆధునికతను మేళవించిన అరుదైన నృత్య ప్రదర్శన 'ఫ్యూజన్ ఈస్ట్ మీట్స్ వెస్ట్' శుక్రవారం సాయంత్రం 7.15 గంటలకు నగరంలోని రవీంద్రభారతిలో జరుగనుంది. ఈ ప్రదర్శనలో న్యూయార్క్ నగరానికి చెందిన ప్రసిద్ధ బ్యాలీ నర్తకి టేలర్ గోర్డన్, డ్యాన్సర్స్ నికీ, డొమినిక్‌తో పాటు, స్టెప్స్ డాన్స్ స్టూడియో ఆర్టిస్టిక్ డైరెక్టర్ పృథ్వీరాజ్ రామస్వామి, తెలంగాణకి చెందిన పేరిణీ నర్తకులు పాల్గొనున్నారు.

### ఈస్ట్ – వెస్ట్ సాంస్కృతిక వైవిధ్యంతో..

ఈ కార్యక్రమం ఈస్ట్, వెస్ట్ నృత్య శైలి కలయికగా నిలువనుంది. ఈ సందర్భంగా టేలర్ గోర్డన్ మాట్లాడుతూ.. 'ఇది కేవలం ప్రదర్శన కాదు, సంస్కృతుల మధ్య ఓ సంభాషణ' అని అభిప్రాయపడ్డారు. పేరిణీ నర్తకులతో ఈ కలయిక తమకు ఎంతో నేర్పిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్, అమెరికన్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, కాన్సులేట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ రేబెకా డ్రామే హాజరుకానున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. సంప్రదాయ నృత్య కళల అభివృద్ధికి ఈవిధమైన కలయికలు ప్రేరణగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు.



## ఆసక్తికరంగా హెచ్‌ఆర్ కాన్‌క్లేవ్..




సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన కేఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో హెచ్‌ఆర్ కాన్‌క్లేవ్ కొండాపూర్ క్యాంపస్‌లో గురువారం జరిగింది. 'మారుతున్న ప్రపంచంలో భవిష్యత్తు ప్రతిభను తీర్చిదిద్దడం- హెచ్‌ఆర్ నాయకత్వం' అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. వేగంగా మారుతున్న వ్యాపార ప్రపంచంలో పని, సంస్కృతి, భవిష్యత్తు, నాయకత్వం, నైపుణ్యాభివృద్ధిపై ప్రభావవంతమైన చర్చల కోసం ప్రముఖ హెచ్‌ఆర్ నిపుణులను, నగర పారిశ్రామిక దార్శనికులను ఈ సదస్సు ఒకచోట చేర్చింది. కేఎల్ డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జీ.పార్థసారథి వర్మ ప్రారంభించిన ఈ కాన్‌క్లేవ్‌లో రమేష్ కాజా (స్టేట్ స్ట్రీట్), ఇమ్మాన్యుయేల్ గోసుల (ఇపామ్), అవినాష్ కుమార్ (టయోటా కిర్లోస్కర్ మోటార్), రచనా తారానాథ్ (మాస్‌మ్యూచువల్ ఇండియా), మీనాక్షి చిల్లర్ (మాడ్ మెడ్ ఇండియా), తేజస్విని శేషాద్రి (జెన్‌ప్యాక్ట్), జి.బాబ్జి (బ్రాడ్రిడ్జ్), శ్రీధర్ ములగడ (టీవీ9), గిరిమేఘన (మింటిఫై) వంటి ప్రముఖ వక్తలు పాల్గొని, తమ అనుభవాలను పంచుకున్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 1-8-2025


కుమార్తె సంయుక్తతో అముదవల్లి

చదువుకు వయసేమిటి? కష్టమైన మెడిసిన్ సీటు సాధించడంలో మనకు తక్కువేమిటి అనుకున్నారు 49 ఏళ్ల అముదవల్లి. తమిళనాడుకు చెందిన ఈ ఫిజియోథెరపిస్ట్ తన కుమార్తె సంయుక్తతో కలిసి నీట్ 2025 రాశారు. ఇద్దరికీ ర్యాంకు వచ్చింది. బుధవారం కౌన్సిలింగ్‌లో ఆమెకు సీటు ఖరారైంది. కూతురుతోపాటు మెడిసిన్ చదవబోతున్నందుకు చాలా ఉద్వేగంగా ఉందామె. పెళ్లి వల్ల చదువు ఆగిపోయిన తల్లులు అముదవల్లిని చూసి స్ఫూర్తి పొందాలి.

# తల్లీకూతుళ్లు.. ఒకేసారి మెడిసిన్

'వివాహం విద్యానాశాయ'... పెళ్లికాగానే చదువు అటకెక్కుతుందని, బాధ్యతలు తలకెక్కుతాయని పెద్దలంటారు. అదంతా అప్పటి మాట. ఇప్పుడు పెళ్లి తర్వాత కూడా విద్యను వృద్ధి చేయవచ్చు అని నిరూపించారు 49 ఏళ్ల అముదవల్లి. కూతురితో కలిసి, నీట్ పరీక్ష రాసిన ఆమె ఉత్తీర్ణత సాధించి చాలామంది అమ్మలకు స్ఫూర్తిగా నిలిచారు. ఒకేసారి తల్లీకూతుళ్లు నీట్ పరీక్ష రాయడం, ఇద్దరూ పాసవడం దేశంలో ఇదే తొలిసారి కావొచ్చు.

### ఎప్పటి నుంచో కల

తమిళనాడు తెన్‌కాశికి చెందిన అముదవల్లి వృత్తిరీత్యా ఫిజియోథెరపిస్ట్. భర్త లాయర్. మరో ఏడాదిలో ఆమె 50 ఏళ్ల వయసుకు చేరుకుంటారు. ఇన్నేళ్లు గడిచినా ఆమె మనసులో ఒక కోరిక మాత్రం తీరలేదు. అదే డాక్టర్ అవ్వడం. తెల్లకోటు వేసుకొని, చేతిలో స్టెతస్కోప్ పట్టుకొని, రోగుల్ని నవ్వుతూ పలకరించి, చల్లటి చికిత్స అందించే వైద్యురాలు కావాలన్నది ఆమె కల. కానీ ఆమె ఆర్థిక పరిస్థితి అందుకు సహకరించలేదు. దీంతో ఫిజియోథెరపీ కోర్సు చేసి, అందులోనే కొనసాగారు. ఆశ్చర్యంగా కూతురు సంయుక్త తనకు డాక్టర్ కావాలని ఉందని చెప్పినప్పుడు అముదవల్లి ఎంతో సంతోషపడ్డాను. తను నెరవేర్చుకోలేకపోయిన కోరిక కూతురు సాధించబోతోందని ఆనందపడ్డారు. అంతేనా? తన కూతురితోపాటు తను మాత్రం ఎందుకు సాధించకూడదు? ఆ వయసులో తనకు అడ్డుపడ్డ ఇబ్బందులు ఇవాళ లేవుగా? అందుకే కూతురుతోపాటు తనూ నీట్ పరీక్ష రాయాలని అనుకున్నారు.

> నేను చదివినప్పటికీ, ఇప్పటికీ సిలబస్‌లో చాలా మార్పులొచ్చాయి. అయినా నా కూతురి సాయంతో వాటిని చదివి, అర్థం చేసుకున్నాను. ఇద్దరం కలిసి వాటిని చర్చించి, చదువుకునేవాళ్లం. ఈ విషయంలో మా అమ్మాయే నాకు స్ఫూర్తి.
> - అముదవల్లి

### కష్టమైన లక్ష్యం

దేశవ్యాప్తంగా నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, ఆపై మెడికల్ సీటు పొందడం అంత సులభమైన విషయాలు కావు. చాలా శ్రమించాలి. గంటల తరబడి చదవాలి. రోజుల తరబడి చదువుకు అంకితమవ్వాలి. ఇంత చేసినా పాసవుతామన్న నమ్మకం లేదు. అయితే అముదవల్లికి కూతురు సంయుక్త తోడుగా నిలిచింది. స్ఫూర్తి నింపింది. తనతోపాటు తల్లి కూడా నీట్ పరీక్ష రాయడాన్ని ప్రోత్సహించింది. ఇద్దరూ కలిసి పరీక్షకు సిద్ధమయ్యారు.

అయితే అప్పటికి అముదవల్లి చదువు మానేసి చాలా ఏళ్లయ్యింది. కొత్త సిలబస్, సరికొత్త అంశాలు. అవన్నీ మళ్లీ చదవడం, వాటిని అర్థం చేసుకోవడం, గుర్తుపెట్టుకోవడం కష్టమైన పనులు. అయినా ఆమె విసుగు లేకుండా రోజూ సాధన చేసేవారు. తనకొచ్చే సందేహాలను కూతురిని అడిగి సమాధానాలు తెలుసుకునేవారు. 'నేను చదివినప్పటికీ, ఇప్పటికీ సిలబస్‌లో చాలా మార్పులొచ్చాయి. కొన్ని విషయాలు నాకు పూర్తిగా కొత్త. అయినా నా కూతురి సాయంతో వాటిని చదివి, అర్థం చేసుకున్నాను. ఇద్దరం కలిసి వాటిని చర్చించి, చదువుకునేవాళ్లం. ఈ విషయంలో మా అమ్మాయే నాకు స్ఫూర్తి' అని సంతోషంగా వివరిస్తున్నారు అముదవల్లి.

సంయుక్త కోచింగ్ సెంటర్‌కి వెళ్లి, అక్కడ శిక్షణ పొంది ఇంటికొచ్చి, ఆ పాఠాలు తల్లికి చెప్పేది. దీనివల్ల ఆ విషయాలు తనకూ బాగా తెలియడంతోపాటు తల్లికీ ఉపయోగకరంగా మారింది. 'మనం చదువుకున్నది మరొకరికి నేర్పితే, అది మనకు బాగా గుర్తుంటుంది. నేను నేర్చుకున్న టాపిక్స్ మా అమ్మకు నేర్పడం చాలా మంచిదైంది' అంటోంది సంయుక్త.

### సాధించిన ద్వయం

అముదవల్లి, సంయుక్త నీట్- 2025 పరీక్ష రాశారు. అముదవల్లి 147 మార్కులు సాధించగా, సంయుక్త 450 మార్కులు సాధించింది. జూలై 30న చెన్నైలో నీట్ కౌన్సిలింగ్‌కి ఇద్దరూ హాజరయ్యారు. దివ్యాంగుల కోటాలో అముదవల్లికి విరుదనగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్ రాగా, సంయుక్తకు ఇంకా కళాశాలను అలాట్ చేయలేదు. 'మా అమ్మతో కలిసి ఒకే కాలేజీ చదవాలని నాకు లేదు. ఆమె ప్రిపేర్ అవుతున్నప్పుడు అదొక్కటే నేను పెట్టిన షరతు' అని నవ్వింది సంయుక్త. ఇన్నేళ్ల తర్వాత తన తల్లి తన ఆశయాన్ని సాధించి, అనేకమందికి స్ఫూర్తిగా నిలవడం ఆనందంగా ఉందని అంటోంది.

ఫ్యాషన్
ఇండియన్ కొచర్ వీక్ 2025

# మెరిసిన మెటాలిక్

మెటాలిక్ కలర్, మిర్రర్ వర్క్ డ్రెస్‌లో నటి ఖుషీ కపూర్ హ్యుందయ్ ఇండియన్ కొచర్ వీక్‌లో మెరిసిపోయారు. డిజైనర్ రిమ్‌జిమ్ దాదు చేసిన ఈ మోడర్న్ డిజైన్స్‌కి గుజరాతీ సంచార జాతుల హస్తకళ ప్రేరణగా నిలిచింది. ఎవర్‌గ్రీన్‌గా నిలిచే కలర్స్‌కి తోడైన ప్రాచీన హస్తకళ అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.

ఆక్సిడైజ్డ్ సిల్వర్, మిర్రర్ వర్క్, హెరిటేజ్, మోడర్న్... అంశాలతో లగ్జరియస్ బ్రాండ్‌గా పేరొందిన రిమ్‌జిమ్ దాదు ఈ డిజైన్స్ రూపొందించారు. 'ఆక్సిన్' పేరుతో మన మూలాల కాంతి అని అర్థం వచ్చేలా చేసిన ఈ డిజైన్స్‌లో పటోలా వంటి సంప్రదాయ ఎంబ్రాయిడరీ, మిర్రర్ వర్క్‌ను ఆమె తన డిజైన్స్‌కి జత చేశారు.











ఖుషీ కపూర్ ధరించిన కస్టమ్ టెక్స్‌టైల్ బ్రాకెట్-స్టైల్ బ్లౌజ్, హై-వెయిస్టెడ్ లెహంగా ఎంగేజ్‌మెంట్, రిసెప్షన్ వంటి వేడుకలలో హైలైట్‌గా నిలిచే లక్ష్యంతో ఈ డ్రెస్‌ను రూపొందించారు. మెటాలిక్ కలర్‌లోనే స్కర్ట్ అంతా మిర్రర్ వర్క్ చేశారు. బంజారా సంచార స్ఫూర్తితో ప్రేరణ పొందిన ఈ సేకరణలో మెటాలిక్ తీగలను ఉపయోగించారు. దీంతో బంజారా తెగ సాంస్కృతిక వారసత్వం హైలైట్ అయ్యింది. 'బంజారాతో దుస్తులకు ఉన్న సంబంధాన్ని, అది తనకు తెచ్చిన అందం, సౌకర్యాన్ని ఇష్టపడుతున్నాన'ని ఖుషీకపూర్ ఈ సందర్భంగా తెలియజేశారు.

ఆక్సిడైజ్డ్ సిల్వర్, మిర్రర్ వర్క్, హెరిటేజ్, మోడర్న్... అంశాలతో లగ్జరియస్ బ్రాండ్‌గా పేరొందిన రిమ్‌జిమ్ దాదు ఈ డిజైన్స్ రూపొందించారు. 'ఆక్సిన్' పేరుతో మన మూలాల కాంతి అని అర్థం వచ్చేలా చేసిన ఈ డిజైన్స్‌లో పటోలా వంటి సంప్రదాయ ఎంబ్రాయిడరీ, మిర్రర్ వర్క్‌ను ఆమె తన డిజైన్స్‌కి జత చేశారు.

ఇతర మోడల్స్ ధరించిన డ్రెస్సులను డిజైనర్ దాదు తన బ్రాండ్ సిగ్నేచర్ మెటల్ వైర్ల నుండి రూపొందించిన టైలర్డ్ ఫారమ్స్, స్కల్ప్చర్ డ్రేప్‌లతో ఆకట్టుకుటోంది. ఈ డిజైన్స్‌తో పైస్లీ మోటిఫ్‌లు మెరుస్తూ ఆకట్టుకున్నాయి.

* * *

మన దేశీయ వారసత్వ హస్తకళా సంపద ఎన్నటికీ వన్నెతగ్గదని నిరూపిస్తూ డిజైనర్లు స్ఫూర్తిమంతమైన డిజైన్స్ మన ముందుకు తీసుకు వస్తూనే ఉంటారు. మన మూలాల గొప్పతనాన్ని ఎప్పటికీ నిలిచి ఉండేలా ప్రపంచానికి పరిచయం చేస్తూనే ఉంటారు.

## సమ్‌థింగ్ స్పెషల్

# నవ్వుకు 16.5 కోట్ల ఇన్సూరెన్స్!


సింథియా ఎరివో

'నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది' అనేది మన సామెత.

'నోరు ఆరోగ్యంగా ఉంటేనే నా కెరీర్ బాగుంటుంది. భవిష్యత్ బాగుంటుంది' అనేది బ్రిటిష్ నటి, గాయని సింథియా ఎరివో మాట.

'నవ్వే నా ఆస్తి.. నా గొంతే నా ఐశ్వర్యం' అంటున్న సింథియా సుమారు 16.5 కోట్లకు తన గొంతును బీమా చేయించింది. మౌత్‌వాష్ బ్రాండ్ 'లిస్టెరిన్' 'వాష్ యువర్ మౌత్' క్యాంపెయిన్‌కు ఆమె ప్రచారకర్తగా ఉంది.

'వ్యక్తిగతంగా, వృత్తిపరంగా నా అందమైన నవ్వు, శక్తిమంతమైన స్వరం నా గుర్తింపు' అని చెప్పే సింథియా దంత శుభ్రత, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుంది. వేదిక ఎక్కినప్పుడల్లా బ్రష్ చేసుకుంటుంది. నోటికి సంబంధించిన ఆరోగ్య జాగ్రత్తలు తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచినట్లు చెబుతుంది.

శరీర భాగాలకు బీమా చేయించడం కొత్తేమీ, వింతేమీ కాదు. కాళ్లు, వీపు, స్వరపేటిక, నాలుక...ఇలా రకరకాల శరీర భాగాలకు బీమా చేసుకున్నవారు హాలీవుడ్‌లో చాలామందే ఉన్నారు. అక్కడ ఇదొక ట్రెండ్‌గా కొనసాగుతోంది.

## ఇంటిప్

- తెల్లని వస్త్రాలపై పడిన పసుపు, టీ మరకలు ఒకపట్టాన వదలవు. ఈ మరకలను వదిలించడానికి ముందుగా పచ్చిపాలను మరకలపై పోసి పది నిమిషాలపాటు ఉంచాలి. ఆరిన తర్వాత రుద్దాలి. తరువాత డిటర్జెంట్‌లో నానబెట్టి ఉతికితే మరకలు పూర్తిగా పోతాయి.
- దిండు కవర్లపైన పడిన నూనె మరకలు పోవాలంటే... నూనెపైన టాల్కం పౌడర్ వేసి పదిహేను నిమిషాలు ఉంచాలి. తరువాత సర్ఫ్‌లో నానబెట్టి ఉతికితే నూనె శుభ్రంగా పోతుంది.

## కొత్త జీవితం



# అభయమిచ్చిన బేలీ

గత సంవత్సరం కేరళలోని వయనాడ్‌లో వచ్చిన భారీ వర్షాలు, విరిగి పడిన కొండచరియలు ఎంతోమంది జీవితాలను అస్తవ్యస్తం చేశాయి. ఈ నేపథ్యంలో వరదబాధితులకు వేగంగా సహాయం అందించడానికి ఆర్మీ ఆఫీసర్ సీతా షెల్కే 144 మంది ఆర్మీ జవానుల బృందంతో కలిసి 'బేలీ వంతెన' నిర్మించింది.

ఆనాటి వరదల్లో సర్వస్వం కోల్పోయిన మహిళలకు ఇప్పుడు 'బేలీ' అండగా నిలబడింది. అయితే ఇది వంతెన కాదు. వరద బాధిత మహిళలు తమ జీవితాలను పునర్మించుకోవడానికి వచ్చిన ప్రాజెక్ట్.

'బేలీ అంబరిల్లా అండ్ బ్యాగ్స్ ప్రాజెక్ట్' ద్వారా ఎంతోమంది మహిళల జీవితాల్లో కొత్త వెలుగు వచ్చింది.

జిల్లా అధికార యంత్రాంగం స్వయం సహాయక బృందం 'కుటుంబశ్రీ' భాగస్వామ్యంతో 'బేలీ అంబరిల్లా అండ్ బ్యాగ్స్ ప్రాజెక్ట్'ను ప్రారంభించింది. ఆనాటి వరదల్లో 'బేలీ వంతెన' ఎంతోమంది బాధితులను కాపాడింది. ఆ కృతజ్ఞతతోనే ఈ జీవనోపాధి ప్రాజెక్ట్‌కు 'బేలీ' అని నామకరణం చేశారు.

'బేలీ ప్రాజెక్ట్'లోని మహిళలు తయారు చేస్తున్న రంగురంగుల గొడుగులు, బ్యాగులను కుటుంబశ్రీ స్టాల్స్, ట్రైబల్ డిపార్ట్‌మెంట్ ఔట్‌లెట్స్‌లో ప్రదర్శిస్తున్నారు. 'బేలీ బ్రాండ్' బ్యాగులు, గొడుగులకు తక్కువ కాలంలోనే మంచి పేరు వచ్చింది. వివిధ ప్రాంతాల నుంచి వీటికి ఆర్డర్లు వెల్లువెత్తుతున్నాయి. 'బేలీ ప్రాజెక్ట్'కు సంబంధించిన పని ప్రదేశం... కేవలం బ్యాగులు, గొడుగుల తయారీ కేంద్రం మాత్రమే కాదు. 'విపత్కర పరిస్థితులను తట్టుకొని నిలబడవచ్చు. మోడు వారిన పరిస్థితులలోనూ కొత్తగా పునర్జీవించవచ్చు' అని బలంగా చెప్పే ప్రదేశం.

## కాస్త సరదాగా...

# బామ్మగారి లయన్... పిజ్జాలు తినడంలో నెంబర్‌వన్!



బామ్మగారి లయన్... పిజ్జాలు తినడంలో నెంబర్ వన్!

'ఏరా బుజ్జికొండా, పిజ్జాలు తింటావా!' అని తన పక్కన కూర్చున్న సింహాన్ని అడిగింది బామ్మ.

'నువ్వు తినిపిస్తే ఎందుకు తినను' అన్నట్లుగా చూసింది సింహం.

'అయితే తినూ' అంటూ సింహానికి ఆప్యాయంగా పిజ్జా తినిపిస్తూ తాను కూడా ఒక ముక్క తిన్నది బామ్మ. మటన్ ముక్కలు తినే సింహం పిజ్జా ముక్కలు తినడం ఏమిటి! అడవిలో ఉండాల్సిన సింహం బామ్మ పక్కన పిల్లిలా కూర్చోవడం ఏమిటి!!

ఇది కలియుగ వింత కాదు... ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సృష్టించిన సాంకేతిక వింత.

ఈ ఏఐ వీడియోలో ఎక్కడా కృత్రిమత్వం కనబడదు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ సింహం-బామ్మ వీడియో వేలాది వ్యూస్‌తో దూసుకుపోతోంది.

## న్యూస్‌సీన్



# ఆ గుండె 17 నిమిషాలపాటు ఆగింది!

**విక్టోరియా అనే ఓ మహిళ గుండె స్పందనలు ఆగాయి. కార్డియాక్ అరెస్ట్‌తో ఆ గుండె ఆగగానే ఆమె దాదాపుగా చనిపోయిందనే అనుకున్నారందరూ! ఏకంగా 17 నిమిషాల పాటు ఆగిందామె గుండె. అయితే... అత్యంత అప్రమత్తతతో అత్యవసరంగా స్పందించిన కొందరు పారామెడిక్స్ కృషితో గుండె స్పందనలు మళ్లీ మొదలయ్యాయి. తీరా చూస్తే ఆమె గుండె అలా ఆగడానికి కారణం... ఆమెకున్నో అరుదైన జన్యుపరమైన వ్యాధి. మల్టిపుల్ హార్ట్ ఫెయిల్యూర్‌గా పిలిచే విక్టోరియా వ్యాధి వివరాలివి.**

యూకేలోని గ్లౌసెస్టర్ నగరానికి చెందిన విక్టోరియా థామస్ అనే మహిళ ఓ ఫిట్‌నెస్ ఫ్రీక్. ముప్పై ఐదేళ్ల ఆమె తన ఆరోగ్యం కోసం నిత్యం వ్యాయామాలు చేస్తూ ఉండేది. ఎప్పటిలాగే ఆరోజునా ఆమె జిమ్‌లో వ్యాయామాలు చేస్తోంది. తన ఇంటెన్సివ్ వర్కవుట్ సెషన్‌లో భాగంగా అప్పుడే ఆమె తన వెయిట్ లిఫ్టింగ్ సెట్స్ పూర్తి చేసుకుంది. ఇంతలో ఆమెలోని శక్తినంతా తలలోంచి బయటకు తోడిపోసిన అనుభూతి! విక్టోరియా తన చేతిలోని వెయిట్స్ రాడ్‌ను ఇలా పక్కకు పెట్టిందో లేదో... ఒక పక్కకు అలా ఒరిగిపోయింది. పక్కనున్నవాళ్లు హుటాహుటిన పారామెడిక్స్‌ను తీసుకొచ్చారు. వాళ్లు ఆమె ఛాతీని నొక్కుతూ సీపీఆర్ (కార్డియో పల్మొనరీ రీససియేషన్) మొదలుపెట్టారు. కానీ గుండె స్పందనలు ఎంతకీ మొదలు కాలేదు.

### మరణానుభవానుభూతితో ఓ నిశ్శబ్ద శూన్యత...

సెకన్లు నిమిషాల్లోకి గడిచిపోతున్నాయి. నిమిషాలు పదీ, పదిహేను నిమిషాల వ్యవధి దాటి పావుగంటల్లోకి దొర్లిపోతున్నాయి. కానీ సీపీఆర్‌తో ఎంతగా ప్రయత్నిస్తున్నా విక్టోరియా కోలుకోవడం లేదు. అలా 17 నిమిషాల ప్రయత్నం తర్వాత ఆమె గుండె అకస్మాత్తుగా స్పందనలనందుకుంది. ఈలోపు ఆమెకు అంతటా శూన్యం. భయంకరమైన నిశ్శబ్దం. ఎటు చూసినా... చూడకున్నా అంతా చిమ్మచీకటి. ఆమెలోని తన స్మృతి హేతు జ్ఞానాలన్నీ విస్మృతిలోకి వెళ్లాయి.

ఇలా ఆమె ఆ 17 నిమిషాల పాటూ 'నియర్ డెత్' భయంకరానుభవాన్ని చవిచూసింది. ప్రాణాలు దక్కవనే అనుకున్నారు. కానీ 17 నిమిషాల తర్వాత ఆమె గుండె స్పందనలు మొదలయ్యాయి.

### మూడు రోజులపాటు కోమాలోనే...

ఎట్టకేలకు గుండె స్పందనలు మొదలైనా ఇంకా ఆమె కోమాలోనే ఉంది. దాంతో విక్టోరియాను 'బ్రిస్టల్ రాయల్ ఇన్‌ఫర్మరీ' అనే ఓ పెద్ద వైద్యశాలకు తరలించారు. అక్కడామె మూడు రోజుల పాటు కోమాలోనే ఉండిపోయింది. తర్వాత మెల్లగా కోలుకుని కోమాలోంచి బయటకొచ్చింది.

### గర్భం దాల్చడంతో మొదలైన సవాళ్లు...

ఇదిలా ఉండగా 2021లో విక్టోరియా గర్భం దాల్చింది. అప్పుడు చేసిన పరీక్షల క్రమంలో తెలిసిందేమిటంటే... ఆమెకు మల్టిపుల్ ఆర్గాన్ ఫెయిల్యూర్ అనే వ్యాధి ఉందని! 'డేనన్ డిసీజ్' అని పిలిచే ఆ అరుదైన జన్యుపరమైన ఆ వ్యాధి కారణంగా ఇతర కండరాలతో పాటు గుండె కండరాలూ తీవ్రంగా ప్రభావితమవుతాయి. అవి క్రమంగా బలహీనపడిపోవడంతో (కార్డియోమయోపతి కారణంగా) గుండె మాటిమాటికీ ఆగిపోతుంటుంది.



ఆ గుండె ఆగకుండా స్పందించేందుకూ... ఒకవేళ ఆగినా మళ్లీ స్పందనలు మొదలయ్యేందుకు డీ-ఫిబ్రిలేటర్ అనే పరికరాన్ని అమర్చారు. అది చేసే పనేమిటంటే గుండె ఆగినప్పుడుల్లా ఓ ఎలక్ట్రిక్ షాక్ పంపి, గుండెను మళ్లీ కొట్టుకునేలా చేస్తుంది. చిత్రమేమిటంటే... జన్యుపరమైన వ్యాధి అయినప్పటికీ... వాళ్ల కుటుంబంలో అందుకుముందెవరికీ ఆ వ్యాధి లేదు. అది కనిపించిన మొట్టమొదటి బాధితురాలు విక్టోరియానే!!

### అసలే గుండె వీక్... ఆ పైన ప్రెగ్నెన్సీ!!

మొదటే గుండె చాలా బలహీనం. కానీ ఆలోపు ప్రెగ్నెన్సీ రావడంతో గుండె పంపింగ్ సరిగా జరగక మాటిమాటికీ విక్టోరియా గుండె ఆగిపోవడాలు జరిగేవి. ఇలా తరచూ జరిగే కార్డియాక్ అరెస్టుల నేపథ్యంలోనే నెలల నిండకముందే సిజేరియన్‌తో బిడ్డను బయటకు తీయాల్సి వచ్చింది. బిడ్డ కాస్త బలహీనంగా ఉన్నప్పటికీ పండంటి మగబిడ్డ! అదృష్టం... పరీక్షలు చేసి చూస్తే తల్లికి ఉన్న ఆ జన్యుపరమైన జబ్బు బిడ్డకు లేదు!!

డాక్టర్లు 2022లో విక్టోరియాకు గుండె పరీక్షలు చేయించినప్పుడు తెలిసిందేమిటంటే... ఆమె గుండె పనితీరు కేవలం 11 శాతమేనని!! అంటే హార్ట్ ఫెయిల్యూర్ తాలూకు చివరి దశ అది. ఇకపై ఆమె బతకబోయేది కొద్ది నెలల మాత్రమేనని తేలింది.

అదృష్టాలు ఒక్కోసారి 'ఫలించి'నప్పుడు గుండెకాయ కూడా చెట్టుకాయలా దొరుకుతుంది. అలా ఆమెకు గుండె మార్పిడి చికిత్స కోసం తగిన గుండె దొరకడంతో... ఏప్రిల్ 2023 లో ట్రాన్స్‌ప్లాంట్ చికిత్స చేశారు. దాంతో విక్టోరియా మృత్యుముఖం నుంచి మరోసారి బయటపడింది. 'కొత్త హార్ట్'తో తల్లి... తన 'స్వీట్ హార్ట్' అయిన ఆ బిడ్డ... ఇలా ఇప్పుడా తల్లీ బిడ్డా ఇద్దరూ క్షేమం.


\- యాసీన్

## బులియన్

బంగారం 10 గ్రా.: వెండి కిలో; జూలై 31న ముగింపు రూ.లలో

| | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|---|
| బంగారం (24 క్యారెట్లు) | 99,910 | 1,01,300 | 1,00,300 | 1,01,300 | 99,500 | 1,00,030 |
| బంగారం (22 క్యారెట్లు) | 92,270 | 91,700 | 91,700 | 94,450 | 91,540 | 91,700 |
| వెండి | 1,15,000 | 1,15,000 | 1,25,000 | 1,15,000 | 1,15,000 | 1,25,000 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



# నేరగాళ్ల చరిత్ర విప్పే నిఘా నేత్రాలు

**రైల్వే స్టేషన్‌లలో సీసీటీవీ కెమెరా వ్యవస్థ • అత్యాధునిక 'ఏఐ ఆధారిత ముఖ గుర్తింపు'**

- రియల్‌టైమ్‌లో స్పష్టమైన చిత్రాలు, నేర చరిత్ర
- మహిళలపై నేరాల కట్టడికి వినూత్న ప్రాజెక్టు
- రూ.250 కోట్లతో ఏర్పాటుచేస్తున్న కేంద్రం
- పైలట్ ప్రాజెక్టుగా సికింద్రాబాద్ సహా దేశవ్యాప్తంగా 8 స్టేషన్‌లలో ఏర్పాటు

**సాక్షి, హైదరాబాద్:** ఇక మీదట.. నేరాలు చేసి రైల్వే స్టేషన్లలోకి వెళ్లి తప్పించుకుంటామంటే కుదరదు. 'ముఖ'చిత్రంతోపాటు.. నేర చిట్టాతో సహా అడ్డంగా దొరికిపోతారు. మహిళలపై నేరాలకు పాల్పడేవారిలో ఎక్కువమంది తప్పించుకునే క్రమంలో రైల్వే స్టేషన్‌లకు చేరుతున్నారు. తోచిన రైలెక్కి పారిపోతున్నారు. అలాంటి వారిని పట్టుకునేందుకు..కేంద్రం ఏఐ ఆధారిత, రియల్‌టైమ్‌లో పనిచేసే వినూత్న సీసీటీవీ కెమెరాల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఇవి రైల్వే స్టేషన్లలో నేరగాళ్ల ముఖాలను పసిగట్టి అప్పటికప్పుడు వారి నేరాల చిట్టాను విప్పుతాయి. ఆ వెంటనే పోలీసులు సులభంగా పట్టుకోగలుగుతారు.

దేశవ్యాప్తంగా మహిళలపై అత్యాచారాలు, ఇతర నేరాలు పెరుగుతుండటంతో కేంద్ర హోం శాఖ రైల్వే స్టేషన్‌లలో గట్టి నిఘా అవసరమని గుర్తించింది. నేరాలకు పాల్పడేవారిలో ఎక్కువ మంది రైళ్లలోనే పారిపోతుండటమే దీనికి కారణం. దీంతో నేరగాళ్లను సులభంగా గుర్తించేందుకు రైల్వే స్టేషన్‌లలో ఏఐ ఆధారిత ముఖ గుర్తింపు సీసీటీవీ కెమెరా పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. నిర్భయ నిధి నుంచి ఇందుకు రూ.250 కోట్లు విడుదలకు నిర్ణయించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రయోగాత్మకంగా, దేశంలో రద్దీ ఎక్కువగా ఉండే 8 కీలక రైల్వే స్టేషన్‌లలో తొలుత వీటిని అందుబాటులోకి తేబోతోంది. ఇందులో తెలంగాణలోని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కూడా ఉంది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పునరాభివృద్ధి జరుపుకొంటున్న ఈ స్టేషన్ వచ్చే ఏడాదిలో పూర్తి కొత్త రూపుతో, మినీ ఎయిర్‌పోర్టు తరహాలో అందుబాటులోకి రాబోతోంది. ఈలోపే ఈ కొత్త సీసీటీవీ కెమెరాలను కూడా ఏర్పాటుచేయనున్నారు.



### ఆ 8 స్టేషన్లు ఇవే

సికింద్రాబాద్ కాకుండా మరో ఏడు నగరాలను కేంద్రం ఎంపిక చేసింది. ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్, న్యూఢిల్లీ రైల్వే స్టేషన్, బెంగళూరు, చెన్నై, హౌరా, అహ్మదాబాద్, పుణేలోని స్టేషన్లలో పైలట్ ప్రాజెక్టుగా ఏఐ ఆధారిత 4కే హెచ్‌డీ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు కానున్నాయి. ఈ ఎనిమిది స్టేషన్‌లలో కలిపి రోజుకు దాదాపు కోటి మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. మహిళలపై నేరాలకు పాల్పడేవారు ఈ రద్దీలో కలిసిపోయి పారిపోతున్నారు.

### ఇలా పని చేస్తుంది

ఈ వ్యవస్థలో ఏర్పాటుచేసే సీసీటీవీ కెమెరాలు ప్రత్యేకమైనవి. ఇవి దృశ్యాలను అత్యంత స్పష్టంగా రికార్డు చేస్తాయి. ఈ వ్యవస్థ భారత దేశ జాతీయ లైంగిక నేరస్థుల డేటాబేస్ (ఎన్‌డీఎస్‌ఓ)తో అనుసంధానమై ఉంటుంది. దేశ వ్యాప్తంగా మహిళలపై నేరాలకు పాల్పడిన వారి చిత్రాలు, నేర చరిత్ర, వేలిముద్రలు సహా ఇతర వివరాలు ఎన్‌డీఎస్‌ఓలో నిక్షిప్తమై ఉన్నాయి. ఇలా ప్రస్తుతం సుమారు 20.28 లక్షల రికార్డులు ఉన్నాయి. సరికొత్త సీసీటీవీ కెమెరాలు హై-డెఫినిషన్ క్లారిటీతో వ్యక్తుల ముఖాలను గుర్తిస్తాయి. ఎన్‌డీఎస్‌ఓ రికార్డులతో రియల్‌టైమ్‌లో వాటిని సమీక్షించి, రికార్డుల్లో నమోదైన నేరగాళ్లు ఉన్నట్టు తేలితే వెంటనే పూర్తి డేటాను అందిస్తుంది. పోలీసు వ్యవస్థను అలర్ట్ చేయగానే.. పోలీసు సిబ్బంది వారిని వీలైనంత తొందరలో పట్టుకోగలుగుతారన్నది ఈ వ్యవస్థ ఏర్పాటు ఉద్దేశం.

### వాహనాలనూ గుర్తుపట్టేలా..

ఫేషియల్ రికగ్నిషన్‌తో పాటు ఈ స్టేషన్లలో అత్యవసర కాల్ బాక్స్‌లు, స్మార్ట్ లైటింగ్, డ్రోన్‌నిఘా, ఆటోమేటెడ్ నంబర్ ప్లేట్ గుర్తింపు వ్యవస్థలతో సహా విస్తృత సాంకేతికతలను ఏర్పాటు చేయనున్నారు. గతంలో వివిధ నేరాల్లో పాలుపంచుకున్న వాహనాలు (నంబర్‌ప్లేట్ ఆధారంగా) కనిపించినా కెమెరాలు పట్టేస్తాయి. రైల్వే అనుబంధ సంస్థ సిగ్నల్ అండ్ టెలీకమ్యూనికేషన్స్ విభాగం దీని ఏర్పాటు పనులను పర్యవేక్షిస్తోంది. ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన ఎనిమిది రైల్వే స్టేషన్‌లలో, ఒక్కో స్టేషన్‌కు నిర్భయ నిధి నుంచి రూ.4.8 కోట్లు విడుదల చేశారు.

### గోప్యంగా సమాచారం

ఈ కెమెరాలను వెయిటింగ్ హాళ్లు, రిజర్వేషన్ కౌంటర్లు, పార్కింగ్ ప్రాంతాలు, ప్రధాన ద్వారాలు, ప్లాట్‌ఫామ్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ సహా వ్యక్తుల కదలికలుండే కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కంట్రోల్ రూమ్‌లలో వీడియో ఫీడ్ పర్యవేక్షిస్తారు. ఈ వ్యవస్థ సేకరించే సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని, అవసరమైనంత మేరకు తప్ప బహిర్గతం చేయబోమని రైల్వే అధికారులు తెలిపారు.

### ఇదీ నేపథ్యం

మహిళలపై నేరాలకు సంబంధించి.. తక్కువ శిక్ష రేటుపై ఆందోళన వ్యక్తం చేస్తూ విమెన్ లాయర్స్ అసోసియేషన్ గతంలో సుప్రీంకోర్టులో కేసు వేసింది. 2022లో 23.66 లక్షల పెండింగ్ కేసుల్లో 38,136 మందికి మాత్రమే శిక్ష పడిందని పిటిషన్‌లో పేర్కొంది. దీనిపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించగా, ఈ కొత్త వ్యవస్థ ఏర్పాటు కోసం తీసుకుంటున్న చర్యలను తాజాగా సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చింది. వీలైనంత త్వరలో దీన్ని రైల్వే స్టేషన్‌లలో అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేసింది.

### ఏ ప్రాంతంలో ఎలాంటి కెమెరాలు?

- స్టేషన్ భవనాల్లోని ప్రాంతాల్లో డోమ్ టైప్ కెమెరాలు
- ప్లాట్‌ఫామ్స్ వద్ద బుల్లెట్ టైప్ కెమెరాలు
- పార్కింగ్ ఏరియాలలో పాన్ టిల్ట్ జూమ్ టైప్ కెమెరాలు
- కీలక ప్రాంతాల్లో 4కే హెచ్‌డీ అల్ట్రా కెమెరాలు

## ఫేక్ అటెండెన్స్‌పై ప్రభుత్వం సీరియస్

- కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని కొన్ని గ్రామపంచాయతీలలో పంచాయతీ కార్యదర్శుల ఫేక్ అటెండెన్స్ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టినట్టు సమాచారం. ప్రస్తుత విధానాల ప్రకారం, పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వహిస్తున్న గ్రామం నుంచే మొబైల్ ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయాల్సిన అవసరం ఉంది. అయితే కొందరు సెక్రటరీలు ఇతరుల సహాయంతో లేదా తమ మొబైల్ ఫోన్లు మల్టీ పర్పస్ వర్కర్లకు ఇచ్చి, తాము లేకుండానే యాప్ ద్వారా హాజరు నమోదు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఏకంగా తమ పాస్‌పోర్ట్ ఫొటోలను వాడి హాజరు నమోదు చేసిన ఉదంతాలూ ఇటీవల వెలుగులోకి వచ్చాయి. కొన్నిచోట్ల ఖాళీ కుర్చీలను ఫొటోలు తీసి అటెండెన్స్ యాప్‌లో అప్లోడ్ చేసిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ విధంగా జిల్లాల వారీగా పదుల సంఖ్యలో ఇలాంటి ఫేక్ హాజరు కేసులు వెలుగుచూస్తుండటంతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కఠిన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైనట్టు అధికారవర్గాల సమాచారం. ఫేక్ అటెండెన్స్‌తో ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారిపై ఆ శాఖ మంత్రి సీతక్క కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇలా మోసపూరితంగా వ్యవహరిస్తున్న కొంతమంది వల్ల మొత్తం వ్యవస్థపై అపవాదు పడుతోందని పంచాయతీ కార్యదర్శుల సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. దీనిపై స్పందించిన అధికారులు, సంబంధిత జిల్లాల పంచాయతీ అధికారులు ఆ ఉద్యోగులపై సస్పెన్షన్ విధించాలని ఆదేశించారు. కలెక్టర్లకు నివేదికలు పంపి తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు.

## గర్భిణులను గాలించి.. ఎరవేసి!

### 'సృష్టి' వ్యవహారాలపై కొనసాగుతున్న దర్యాప్తు

- పాత కేసులను వెలికి తీస్తున్న పోలీసులు
- ఐదు రోజుల పోలీసు కస్టడీకి డాక్టర్ నమ్రత



**సాక్షి, హైదరాబాద్:** సరోగసీ పేరుతో చిన్నారుల అక్రమ రవాణా, విక్రయానికి పాల్పడిన యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతను తదుపరి విచారణ నిమిత్తం ఐదు రోజుల పాటు పోలీసుల కస్టడీకి అప్పగిస్తూ సికింద్రాబాద్ కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి పరారీలో ఉన్న ఇద్దరు నిందితులు నందిని, సంజయ్ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఇంకోవైపు నమ్రత నేర చరిత్రను పోలీసులు తిరగదోడుతున్నారు. గతంలో నమోదైన కేసుల పూర్వాపరాలను పరిశీలిస్తున్నారు. నమ్రతపై నగరంలోని గోపాలపురం ఠాణాలో 5, విశాఖపట్నంలో 5, గుంటూరులో ఒక కేసు ఉన్నట్లు అధికారికంగా గుర్తించారు.

**శిశువు చనిపోయిందని నమ్మించి..**

విజయనగరానికి చెందిన దంపతులు సంతానలేమితో బాధపడుతూ 2019 ఫిబ్రవరిలో విశాఖ సెంటర్‌లో డాక్టర్ నమ్రతను కలిశారు. వారికి సరోగసీ సిఫార్సు చేసిన ఆమె రూ.13 లక్షలు వసూలు చేసింది. అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం పి.భీమవరానికి చెందిన గర్భిణీ వెంకటలక్ష్మి 2020 జనవరిలో చోడవరం పెద్దబజారులోని ఓ ఆస్పత్రికి వెళ్లగా.. డాక్టర్ నమ్రతకు ఏజెంట్‌గా వ్యవహరించిన నేమాల నూకరత్నం ఉచితంగా డెలివరీ చేయిస్తానంటూ ఆమెను నమ్మించింది. 2020 జనవరి 30న ఆమెను విశాఖలోని పద్మజ ఆస్పత్రిలో చేర్పించింది. ఈమెకు ఆ మర్నాడే ఆడపిల్ల పుట్టింది. అయితే పుట్టిన వెంటనే బిడ్డ చనిపోయిందని వెంకటలక్ష్మిని నమ్మించిన నూకరత్నం నమ్మించడంతో నమ్రత ఫిబ్రవరి 6న ఆ శిశువును విజయనగరం దంపతులకు అప్పగించింది. అయితే అప్పటికే సృష్టి సెంటర్‌పై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో విజయనగరం జంట పోలీసులను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం బయటపడింది.

**ఉచిత డెలివరీ, డబ్బు ఆశ చూపించి..**

ఇంకో కేసులో విశాఖ సమీపంలోని కానికారమాత కాలనీకి చెందిన సుందరమ్మ గర్భం దాల్చిన విషయం తెలుసుకున్న ఆశా కార్యకర్తలు కోడి వెంకటలక్ష్మి, బొట్టా అన్నపూర్ణ విషయాన్ని నమ్రత ఏజెంట్‌గా ఉన్న ఆర్జి రామకృష్ణకు తెలిపారు. ముగ్గురూ కలిసి ఉచితంగా డెలివరీ చేయిస్తామని, శిశువును ఇచ్చేస్తే కొంత డబ్బు ఇస్తామని ప్రలోభానికి గురిచేశారు. విశాఖలోని సృష్టి సెంటర్లో సుందరమ్మ మగబిడ్డకు జన్మనిచ్చింది. నమ్రత ఆ చిన్నారిని పశ్చిమ బెంగాల్‌కు చెందిన దంపతులకు అమ్మేసింది. సుందరమ్మ గర్భవతిగా ఉన్నప్పుడు అంగన్‌వాడీ టీచర్ సరోజిని ఆమెకు పోషకాహారం అందించేది. సుందరమ్మ డెలివరీ విషయం తెలుసుకుని ఆమె ఆరా తీయడం, సుందరమ్మ సరైన సమాధానం ఇవ్వకపోవడంతో 2020 మార్చి 14న చైల్డ్‌లైన్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో శిశు విక్రయం బయటపడగా, అదే నెల 20న ఆ పసికందును వెనక్కి తీసుకువచ్చారు. కర్ణాటకకు పారిపోయిన నమ్రతను జూలైలో పోలీసులు దావణగిరిలో అరెస్టు చేసి విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు. విజయవాడలో సృష్టి సెంటర్ అక్రమాలపై 2015లో కృష్ణా జిల్లా కలెక్టర్ విచారణ జరిపి ఇండియన్ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో 2018లో ఈ లైసెన్సు రద్దు అయింది. ఇలావుండగా డాక్టర్ నమ్రత రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేశారని, అందులోనూ కొందరిని మోసం చేశారని పోలీసులు చెప్తున్నారు.

### నమ్రత నేరం అంగీకరించారు: పోలీసులు

సృష్టి సెంటర్ ముసుగులో అక్రమాలకు పాల్పడినట్లు డాక్టర్ నమ్రత అంగీకరించారని గోపాలపురం పోలీసులు సికింద్రాబాద్ కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. సరోగసీ చేయకపోయినా ఆ పేరుతో దంపతులను నమ్మించానని వెల్లడించినట్లు తెలిపారు. ఆమెను కస్టడీకి కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌లో ఈ వివరాలను పొందుపరిచారు. సృష్టి సెంటర్ చేసిన నేరాలు, వాటి మూలాలు, సహ నిందితులను గుర్తించడానికి లోతుగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉన్నట్లు కోర్టుకు తెలిపారు. కాగా నమ్రతను పోలీసులు శుక్రవారం జైలు నుంచి కస్టడీలోకి తీసుకోనున్నారు.

# కొత్త తరానికి చేరువవుదాం!

▶ మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే విస్తృత స్థాయి సమావేశం తరహాలో అన్ని జిల్లా కేంద్రాల్లోనూ సదస్సులు నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. దీంతోపాటు రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా అనుసరించాల్సిన వ్యూహాలపై బీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా కేసీఆర్ ఎర్రవల్లి నివాసంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితో పాటు మరికొందరు నేతలతో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. గురువారం భేటీలో కీలక అంశాలపై చర్చించడంతోపాటు పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు.

**ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీం తీర్పు**

బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేసీఆర్ చర్చించారు. ఒకవైపు స్థానిక సంస్థల ఎన్నికల కోసం సన్నద్ధమవుతూనే పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని కేటీఆర్‌ను ఆదేశించారు. ఆయా నియోజకవర్గాల్లో స్థితిగతులను మదింపు చేసి నివేదిక రూపొందించాలని సూచించారు. మరోవైపు మూడు నెలల్లోగా అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేలా స్పీకర్‌పై ఒత్తిడి పెంచేందుకు అనుసరించాల్సిన వ్యూహంపైనా ఈ భేటీలో చర్చించారు.

**బనకచర్లతో జరిగే నష్టంపై..**

నదీ జల్లాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించడంతోపాటు ప్రత్యేకించి గోదావరి–బనకచర్ల లింకు ప్రాజెక్టుతో రాష్ట్రానికి జరిగే నష్టంపై యువత, విద్యార్థులకు వివరించాలని కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు. ఆగస్టు 1న మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో సమావేశం నిర్వహిస్తున్నారు. సూర్యాపేట, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల్లోనూ త్వరలో ఈ తరహా సమావేశాలు జరుగుతాయి. అన్ని జిల్లా కేంద్రాల్లో సదస్సులు నిర్వహించే బాధ్యతను బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, బాల్క సుమన్, గాదరి కిషోర్, ఎర్రోల్ల శ్రీనివాస్‌కు అప్పగించారు. జల వనరుల నిపుణులు వి.ప్రకాశ్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ సదస్సుల్లో ప్రసంగిస్తారు. రాష్ట్రంలో రేవంత్ సర్కారును టీడీపీ, బీజేపీ నడిపిస్తున్నాయనే విషయాన్ని విడమరిచి చెప్పాలని కేసీఆర్ ఆదేశించినట్లు సమాచారం. కాంగ్రెస్, బీజేపీ ఉమ్మడిగా బీఆర్ఎస్ లక్ష్యంగా చేస్తున్న రాజకీయాలను విడమరిచి చెప్పాలని సూచించారు.

**దృష్టి మళ్లించేందుకే విచారణలు**

ఎన్నికల హామీల అమలు, పాలన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానాలు, వాటిని ఎదుర్కొనాల్సిన తీరుపై కేసీఆర్ లోతుగా విశ్లేషించినట్లు సమాచారం. కాళేశ్వరం, విద్యుత్ అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్లు తదితరాలపై ఈ భేటీలో చర్చ జరిగింది. కాళేశ్వరం కమిషన్ విచారణకు తాను, హరీశ్ హాజరుకావడం ద్వారా ప్రజల్లో నెలకొన్న అపోహలు పటాపంచలు అయినట్లు కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. కాళేశ్వరం కమిషన్ నివేదికలో ఏయే అంశాలు ఉండొచ్చనే కోణంలోనూ చర్చ జరిగినట్లు సమాచారం.

**బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలు**

బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంలో కాంగ్రెస్ పార్టీ తాను తీసుకున్న గోతిలో తానే పడిందని, బయటపడే మార్గం కోసం వెతుకుతూ మరింత లోతుగా కూరుకుపోతోందనే అభిప్రాయం కేసీఆర్ భేటీలో వ్యక్తమైంది. కాంగ్రెస్ తీరును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ నెల 8న కరీంనగర్‌లో నిర్వహించే బీసీ సభ ఏర్పాట్ల బాధ్యతను మాజీ మంత్రి గంగుల కమలాకర్‌కు అప్పగించారు. పార్టీ బీసీ నేతలు మధుసూదనాచారి, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, బండా ప్రకాశ్ శుక్రవారం కరీంనగర్‌కు వెళ్లి సభ నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించాలని కేసీఆర్ ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాల వారీగా సమన్వయం, అభ్యర్థుల ఎంపిక, ప్రచారం తదితరాలకు సంబంధించి కేసీఆర్ పలు సూచనలు చేసినట్లు తెలిసింది. కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు జిల్లాల వారీగా కీలక నేతలు సమన్వయం చేసుకోవాలని కేసీఆర్ సూచించారు.

## ‘బనకచర్ల’ వెనక్కి

▶ మొదటి పేజీ తరువాయి

లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అంతర్రాష్ట్ర అంశాలపై తెలంగాణ అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ అంశాన్ని కేంద్ర జల సంఘం పరిశీలించాలని నిపుణుల కమిటీకి సూచించింది. ఈ ఏడాది జూన్ 17న సమావేశమైన కమిటీ.. ప్రాజెక్టు ప్రతిపాదనను తిరిగి పంపించాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టును ప్రతిపాదించిన ఏపీ ప్రభుత్వం ముందుగా కేంద్ర జల సంఘాన్ని సంప్రదించి అవసరమైన అనుమతులు, క్లియరెన్సులతోపాటు నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) పొందాలని సూచించింది. ఆ తర్వాతే టీఓఆర్ కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది.

## గొర్రెల పంపిణీ కుంభకోణంపై ఈడీ దర్యాప్తు

- తలసాని ఓఎస్డీ విచారణ

**సాక్షి, హైదరాబాద్:** గొర్రెల పంపిణీ పథకంలో కుంభకోణంపై ఈడీ దర్యాప్తు కొనసాగుతోంది. మాజీ మంత్రి తలసాని ఓఎస్డీ కల్యాణ్‌కుమార్ నివాసం సహా హైదరాబాద్‌లో బుధవారం పలుచోట్ల ఈడీ సోదాలు చేపట్టడం తెలిసిందే. నిధుల గోల్‌మాల్, మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేసిన ఈడీ అధికారులు.. బుధవారం నాటి సోదాల్లో పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని విశ్లేషించడంతోపాటు కల్యాణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని బుధ, గురువారాల్లో విచారణ జరిపారు.

## కమిషన్ వేయాలా? వద్దా? తేలుస్తాం

సాక్షి, హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా నాగారంలోని 181, 182, 194, 195 సర్వే నంబర్లలోని భూదాన్ భూముల అన్యాక్రాంతం, అక్రమాల ఆరోపణలపై విచారణ కమిషన్ వేయాలా? వద్దా? అనేది తేలుస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు దాఖలైన పిటిషన్‌లో తీర్పు రిజర్వు చేసింది. ఈ సర్వే నంబర్లలో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు భూములను అక్రమంగా తమ పేరిట నమోదు చేసుకున్నారని, వీటిపై కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరపాలని దాఖలైన మరో పిటిషన్‌లోని మధ్యంతర అప్లికేషన్ల(ఐఏ)లో తీర్పు వాయిదా వేసింది. భూకబ్జాలపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని, దీనిపై విచారణ కమిషన్ వేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ అంబర్‌పేట్‌కు చెందిన బిర్లా మహేశ్, పడమటి తండాకు చెందిన రాములు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం మళ్లీ విచారణ చేపట్టారు.

**తెలియకుండా భూములు మార్చేశారు..**

పిటిషనర్ తరఫున డాక్టర్ జె.విజయలక్ష్మి వాదనలు వినిపిస్తూ.. ‘194/ఐ, 195/ఐలో రాములు భూములున్నాయి. ప్రస్తుతం ఆ భూములు అతని అధీనంలోనే ఉన్నాయి. పాస్‌బుక్ అతని పేరిటే ఉన్నా.. భూభారతిలో మాత్రం జావేద్, అర్షియా సుల్తానా, అబ్దుల్ లతీఫ్ పేర్లు చూపిస్తోంది. తనకు తెలియకుండా ఆన్‌లైన్‌లో ఎలా మార్చారో చెప్పాలని తహసీల్దార్‌ను కోరినా వివరాలు ఇవ్వలేదు. కోర్టు ఆదేశించినా స్పందనలేదు. కమిషన్ వేస్తే గానీ వివరాలు బహిర్గతం కావని కోర్టును ఆశ్రయించాం’అని తెలిపారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. ‘కమిషన్ వేస్తారు.. నివేదిక వస్తుంది, అది కూడా ఉన్నతాధికారులకు సమర్పించాల్సిందే, అప్పుడు కూడా ఆ నివేదికను అల్మారాలో పెట్టి వదిలేస్తే ఏం చేస్తారు’అని ప్రశ్నించారు. మళ్లీ కోర్టును ఆశ్రయించాల్సిందేనని న్యాయవాది బదులిచ్చారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. వ్యక్తిగత అంశాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించడం సాధ్యం కాదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఈ పిటిషన్‌లో తీర్పు రిజర్వు చేశారు.

**‘భూదాన్’ కేసులో తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు**



## పీఎంకేఎస్‌వై కింద తెలంగాణకు రూపాయికూడా ఇవ్వలేదు

**లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానమిచ్చిన కేంద్ర జలశక్తి శాఖ**

**సాక్షి, న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై)లో భాగంగా అమలు చేస్తున్న సత్వర సాగునీటి ప్రాయోజిత కార్యక్రమం (ఏఐబీపీ), హర్ ఖేత్ కో పానీ (హెచ్‌కేకేపీ) పథకాల కింద గడిచిన మూడేళ్లలో తెలంగాణకు ఒక్క రూపాయి కూడా సాయం అందలేదని కేంద్రం వెల్లడించింది. పథకాల కింద గడిచిన మూడేళ్లలో రాష్ట్రాల వారీగా విడుదల చేసిన నిధుల వివరాలను మహారాష్ట్రకు చెందిన ఎంపీ ఒకరు లోక్‌సభలో ప్రశ్నించగా, దానికి కేంద్ర జల శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి సమాధానమిచ్చారు. సాగుకు నీటి లభ్యతను మెరుగుపరచడం, సాగు విస్తీర్ణాన్ని పెంచడం, వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ పథకాలను తీసుకొచ్చామని తెలిపిన ఆయన, మూడేళ్లలో మొత్తంగా రూ.3,780 కోట్లు కేంద్ర సాయం అందించినట్లు తెలిపారు. తెలంగాణకు మాత్రం మూడేళ్లలో ఒక్క రూపాయి ఇవ్వలేదని తెలిపారు.

# మూడు సంపుటాలు.. వేయి పేజీలు

▶ మొదటి పేజీ తరువాయి

జస్టిస్ ఘోష్ పేర్కొనగా.. అనుబంధాలతో కలిపి మొత్తం మూడు సంపుటాలుగా ఇచ్చిన నివేదికలో వెయ్యికిపైగా పేజీలునున్నట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ 2023 అక్టోబర్ 21న కుంగిపోగా, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సైతం బుంగలు ఏర్పడి నీళ్లు సీపేజీ అయ్యాయి. ఆ వెంటనే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బరాజ్‌ల నిర్మాణంలో సాంకేతిక లోపాలతోపాటు అవినీతి ఆరోపణలపై విచారణ కోసం 2024 మార్చి 14న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్‌తో విచారణ కమిషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.


**బాధ్యులు వారేనా?**

బరాజ్‌ల డిజైన్లు, నిర్మాణంతోపాటు నిర్వహణ, పర్యవేక్షణలో పాల్గొన్న నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, మాజీ ఈఎన్సీలు, సీఈలు, ఎస్ఈలు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు, ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లను కమిషన్ ప్రశ్నించి కీలక సాక్ష్యాధారాలను సేకరించింది. బరాజ్‌ల స్థల ఎంపికతో పాటు ఇతర కీలక నిర్ణయాలను నాటి సీఎం కేసీఆర్ తీసుకున్నారని పలువురు మాజీ ఇంజనీర్లు, ఐఏఎస్‌లు విచారణ కమిషన్ ముందు సాక్ష్యం ఇచ్చారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన వేలాది ఫైళ్లను జల్లెడ పట్టిన కమిషన్.. ఎన్నో అవకతవకలను గుర్తించింది. క్రాస్ ఎగ్జామినేషన్‌లో పాల్గొనే సాక్షులకు వాటి ఆధారంగా ప్రశ్నలను సంధించింది. విచారణ చివర్లో మాజీ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, మాజీ నీటిపారుదల మంత్రి హరీశ్‌రావు, మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించింది. మంత్రివర్గ నిర్ణయాల ఆధారంగానే బరాజ్‌ల నిర్మాణ పనులు జరిగాయని మాజీ మంత్రులిద్దరితోపాటు కేసీఆర్ కమిషన్ ఎదుట వాంగ్మూలం ఇచ్చారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఈ వాదనలను ఖండిస్తూ అసలు గత ప్రభుత్వంలోని జరిగిన మంత్రివర్గ సమావేశాల్లో బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించి ఎలాంటి నిర్ణయాలు జరగలేదని తేల్చింది. దీనికి సమర్థనగా గత ప్రభుత్వంలో జరిగిన కేబినెట్ సమావేశాలకు సంబంధించిన తీర్మానాల ప్రతులతో కమిషన్‌కు నివేదిక అందించింది. బరాజ్‌లకు సంబంధించిన నిర్ణయాలను ఎవరు తీసుకున్నారనే అంశాన్ని నిర్ధారించడానికి ఈ నివేదిక కీలకం కానుంది. ప్రధానంగా తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బరాజ్ స్థల మార్పుపై నిర్ణయం ఎవరు తీసుకున్నారనే అంశంపై కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ సందర్భంగా పలువురు సాక్షులను ప్రశ్నించింది. చాలా మంది సాక్షులు దీనికి సమాధానంగా ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌ల పేర్లను ఉటంకించారు. విచారణకు హాజరైన సాక్షుల్లోనే పలువురి పాత్రపై ఆధారాలను సేకరించిన కమిషన్.. వారినే బాధ్యులుగా నిర్ధారిస్తూ నివేదికలో పొందుపరిచినట్లు సమాచారం.

**నేడు సీఎంకు నివేదిక..**

జస్టిస్ ఘోష్ గురువారం సమర్పించిన నివేదిక నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి చేరగా.. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆ నివేదికను అందచేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ ‘సాక్షి’కి తెలిపారు. అనంతరం నివేదికను మీడియాకు బహిర్గతం చేయనున్నట్లు తెలిపారు.

### అంశాలకు కట్టుబడే నివేదిక.. జస్టిస్ ఘోష్



ప్రభుత్వం కమిషన్‌కు నిర్దేశించిన అంశాలకే పరిమితమై నివేదికను సిద్ధం చేసినట్లు జస్టిస్ పీసీ ఘోష్ తెలిపారు. ఈ నేపథ్యంలో బాధ్యులపై తీసుకోవాల్సిన చర్యలపై ఎలాంటి సిఫారసులు చేయలేదని మీడియాకు తెలియజేశారు. సర్కారుకు నివేదిక అందించడంతో తన బాధ్యత తీరిందన్నారు. ఇకపై కమిషన్ కార్యకలాపాల కోసం హైదరాబాద్‌కు రానన్నారు. సర్కారు నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటుందా అని ప్రశ్నించగా అది తనకు తెలియదన్నారు.

### బాధ్యులెవరు? ప్రజాధన దుర్వినియోగం ఎంత?

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణంలో నిర్లక్ష్యం, అక్రమాలు, లోపాలు, కాంట్రాక్టర్లకు పనుల అప్పగించిన తీరు, చేసుకున్న ఒప్పందాలు, వాటి అమలు తీరు/ఉల్లంఘనలతోపాటు వాటి అమల్లో ఆర్థిక క్రమశిక్షణ కఠినంగా పాటించారా లేదా? వంటి అంశాలపై విచారణ కోసం ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసింది. క్వాలిటీ కంట్రోల్, పర్యవేక్షణ అంశాలు, నిర్మాణ సంస్థలు/కాంట్రాక్టర్లు, నీటిపారుదల శాఖల నిర్లక్ష్యం, ఇతర అవకతవకలపై విచారణ జరపాలని కోరింది. అసమంజస రీతిలో ఒప్పందాల గడువు పొడిగింపు, పనులు పూర్తయినట్లు తప్పుడు సర్టిఫికేట్ల జారీ, గడువు పూర్తికాక ముందే బ్యాంక్ గ్యారెంటీల విడుదల, తదితర చర్యలతో నిర్మాణ సంస్థలు/కాంట్రాక్టర్లకు అనుచిత లబ్ధి కలిగించిన వ్యవహారంపై విచారణ జరిపి సంబంధిత అధికారులు/సంస్థలను బాధ్యులుగా నిర్ధారించాలని సూచించింది. అంశాలవారీగా బాధ్యులను గుర్తించడంతోపాటు దుర్వినియోగమైన నిధులను కమిషన్ నిర్ధారించి నివేదికలో పొందుపరిచినట్లు తెలిసింది.

# సాక్షి బిజినెస్

శుక్రవారం
1-8-2025

**స్టాక్ మార్కెట్లు** (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ | 296 | 81,186 |
| నిఫ్టీ ▽ | 87 | 24,768 |

| విదేశీ సూచీలు | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 21,254 | △ | 125 |
| డోజోన్స్ | 44,379 | ▽ | 82 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 9,129 | ▽ | 8 |
| డాక్స్ | 24,094 | ▽ | 168 |
| షాంఘై | 3,573 | ▽ | 42 |
| నికాయ్ | 41,070 | ▽ | 415 |

●అమెరికా ●బ్రిటన్ ●జర్మనీ ●చైనా ●జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటి | 87.30 | 88.32 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటి | 115.00 | 117.99 |
| € | యూరో | ఒకటి | 99.48 | 102.23 |
| ¥ | జపాన్ యెన్ (100) | ఒకటి | 58.22 | 59.71 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటి | 55.72 | 57.96 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒకటి | 65.26 | 68.90 |
| SAR | సౌదీ రియాల్ | ఒకటి | 22.44 | 23.92 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | ఒకటి | 22.91 | 24.96 |
| ¥ | చైనా యువాన్ | ఒకటి | 11.28 | 13.10 |

## టాటా మోటార్స్ రూ. 10,000 కోట్ల సమీకరణ!

- ఈక్విటీ, దీర్ఘకాలిక రుణాలపై దృష్టి
- ఇవెకో కొనుగోలుకు తీసుకునే తాత్కాలిక రుణాల తీర్చివేతపై కసరత్తు



**న్యూఢిల్లీ:** ఇటలీ కంపెనీ ఇవెకో గ్రూప్ కొనుగోలు కోసం తీసుకుంటున్న స్వల్పకాలిక రుణాన్ని (బ్రిడ్జ్ ఫైనాన్సింగ్) తీర్చివేసేయడంపై టాటా మోటార్స్ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా సుమారు 1 బిలియన్ యూరోలను (సుమారు రూ. 10,000 కోట్లు) ఈక్విటీగా, మిగతా మొత్తాన్ని దీర్ఘకాలిక రుణాలుగా సమకూర్చుకునే యత్నాల్లో ఉన్నట్లు టాటా మోటార్స్ గ్రూప్ సీఎఫ్‌వో పీబీ బాలాజీ తెలిపారు. ఇవెకో డీల్ ముగిసిన 12–18 నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి కావచ్చన్నారు. 3.8 బిలియన్ యూరోలతో (సుమారు రూ. 38,240 కోట్లు) వాణిజ్య వాహనాల కంపెనీ ఇవెకో గ్రూప్‌ను టాటా మోటార్స్ కొనుగోలు చేయనుంది. ఇందుకు మోర్గాన్ స్టాన్లీ, ఎంయూఎఫ్‌జీ తదితర సంస్థలు బ్రిడ్జ్ ఫైనాన్సింగ్ చేస్తున్నాయి.

**నాలుగో స్థానానికి...:** ఇన్వెస్టర్లతో సమావేశం సందర్భంగా వెల్లడించిన వివరాల ప్రకారం ఇవెకో కూడా కలిస్తే 6 టన్నుల ట్రక్కుల కేటగిరీలో టాటా మోటార్స్ గ్రూప్ మొత్తం అమ్మకాలు వార్షికంగా 2.3 లక్షల యూనిట్ల పైచిలుకు ఉంటుంది. తద్వారా దాదాపు వోల్వో గ్రూప్‌తో సమానంగా నాలుగో స్థానంలో ఉంటుంది. కొనుగోలుకు ముందు ఏటా 1.8 లక్షల యూనిట్లతో టాటా మోటార్స్ గ్రూప్ ఆరో స్థానంలో, 50,000 యూనిట్లతో ఇవెకో 17వ స్థానంలో ఉన్నాయి. తొలి మూడు స్థానాల్లో డైమ్లర్ గ్రూప్ (3.5 లక్షల యూనిట్లు), సీఎన్‌హెచ్‌టీసీ గ్రూప్ (2.5 లక్షలు), ట్రాటన్ గ్రూప్ (2.4 లక్షల యూనిట్లు) ఉన్నాయి. 2024 డిసెంబర్ నాటికి ఇవెకో సంస్థకు అంతర్జాతీయంగా 32,000 మంది ఉద్యోగులు ఉన్నారు.

## పసిడి డిమాండ్‌కు ధరాఘాతం!

- జూన్ త్రైమాసికంలో 10 శాతం డౌన్
- 134.9 టన్నులకు పరిమితం
- వెల్లడించిన ప్రపంచ స్వర్ణ మండలి



6 నెలల్లో 253 టన్నులు..

**ముంబై:** పసిడి ధరలు జీవిత కాల గరిష్ట స్థాయిలకు చేరడంతో డిమాండ్ (పరిమాణం పరంగా) తగ్గుముఖం పట్టింది. జూన్ త్రైమాసికంలో భారత్‌లో బంగారం డిమాండ్ 134.9 టన్నులుగా ఉన్నట్టు ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో డిమాండ్ 149.7 టన్నుల కంటే ఇది 10 శాతం తక్కువ. ధరలు రికార్డు స్థాయిలకు చేరడం కొనుగోలు సామర్థ్యంపై ప్రభావం చూపించినట్టు పేర్కొంది. ధరలు పెరిగిన ఫలితంగా పుత్తడి కొనుగోలుపై భారతీయులు అధికంగా వెచ్చించాల్సి వచ్చినట్టు తెలుస్తోంది. విలువ పరంగా పసిడి డిమాండ్ రూ.1,21,800 కోట్లకు చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో ఉన్న రూ.93,850 కోట్ల కంటే 30% పెరిగింది. బంగారు ఆభరణాల కొనుగోలు డిమాండ్ పరిమాణం పరంగా 17 శాతం తగ్గి 88.8 టన్నులకు పరిమితమైంది. క్రితం ఏడాది జూన్ త్రైమాసికంలో బంగారు ఆభరణాల డిమాండ్ 106.5 టన్నులుగా ఉంది. విలువ పరంగా బంగారు ఆభరణాల డిమాండ్ 20 శాతం పెరిగి రూ.80,150 కోట్లకు చేరింది. ధరలు పెరగడం ఫలితంగా ఆభరణాల కొనుగోళ్లు తగ్గుముఖం పట్టినప్పటికీ, అదనంగా ఖర్చు చేయాల్సి రావడం విలువ పెరిగేందుకు దారితీసింది.

**పెట్టుబడి పరంగా డిమాండ్..**

పెట్టుబడి పరంగా బంగారం డిమాండ్ 7 శాతం పెరిగి 46.1 టన్నులుగా జూన్ త్రైమాసికంలో నమోదైంది. విలువ పరంగా చూస్తే డిమాండ్ 54 శాతం పెరిగి రూ.41,650 కోట్లకు చేరుకుంది. దీర్ఘకాలానికి విలువ పెరిగే సాధనంగా బంగారాన్ని చూస్తున్నారనడానికి ఇది నిదర్శమని డబ్ల్యూజీసీ భారత సీఈవో సచిన్ జైన్ తెలిపారు. బంగారం దిగుమతులు 34 శాతం తగ్గి 102.5 టన్నులుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో దిగుమతులు 150 టన్నులుగా ఉన్నట్టు డబ్ల్యూజీసీ నివేదిక తెలిపింది. మరోపక్క, బంగారం రీసైక్లింగ్ (పునర్వినియోగపరిచిన) డిమాండ్ ఒక శాతం పెరిగి 23.1 టన్నులకు చేరుకుంది.

జూన్ త్రైమాసికంలో బంగారం ధరలు ఔన్స్‌కు సగటున 3,280 డాలర్లుగా ఉంటే, 10 గ్రాముల ధర భారత్‌లో రూ.90,307 స్థాయిలో ఉన్నట్టు సచిన్ జైన్ తెలిపారు. సురక్షిత పెట్టుబడి సాధనంగా బంగారానికి ప్రాధాన్యం కొనసాగుతున్నట్టు చెప్పారు. ఇక ఈ ఏడాది తొలి 6 నెలల్లో (జనవరి–జూన్) భారత్‌లో బంగారం డిమాండ్ 253 టన్నులుగా ఉండగా, పూర్తి ఏడాదికి 600–700 టన్నుల మధ్య ఉండొచ్చని సచిన్‌జైన్ తెలిపారు. ధరల్లో స్థిరత్వం ఏర్పడితే డిమాండ్ గరిష్ట స్థాయిలో 700 టన్నులకు చేరుకోవచ్చన్నారు. ధరల పెరుగుదల కొనసాగితే డిమాండ్ 600 టన్నులకు పరిమితం కావొచ్చని అంచనా వేశారు.

## సూచీలకు సుంకాల సెగ

- సెన్సెక్స్ 296 పాయింట్ల పతనం
- నిఫ్టీ నష్టం 87 పాయింట్లు
- రెండు రోజుల లాభాలకు బ్రేక్



**ముంబై:** భారత్ ఉత్పత్తులపై 25% టారిఫ్‌తో పాటు, పెనాల్టీలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనతో దేశీయ స్టాక్ మార్కెట్ గురువారం నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్ 296 పాయింట్ల పతనంతో 81,186 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 87 పాయింట్లు నష్టపోయి 24,768 వద్ద నిలిచింది. దీంతో రెండు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడినట్లైంది. ఉదయమే సూచీలు భారీ నష్టాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 787 పాయింట్లు క్షీణించి 80,695 వద్ద, నిఫ్టీ 220 పాయింట్లు పతనమై 24,635 వద్ద కనిష్టాలు తాకాయి. ఎఫ్‌ఎంసీజీ, సర్వీసెస్ షేర్లు రాణించడంతో ఇంట్రాడేలో నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. అయితే చివర్లో మరోసారి అమ్మకాలు తలెత్తడంతో నష్టాల ముగింపు తప్పలేదు. డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 87.65 వద్ద స్థిరపడింది.

- ఎఫ్‌ఎంసీజీ, సర్వీసెస్ మినహా అన్ని రంగాల షేర్లూ నష్టాలు చవిచూశాయి. ఇండెక్సుల వారీగా బీఎస్‌ఈలో టెలీ కమ్యూనికేషన్ 2%, ఆయిల్‌అండ్‌గ్యాస్, ఇంధనం 1.50%, మెటల్, కమోడిటీ, కన్జూమర్ డ్యూరబుల్స్ 1% నష్టపోయాయి. స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు ఒకశాతం చొప్పున పతనయమ్యాయి.
- భారత్‌పై ఆగస్టు 1 నుంచి 25 శాతం సుంకాలను విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడంతో దేశీయ టెక్స్‌టైల్, ఫార్మా, ఆటో, ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. టెక్స్‌టైల్ షేర్లు పెరల్ గ్లోబల్ 7%, గోకుల్‌దాస్ ఎక్స్‌పోర్ట్స్, అరవింద్, వర్ధమాన్ టెక్స్‌టైల్స్, వెల్‌స్పన్ కార్ప్ 4%, కేపీఆర్ మిల్ 3%, అలోక్ ఇండస్ట్రీస్ 2.50% నష్టపోయాయి. ఫార్మా షేర్లు జుబిలెంట్ ఫార్మోవా 4%, ఇప్కా ల్యాబ్స్, లుపిన్ 3%, సన్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ 1% నష్టపోయాయి.

### బ్రిగేడ్ లిస్టింగ్.. ఫ్లే



బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ షేరు లిస్టింగ్‌లో నిరాశపరిచింది. ఇష్యూ ధర(రూ. 90)తో పోలిస్తే బీఎస్ఈలో 9% డిస్కౌంట్‌తో రూ.82 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 9.50% క్షీణించి రూ.81.49 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 5% నష్టంతో రూ.85.40 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.3,243 కోట్లుగా నమోదైంది.

## మారుతీ లాభం ఫ్లాట్

**క్యూ1లో రూ. 3,792 కోట్లు**



**న్యూఢిల్లీ:** ఆటో రంగ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం నామమాత్ర వృద్ధితో రూ. 3,792 కోట్లకు పరిమితమైంది. దేశీయంగా అమ్మకాలు నీరసించినప్పటికీ ఎగుమతులు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 3,760 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 36,840 కోట్ల నుంచి రూ. 40,493 కోట్లకు జంప్‌చేసింది. స్టాండెలోన్ నికర లాభం స్వల్పంగా 2 శాతం పుంజుకుని రూ. 3,712 కోట్లను తాకింది. గత క్యూ1లో రూ. 3,650 కోట్లు ఆర్జించింది. అయితే నిర్వహణ లాభం(ఇబిటా) 11 శాతం నీరసించి రూ. 3,995 కోట్లకు పరిమితమైంది. ఇబిటా మార్జిన్లు 2.27 శాతం బలహీనపడి 10.4 శాతానికి చేరాయి. గత క్యూ1లో ఇవి 12.67 శాతంగా నమోదయ్యాయి. ఈ కాలంలో దేశీయంగా వాహన పరిశ్రమ డిమాండ్ మందగించినట్లు కంపెనీ పేర్కొంది. అయితే ఎగుమతులు పుంజుకున్నట్లు వెల్లడించింది. దేశీయంగా వాహన విక్రయాలు 4.5 శాతం క్షీణించి 4,30,889 యూనిట్లకు పరిమితంకాగా.. ఎగుమతులు 37 శాతంపైగా జంప్ చేసి 96,972 యూనిట్లను తాకాయి. వెరసి 1 శాతం వృద్ధితో మొత్తం 5,27,861 వాహనాలను విక్రయించింది.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు స్వల్ప వృద్ధితో రూ. 12,634 వద్ద ముగిసింది.

## హెచ్‌యూఎల్ లాభం ప్లస్

**క్యూ1లో రూ. 2,768 కోట్లు**



**న్యూఢిల్లీ:** ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్(హెచ్‌యూఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్ (క్యూ1)లో నికర లాభం 6% పుంజుకుని రూ.2,768 కోట్లను తాకింది. గతంలో చెల్లించిన పన్నులను తిరిగి మదింపు చేయడంతో నమోదైన లబ్ధి ఇందుకు సహకరించినట్లు కంపెనీ పేర్కొంది. గతేడాది (2024–25) ఇదే కాలంలో రూ. 2,612 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 5 శాతం వృద్ధితో రూ. 16,296 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 15,497 కోట్ల ఆదాయం అందుకుంది. కాగా.. పన్నుకు ముందు లాభం 6% క్షీణించి రూ. 3,303 కోట్లకు పరిమితమైంది. గత క్యూ1లో ఇది రూ.3,529 కోట్లుగా నమోదైంది. అయితే పన్ను ప్రొవిజన్లను తిరిగి మదింపు చేయడం ద్వారా నికర లాభం మెరుగుపడినట్లు కంపెనీ తెలిపింది.

**విభాగాలవారీగా..:** హెచ్‌యూఎల్ గృహ సంరక్షణ విభాగం అమ్మకాలు 2% పుంజుకుని రూ. 5,777 కోట్లను తాకాయి. లాక్మే తదితర సౌందర్య బ్రాండ్ల నుంచి 11% అధికంగా రూ.3,631 కోట్లు లభించింది. వ్యక్తిగత సంరక్షణ బిజినెస్ నుంచి 6% వృద్ధితో రూ. 2,540 కోట్లు వచ్చింది. ఫుడ్ బిజినెస్ 4% బలపడి రూ. 4,016 కోట్లయ్యింది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌యూఎల్ షేరు 3.5% ఎగసి రూ. 2,522 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ట్రంప్ 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలు తప్పుగా దొర్లినవే... | కోల్ ఇండియా 5.50 డివిడెండ్

# సాక్షి స్పోర్ట్స్



### సెమీఫైనల్లో అర్జున్ ఓటమి

**రియాద్:** ఈ-స్పోర్ట్స్ వరల్డ్‌కప్‌లో భాగంగా చెస్ ఈవెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, తెలంగాణ ప్లేయర్ ఇరిగేశి అర్జున్ మూడో స్థానం కోసం పోటీపడనున్నాడు. గురువారం జరిగిన తొలి సెమీఫైనల్లో అర్జున్ 1–4 పాయింట్ల తేడాతో అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయాడు. తొలి గేమ్‌లో అలీరెజా 58 ఎత్తుల్లో నెగ్గగా... రెండో గేమ్‌ను అర్జున్ 64 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. మూడో గేమ్‌లో అలీరెజా మళ్లీ 58 ఎత్తుల్లోనే గెలుపొందగా... నాలుగో గేమ్‌ను అర్జున్ 58 ఎత్తుల్లోనే 'డ్రా'గా ముగించాడు. ఐదో గేమ్‌లో అలీరెజా 26 ఎత్తుల్లో అర్జున్‌పై గెలిచాడు. రెండో సెమీఫైనల్లో కార్ల్‌సన్‌తో నకమురా (అమెరికా) తలపడతాడు. అంతకుముందు జరిగిన క్వార్టర్ ఫైనల్లో అర్జున్ 2.5–1.5తో నిపోమ్‌నిషి (రష్యా)పై నెగ్గాడు. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ నిహాల్ సరీన్ క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించాడు. నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో నిహాల్ 0.5–2.5తో ఓడిపోయాడు.

## తరుణ్ సంచలనం

- ప్రపంచ 15వ ర్యాంకర్‌పై గెలుపుతో క్వార్టర్ ఫైనల్లోకి
- శ్రమించి నెగ్గిన సాత్విక్–చిరాగ్ జోడీ



**మకావ్:** అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్న భారత షట్లర్, హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నేపల్లి తన కెరీర్‌లో గొప్ప విజయాన్ని అందుకున్నాడు. మకావ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 టోర్నీలో ప్రపంచ 47వ ర్యాంకర్ తరుణ్ సంచలనం సృష్టించాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో తరుణ్ 19–21, 21–14, 22–20తో ప్రపంచ 15వ ర్యాంకర్, టాప్ సీడ్ లీ చెక్ యు (హాంకాంగ్)ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 60 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తరుణ్ తొలి గేమ్‌లో ఒకదశలో 7–1తో ఆధిక్యంలో ఉన్నప్పటికీ అదే జోరును కొనసాగించలేకపోయాడు. తొలి గేమ్ చేజార్చుకున్నప్పటికీ ఆందోళనకు గురి కాకుండా సంయమనంతో ఆడిన తరుణ్ రెండో గేమ్‌ను దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచాడు. హోరాహోరీగా సాగిన నిర్ణాయక మూడో గేమ్‌లు పలుమార్లు స్కోర్లు సమమయ్యాయి. ఒకదశలో 17–14తో ముందంజ వేసిన తరుణ్ ఆ తర్వాత తడబడి స్కోరును 20–20తో సమం చేసుకున్నాడు. అయితే వెంటనే వరుసగా రెండు పాయింట్లు నెగ్గిన తరుణ్ చిరస్మరణీయ విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. భారత్‌కే చెందిన లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్ చేరగా... ఆయుశ్ శెట్టి నిష్క్రమించాడు. లక్ష్య సేన్ 21–14, 14–21, 21–17తో చికో వర్డోయో (ఇండోనేసియా)పై నెగ్గగా... ఆయుశ్ 18–21, 16–21తో జస్టిన్ హో (మలేసియా) చేతిలో ఓడిపోయాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో రక్షిత శ్రీ (భారత్) 21–14, 10–21, 11–21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో తనీషా క్రాస్టో–ధ్రువ్ కపిల (భారత్) ద్వయం 21–19, 13–21, 18–21తో జిమ్మీ వోంగ్–లాయ్ పె జింగ్ (మలేసియా) జంట చేతిలో ఓటమి పాలైంది.

పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జంట క్వార్టర్ ఫైనల్ చేరింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ 10–21, 22–20, 21–16తో కకేరు కుమగాయ్–హిరోకి నిషి (జపాన్)లపై గెలిచింది. 61 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌ను కోల్పోయిన భారత జోడీ రెండో గేమ్‌లో 19–20తో ఓటమి అంచుల్లో నిలిచింది. అయితే పట్టుదలతో పోరాడి వరుసగా మూడు పాయింట్లు నెగ్గిన భారత ద్వయం రెండో గేమ్‌ను నెగ్గి మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో గేమ్‌లో ఆరంభంలోనే 4–0తో ముందంజ వేసిన సాత్విక్–చిరాగ్ చివరి వరకు ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని విజయాన్ని అందుకుంది.

## వైజాగ్‌లో ప్రో కబడ్డీ లీగ్

**ఈ నెల 29 నుంచి 12వ సీజన్ షురూ**



**ముంబై:** ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్ పోటీలకు రంగం సిద్ధమైంది. ఈ నెల 29 నుంచి టోర్నీ జరుగుతుంది. 12 జట్లు పాల్గొంటున్న పీకేఎల్ లీగ్ దశ మ్యాచ్‌ల కోసం ఢిల్లీ, జైపూర్, చెన్నై, విశాఖపట్నంలను వేదికలుగా నిర్ణయించారు. టోర్నీ లీగ్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను గురువారం విడుదల చేశారు. తెలుగు టైటాన్స్ జట్టు ఈసారి హైదరాబాద్ నుంచి తమ హోం గ్రౌండ్‌ను విశాఖపట్నానికి మార్చింది. తొలి దశ పోటీల్లో భాగంగా వైజాగ్‌లోనే తెలుగు టైటాన్స్, తమిళ్ తలైవాస్‌తో ఆగస్టు 29న జరిగే మొదటి మ్యాచ్‌తో టోర్నమెంట్ మొదలవుతుంది. ఏడేళ్ల తర్వాత ప్రో కబడ్డీ లీగ్ మ్యాచ్‌లు వైజాగ్‌లో జరుగుతున్నాయి. 2018లో చివరిసారిగా ఇక్కడ పోటీలు నిర్వహించారు. సెప్టెంబర్ 12 నుంచి రెండో దశను జైపూర్‌లో, సెప్టెంబర్ 29 నుంచి చెన్నైలో, అక్టోబర్ 13 నుంచి ఢిల్లీలో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. లీగ్ 'ప్లే ఆఫ్స్' షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తారు. మ్యాచ్‌లన్నీ స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్, జియో హాట్‌స్టార్‌లలో ప్రసారమవుతాయి.

## తొలిరోజు తడబాటు

సిరీస్ సమం కోసం గెలవాల్సిన సమరాన్ని భారత్ సరిపోలని ఆటతీరుతో మొదలు పెట్టింది. ప్రతికూల వాతావరణం, కలిసిరాని పిచ్, నిలకడలేని బ్యాటింగ్... అన్నీ టీమిండియాకు ప్రతికూలంగా మారాయి. వాన చినుకులు పదేపదే ఇబ్బంది పెట్టిన తొలిరోజు ఆటలో భారత్ అడుగడుగునా కష్టాల్నే ఎదుర్కొంది. బ్యాటర్ల వైఫల్యంతో సెషన్, సెషన్‌కు వికెట్లను కోల్పోయిన భారత్ మొదటి రోజు అతికష్టంగా 200 పరుగుల స్కోరు దాటింది.

**తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 204/6**

- ఆదుకున్న కరుణ్ నాయర్
- టీమిండియాను దెబ్బతీసిన అట్కిన్సన్, టంగ్



గిల్

**లండన్:** చికాకు పెట్టిన చినుకులు, ప్రతికూల పరిస్థితుల మధ్య ఆఖరి టెస్టును భారత్ అతిక్లిష్టంగా మొదలు పెట్టింది. విలువైన వికెట్లను తక్కువ స్కోరుకే కోల్పోయి కష్టంగా బ్యాటింగ్ చేసింది. మరోవైపు సిరీస్‌లో ఇదివరకే ఆధిక్యంలో ఉన్న ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు... ఆధిపత్యంతో ఐదో టెస్టుకు శ్రీకారం చుట్టింది. సమష్టి బౌలింగ్ ప్రదర్శనతో టీమిండియాను బెంబేలెత్తించింది. దీంతో తొలిరోజు ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 64 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేసింది. కరుణ్ నాయర్ (98 బంతుల్లో 52 బ్యాటింగ్; 7 ఫోర్లు), వాషింగ్టన్ సుందర్ (45 బంతుల్లో 19 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. ఈ మ్యాచ్‌లో భారత్ నాలుగు మార్పులతో బరిలోకి దిగింది. గాయపడిన రిషభ్ పంత్ స్థానంలో ధ్రువ్ జురేల్‌ను, వెటరన్ సీమర్ బుమ్రా, అన్షుల్ కంబోజ్, శార్దుల్ ఠాకూర్ స్థానాల్లో వరుసగా ఆకాశ్‌దీప్, ప్రసిధ్ కృష్ణ, కరుణ్ నాయర్‌లను తుది జట్టులోకి తీసుకున్నారు. మరోవైపు ఇంగ్లండ్ జట్టు రెగ్యులర్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఈ మ్యాచ్‌కు దూరమవగా ఒలీ పోప్ సారథ్యం వహిస్తున్నాడు. ఇంగ్లండ్ బౌలర్లలో అట్కిన్సన్, జోష్ టంగ్ రెండు వికెట్ల చొప్పున తీశారు. వర్షం కారణంగా తొలి రోజు 64 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యపడింది.

**జైస్వాల్ 2, రాహుల్ 14...**

టాస్ నెగ్గిన ఇంగ్లండ్ కెప్టెన్ ఒలీ పోప్ పరిస్థితులను గమనించి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. బౌలర్లు తమ కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ ఆరంభ ఓవర్లలోనే భారత్‌ను కష్టాల్లోకి నెట్టేశారు. నాలుగో ఓవర్ తొలి బంతికే యశస్వి జైస్వాల్ (2)ను అట్కిన్సన్, కాసేపటికి కేఎల్ రాహుల్ (14)ను వోక్స్ అవుట్ చేశారు. సాయి సుదర్శన్ (38; 6 ఫోర్లు), శుబ్‌మన్ గిల్ (21; 4 ఫోర్లు) నిలదొక్కుకునే ప్రయత్నాలపై చినుకులు కురవడంతో 72/2 స్కోరు వద్ద ఆట ఆగింది. ముందు వాన... తర్వాత తడారని మైదానం కోసం మ్యాచ్ చాలా సేపు నిలిపివేశారు. ఈ లోపే లంచ్ బ్రేక్‌ను కానిచ్చారు. ఫీల్డ్ అంపైర్లు పిచ్, అవుట్ ఫీల్డ్‌ను పరిశీలించిన తర్వాత రెండో సెషన్ ఆలస్యంగానే మొదలైంది.

**గిల్ నిర్లక్ష్యం**

తొలి సెషన్ ఎదురుదెబ్బల నుంచి ఇంకా కోలుకోకముందే రెండో సెషన్‌లో కెప్టెన్ శుబ్‌మన్ గిల్ అవుట్‌తో కోలుకోలేని దెబ్బ తగిలింది. బంతి ఫీల్డర్ చేతుల్లోకి వెళుతున్న క్రమంలోనే పరుగుకు ప్రయత్నించి గిల్ వికెట్‌ను సమర్పించుకున్నాడు. కవర్స్ దిశగా బంతిని బాదిన శుబ్‌మన్... ఫీల్డర్ అట్కిన్సన్‌ను సమీపిస్తున్న బంతిని చూసుకోకుండానే పరుగు కోసం సగం పిచ్‌ను దాటేశాడు. సాయి సుదర్శన్ వారించినా పట్టించుకోలేదు. అట్కిన్సన్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా బంతిని నేరుగా వికెట్లకు (డైరెక్ట్ హిట్) త్రో చేయడంతో గిల్ నిష్క్రమించాడు. దీంతో 45 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యం రనౌట్‌తో కూలింది. టెస్టుల్లో శుబ్‌మన్ ఇలా రనౌట్ కావడం ఇది రెండోసారి. ఏడాది క్రితం రాజ్‌కోట్‌లో అదికూడా ఇంగ్లండ్‌తోనే జరిగిన టెస్టులో అతను రనౌటయ్యాడు. రవీంద్ర జడేజా (9), ధ్రువ్ జురేల్ (19) తక్కువే చేశారు.

**నాయర్ ఫిఫ్టీ**


భారత బ్యాటింగ్ బలగమంతా చేతులెత్తేయడంతో ఒకదశలో 153 పరుగులకే 6 ప్రధాన వికెట్లను కోల్పోయింది. ఇలా క్లిష్టపరిస్థితుల్లో కరుణ్ నాయర్ టీమిండియా పాలిట ఆపద్బాంధవుడయ్యాడు. వాషింగ్టన్ సుందర్‌తో కలిసి వికెట్‌ను కాపాడుకుంటూనే ఒక్కో పరుగు జతచేస్తూ జట్టు స్కోరును 200 పరుగులు దాటించిన పోరాటం అద్భుతం. ఈ క్రమంలోనే అతను 89 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. ఇద్దరు అబేధ్యమైన ఏడో వికెట్‌కు 51 పరుగులు జోడించారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

**743** ఒకే టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత కెప్టెన్‌గా శుబ్‌మన్ గిల్ రికార్డు సృష్టించాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న ప్రస్తుత సిరీస్‌లో గిల్ తొమ్మిది ఇన్నింగ్స్‌లో కలిపి 743 పరుగులు చేశాడు. గతంలో ఈ రికార్డు సునీల్ గావస్కర్ (1979లో వెస్టిండీస్‌తో సిరీస్‌లో 732 పరుగులు) పేరిట ఉండేది.

**స్కోరు వివరాలు**

**భారత్ తొలి ఇన్నింగ్స్:** జైస్వాల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అట్కిన్సన్ 2; రాహుల్ (బి) వోక్స్ 14; సుదర్శన్ (సి) స్మిత్ (బి) టంగ్ 38; గిల్ (రనౌట్) 21; కరుణ్ నాయర్ (బ్యాటింగ్) 52; జడేజా (సి) స్మిత్ (బి) టంగ్ 9; జురేల్ (సి) బ్రూక్ (బి) అట్కిన్సన్ 19; సుందర్ (బ్యాటింగ్) 19; ఎక్స్‌ట్రాలు 30; **మొత్తం** (64 ఓవర్లలో 6 వికెట్లకు) 204. **వికెట్ల పతనం:** 1–10, 2–38, 3–83, 4–101, 5–123, 6–153. **బౌలింగ్:** వోక్స్ 14–1–46–1, అట్కిన్సన్ 19–7–31–2, టంగ్ 13–3–47–2, ఓవర్టన్ 16–0–66–0, బెథెల్ 2–1–4–0.



కరుణ్ నాయర్

### అధర్మసేన!



**భారత్** ఇన్నింగ్స్‌లో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. ఫీల్డ్ అంపైర్ కుమార ధర్మసేన వ్యవహారశైలి చర్చకు దారి తీసింది. 13వ ఓవర్ వేసిన టంగ్ భారత బ్యాటర్ సాయి సుదర్శన్‌కు యార్కర్ సంధించాడు. దానిని ఆడలేక సాయి కింద పడిపోయాడు. బంతి ప్యాడ్స్‌కు తగలడంతో టంగ్ ఎల్బీడబ్ల్యూ కోసం అప్పీల్ చేశాడు. దీనిని ధర్మసేన తిరస్కరించడం వరకు ఓకే. కానీ అవుట్ కాదని చెబుతూనే అతను బంతి ముందే బ్యాట్‌కు తగిలినట్లుగా కూడా తన వేళ్లతో సైగ చేశాడు. నిబంధనల ప్రకారం డీఆర్ఎస్ కోసం ఇచ్చే 15 సెకన్లు ముగిసే వరకు అంపైర్లు ఏ రీతిలో కూడా ఆటగాళ్లకు సహకరించే సంజ్ఞలు చేయరాదు. కానీ ధర్మసేన ఇలా చేయడం ఇంగ్లండ్‌కు పరోక్షంగా సహకరించినట్లయింది. తమ అప్పీల్‌పై నమ్మకం ఉంటే ఇంగ్లండ్ డీఆర్ఎస్‌కు వెళ్లేది. నాటౌట్‌గా తేలితే జట్టు రివ్యూ కోల్పోయేది. అంపైర్ వ్యవహరించిన తీరుపై అన్ని వైపుల నుంచి విమర్శలు వచ్చాయి.




# ఎగుమతులకు టారిఫ్‌ల సెగ

అమెరికా సుంకాలతో పలు రంగాలపై తీవ్ర ప్రభావం

టెక్స్‌టైల్స్, రత్న ఆభరణాలు తదితర పరిశ్రమలకు దెబ్బ

ఉపాధి అవకాశాలపైనా ఎఫెక్ట్..

నిపుణులు, పరిశ్రమ వర్గాల విశ్లేషణ

భారత ఎగుమతులపై అమెరికా ఎకాయెకిన 25 శాతం టారిఫ్‌లు ప్రకటించడం దేశీ పరిశ్రమలకు శరాఘాతంగా తగిలింది. దీనితో అమెరికన్ మార్కెట్‌పైనే ఎక్కువగా ఆధార పడుతున్న రత్నాభరణాలు, టెక్స్‌టైల్స్, ఫార్మా తదితర పలు పరిశ్రమలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందనే భయాలు నెలకొన్నాయి. అలాగే పలు రంగాల్లో భారీగా ఉపాధి అవకాశాలకు కూడా కోత పడొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికాకు కనీసం 25 శాతం ఎగుమతులు తగ్గినా, వాణిజ్య ఆదాయాలపరంగా ఏటా 21.75 బిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లుతుందని అంచనా. ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయాలు తగ్గడం వల్ల మన రూపాయి మారకం విలువ కూడా క్షీణించే అవకాశం ఉంది. అటు స్టాక్ మార్కెట్లపరంగా చూస్తే ఎగుమతుల ఆధారిత రంగాలకు చెందిన (టెక్స్‌టైల్స్, జ్యుయలరీ మొదలైనవి) సంస్థల షేర్లు తగ్గొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికాతో మన వాణిజ్యం, టారిఫ్‌లపై వివిధ రంగాలపై పడే ప్రభావాలపై ఈ ప్రత్యేక కథనం.
– బిజినెస్ డెస్క్

**రత్నాభరణాలు:** రత్నాభరణాల పరిశ్రమ మొత్తం ఎగుమతుల్లో 30 శాతం వాటా అమెరికాదే ఉంటోంది. అగ్రరాజ్యానికి ఎగుమతులు సుమారు 10 బిలియన్ డాలర్లుగా ఉంటున్నాయని రత్నాభరణాల ఎగుమతుల మండలి జీజేఈపీసీ చైర్మన్ కిరీట్ భన్సాలీ తెలిపారు. భారీ స్థాయిలో టారిఫ్‌లు విధించడం వల్ల వ్యయా పెరిగిపోవడానికి, ఎగుమతుల్లో జాప్యానికి దారి తీస్తుందని, చిన్న స్థాయి వ్యాపారుల నుంచి భారీ తయారీ సంస్థల వరకు అందరిపైనా ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ఎగుమతులు పడిపోవడం, ఆర్డర్లు రద్దు కావడం, ఎగుమతిదారుల మార్జిన్లు తగ్గిపోవడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటాయని రిద్ధిసిద్ధి బులియన్స్ (ఆర్ఎస్‌బీఎల్) ఎండీ పృథ్వీరాజ్ కొఠారీ చెప్పారు.

### టెక్స్‌టైల్స్..

- టారిఫ్‌ల వల్ల భారతీయ టెక్స్‌టైల్స్ ఎగుమతిదారులపై గణనీయంగానే ప్రతికూల ప్రభావం పడుతుందని విశ్లేషకులు తెలిపారు. మనతో పోలిస్తే వియత్నాం, ఇండొనేషియాలాంటి దేశాలపై తక్కువ సుంకాలు ఉండటం వల్ల వాటి నుంచి మరింత పోటీని ఎదుర్కొనాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఆర్డర్లు రద్దు కావడం, ధరలు తగ్గించాలంటూ ఒత్తిడి పెరగడంలాంటి పరిణామాలు చోటు చేసుకోవచ్చని ట్రేడ్ ఇంటెలిజెన్స్ సంస్థ సైబెక్స్ ఎగ్జిమ్ సొల్యూషన్స్ తెలిపింది. బంగ్లాదేశ్, వియత్నాం లాంటి దేశాల నుంచి పోటీ పెరిగి, చిన్న తయారీ సంస్థలపై ఒత్తిడి పెరుగుతుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో బ్రిటన్, యూరోపియన్ యూనియన్, జపాన్‌లాంటి ఇతర మార్కెట్లపై కూడా మరింతగా దృష్టి పెట్టాలని భారతీయ టెక్స్‌టైల్ పరిశ్రమ సమాఖ్య (సీఐటీఐ) సెక్రటరీ జనరల్ చంద్రిమా చటర్జీ చెప్పారు. భారత టెక్స్‌టైల్స్, దుస్తులకు అమెరికా అతి పెద్ద మార్కెట్‌గా ఉంటోంది. 17 బిలియన్ డాలర్ల రెడీమేడ్ దుస్తుల ఎగుమతుల్లో 5.6 బిలియన్ డాలర్ల ఉత్పత్తులు అమెరికాకే ఎగుమతవుతున్నాయి. టెక్స్‌టైల్స్, అపారెల్ పరిశ్రమ ద్వారా దాదాపు 4.5 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు. పరిశ్రమ దెబ్బతింటే వీరి ఉపాధిపైనా ప్రభావం పడుతుంది.

### ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ పరికరాలు..

- టెలికం పరికరాలు, మొబైల్ ఫోన్స్, సర్క్యూట్ బోర్డుల్లాంటి ఉత్పత్తుల ఎగుమతులు 12 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంటున్నాయి. టారిఫ్‌ల వల్ల చౌకగా లభించే ఎలక్ట్రానిక్స్ విషయంలో మిగతా దేశాలతో భారత్ పోటీ పడే సామర్థ్యం తగ్గుతుంది. దీనితో ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు నెమ్మదించవచ్చు.

### సీఫుడ్..

గత ఆర్థిక సంవత్సరంలో భారత్ దాదాపు 2.3 బిలియన్ డాలర్ల విలువ చేసే రొయ్యలను అమెరికా మార్కెట్‌కు ఎగుమతి చేసింది. అమెరికాకు మొత్తం సీఫుడ్ ఎగుమతుల్లో ఇది 90 శాతం కావడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా ఎగుమతులు ఉంటుండటంతో తెలుగువారిపైనా ఈ ప్రభావం పడొచ్చని అంచనా. ఈ విభాగంలో మనతో పోలిస్తే టారిఫ్‌లు తక్కువగా ఉన్న ఈక్వెడార్‌తో పోటీ తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. అయితే, బ్రిటన్‌తో ఇటీవలే వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంతో అమెరికా టారిఫ్‌ల ప్రభావం కాస్త తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.

### ఫార్మా.. మెడికల్ డివైజ్‌లు..

చౌక జనరిక్స్ ఔషధాలకు సంబంధించి అమెరికా అవసరాల్లో దాదాపు 47 శాతాన్ని భారత్ తీరుస్తోంది. టారిఫ్‌లతో ఎగుమతులపై ప్రభావం పడితే భారత ఫార్మా సంస్థల లాభాలు తగ్గుతాయి. పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు నెమ్మదిస్తాయని, కొత్త ఔషధాలకు అనుమతులు నిలిచిపోతాయని, అలాగే కొత్త ఆవిష్కరణలపై ఎఫెక్ట్ పడుతుందని భారతీయ మెడికల్ డివైజ్‌ల పరిశ్రమ సమాఖ్య ఏఐఎంఈడీ ఫోరం కోఆర్డినేటర్ రాజీవ్ నాథ్ తెలిపారు. అయితే, టారిఫ్‌ల పరంగా చైనా, భారత్ మధ్య 15–20 శాతం మేర వ్యత్యాసం కొనసాగినంత కాలం మెడికల్ డివైజ్‌ల పరిశ్రమకు కాస్త సానుకూలంగానే ఉంటుందని పేర్కొన్నారు.

### ఇంజనీరింగ్ ఉత్పత్తులు..

- గణాంకాల ప్రకారం అమెరికాకు ఇంజనీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులు 18.3 బిలియన్ డాలర్ల స్థాయిలో నమోదయ్యాయి. మన ఉత్పత్తులు ఖరీదుగా మారితే అమెరికన్లు మెక్సికోలాంటి దేశాలవైపు మళ్లొచ్చు. దీనితో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న మేకిన్ ఇండియా కార్యక్రమానికి విఘాతం కలగవచ్చు.

### వ్యవసాయ ఉత్పత్తులు..

- అమెరికాకు మన వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు 5.6 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నాయి. సుంకాలతో భారత్ నుంచి ఆహార పదార్థాల ధరలు పెరిగిపోయి, అమెరికన్లు దిగుమతులను తగ్గించుకోవచ్చు. ప్రత్యామ్నాయ మార్కెట్ల వైపు మళ్లొచ్చు. దీనితో రైతులు, ఎగుమతిదార్లపై ప్రభావం పడొచ్చు.

### ఉక్కు, రసాయనాలు, పెట్రోలియం ఉత్పత్తులు..

అమెరికాకు ఈ ఉత్పత్తుల ఎగుమతులు 8 బిలియన్ డాలర్ల పైగా ఉన్నాయి. టారిఫ్‌లతో వల్ల వియత్నాం, బ్రెజిల్‌లాంటి దేశాలు పోటీకి రావడం వల్ల మన దగ్గర ఈ రంగంలోని బడా కంపెనీలతో పాటు చిన్న, మధ్యతరహా సంస్థలపైనా ప్రభావం పడుతుంది.

### అమెరికన్లకూ 'చేదు' మాత్రే ..

అమెరికా టారిఫ్‌లు భారత్‌కి కొంత సమస్యాత్మకమే అయినప్పటికీ, దీర్ఘకాలంలో వాటి ప్రభావం అమెరికన్లపైనే ఎక్కువగా ఉంటుందని నిపుణులు, పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. భారత్ నుంచి వచ్చే ఉత్పత్తులపై సుంకాలు విధించడం వల్ల, అక్కడ వాటి ధరలు పెరిగిపోయి స్థానికులు మరింతగా వెచ్చించాల్సి వస్తుందని ఫార్మా ఎగుమతి సంస్థల సమాఖ్య ఫార్మెక్సిల్ చైర్మన్ నమిత్ జోషి తెలిపారు. భారీ ఎత్తున, నాణ్యమైన ఔషధాలను చౌకగా అందించే ప్రత్యామ్నాయాలను ఇప్పటికిప్పుడు దొరకపుచ్చుకోవడం పెద్ద సవాలుగానే ఉంటుందని చెప్పారు.

### మొత్తం ఎగుమతుల్లో అయిదో వంతు వాటాతో భారత్‌కు అమెరికా కీలకంగా ఉంటోంది.

- భారీగా ఉపాధి కల్పించే టెక్స్‌టైల్స్, వ్యవసాయం, లెదర్, రత్నాభరణాల్లాంటి పరిశ్రమల నుంచి 2025 ఆర్థిక సంవత్సరంలో ఎగుమతుల్లో అమెరికా వాటా ఏకంగా 35 శాతంగా నమోదైంది. టారిఫ్‌లతో ఈ పరిశ్రమలు దెబ్బతింటే, ఉపాధి అవకాశాలపై కూడా దాని ప్రభావం పడే అవకాశం ఉంది. రత్నాభరణాల పరిశ్రమలో 1 లక్ష పైగా ఉద్యోగాలపై ప్రభావం పడొచ్చని అంచనా.
- గత ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు భారత్ 87 బిలియన్ డాలర్ల విలువ చేసే ఉత్పత్తులను ఎగుమతి చేయగా, 46 బిలియన్ డాలర్ల మేర దిగుమతులు చేసుకుంది. అమెరికాతో వాణిజ్యంలో భారత్‌కు సుమారు 41 బిలియన్ డాలర్ల మేర మిగులు ఉంది. అటు సర్వీసులపరంగా చూసినా అమెరికాకు 2023లో 36.4 బిలియన్ డాలర్ల ఎగుమతులు చేయగా, 34 బిలియన్ డాలర్ల దిగుమతులు చేసుకుంది. భారత్ పక్షాన సుమారు 2.4 బిలియన్ డాలర్ల మిగులు నమోదైంది.

**9 కేటగిరీల్లో ఎగుమతులకు అమెరికా అగ్రస్థానంలో ఉంటోంది.**

| | | | |
|---|---|---|---|
| ఇంజనీరింగ్ ఉత్పత్తులు | 18.3 | రత్నాభరణాలు | 9.3 |
| ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు | 14.6 | అగ్రి ఉత్పత్తులు | 5.6 |
| టెక్స్‌టైల్స్ | 11 | మెరైన్ ఉత్పత్తులు | 2.7 |
| ఫార్మా | 10.5 | లెదర్ ఉత్పత్తులు | 1 |
| రసాయనాలు, అనుబంధ ఉత్పత్తులు | 10 | (2024–25 ఆర్థిక సంవత్సర గణాంకాలు) | |
| విలువ (బిలియన్ డాలర్లలో) | | | |

**ఏయే పరిశ్రమలకు ప్రతికూలం..**

- టెక్స్‌టైల్స్/దుస్తులు
- రత్నాభరణాలు
- ఫార్మా
- వాహనాలు, ఆటో విడిభాగాలు
- ఎలక్ట్రానిక్స్/మొబైల్ డివైజ్‌లు
- ఇంజనీరింగ్ ఉత్పత్తులు/మెటల్స్
- సీఫుడ్/అగ్రి ఎగుమతులు

## క్లుప్తంగా...



ఈనెల 13న హైదరాబాద్‌లో జరిగే తన కుమారుని వివాహానికి రావాలని కోరుతూ.. పార్టీ అధినేత కేసీఆర్‌కు వివాహ పత్రికను అందిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ సోమ భరత్ కుమార్

### ఐఎంఎస్ డైరెక్టర్‌గా డాక్టర్ సుధాకర్

సాక్షి, హైదరాబాద్: ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) సంచాలకునిగా డాక్టర్ సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిషోర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో స్పెషల్ గ్రేడ్ సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న సుధాకర్‌ను ఐఎంఎస్ డైరెక్టర్‌గా నియమించారు. 15 రోజుల్లో నిర్దేశించిన విధుల్లో చేరాలని ఆదేశించారు. ఐఎంఎస్ డైరెక్టర్ పోస్టు దాదాపు ఆరేళ్లుగా ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. గతంలో పూర్తిస్థాయి డైరెక్టర్‌గా పనిచేసిన దేవికారాణి ఏసీబీ కేసులో అరెస్టయినప్పటి నుంచి.. ఈ పోస్టులో ఇన‌చార్జిలే కొనసాగుతున్నారు.

### డీపీహెచ్ రవీందర్ నాయక్ సహా ఏడుగురిపై విచారణ

**ప్రజెంటింగ్ ఆఫీసర్‌గా డాక్టర్ అజయ్**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వైద్యశాఖలో ప్రజారోగ్య సంచాలకుడు (డీపీహెచ్) డాక్టర్ బి.రవీందర్ నాయక్‌తో పాటు ఏడుగురు ప్రభుత్వ ఉద్యోగులపై జరుగుతున్న శాఖాపరమైన విచారణకు.. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌ను ప్రజెంటింగ్ ఆఫీసర్‌గా నియమించారు. తెలంగాణ సివిల్ సర్వీసెస్ నియమావళి రూల్ 20 ప్రకారం డిపార్ట్‌మెంటల్ ప్రొసీడింగ్స్ ప్రారంభమయ్యాయి. ఈ విచారణను సమర్థంగా కొనసాగించేందుకు డాక్టర్ జె.అజయ్ కుమార్‌ను ప్రజెంటింగ్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించింది. ఆయన విచారణ అధికారికి డిసిప్లినరీ అథారిటీ తరపున కేసును వినిపించనున్నారు. మార్చి 27న హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ జారీ చేసిన 2జీవోల ఆధారంగా కమిషనర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

### మరో ఏడాది డీటీసీపీగా దేవేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.దేవేందర్‌రెడ్డి ఉద్యోగ విరమణ అనంతరం.. ఆయన బాధ్యతలను మరో ఏడాది పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆగస్టు 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది జూలై 31వ తేదీ వరకు ఆయనను పునర్నియమిస్తూ.. పురపాలక శాఖ కార్యదర్శి ఇలంబర్తి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దేవేందర్ రెడ్డి డీటీసీపీ విధులతోపాటు అదనంగా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ బాధ్యతలను చూస్తారని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

## మెడికల్ మేనేజ్‌మెంట్ కోటా ప్రవేశాలకు నోటిఫికేషన్

7 వరకు రిజిస్ట్రేషన్లకు గడువు • బీ, సీ కేటగిరీల్లో కూడా ఈ రిజిస్ట్రేషన్ల ద్వారానే సీట్లు



సాక్షి, హైదరాబాద్: కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రైవేట్ నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్, డెంటల్ కాలేజీలతోపాటు అనురాగ్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న నీలిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి ఆగస్టు 7 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవలసి ఉంటుంది. అభ్యర్థులు నీట్–యూజీ 2025లో అర్హత సాధించి ఉండాలి. జనరల్ కేటగిరికి చెందిన విద్యార్థులకు 50వ పర్సంటైల్‌లో కనీసం 144 మార్కులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు 40వ పర్సంటైల్‌లో 113 మార్కులు, ఓసీ పీడబ్ల్యూడీ వర్గానికి 45వ పర్సంటైల్‌లో 127 మార్కులు కనీస అర్హతగా వర్సిటీ పేర్కొంది.

**కన్వీనర్ కోటా 50 శాతం పోగా మిగిలిన సీట్లలో...**

ప్రైవేటు నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్, డెంటల్ కళాశాల్లో 50 శాతం కన్వీనర్ కోటా పోగా మిగిలిన సీట్లను మేనేజ్‌మెంట్ కోటాలో బీ కేటగిరీ కింద కేటాయిస్తారు. బీ కేటగిరి సీట్లలో కూడా 85 శాతం స్థానిక అభ్యర్థులకు రిజర్వు చేశారు. మిగిలిన 15 శాతం సీట్లు దేశవ్యాప్తంగా అభ్యర్థులకు అవకాశం ఉంటుంది. నీలిమా కళాశాలలో బీ కేటగిరిలో 25 శాతం మాత్రమే స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మైనారిటీ కాలేజీల్లో సీట్లు ముస్లిం అభ్యర్థులకే ఇవ్వనున్నారు. చివరి దశలో అర్హులు లేకపోతే 30 శాతం వరకు నాన్ మైనారిటీ అభ్యర్థులకు కేటాయించవచ్చు. గడువు తర్వాత తాత్కాలిక మెరిట్ జాబితా తయారు చేసి తర్వాత వెబ్ కౌన్సెలింగ్ ద్వారా సీట్ల కేటాయింపు జరుగుతుంది. ప్రవేశానికి సంబంధించి పూర్తి వివరాలను knruhs.telangana.gov.in వెబ్‌సైట్ లో పొందుపరిచారు. కన్వీనర్ కోటా కౌన్సెలింగ్ తరువాత మేనేజ్‌మెంట్ కోటాలో బీ, సీ కేటగిరీ సీట్లకు కౌన్సెలింగ్ జరుగుతుంది.

**ఫీజు వివరాలు..**

- దరఖాస్తు ఫీజు: రూ.12,000
- ఎన్‌ఆర్ఐ కోటాకు లేట్ అప్లికేషన్ ఫీజు: రూ.20,000
- విశ్వవిద్యాలయ ఫీజు (బీ కేటగిరీ: ఎంబీబీఎస్) రూ.40,000, బీడీఎస్‌కి రూ.20,000
- ఎన్‌ఆర్ఐ కోటా సీట్లకు వర్సిటీ ఫీజు: ఎంబీబీఎస్‌కి రూ.70,000, బీడీఎస్‌కి రూ.40,000
- ట్యూషన్ ఫీజు: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉండే ట్యూషన్ ఫీజును కళాశాలలకు చేరే సమయంలో డీడీ రూపంలో చెల్లించాలి.

**హెల్ప్‌లైన్ నంబర్లు:**

నిబంధనల కోసం: 7901098840, 9490585796
సాంకేతిక సహాయం: 9392685856, 9059672216
సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం: 9866092370

## రేపటి నుంచి టీచర్ల పదోన్నతులు

11వ తేదీ వరకు కొనసాగనున్న ప్రక్రియ

షెడ్యూల్ విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల పదోన్నతులకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఇ.నవీన్ నికోలస్ షెడ్యూల్‌ను గురువారం విడుదల చేశారు. గెజిటెడ్ హెడ్‌మాస్టర్ గ్రేడ్–2, స్కూల్ అసిస్టెంట్ కేటగిరీల్లో అందుబాటులో ఉన్న ఖాళీలను పదోన్నతులతో భర్తీ చేస్తారు. గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్–2 కేటగిరికి సంబంధించి మల్టీజోన్–1 పరిధిలో 490 పోస్టులు, మల్టీజోన్–2 పరిధిలో 410 పోస్టులున్నాయి. అదేవిధంగా ఎల్ఎఫ్ఎల్ హెడ్‌మాస్టర్ కేటగిరీలో 640 ఖాళీలు, స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో 2,320 ఖాళీలు ఉన్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. అందుబాటులో ఉన్న ఖాళీలను నిబంధనలకు లోబడి ఆగస్టు 2 నుంచి 11వ తేదీలోపు భర్తీ చేయాలని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాశాఖ అధికారులను నవీన్ నికోలస్ ఆదేశించారు.

**పదోన్నతుల షెడ్యూల్ ఇలా...**

| తేదీ | అంశం |
|---|---|
| ఆగస్టు 2 | వెబ్‌సైట్‌లో ఖాళీల ప్రదర్శన |
| ఆగస్టు 3 | సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ |
| ఆగస్టు 4 | అభ్యంతరాల పరిష్కారం, తుది జాబితా విడుదల |
| ఆగస్టు 6 | హెడ్‌మాస్టర్ల గ్రేడ్ -2 వెబ్ ఆప్షన్లు |
| ఆగస్టు 7 | స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్ 2 హెడ్‌మాస్టర్ ప్రమోషన్స్ ప్రకటన |
| ఆగస్టు 8 | ఎస్జీటీల తుది జాబితా విడుదల |
| ఆగస్టు 10 | ఎస్జీటీలకు వెబ్ ఆప్షన్లు |
| ఆగస్టు 11 | ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి ఉత్తర్వులు |

## సత్వరమే 259 మె.వా. సౌర విద్యుత్ ప్లాంట్లు

అధికారులతో సమీక్షలో సింగరేణి సీఎండీ బలరాం ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది చివరిలోగా 259 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను సింగరేణి సీఎండీ ఎన్.బలరాం ఆదేశించారు. గురువారం సింగరేణి భవన్‌లో చేపట్టిన ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న 122 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను అక్టోబర్‌లోగా పూర్తి చేయాలని.. మిగిలిన 137 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణాన్ని ఏడాది చివరిలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మొత్తంగా 504 మెగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యం సాధించేలా ప్రణాళికలు రచించాలన్నారు. సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఏజెన్సీలు, అధికారులను ఆయన హెచ్చరించారు. రామగుండంలో సింగరేణి చేపట్టనున్న గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటుకు గల అవకాశాలపై సానుకూల నివేదిక వచ్చిన నేపథ్యంలో ప్లాంటు నిర్మాణానికి వేగంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ ప్లాంట్ పూర్తయితే రోజుకు 5 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి అవుతుందని.. తద్వారా సింగరేణికి ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. అలాగే మణుగూరులో జియోథర్మల్ విద్యుదుత్పత్తికి అవకాశం ఉందని నివేదికలు చెబుతున్నందున ఓఎన్జీసీతో కలిసి ప్లాంట్ ఏర్పాటుకు తక్షణమే సన్నాహాలు ప్రారంభించాలని ఆదేశించారు. ఓపెన్ కాస్ట్ గనుల దంపులపై పవన విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అధ్యయనం త్వరగా పూర్తిచేయాలని అధికారులకు బలరాం సూచించారు. అలాగే మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గనితోపాటు ఇతర ఓపెన్ కాస్ట్ గనుల్లో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు గల అవకాశాలపై అధ్యయనం జరపాలన్నారు.

## 'సిగాచి'పై దర్యాప్తు పురోగతి ఏంటి?: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో ఘోర పేలుడు ప్రమాదంపై ఏ చర్యలు చేపట్టారో చెప్పాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది.ఎంత మంది చనిపోయారు.. ఈ ఘటనకు ఎవరు బాధ్యులు.. ఘటన జరిగిన సమయంలో ఎంతమంది కార్మికులున్నారు.. ఇలా దర్యాప్తు పురోగతిని తెలియజేస్తూ 3 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. సిగాచి పరిశ్రమలో జూన్ 30న సంభవించిన పేలుడులో 54 మంది మృతి చెందగా, 28 మంది గాయపడ్డారని, 8 మంది ఆచూకీ ఇంకా లభించాల్సి ఉందని హైదరాబాద్ స్నేహపురి కాలనీకి చెందిన రిటైర్డ్ సైంటిస్ట్ కలపాల బాబురావు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. రోజులు గడిచిపోతున్నాయి కదా.. అని విషాద ఘటనను మరుగున పడేసే ప్రయత్నం చేయకూడదని స్పష్టం చేసింది. మరణించిన కార్మికుల కుటుంబాలకు సాయం చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించింది. తదుపరి విచారణ ఆగస్టు 27కు వాయిదా వేసింది.

## చిరుత చిక్కింది..

చిలుకూరు ప్రాంతంలో చిరుతను బంధించాం: పీసీసీఎఫ్ సువర్ణ

వన్యప్రాణులు కనిపిస్తే 040-23231772కు ఫోన్ చేయండి

సాక్షి, హైదరాబాద్: కొద్దిరోజులుగా హైదరాబాద్ శివార్లలోని చిలుకూరు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలను బెంబేలెత్తించిన చిరుతపులిని ఎట్టకేలకు అటవీశాఖ అధికారులు బంధించారు. చిరుతను పూర్తి ఆరోగ్యంగా బుధవారం రాత్రి బంధించినట్టు పీసీసీఎఫ్ డా.సువర్ణ గురువారం తెలిపారు. ఈ చిరుత అడవి నుంచి బయటకు వచ్చి గత 25రోజులుగా ఆయా ప్రాంతాల్లో సంచరించిందని వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా క్రూర జంతువులు కనిపిస్తే వెంటనే అటవీశాఖ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇందుకోసం ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నంబర్: 040-23231772ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గురువారం అరణ్యభవన్‌లో అటవీ అధికారులు ఏలూసింగ్ మేరు, ప్రియాంక వర్గీస్, ఎ.శంకరన్‌లతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. వన్యప్రాణులపై ప్రజలు కక్షపూరితంగా వ్యవహరించి విషప్రయోగం వంటి పనులు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. క్రూరమృగాల దాడిలో మరణించిన వారికి ఇచ్చే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు ప్రభుత్వం పెంచినట్టు వెల్లడించారు.

**జీవో 49 నిలుపుదల:** మహారాష్ట్ర నుంచి పులులు కవ్వాల్ టైగర్ రిజర్వ్ (కేటీఆర్)లోకి వచ్చేందుకు వీలుగా 'కారిడార్ ఫారెస్ట్'ను టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటిస్తూ తీసుకొచ్చిన జీవో 49ని ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపేసిందని పీసీసీఎఫ్ సువర్ణ తెలిపారు. కన్జర్వేషన్ జోన్ అనేది రిజర్వ్ ఫారెస్ట్‌ను పోలి ఉంటుందని, టైగర్ రిజర్వ్‌లో ఉన్న కఠిన నిబంధనలు వీటిలో ఉండవని చెప్పారు. కేటీఆర్ లోపల ఉన్న 85 గ్రామాలతోపాటు మొత్తం 300 పైచిలుకు గ్రామాలను ఖాళీ చేయిస్తారనే అపోహ ప్రజల్లో ఏర్పడిందని, అలాంటిది ఏమీ జరగదని వివరణ ఇచ్చారు.





## ఉద్యోగ విరమణ రోజే పెన్షన్ పత్రాలు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ విరమణ చేసిన రోజే పెన్షన్ చెల్లింపు పత్రాలను (పీపీవో) అందజేస్తున్నామని ప్రావిడెంట్ ఫండ్ ప్రాంతీయ కమిషనర్–1 తేజ్ ప్రతాప్ సింగ్ యాదవ్ స్పష్టం చేశారు. పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం జరిగిన ప్రయాస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్ జిల్లాల్లో ఉద్యోగ విరమణ చేసిన పలువురికి తేజ్ ప్రతాప్ సింగ్ యాదవ్ పీపీవో పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ కమిషనర్–2 వి.వాసవి తదితరులు పాల్గొన్నారు.



## మగ్గంపై మహాద్భుతం!

'ఆపరేషన్ సిందూర్' బంగారు శాలువా

సిరిసిల్ల నేత కళాకారుడి సృష్టి

సిరిసిల్ల: సిరిసిల్ల చేనేత కళాకారుడు నల్ల విజయ్‌కుమార్ మరోసారి చేనేత మగ్గంపై అద్భుతాన్ని ఆవిష్కరించారు. 'ఆపరేషన్ సిందూర్'పేరిట భారత ప్రభుత్వం నిర్వహించిన సైనిక చర్యలను అభినందిస్తూ.. ఆ చిత్రంతో కూడిన బంగారు పోగుల శాలువను చేనేత మగ్గంపై గురువారం నేశారు. అగ్గిపెట్టెలో ఇమిడిపోయే శాలువాను నేసి అబ్బురపరిచారు. ప్రత్యేక డిజైన్ చేయించి.. రెండు గ్రాముల బంగారం పోగులు, పట్టుజరీ నూలుతో రెండు మీటర్ల పొడవు, 36 అంగుళాల వెడల్పు, 80 గ్రాముల బరువుతో శాలువాను నేశారు. ఈ శాలువాను ఆగస్ట్ 7న చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీకి పంపనున్నట్లు చేనేత కళాకారుడు నల్ల విజయ్‌కుమార్ తెలిపారు.

## 'మహాలక్ష్మి' వచ్చేసిందని..!

పరిగి పోస్టాఫీసులో వెయ్యి ఖాతాలు



పరిగి: పట్టణంలోని పోస్టాఫీస్‌కు గురువారం పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చారు. తమకు వెంటనే ఖాతాలు కావాలని అధికారులను కోరారు. ఎప్పుడూ లేని విధంగా మహిళల తాకిడిని గమనించిన సిబ్బంది అసలు విషయం తెలుసుకుని అవాక్కయ్యారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రూ.2,500 అందజేస్తోందని, అర్హులైన వారు వెంటనే పోస్టాఫీసులో ఖాతా తెరవాలని కొంతమంది సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేశారు. ఇది నిజమేనని నమ్మిన మహిళలు పోస్టాఫీసు ముందు బారులుతీరారు. ఇలా బుధ, గురువారాల్లో మొత్తం వెయ్యికి పైగా ఖాతాలను తెరిచారు.

## హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావుపై వేటు

సాక్షి, హైదరాబాద్: అవినీతి, మోసం, అధికార దుర్వినియోగం ఆరోపణలు ఎదుర్కొంటున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్మోహన్ రావుపై అపెక్స్ కౌన్సిల్ సస్పెన్షన్ వేటు వేసింది. ఆయనతోపాటు సంఘం కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి సీజే శ్రీనివాస్‌ను సైతం సస్పెండ్ చేసింది. ఈమేరకు గత నెల 28న జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. సీఐడీ కేసు విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఈ ముగ్గురిపై వేటువేయడం గమనార్హం. ఇటీవల హెచ్‌సీఏ వ్యవహారాలు చూసుకోవాలని హైకోర్టు జస్టిస్ నవీన్ రావు నేతృత్వంలో సింగిల్ మెన్ కమిటీని నియమించగా.. అపెక్స్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయానికి ఎంతవరకు చట్టబద్ధత ఉంటుందనే చర్చ ఉంది. మరోవైపు అపెక్స్ కౌన్సిల్ నిర్ణయానికి జస్టిస్ నవీన్ రావు ఆమోదం ఉందో, లేదో తెలియాల్సి ఉంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. 


ఇనుగుర్తి మండలం మీర్యతండాలో నిర్వహిస్తున్న బ్లాక్ గ్రానైట్ క్వారీ

# ఉపాధి పనులు కుది'రాయి'!

అన్నం పెడుతున్న గ్రానైట్ రాయి

మహబూబాబాద్ జిల్లాలో 50 గ్రానైట్ క్వారీలు

జిల్లావ్యాప్తంగా వేలాది మందికి ఉపాధి

దేశ, విదేశాలకు గ్రానైట్ రాళ్ల ఎగుమతులు

నెల్లికుదురు: మహబూబాబాద్ జిల్లాలో భారీగా నిర్వహిస్తున్న గ్రానైట్ క్వారీలతో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. పలు మండలాల్లో గ్రానైట్ క్వారీ పరిశ్రమలు కొనసాగుతున్నాయి. 40 ఏళ్లగా అంతర్జాతీయంగా పేరుగాంచిన మెడివెస్ట్ గ్రానైట్, గాయత్రి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్.. జిల్లాలోని ఇనుగుర్తి మండలం చిన్ననాగారం, మీర్యతండా, కేసముద్రం మండలం తీగలవేణి, అర్పపల్లి గ్రామాల్లో క్వారీలను నిర్వహిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా వేలాది ఎకరాల్లో విస్తరించిన 50 గ్రానైట్ క్వారీ పరిశ్రమల్లో.. ఎంతో మందికి ఉపాధి దొరుకుతోంది. మేనేజర్ నుంచి వాచ్‌మెన్ వరకు స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాలు ఒడిశా, అస్సాం, బిహార్ రాష్ట్రాల నుంచి వేలాది మంది ఉద్యోగులు, కార్మికులకు ఉపాధి దొరుకుతోంది.

### జిల్లాలో ఖరీదైన గ్రానైట్

మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలంలోని చిన్ననాగారం, కేసముద్రం మండలం అర్పనపల్లి, తీగలవేణి, కేసముద్రం, నెల్లికుదురు మండలం ఎర్రబెల్లిగూడెం గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న క్వారీల నుంచి తీస్తున్న బ్లాక్ గ్రానైట్ సిరులు కురిపిస్తోంది. ఇది ఖరీదైన గ్రానైట్‌గా పేరొందింది. ఈ గ్రానైట్‌ను హైదరాబాద్ నుంచి విదేశాలకు తరలిస్తున్నారు. కాగా రాజ్యసభ సభ్యుడు, గాయత్రి గ్రానైట్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ వద్దిరాజు రవిచంద్ర కూడా దేశ, విదేశాలకు నల్ల గ్రానైట్‌ను ఎగుమతి చేస్తున్నారు.

### యంత్రాల విడిభాగాలతో ఉపాధి

భూగర్భం నుంచి గ్రానైట్ ఖనిజ సంపద తీయడానికి ఉపయోగించే యంత్రాల విడిభాగాలను సరఫరా చేస్తూ కూడా ఎంతోమంది ఉపాధి పొందుతున్నారు. గ్రానైట్ బండలను లారీల ద్వారా హైదరాబాద్‌కు తరలిస్తారు. అక్కడ పెద్ద పెద్ద యంత్రాలతో టైల్స్‌గా కట్ చేయడం, పాలిష్ చేసి విదేశాలకు సరఫరా చేయడం వరకు అంతా ఉపాధి లభిస్తుంది. గ్రానైట్ క్వారీల పరిధిలోని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి.

### పదేళ్లుగా గ్రానైట్ క్వారీలోనే..



పదేళ్లుగా ఇనుగుర్తి మండలం మీర్యతండా గ్రానైట్ క్వారీలోనే ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నా. క్వారీ ద్వారా ఉపాధితోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. క్వారీ ద్వారా ఎంతో మంది ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. గ్రానైట్ క్వారీలు నిర్వహించడానికి నిర్వాహకులు ఎంతో శ్రమించాలి.

– గుండాల శోభన్, చిన్ననాగారం

### సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నా



ఒక క్వారీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. క్వారీల్లో ఎంతో మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. స్థానికులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి క్వారీలో ఉపాధి కల్పిస్తున్నారు. మా పరిధిలో 30 ఏళ్లుగా గ్రానైట్ క్వారీలను నడుపుతున్నారు.

– గుగులోత్ రాజేందర్, ఇనుగుర్తి మండలం మీర్యతండా


తరలించడానికి సిద్ధంగా నల్ల గ్రానైట్ బండలు

### ఉమ్మడి వరంగల్ జిల్లా గ్రానైట్ నాణ్యమైనది



పాతికేళ్లుగా గ్రానైట్ ఫీల్డ్‌లోనే సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నా. ఉమ్మడి వరంగల్ జిల్లాలో లభించే గ్రానైట్ నాణ్యతలో దేశంలోనే ప్రథమస్థానంలో ఉంది. జిల్లాలో తీసే గ్రానైట్ సంపదకు భలే డిమాండ్ ఉంది.

– రావులపల్లి రవికుమార్, సూపర్‌వైజర్, మెడివెస్ట్ గ్రానైట్, కేసముద్రం

## పార్లమెంట్‌లో తెలంగాణ

# పరిశోధన, అభివృద్ధి కోసం రూ.1,143.34 కోట్లు ఖర్చు చేశాం

**ఫెలోషిప్ జాప్యాలపై కేంద్రం స్పందన**

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని శాస్త్రీయ పరిశోధన రంగానికి ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డా. జితేంద్రసింగ్ పేర్కొన్నారు. దేశ జీడీపీలో పరిశోధన అభివృద్ధి కోసం ఖర్చు శాతం గత మూడు సంవత్సరాల్లో సుమారు స్థిరంగా ఉందని చెప్పారు. 2018–19లో 0.66 శాతం, 2019–20లో 0.66 శాతం, 2020–21లో 0.64 శాతంగా నమోదైందని తెలిపారు. ఈ మూడేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో పరిశోధన అభివృద్ధి కోసం రూ.1,143.34 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. రాజ్యసభలో బీఆర్‌ఎస్ ఎంపీ బి.పార్థసారథి రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి సమగ్ర సమాచారం ఇచ్చారు. గతంలో కొత్త నిధుల పంపిణీ విధానాలైన సెంట్రల్ నోడల్ ఏజెన్సీ, హైబ్రిడ్ టీఎస్‌ఏ అమలుతో తాత్కాలికంగా ఫెలోషిప్ మంజూరులో జాప్యాలు చోటుచేసుకున్నాయని వెల్లడించారు. అయితే ఈ సమస్యలను అధిగమించేందుకు ముందస్తు ఫెలోషిప్ మంజూరుతో పాటు, హెల్ప్‌డెస్కులు, శిక్షణల ద్వారా సమస్యలు పరిష్కరించామన్నారు.

### తెలంగాణలో 7వేలకుపైగా ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు

తెలంగాణలో చిన్నా–పెద్దా కలిపి వేలాది ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు కార్యాచరణలో ఉన్నాయని కేంద్ర ఆహార ప్రాసెసింగ్ శాఖ వెల్లడించింది. ఈ రంగాన్ని బలోపేతం చేయడంలో కేంద్ర పథకాలైన ప్రధాన్ మంత్రి కిసాన్ సంపద యోజన, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్, అలాగే ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ కీలకంగా నిలుస్తున్నాయని తెలిపింది. ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద తెలంగాణలో మొత్తం 7,005 ప్రతిపాదనలు మంజూరు కాగా, వీటికి రూ.96.38 కోట్ల సబ్సిడీ అందించిందని కేంద్ర మంత్రి రవ్నీత్ సింగ్ తెలిపారు. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు గురువారం ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో కేంద్రమంత్రి వెల్లడించారు.

### ఐదేళ్లలో 2,63,749 ఎల్పీజీ కనెక్షన్లను

- ప్రధానమంత్రి ఉజ్వల యోజనలో భాగంగా 2019–20 నుంచి 2024–25 మధ్య తెలంగాణలో 2,63,749 ఎల్పీజీ కనెక్షన్లను ఇచ్చినట్లు కాంగ్రెస్ ఎంపీ రఘురాంరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి గురువారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అంతేగాక కేంద్ర ప్రభుత్వం చేపట్టిన భారీ ప్రాజెక్టులలో ఒకటైన భారతమాల పథకం కింద తెలంగాణలో మొత్తం 1,719 కిలోమీటర్ల పొడవులో జాతీయ రహదారుల అభివృద్ధి లక్ష్యంగా నిర్ణయించామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఎంపీ రఘురాంరెడ్డి ప్రశ్నకు కేంద్రమంత్రి బదులిచ్చారు.
- తెలంగాణ రాష్ట్రంలో అమృత్ 2.0 పథకం కింద 252 ప్రాజెక్టుల కోసం రూ.9,584.26 కోట్లు మంజూరు చేసినట్లు బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ అడిగిన ప్రశ్నలకు కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు గురువారం సమాధానం ఇచ్చారు.

## స్మార్ట్‌సిటీ మిషన్‌కు పొడిగింపు లేదు

**2025 మార్చితో గడువు ముగిసినట్టేనని స్పష్టం చేసిన కేంద్రం**

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రం తరఫున వరంగల్, కరీంనగర్ నగరాల స్మార్ట్ సిటీ మిషన్‌ను 2026 జూన్ వరకు పొడిగించాలన్న విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. స్మార్ట్‌సిటీ మిషన్‌కు 2025 మార్చి 31తో గడువు ముగిసిందని, ఇకపై దానికి సంబంధించి ఎటువంటి నూతన నిధులు లేదా నగరాలు చేర్చే అవకాశం లేదని కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహూ గురువారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు స్పష్టత ఇచ్చారు. స్మార్ట్ సిటీ మిషన్ పథకంలో భాగంగా వరంగల్‌లో మొత్తం 119 ప్రాజెక్టులకు రూ.1,800 కోట్లు మంజూరు చేశారు. ఇందులో రూ.1,386 కోట్లు విలువచేసే 79 ప్రాజెక్టులు (66%) పూర్తయ్యాయని మిగతా రూ.415 కోట్ల విలువచేసే 40 ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. అదే సమయంలో కరీంనగర్‌లో మొత్తం 49 ప్రాజెక్టులకు రూ.1,094 కోట్లు మంజూరు చేశామని... ఇందులో రూ.979 కోట్లు విలువ చేసే 37 ప్రాజెక్టులు (76%) పూర్తయ్యాయని తెలిపారు. మిగతా రూ.115 కోట్ల విలువచేసే 12 ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయని కేంద్రం వెల్లడించింది. కాగా 2025 మార్చితో పథకం ముగిసిన నేపథ్యంలో, జూలై 10, 2025న రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ చేశామని... ఇందులో అన్ని ప్రత్యేక ప్రయోజన సంస్థలు (ఎస్‌పీవీలు) తమతమ నగరాల్లో స్మార్ట్ సిటీ పథకం కింద కొనసాగుతున్న ప్రాజెక్టులను సమయానికి పూర్తి చేయాలని కేంద్రం ఆదేశించింది.

## 'కార్బన్ క్యాప్చర్'టెక్నాలజీకి ప్రణాళిక లేదు..

పెద్దపల్లి జిల్లాలో ఉన్న ఎన్టీపీసీ థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో కార్బన్ క్యాప్చర్ టెక్నాలజీ అమలుకు ప్రస్తుతానికి ఎలాంటి ప్రణాళిక లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలోని కొన్ని కేంద్రాల్లో చిన్న స్థాయి ప్రయోగాత్మక ప్రాజెక్టులనే ప్రస్తుతం నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. అంతేగాక పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల పరిసరాల్లో నివసించే ప్రజలపై ఆరోగ్య ప్రభావాలపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి అధ్యయనం చేపట్టలేదని కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ అడిగిన ప్రశ్నలకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ నాయక్ వెల్లడించారు. అయితే, ఎన్టీపీసీ రామగుండం యూనిట్ మాత్రం 2017–18లో 'ఆక్యుపేషనల్ హెల్త్, ఎపిడెమిక్ హెల్త్ డిజార్డర్ సర్వే'ను నిర్వహించిందని, అందులో ఎలాంటి నెగటివ్ ఆరోగ్య ప్రభావాలు కనిపించలేదని పేర్కొంది. అదే సమయంలో ఎన్టీపీసీ తన బాధ్యతను నెరవేర్చే క్రమంలో పెద్దపల్లి జిల్లాలో 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్, 10 మెగావాట్ల గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు కేంద్రం పేర్కొంది.

## తీర్పును స్వాగతిస్తున్నాం



సాక్షి, న్యూఢిల్లీ: 'పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పుఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకం. కోర్టు తీర్పును అనుసరిస్తూ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాను. ఒకపార్టీ బీ–ఫారంపై గెలిచి పార్టీ మారిన ప్రజాప్రతినిధులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను సంవత్సరాల పాటు నాన్చడాన్ని న్యాయమూర్తులు తప్పుబట్టారు. సుప్రీం తీర్పు ఆహ్వానించదగింది'

– బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

## తీర్పు బీఆర్‌ఎస్‌కు చెంపపెట్టు



'సుప్రీంకోర్టు తీర్పు బీఆర్‌ఎస్ పార్టీకి చెంపపెట్టు లాంటిది. సుప్రీంకోర్టు అనర్హత వేటు వేస్తుందని ఆ పార్టీ నేతలు పగటికలలు కన్నారు. కానీ.. అసెంబ్లీ స్పీకరే దీనిపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. శాసనసభాపతి ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుంది. ఉప ఎన్నికలు వస్తే సిద్ధంగానే ఉన్నాం. గెలుస్తాం కూడా'

– కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

## మూడు నెలల్లో నిర్ణయం తీసుకోకపోతే పరిస్థితి ఏంటి?



'పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసులో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. 10 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల జడ్జిమెంట్‌లో స్పీకర్‌కు నిర్ణీత సమయం పెట్టారు. ఒకవేళ శాసనసభాపతి నిర్ణయం తీసుకోకపోతే.. మళ్లీ కోర్టుకు వెళ్లాల్సిందే. ఈ విషయంలో ధర్మాసనం స్పష్టత ఇస్తే బాగుండేది. స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని కోర్టు ఆశించడం వేరు, శాసించడం వేరు. ఈ విషయంలో శాసనసభ స్పీకర్ ప్రజల పక్షాన నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నాం'.

– బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు

## ఫిరాయింపు ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి




సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయించి కాంగ్రెస్‌లో చేరిన పది మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై అసెంబ్లీ స్పీకర్ వెంటనే అనర్హత వేటువేయాలని శాసనసభలో బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై మూడు నెలల్లో స్పీకర్ చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించడం చారిత్రాత్మక నిర్ణయంగా పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు సీఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టులాంటిదని, గతంలో అనర్హతవేటు అంశంలో సుప్రీంకోర్టును తప్పుపట్టేలా రేవంత్ వ్యాఖ్యలు చేశారన్నారు. బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్‌తో కలిసి గురువారం తెలంగాణ భవన్‌లో కేపీ వివేకానంద మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు మీద ఏ మాత్రం విశ్వాసం ఉన్నా పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలు వెంటనే రాజీనామా చేయాలన్నారు. మూడు నెలల వరకు వేచి చూడకుండా స్పీకర్ వెంటనే పార్టీ మారిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని వివేకానంద డిమాండ్ చేశారు. మూడు నెలల్లోగా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ నిర్ణయం తీసుకోకుంటే కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని సోమ భరత్‌కుమార్ పేర్కొన్నారు.

– బీఆర్‌ఎస్ విప్ కేపీ వివేకానంద

## ఇమామ్, మౌజంలకు వేతనాలు ఇవ్వాలి

**మాజీ మంత్రి మహమూద్ అలీ**



సాక్షి, హైదరాబాద్: మౌజమ్, ఇమాంలకు సక్రమంగా వేతనాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం వారిని ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని అడుగుతోందని మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ విమర్శించారు. మైనారిటీలకు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం మహమూద్ అలీ మీడియాతో మాట్లాడారు. మైనారిటీలకు కేబినెట్‌లో మంత్రి పదవి, సబ్ ప్లాన్ అమలు వంటి హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. మైనారిటీ గురుకుల విద్యా సంస్థల్లో వసతులు కల్పించడం లేదని, మైనారిటీ విద్యార్థులకు బకాయి పడిన ప్రీ, పోస్ట్ మెట్రిక్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని మహమూద్ అలీ డిమాండ్ చేశారు. ఇమామ్, మౌజంలకు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలనే నిబంధనను ఎత్తి వేయాలన్నారు. రేవంత్ పాలనలో మైనారిటీలకు ఒరిగిందేమీ లేదని వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ మసియుల్లా ఖాన్ విమర్శించారు. రాష్ట్ర మంత్రివర్గంలో ముస్లింలకు ప్రాతినిధ్యం ఎందుకు ఇవ్వడం లేదని ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ రహీముల్లా ఖాన్ నియాజీ ప్రశ్నించారు.

## బీసీ చైతన్య రథాలను ప్రారంభించిన కవిత



సాక్షి, హైదరాబాద్: బీసీ బిల్లు కోసం ఆగస్టు 4 నుంచి 7 వరకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత చేపట్టబోయే 72 గంటల నిరాహారదీక్షకు మద్దతుగా బీసీ చైతన్య రథాలు జిల్లా కేంద్రాల నుంచి బయలుదేరాయి. ఈ మేరకు గురువారం కవిత తన నివాసం వద్ద జెండా ఊపి బీసీ చైతన్య రథాలను ప్రారంభించారు. కార్యక్రమంలో యూపీఎఫ్ కన్వీనర్ బొల్ల శివశంకర్, కో–ఆర్డినేటర్ ఆలకుంట హరి, జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఇందిరాపార్క్ వద్ద బీసీల మహాధర్నా

**బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు**

సాక్షి, హైదరాబాద్: శనివారం ఉదయం 10 గంటలకు ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో 'బీసీల హక్కుల కోసం పోరాడుదాం, రాజకీయ వాటాను తేల్చుకుందాం' అనే నినాదంతో మహాధర్నా నిర్వహిస్తున్నట్టు బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ బీసీ వ్యతిరేక కుట్రలు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న కుట్రలు, ఎమ్మెల్సీ కవిత వంటి నేతలు...బీసీ రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్న దురుద్దేశాలను ప్రజల ముందు బయటపెడతామన్నారు. ఈ ధర్నాలో పార్టీ జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొంటారని, ఇందులో బీసీ కుల సంఘాలు, నాయకులు, మేధావులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. గురువారం కాసం వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే అమలు చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోందన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు అధ్యక్షతన మహాధర్నా ఏర్పాట్లపై జరిగిన సమావేశంలో... హైదరాబాద్, రంగారెడ్డి, చుట్టుపక్కల ఉన్న 8 జిల్లాల ముఖ్యనాయకులు పాల్గొన్నారని కాసం తెలిపారు.


## టిస్కాన్ యూత్ రెగట్టా పోటీల్లో గురుకుల విద్యార్థులకు పతకాలు

**విద్యార్థులను అభినందించిన మంత్రి పొన్నం**

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో జరిగిన టిస్కాన్ యూత్ ఓపెన్ రెగట్టా పోటీల్లో గురుకుల సొసైటీ విద్యార్థులు సత్తా చాటారని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యాచ్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ ఓపెన్ రెగట్టా ఆప్టిమిస్ట్ మెయిన్ ఫ్లీట్ విభాగంలో చాంద్రాయణగుట్ట బీసీ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని శిరీష వెండి పతకం సాధించింది. మునుగోడు బీసీ గురుకుల పాఠశాలకు చెందిన ఐదో తరగతి విద్యార్థి వి.హనుమంతు కాంస్య పతకం సాధించాడు. కల్వకుర్తి బాలికల పాఠశాలకు చెందిన ఏడవ తరగతి విద్యార్థిని ఎం.అక్షర జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయి పోటీలో పతకాలు సాధించిన విద్యార్థులను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, కార్యదర్శి బడుగు సైదులు ప్రత్యేకంగా అభినందించారు. బీసీ గురుకుల విద్యార్థులకు చదువుతో పాటు వారిలో నైపుణ్యాలను, ఆసక్తిని గమనించి అనేక అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు బీసీ గురుకుల విద్యాసంస్థ అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని సైదులు తెలిపారు. ఈ శిక్షణలో అసాధారణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇవ్వడంతోపాటు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామన్నారు. వారిలో జాతీయ స్థాయిలో ముగ్గురు విద్యార్థులు పతకాలు సాధించడం ఆనందంగా ఉందని చెప్పారు. శిక్షణలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు 2026లో జరిగే ఏషియన్ గేమ్స్, 2028 జరిగే ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని, అందుకు అవసరమైన శిక్షణ అందిస్తామన్నారు.


ఒకటి కాదు.. రెండు కాదు.. వందల సంఖ్యలో గబ్బిలాలు.. ఒకే చెట్టుపై సేదదీరుతూ కనిపించాయి. వందల ఏళ్ల చరిత్ర గల మహావృక్షాన్ని నివాసయోగ్యంగా మలచుకున్నాయి. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మినీట్యాంక్ బండ్ (ఎల్లమ్మ చెరువు) వద్ద రావిచెట్టుకు వేలాడుతున్న గబ్బిలాల గుంపు ఇది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

## బీసీ బిల్లును బీజేపీ ఆమోదించాలి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బిల్లు తరహాలో బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపజేసి.. చరిత్రలో నిలిచిపోయే అద్భుత అవకాశాన్ని కేంద్ర బీజేపీ సొంతం చేసుకోవాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ కోరారు. బీసీ రిజర్వేషన్లపై జరుగుతున్న పరిణామాలను బీసీలు క్షుణ్ణంగా గమనించాలని కోరారు. తమ హక్కుల సాధనకు ఉద్యమించాల్సిన సరైన సమయం ఇదేనని ఆయన గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

## 'బనకచర్ల' రద్దుపై సదస్సు నేడు

సాక్షి, హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల లింక్ ప్రాజెక్టు రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం మంచిర్యాల బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సదస్సు నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో నీటి పారుదల నిపుణుడు వి.ప్రకాశ్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, నడిపెల్లి దివాకర్ రావు, దుర్గం చిన్నయ్య, పార్టీ సీనియర్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొంటారని వెల్లడించారు.

# ఇంటి వద్ద 'బొన్సాయ్' హాయ్





కుండీల్లో వృక్షాలు పెరగడం ఏమిటా అని ఆలోచిస్తున్నారా? ఇవి బొన్సాయ్ మొక్కలు. పరిశీలిస్తే కాండం, కొమ్మలు కనిపిస్తాయి. చూపరులకు హాయిని ఇస్తాయి. వీటిని ఎవరూ పెరటి స్థలంలో పెంచరు. కర్నూలులోని గణేష్‌నగర్‌కు చెందిన రాజు అనే వ్యక్తి ఇంటి పెరటిలో వీటిని పెంచారు. ఫీకస్ పాండా, జెడ్ బోన్స్యామ్, చింత బొన్సాయ్, మర్రిచెట్టు, మధు కామిని, ఫికస్ బెంజమెనా తదితర మొక్కలు ఆకర్షణీయంగా ఉన్నాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



పెరటి స్థలంలో ఉన్న బొన్సాయ్ మొక్కలు



ఆకట్టుకునే థింబుల్ కాక్టస్





వృక్షాలుగా ఉన్న మొక్కలు

## క్లుప్తంగా...

### మావుళ్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలోని శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. గురువారం అమ్మవారి ఆలయంలో శ్రావణ శుద్ధ సప్తమి, చిత్త నక్షత్రం ఉన్నందున దేవస్థాన ప్రాంగణంలో వృక్షం సన్నిధిలో ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లిఖార్జునశర్మ ప్రత్యేక దీపార్చన కార్యక్రమం నిర్వహించారని చెప్పారు. అనంతరం భక్తులు నిత్యదీపాలు వెలిగించి అమ్మవారి దర్శనం చేసుకున్నారన్నారు.

### రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన చంద్రబాబు

**సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ**

ధర్మవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సీఎం చంద్రబాబు రూ.1.70 లక్షల కోట్ల అప్పుల భారాన్ని రాష్ట్ర ప్రజల నెత్తిన మోపి, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజమెత్తారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో సీపీఐ రెండో జిల్లా మహాసభలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక పీఆర్‌టీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ రాష్ట్రాభివృద్ధి కోసం అప్పులు చేస్తే రాష్ట్రం మరో శ్రీలంక అవుతోందంటూ గగ్గోలు పెట్టిన చంద్రబాబు.. ప్రస్తుతం తాను చేస్తున్నదేమిటో చెప్పాలన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత తుంగలో తొక్కారన్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో ఇబ్బడి ముబ్బడిగా విద్యుత్ చార్జీలను పెంచి రూ.15,420 కోట్ల భారాన్ని సామాన్యులపై మోపడం దారుణమన్నారు. అదానీ కంపెనీతో లాలూచీ పడి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి, రాబోవు 25 ఏళ్లలో రూ.లక్ష కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు కుట్ర పన్నారని మండిపడ్డారు. రాజధాని అమరావతి నిర్మాణం పేరుతో ఇప్పటికే రూ.31 వేల కోట్లు ఖర్చు పెట్టేందుకు యత్నిస్తున్నారని, మరో రూ.31 వేల కోట్లు అవసరమని మంత్రి నారాయణ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం బడాబాబులకు మేలు చేసేందుకే చంద్రబాబు అమరావతిని వాడుకుంటున్నారన్నారు.

### సాంకేతిక సమస్యతో నిలిచిన గూడ్స్ రైలు

గిద్దలూరు రూరల్: సాంకేతిక సమస్యతో గూడ్స్ రైలు నిలిచిపోయింది. ఈ సంఘటన ప్రకాశం జిల్లా గిద్దలూరు పట్టణంలోని రాచర్ల గేటు వద్ద గురువారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గుంటూరు నుంచి గుంతకల్ వైపుగా వెళ్లే గూడ్స్ రైలు ఇంజన్‌లో సాంకేతిక మరమ్మతుల కారణంగా రాచర్ల గేటు వద్ద సుమారు అరగంట సేపు నిలిచిపోయింది. దీంతో పట్టణంలోని రాచర్ల గేటు దాటి అవతలి వైపుకు వెళ్లే వాహనదారులు రోడ్డు పై అలాగే నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

### యూనిఫాం వెనక్కి ఇవ్వలేదని..

**విద్యార్థినిపై చేయిచేసుకున్న టీచర్**

ప్రొద్దుటూరు కల్చరల్ : యూనిఫాం వెనక్కి ఇవ్వలేదని విద్యార్థినిపై టీచర్ చేయిచేసుకున్న సంఘటన వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు నడింపల్లె మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం చోటు చేసుకుంది. దస్తగిరిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ముల్లా జుబేరియా ఐదో తరగతి చదువుతోంది. ఈ పాఠశాలలో యూనిఫాం ఇచ్చిన తర్వాత ఆ విద్యార్థిని నడింపల్లె మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో చేరింది. తమ పాఠశాలలో తీసుకున్న యూనిఫాం తిరిగి ఇవ్వాలని దస్తగిరిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు షేక్ సబీహా మరొక విద్యార్థితో చెప్పి పంపింది. యూనిఫాం ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన ఆ ఉపాధ్యాయురాలు గురువారం విద్యార్థిని చదువుతున్న పాఠశాలకు వెళ్లి తరగతి గదిలో విద్యార్థిని చెంపపై కొట్టి వెళ్లిపోయింది. దీంతో విద్యార్థిని ఏడవడంతో అది విన్న తరగతి గదిలోని ఉపాధ్యాయురాలు సంపూర్ణ వచ్చి పరిశీలించగా విద్యార్థిని చెంపపై వాతలు కనిపించాయి. దీంతో ప్రధానోపాధ్యాయుడు శంకర్ దృష్టికి విషయం తీసుకెళ్లారు. శంకర్, ఉపాధ్యాయులు సబీహాపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ శోభారాణికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈఓ స్పందిస్తూ శుక్రవారం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయురాలు షేక్ షబీహాకు షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

---

సోంపేట మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయుడికి వారం రోజుల కిందట ఆర్‌టీఓ ట్రాఫిక్ చలాన్.ఏపీకే అనే లింకు వాట్సాప్ ద్వారా వచ్చింది. దీంతో క్లిక్ చేసి అన్ని లాంఛనాలు పూర్తి చేసి లాగిన్ అయ్యారు. లాగిన్ అయ్యాక ఓటీపీ అడగడం, ఓటీపీ ఎంటర్ చేసిన కొన్ని నిమిషాల్లోనే తన ఫోన్ సిమ్ పనిచేయకపోవడం.. కొన్ని గంటల్లోనే తన బ్యాంకు ఖాతాలోని సొమ్ము మాయమవ్వడం చకచకా జరిగిపోయాయి. దాదాపు రూ.7లక్షలు పోయినట్లు తేలడంతో పోలీసులను ఆశ్రయించారు.

కాశీబుగ్గకు చెందిన ఓ బ్యాంకు మేనేజర్ టెలిగ్రామ్ యాప్‌లో వచ్చిన ఇదే లింకుపై క్లిక్ చేశాడు. అంతే పై మాదిరిగానే సైబర్ కేటుగాళ్లు రూ.10 లక్షలకు పైగా తన వివిధ బ్యాంకు ఖాతాల నుంచి సొమ్మును లాగేసుకున్నారు.

# వాటిని తెరిస్తే తంటాలే..!




### ఏపీకే ఫైల్స్‌తో నయా సైబర్ మోసాలు

- ట్రాఫిక్ చలానా యాప్‌లతో మోసం
- 20 రోజుల్లో 12కుపైగా కేసులు
- ఒక్కొక్కరికి రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పైగా టోకరా
- మోసపోయినవారిలో ఉపాధ్యాయులు, బ్యాంకు మేనేజర్ సహా ముగ్గురు ఎస్‌ఐలు

శ్రీకాకుళం క్రైమ్ : ఆర్‌టీఓ ట్రాఫిక్ చలాన్.ఏపీకే.. శ్రీకాకుళం జిల్లాను దాదాపు నెల రోజులుగా వణికిస్తున్న లింకు ఇది. బండిపై ఎంత చలానా ఉందో తెలుసుకోవాలనే ఉత్సాహంతో ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేశారో.. ఇక అంతే.. ఖాతా ఖాళీ అయిపోతుంది. ఇప్పటికే గత 20 రోజుల్లో దాదాపు 12 కేసులు దీనిపైనే నమోదయ్యాయి. పైగా దీని బాధితులంతా ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న వారే కావడం గమనార్హం.




మొబైల్‌లో ఇలా వస్తుంది.. ఏపీకే ఫైల్

### మోసపోతున్నారిలా

- ముందుగా 'ఆర్‌టీఓ టిఆర్ఏఎఫ్ఎఫ్ఐసి సిహెచ్ఏఎల్ఏల్ఏఎన్.ఎపికె' ఫైల్ మెసేజ్ లింక్ రూపంలో వస్తుంది.
- మనం క్లిక్ చేసిన వెంటనే లాగిన్ అని వస్తుంది. అయ్యాక వెంటనే ఓటీపీ అడుగుతుంది.
- ఓటీపీ ఎంటర్ చేశామా ఇక అంతే సంగతులు.. సైబర్ నేరగాళ్ల మెసేజ్ ఇన్‌బాక్స్‌లో మన ఫోన్ నంబర్ చేరుతుంది.
- వెంటనే మన ఫోన్ నంబర్ ఉన్న సిమ్‌ను అదే నంబర్‌తో ఎలక్ట్రానిక్ సిమ్‌గా మార్చుతారు.
- మన ఫోన్‌పై ఉన్న స్క్రీన్ వారి ఆధీనంలోకి వెళ్లిపోతుంది.
- మన ఫోన్ పనిచేయక తికమక పడుతున్న ఆ క్షణాల్లోనే సిమ్ అప్‌డేట్ అవ్వాలంటే మన మెయిల్ అడ్రస్ యాడ్ చేయాలని అందులో వస్తుంది.
- మనం మెయిల్ అడ్రస్ యాడ్ చేసిన వెంటనే సిమ్ ఛేంజెస్ ఎస్ ఆర్ నో అని వస్తుంది. ఎస్ అని క్లిక్ చేసిన వెంటనే ఐదు, పదినిమిషాల్లో ఓ క్యూఆర్‌కోడ్ రావడం.. మన ఫోన్ నంబర్‌తో ఉన్న సిమ్‌కార్డు సైబర్ నేరస్తుడి మొబైల్ నుంచి యాక్టివేట్ అయిపోవడం జరుగుతుంది.
- వెంటనే సైబర్ నేరగాడు ఎమ్.ఆధార్ యాప్ డౌన్‌లోడ్ చేసి మన ఫోన్ నంబరే కావడంతో వచ్చే ఓటీపీలను ఎంటర్ చేసి బయోమెట్రిక్ లాక్ చేసేస్తాడు. దాంతో మనం సిమ్ కొనాలని షాపులకు వెళ్లినా.. ఆధార్ అవసరంతో బ్యాంకు, రిజిస్ట్రేషన్, ఇతర ఏ పనుల్లో మనం బయెమెట్రిక్‌కు థంబ్ వేయాలని అనుకున్నా అది లాక్ చేయడంతో కుదరదు. ఇక మనకు సిమ్ దొరకదు.
- ఈ లోగా సైబర్ నేరగాడు మన ఆధార్ నంబర్, ఫోన్ నంబర్‌తో ఇంటర్నెట్ త్రూ డెబిట్ కార్డ్ లోన్స్, లోన్ యాప్స్, పేయింగ్ యాప్స్ (ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మీషో, పేటీఎం, గూగుల్‌పే, ఫోన్‌పే) తదితర మార్గాల్లో వస్తువులు కొనేయడం ,డబ్బులు మాయంచేసి మన బ్యాంకు ఖాతాలను కొల్లగొట్టేయడమే కాక రూ.లక్షల్లో లోన్లు వాడేసి మనకు రుణ భారాన్ని మిగుల్చుతారు.
- ఇదే తరహాలో సోంపేట ఉపాధ్యాయునికి జరగడం, చాలా రోజుల వరకు తన నంబర్ ఉన్న సిమ్ రాకపోవడంతో తన వేలి ముద్రలు పనిచేయడం లేదని పాత (మాన్యువల్) పద్ధతిలోనే సిమ్‌ను పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో ఇటువంటి మోసాలు అత్యధికంగా కాశీబుగ్గ, సోంపేట, ఇచ్ఛాపురంలోనే జరిగాయని, చేసే సైబర్ నేరగాళ్లు జార్ఖండ్ వాసులుగా పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.

### పోలీసులకే బురిడీ

సైబర్ మోసాల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన పోలీసుల్ని సైతం ఇదే తరహా లింక్‌తో సైబర్‌కేటుగాళ్లు మోసం చేశారు. జిల్లాలోని వివిధ సర్కిళ్లలో పనిచేస్తున్న ముగ్గురు ఎస్‌ఐలకు ఈ అనుభవం ఎదురైంది. జేబులు కూడా ఖాళీ అయినట్లు పోలీసు వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. ఈ అంశాన్ని పోలీస్ శాఖ సీరియస్‌గానే తీసుకుంది.



### ఎం.పరివాహన్ యాప్‌లోనే కట్టాలి..



వాహన దారులు సామాజిక మాధ్యమాల్లో ఇలా వచ్చే ఏపీకే ఫైల్స్ లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదు. జిల్లా పోలీసు కార్యాలయం ఆధీనంలో ఉండే ఈ–చలానా యాప్ అనేది ట్రాఫిక్ పోలీసులకు, ఆ పరిధి పోలీస్‌స్టేషన్‌లో ఉండే పోలీసుల మొబైళ్లకు అనుసంధానంగా ఉంటుంది. ప్లేస్టోర్‌లో దొరకదు. సాధారణ ప్రజల వద్ద ఉండదు. దాని ద్వారా పోలీసులు ఫైన్‌లు వేశాక మీసేవలో గాని సొంత మొబైల్ ఫోన్‌లో గాని ఎం.పరివాహన్ యాప్ ద్వారానే కట్టాలి. ఎం.పరివాహన్ యాప్ అనేది ప్లేస్టోర్‌లో ఉంటుంది.

– నాగరాజు, సీఐ, శ్రీకాకుళం ట్రాఫిక్

---

# చెన్నై To విశాఖ!

**మద్యం మాఫియా**



### సాధారణ మద్యాన్ని ఖరీదైన బ్రాండ్ మద్యం సీసాల్లో నింపి రవాణా

### నకిలీ మద్యం సరఫరాలో ఆరితేరిన వెంకటేష్ పిళ్లై బృందం

- ఖరీదైన ఖాళీ మద్యం సీసాల్లో పాండిచ్చేరి మద్యం నింపుతున్న చెన్నై ముఠా
- చెన్నై గ్యాంగ్‌తో అక్కయ్యపాలెంకు చెందిన పిళ్లై బృందం చెట్టాపట్టాల్
- డిఫెన్స్ మద్యం పేరుతో విశాఖకు తరలిస్తూ అధిక ధరకు విక్రయం
- పోలీసులకు చిక్కిన వెంకటేష్ పిళ్లై చెన్నై ముఠాలోని మరో ఇద్దరు..

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

**1000** ఎంఎల్.. ఫుల్ బాటిల్.. అంటే మద్యం ప్రియులకు పండగే. అందులోనూ డిఫెన్స్ బాటిల్ అంటే ఎంత ధర అయినా కొనుగోలు చేద్దామనే ఆలోచన!. ఇంట్లో పార్టీ ఉన్నా.. పండగ ఉన్నా... ఇంటికి బంధువులు, స్నేహితులు వస్తే డిఫెన్స్ బాటిల్ ఇచ్చి ఖుషీ చేద్దామనుకుంటారు.. సరిగ్గా దీన్నే పక్కాగా క్యాష్ చేసుకుంటోంది విశాఖ నగరంలోని అక్కయ్యపాలెంకు చెందిన వెంకటేష్ పిళ్లై టీం. చెన్నైలోని బర్మాకాలనీకి చెందిన ఓ టీం ఖరీదైన బ్రాండ్ మద్యం ఖాళీ సీసాలను సేకరించి.. అందులో మాములు బ్రాండ్ మద్యాన్ని నింపి.. ఖరీదైన మద్యంగా సరఫరా చేస్తోంది. వీరితో సంబంధాలు నెరుపుకుంటూ అక్కడ నుంచి మద్యాన్ని దిగుమతి చేసుకుంటూ విశాఖలో డిఫెన్స్ మద్యం పేరుతో విక్రయించి భారీగా దండుకుంటోంది వెంకటేష్ పిళ్లై బృందం. చెన్నై నుంచి ట్రావెల్స్ ద్వారా ఈ మద్యాన్ని తరలిస్తుండడం విశేషం. లావాదేవీలన్నీ ఫోన్ పే, బ్యాంక్ అకౌంట్ల ద్వారా నిర్వహిస్తుండటం గమనార్హం. ఇందులో ఇప్పటికే చెన్నైకు చెందిన ముగ్గురిలో ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వెంకటేష్ పిళ్లైను కూడా అరెస్టు చేసి జైలుకు తరలించారు. లోతుగా విచారించేందుకు నేటి నుంచి వెంకటేష్ పిళ్లైను ఎక్సైజ్ పోలీసులు కస్టడీలోకి తీసుకుంటున్నట్టు తెలుస్తోంది.

**బాటిలింగ్ యూనిట్‌ను ఏర్పాటుచేసుకొని..**

చెన్నైలోని బర్మా కాలనీకి చెందిన ముఠా సభ్యులు పలు ప్రాంతాల నుంచి ఖరీదైన బ్రాండ్ మద్యం ఖాళీ సీసాలను సేకరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపుగా అన్ని జిల్లాల నుంచి ప్రీమియం బ్రాండ్ ఖాళీ సీసాలను అక్కడకు తరలిస్తున్నారు. అనంతరం పాండిచ్చేరి నుంచి తక్కువ ధరకు లభించే మద్యాన్ని (సాధారణ ఇతర బ్రాండ్లు) తీసుకొచ్చి ఈ ఖాళీ సీసాల్లో నింపేస్తున్నారు. ఇందుకోసం బాటిలింగ్ యూనిట్‌ను అక్కడ ఏర్పాటు చేసుకున్నట్టు తెలుస్తోంది. అనంతరం ఆర్డర్లకు అనుగుణంగా ఆయా ప్రాంతాలకు వీటిని తరలిస్తున్నారు. తమిళనాడు కోయంబత్తూరుకు చెందిన వెంకటేష్ పిళ్లై.. ఈ ముఠాతో సంబంధాలు ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచి ఈ మద్యాన్ని ఇక్కడకు తరలిస్తున్నారు. అయితే వెంకటేష్ పిళ్లై గత 20 సంవత్సరాలుగా అక్కయ్యపాలెంలోనే నివాసం ఏర్పాటు చేసుకుని స్థిరపడ్డారు. అంతేకాకుండా అక్కడి నుంచి నకిలీ మద్యాన్ని తెచ్చిన తర్వాత.. కొన్నింటిలో నీటిని కూడా నింపి యథావిధిగా సీల్ వేసి విక్రయిస్తున్నట్టు విచారణలో తేలింది.

### ఫోన్ పే, బ్యాంక్ అకౌంట్ల ద్వారానే లావాదేవీలు

కోయంబత్తూరు నుంచి విశాఖకు 20 ఏళ్ల క్రితం వచ్చిన వెంకటేష్ పిళ్లై మొదటి నుంచీ ఈ నకిలీ మద్యం సరఫరాలో ఆరితేరారు. గతంలోనూ ఇతనిపై పలుసార్లు కేసులు నమోదయ్యాయి. చెన్నైకు చెందిన ఇషాక్, మహమ్మద్ నిస్సార్ అహమ్మద్‌తో పాటు మహమ్మద్ సాధిక్ భాష ఒకే కుటుంబానికి చెందినవారు. వీరు ఏపీలోని దాదాపు అన్ని జిల్లాల నుంచి ఖరీదైన మద్యం ఖాళీ సీసాలను సేకరిస్తున్నారు. ఆయా జిల్లాల్లో ఈ వ్యాపారం చేసే వారితో సంబంధాలు పెట్టుకుని.. చెన్నైలోని బర్మా కాలనీకి చెందిన తమకే విక్రయించేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. అక్కడి నుంచి ఖరీదైన మద్యం పేరుతో నింపిన బాటిల్స్‌ను తమకు వచ్చే ఆర్డర్లకు అనుగుణంగా ట్రావెల్స్ ద్వారా తరలిస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఆర్డర్లకు అనుగుణంగా తమకు రావాల్సిన మొత్తాన్ని ఫోన్ పే, బ్యాంక్ అకౌంట్ల ద్వారానే లావాదేవీలు నిర్వహిస్తున్నారు.

### రూ.వెయ్యి తగ్గించామని కలరింగ్ ఇస్తూ..

1000 ఎంఎల్ బాటిల్‌ను రూ.500కే తయారుచేస్తున్న ఈ ముఠా రూ.4 వేలు చొప్పున విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. అంతిమంగా బయట మార్కెట్‌లో రూ.5 వేల విలువ చేసే బాటిల్‌ను రూ.4 వేలకే విక్రయిస్తున్నామంటూ నకిలీ మద్యాన్ని ఖరీదైన మద్యంగా అంటగడుతున్నారు. బయటి మార్కెట్ కంటే రూ.వెయ్యి ధర తగ్గడమే కాకుండా.. అంత సులువుగా దొరకని డిఫెన్స్ మద్యం తమకు వస్తోందని భావిస్తున్న కొందరు వెంకటేష్ పిళ్లై నుంచి ఆర్డర్లు పెట్టి మరీ తీసుకుంటుండటం గమనార్హం. తాజాగా అక్కయ్యపాలెంలో పట్టుబడిన ఈ మద్యాన్ని పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపగా.. ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే పదార్థాలు కూడా ఇందులో కలిసి ఉన్నట్టు ల్యాబ్ నివేదికలో తేలింది. ఇందులో పాండిచ్చేరి మద్యంతో పాటు ఇంకా ఏమైనా రసాయనాలు కలుపుతున్నారా? అనేది కూడా తేలాల్సి ఉంది.

### కత్తులతో బెదిరించి రూ.15 లక్షల పింఛన్ సొమ్ము దోపిడీ



ముంచంగిపుట్టు: కత్తులతో బెదిరించి రూ.15 లక్షల పింఛన్ సొమ్ము ఎత్తుకు పోయిన ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం బంగారుమెట్ట పంచాయతీ కేంద్రం సమీపంలో గురువారం సాయంత్రం జరిగింది. పెదబయలు మండలం బొండాపల్లి గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కటారి మత్స్యరాజు పెదబయలు ఎస్‌బీఐ బ్యాంకులో పింఛన్ సొమ్ము 17 లక్షల 53 వేల 200 రూపాయలు తీసుకొని, డిజిటల్ అసిస్టెంట్‌కు లక్షా 47 వేలు ఇచ్చి, మిగిలిన 15 లక్షల 6 వేల 200 రూపాయలతో బైకుపై బయల్దేరాడు. ముంచంగిపుట్టు మండలం కిలగాడ పంచాయతీ చెరువుపాకల అయిన తన సొంత గ్రామానికి వస్తుండగా రాయిపల్లి గ్రామ సమీపంలో ఇద్దరు వ్యక్తులు ముఖానికి మాస్కులు వేసుకొని స్కూటీపై వచ్చి, బైకును అడ్డగించారు. కత్తులు, తుపాకులను చూపి చంపేస్తామని బెదిరించి, పింఛన్ సొమ్మును లాక్కొని పారిపోయారు. అదే సమయంలో ఆ మార్గంలో బైకుపై సీతగుంట పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరావు వస్తుండడంతో బైకు ఆపి వెల్ఫేర్ అసిస్టెంట్ మత్స్యరాజు జరిగిన విషయం చెప్పాడు. వీరిద్దరు బైకుపై దొంగలను వెంబడించే ప్రయత్నం చేశారు. ఇద్దరు దొంగలు ఒడిశా రాష్ట్రం పాడువ వైపు పారిపోతుండగా.. బలియగూడ వద్ద వారి స్కూటీ అదుపు తప్పింది. సంఘటన స్థలంలోనే స్కూటీ, రెండు సెల్ ఫోన్లు వదిలి దొంగలు గాయాలతోనే కొండప్రాంతంలోకి పారిపోయారు. దొంగలు వదిలి వెళ్లిపోయిన ఒడిశా రిజిస్ట్రేషన్‌తో ఉన్న స్కూటీ, రెండు సెల్ ఫోన్లు తీసుకొని, పెదబయలు ఎంపీడీవో పూర్ణయ్య సహాయంతో బాధితుడు మత్స్యరాజు ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ దొంగల స్కూటీని పరిశీలించగా డిక్కీలో 5 లక్షల సొమ్మును గుర్తించారు. మిగిలిన 10 లక్షల 6200 సొమ్మును దొంగలు తీసుకొని వెళ్లిపోయినట్లు పోలీసు గుర్తించారు. ఒడిశాలోని పాడువ పోలీసుల సహకారంతో ముంచంగిపుట్టు, పెదబయలు పోలీసులు గాలిస్తున్నారు.

తెలుగు చిత్ర పరిశ్రమ అనగానే గుర్తొచ్చేది హైదరాబాద్. నటీనటులతో పాటు సాంకేతిక నిపుణులు ఇక్కడే నివాసం ఉంటుంటారు (ఇతర భాషల వాళ్లు మినహా). సినిమా షూటింగ్‌లకు అనువైన స్టూడియోలు ఇటు భాగ్యనగరంతో పాటు పరిసర ప్రాంతాల్లోనూ ఉన్నాయి. హైదరాబాద్ సమీపంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేకమైన సెట్టింగులు వేసి చిత్రీకరణలు జరుపుతుంటారు మేకర్స్. ప్రస్తుతం భాగ్యనగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్‌లు భలే జోరుగా సాగుతున్నాయి. ప్రభాస్, పవన్ కల్యాణ్, ఎన్టీఆర్, రామ్‌చరణ్, నాగ చైతన్య, రామ్ పోతినేని, విజయ్ సేతుపతి, సాయిదుర్గా తేజ్, తేజా సజ్జా, అఖిల్ అక్కినేని, సిద్ధు జొన్నలగడ్డ వంటి పలువురు హీరోలు హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో తమ సినిమాల షూటింగ్‌లో హుషారుగా పాల్గొంటున్నారు. ఇక భాగ్యనగరంలో ఎవరెక్కడ? షూటింగ్‌లో పాల్గొంటున్నారో ఆ విశేషాలేంటో చూద్దాం...


ఎన్టీఆర్


ప్రభాస్


రామ్‌చరణ్


పవన్ కల్యాణ్

# ఎవరెక్కడ!

## అజీజ్ నగర్‌లో రాజా సాబ్

'బాహుబలి' సినిమా తర్వాత వరుస పాన్ ఇండియా సినిమాలతో జెట్ స్పీడ్‌లో దూసుకెళుతున్నారు ప్రభాస్. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రాజా సాబ్'. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మాళవికా మోహనన్, నిధీ అగర్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్ సమీపంలోని అజీజ్ నగర్‌లో పీపుల్స్ మీడియా స్టూడియోలో జరుగుతోంది. ప్రభాస్‌తో పాటు ఇతర తారాగణంపై ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మారుతి. హారర్ కామెడీ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో ప్రభాస్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ తాత పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ దాదాపు 90 శాతం పూర్తయిందట.. మరో పది శాతం చిత్రీకరణ మాత్రమే బ్యాలెన్స్ ఉందని టాక్. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా శరవేగంగా జరుగుతున్నాయి. త్వరగా షూటింగ్‌ని పూర్తి చేసి ఈ సినిమాకి ఎంతో కీలకం కానున్న గ్రాఫిక్స్ పనులపై దృష్టి పెట్టనున్నారట మారుతి. పలుమార్లు విడుదల వాయిదా పడిన ఈ చిత్రాన్ని డిసెంబరు 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. అయితే ఆ తేదీకి రిలీజ్ వాయిదా పడే అవకాశాలున్నాయని టాక్.


నాగచైతన్య


అఖిల్

## అల్యూమినియం ఫ్యాక్టరీలో ఉస్తాద్

హీరో పవన్ కల్యాణ్, డైరెక్టర్ హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'గబ్బర్ సింగ్' (2012) చిత్రం మంచి విజయం అందుకున్న విషయం తెలిసిందే. ఈ హిట్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. ఈ సినిమాలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పోలీసాఫీసర్ పాత్ర చేస్తున్నారు పవన్ కల్యాణ్. ఇటీవల ఈ సినిమా పతాక సన్నివేశాలు పూర్తయినట్లు ప్రకటించారు మేకర్స్. క్లైమాక్స్‌లో భాగంగా నబకాంత మాస్టర్ పర్యవేక్షణలో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించారు.

## డ్రాగన్ జోరు

'దేవర' వంటి హిట్ సినిమా తర్వాత ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఎన్టీఆర్ నీల్' (వర్కింగ్ టైటిల్). 'కేజీఎఫ్, సలార్' చిత్రాల ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్నారు. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టి. సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్‌తో పాటు ఇతర తారాగణంపై సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారట ప్రశాంత్ నీల్. ఇప్పటి వరకు చూడనటు వంటి మాస్ లుక్‌లో ఎన్టీఆర్‌ని చూపించనున్నారు దర్శకుడు. మాస్ హీరో, మాస్ డైరెక్టర్ ఇమేజ్ ఉన్న ఎన్టీఆర్– ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న ఈ సినిమాపై ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో ఫుల్ క్రేజ్ నెలకొంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 2026 జూన్ 25న విడుదలకానుంది.

## శంకరపల్లిలో పెద్ది

రామ్‌చరణ్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'పెద్ది'. తొలి సినిమా 'ఉప్పెన'తో(2021) బ్లాక్‌బస్టర్ అందుకున్న బుచ్చిబాబు సానా 'పెద్ది'కి దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా మూవీలో రామ్‌చరణ్‌కి జోడీగా జాన్వీ కపూర్ నటిస్తున్నారు. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతోన్న ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో సమీపంలోని శంకరపల్లిలో జరుగుతోంది. రామ్‌చరణ్‌తో పాటు ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. అలాగే భాగ్యనగరం సమీపంలోని ఓ ప్రముఖ స్టూడియోలో నైట్ ఎఫెక్ట్ నేపథ్యంలో ఓ పాటను చిత్రీకరించనున్నారని తెలిసింది. రామ్‌చరణ్, జాన్వీలపై ఈ సాంగ్‌ని చిత్రీకరించనున్నారు. ఈ సినిమా రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా 2026 మార్చి 27న విడుదల కానుంది. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.


సాయిదుర్గా తేజ్


తేజా సజ్జా

## ప్రత్యేకమైన సెట్‌లో...

'తండేల్' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకోవడంతో పాటు వంద కోట్ల క్లబ్‌లో చేరారు నాగచైతన్య. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్‌సీ 24' (వర్కింగ్ టైటిల్). 'విరూపాక్ష' (2023) వంటి హిట్ మూవీని తెరకెక్కించిన కార్తీక్ వర్మ దండు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి హీరోయిన్. బాపినీడు సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌లో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో వేసిన ఓ ప్రత్యేకమైన సెట్‌లో జరుగుతోంది. నాగచైతన్య, మీనాక్షీ చౌదరి, ఇతర తారాగణంపై సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. మిస్టిక్ థ్రిల్లర్‌గా భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ సినిమాలో నాగచైతన్య సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. ఇందుకోసం ఆయన ఫిజికల్‌గానూ కొత్తగా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు కూడా. 'తండేల్' తర్వాత నాగచైతన్య, 'విరూపాక్ష' తర్వాత కార్తీక్ వర్మ కాంబినేషన్‌లో రానున్న 'ఎన్‌సీ 24' సినిమాపై మంచి బజ్ నెలకొంది.

## ముచ్చింతల్‌లో ఆంధ్ర కింగ్

రామ్ పోతినేని హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' మూవీ ఫేమ్ పి. మహేశ్ బాబు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా, కన్నడ హీరో ఉపేంద్ర, రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేశ్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఎంటర్‌టైన్‌మెంట్, భావోద్వేగాల నేపథ్యంలో రూపొందుతోన్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో జరుగుతోంది. రామ్–భాగ్యశ్రీలతో పాటు ఇతర తారాగణంపై ముఖ్యమైన సన్నివేశాలను రూపొందిస్తున్నారట దర్శకుడు. ఈ చిత్రంలో సూపర్‌స్టార్‌గా నటించిన ఉపేంద్రకి వీరాభిమానిగా రామ్ కనిపించనున్నారు.


సిద్ధు జొన్నలగడ్డ

## అల్యూమినియం ఫ్యాక్టరీలో...

విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమాలో సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్నారు. టబు, కన్నడ నటుడు విజయ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. చార్మీ కౌర్ సమర్పణలో పూరి కనెక్ట్స్, జేబీ మోషన్ పిక్చర్స్‌పై పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా నిర్మిస్తున్నారు. ఈ పాన్ ఇండియా మూవీ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ గచ్చిబౌలిలోని అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతోంది. విజయ్ సేతుపతితో పాటు ఇతర నటీనటులు ఈ షెడ్యూల్ చిత్రీకరణలో పాల్గొంటున్నారట. ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది.


రామ్


విజయ్ సేతుపతి

## బూత్ బంగ్లాలో లెనిన్

అక్కినేని అఖిల్ హీరోగా మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'లెనిన్'. 'ఏజెంట్' సినిమా తర్వాత రెండేళ్ల గ్యాప్ అనంతరం అఖిల్ నటిస్తున్న చిత్రం ఇది. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాయలసీమ నేపథ్యంలో సాగే రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న ఈ సినిమా కోసం ఫుల్ మాస్ లుక్‌లోకి మారిపోయారు అఖిల్. ఈ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని బూత్ బంగ్లాలో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో అఖిల్, ఇతర నటీనటులు పాల్గొంటున్నారు. ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా ఫిక్స్ అయ్యారు. అయితే కొద్ది రోజులు షూటింగ్‌లో పాల్గొన్న అనంతరం ఆమె ఈ మూవీ నుంచి తప్పుకున్నారు. ఇందుకుగల కారణాలు మాత్రం బయటకు రాలేదు. అఖిల్‌కి జోడీగా ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సే పేరు వినిపిస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## తుక్కుగూడలో సంబరాలు...

సాయిదుర్గా తేజ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఎస్‌వైజీ' (సంబరాల యేటిగట్టు). రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై 'హను–మాన్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ నిర్మించిన కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ సమీపంలోని తుక్కుగూడలో జరుగుతోంది. హీరో, హీరోయిన్‌తో పాటు ఇతర తారాగణంపై సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారట రోహిత్ కేపీ. ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో సెప్టెంబర్ 25న ప్రేక్షకులముందుకు రానుంది.

## పతాక సన్నివేశాల్లో యోధ

'జాంబి రెడ్డి' (2021) సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన తేజా సజ్జా 'హను–మాన్' (2024) చిత్రంతో పాన్ ఇండియా హిట్ అందుకున్నారు. ఆ సినిమా తర్వాత ఆయన హీరోగా నటిస్తున్న మరో పాన్ ఇండియా చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, మంచు మనోజ్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఆధ్యాత్మిక అంశాలతో ముడి పడిన ఫ్యాంటసీ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ సినిమాలో తేజ సూపర్ యోధగా కనిపించనున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్ సమీపంలోని ఆర్ఎఫ్‌సీలో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో భాగంగా సినిమా క్లైమాక్స్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారట. 'మిరాయ్' చిత్రం 8 భాషల్లో 2డీ, 3డీ ఫార్మాట్‌లో సెప్టెంబర్ 5న విడుదలకానుంది.

## శంకరపల్లిలో తెలుసు కదా

'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' చిత్రాల ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో వైవా హర్ష కీలక పాత్ర పోషిస్తున్నారు. స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమా ద్వారా దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతీ ప్రసాద్ నిర్మిస్తున్నారు. స్వచ్ఛమైన ప్రేమ, అనుబంధం, వినోదం, భావోద్వేగాల నేపథ్యంలో రూపొందుతోన్న ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్ సమీపంలోని శంకరపల్లిలో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో భాగంగా హీరో హీరోయిన్లతో పాటు ఇతర ప్రధాన తారాగణంపై సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు నీరజ కోన. దీపావళి సందర్భంగా అక్టోబర్ 17న ఈ చిత్రం విడుదల కానుంది.

ఇలా హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో షూటింగ్స్ జరుపుకుంటున్న సినిమాలు పైన పేర్కొన్నవి కాకుండా మరికొన్ని కూడా ఉన్నాయి.

– దేరంగుల జగన్ మోహన్


అనుష్క

# నవంబరులో ఘాటి?

అనుష్కా శెట్టి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఘాటి'. ఈ సినిమాలో విక్రమ్ ప్రభు మరో కీలక పాత్రలో నటించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో జాగర్ల మూడి రాధాకృష్ణ (క్రిష్) దర్శకత్వంలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. జూలైలో విడుదల కావాల్సిన ఈ సినిమా రిలీజ్ వాయిదా వడిన సంగతి తెలిసిందే. కాగా ఈ సినిమాను నవంబరులో రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నారట మేకర్స్. వీఎఫ్ఎక్స్ వర్క్స్‌పై మరింత శ్రద్ధ పెట్టి, మంచి క్వాలిటీతో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలన్నది టీమ్ ప్లాన్. దీంతో ఓ దశలో సెప్టెంబరులో రిలీజ్ అనుకున్నప్పటికీ నవంబరులో అయితే మరిన్ని థియేటర్స్ కూడా దొరకుతాయని, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌కు మరింత సమయం లభిస్తుందని కూడా చిత్రయూనిట్ ఆలోచిస్తోందట. అయితే ఈ విషయంపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. 'ఘాటి' సినిమా తెలుగు, తమిళ, హిందీ, మలయాళంతో సహా పలు భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కానుంది. ఈ సినిమాకు సంగీతం: నాగవెల్లి విద్యాసాగర్.


శివ కార్తికేయన్ హీరోగా ఏఆర్ మురగదాస్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'మదరాసి'. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో విద్యుత్ జమాల్, బీజు మీనన్, షబీర్, విక్రాంత్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తున్న ఈ సినిమా సెప్టెంబరు 5న విడుదల కానుంది. కాగా ఈ సినిమాలోని తొలి పాట 'సలంబల...' లిరిక్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పాట తెలుగులో 'సెలవికగా' విడుదల కానుంది.

# ట్రంప్ 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలు తప్పుగా దొర్లినవే...



ఇండియానే ఆధారం..

- అంతర్జాతీయ పెట్టుబడులకు భారత్ కేంద్రం
- నైపుణ్య సేవల ఎగుమతులకు చిరునామా
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలపై విశ్లేషకుల స్పందన

**న్యూఢిల్లీ:** భారత్ ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అంటూ ఒకవైపు ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ తదితర పేరున్న సంస్థలు కీర్తిస్తుంటే.. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం భారత ఆర్థిక వ్యవస్థను 'డెడ్ ఎకానమీ' (నిర్వీర్యమైనది)గా అభివర్ణిస్తూ నోరు పారేసుకున్నారు. కాకపోతే ఈ వ్యాఖ్యలు తప్పుగా ఉచ్చరించడమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. విదేశీ పెట్టుబడులకు భారత్ ఎంతో ఆకర్షణీయ కేంద్రంగా ఉండడమే కాకుండా.. అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు భారత్‌లో గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (జీసీసీలు) ఏర్పాటుకు క్యూ కడుతుండడాన్ని గుర్తు చేశారు. భారత్ ఉత్పత్తులపై ఆగస్ట్ 1 నుంచి 25 శాతం టారిఫ్‌లకు అదనంగా పెనాల్టీలను విధిస్తామంటూ ప్రకటించిన మర్నాడే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. ''రష్యాతో భారత్ ఏం చేసినా నాకు అవసరం లేదు. నిర్వీర్యమైన తమ ఆర్థిక వ్యవస్థలను (డెడ్ ఎకానమీస్) అవి పరస్పరం మరింత దిగజార్చుకుంటుండడం పైనే నా దృష్టి అంతా'' అని పోస్ట్‌లో పేర్కొన్నారు. దీనిపై కన్సల్టెన్సీ సంస్థ ఈవై ఇండియా స్పందిస్తూ.. భారత్‌పై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు తప్పుగా దొర్లినట్టుగా పేర్కొంది.

''ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గ్లోబల్ సౌత్ ప్రధానంగా మారుతోంది. ఇందులో భారత్ కీలకమైన పాత్ర పోషిస్తోంది. మరోవైపు అభివృద్ధి చెందిన ఒకప్పటి ఆర్థిక వ్యవస్థలు వేగంగా ప్రాభవాన్ని కోల్పోతున్నాయి. భారత సంతతి వారి కృషి మూలంగానే ఆయా ఆర్థిక వ్యవస్థలు ఎంతో కొంత సానుకూల వృద్ధిని చూపించగలుగుతున్నాయి'' అని ఈవై ఇండియా ముఖ్య విధాన సలహాదారుడు డీకే శ్రీవాస్తవ తెలిపారు. అధిక యువ జనాభా కలిగిన భారత ఆర్థిక వ్యవస్థ ఎంతో చురుకైన, చైతన్యవంతమైనదిగా పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి 2024 గణాంకాల ప్రకారం భారత్‌లో సగటు వయసు 28.8 సంవత్సరాలు కాగా, అమెరికాలో ఇది 38.5, యూరప్‌లో 42.8 సంవత్సరాలుగా ఉంది. సగటు వయసు, వృద్ధి అవకాశాల పరంగా అభివృద్ధి చెందిన దేశాలు మరింత వృద్ధాప్యంలోకి చేరుతున్నట్టు శ్రీవాస్తవ అన్నారు. ఐఎంఎఫ్ ఒక రోజు ముందే భారత ఆర్థిక వృద్ధి అంచనాలను పెంచుతూ ప్రకటించడం గమనార్హం. 2025, 2026 సంవత్సరాల్లో జీడీపీ 6.4 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేస్తుందని తెలిపింది. ఈ ఏడాదికి గాను భారత్ 6.3 శాతం వృద్ధి చెందుతుందని ప్రపంచ బ్యాంక్ ప్రకటించగా, ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) 6.5 శాతంగా అంచనా వేసింది. పారిస్ కేంద్రంగా పనిచేసే ఆర్థిక సహకార, అభివృద్ధి సమాఖ్య (ఓఈసీడీ) సైతం భారత్‌కు సంబంధించి మెరుగైన అంచనాలను ప్రకటించడం తెలిసిందే.

## పరిశ్రమలకు తగ్గిన బ్యాంకుల రుణ సాయం

5.5 శాతం వృద్ధికి పరిమితం



**ముంబై:** పరిశ్రమలకు బ్యాంకుల రుణ సాయంలో వృద్ధి జూన్ 26తో ముగిసిన పక్షం రోజుల్లో 5.5 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 7.7 శాతం వృద్ధి చెందడం గమనార్హం. ఆహారేతర పరిశ్రమలకు రుణ సాయం 10.2 శాతం పెరిగింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 13.8 శాతం వృద్ధి చెందింది. 41 షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల డేటా ఆధారంగా ఈ వివరాలను ఆర్‌బీఐ విడుదల చేసింది. ''సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్‌ఎంఈ) రుణ వితరణ స్థిరంగా పెరుగుతోంది. ప్రధాన రంగాల్లో ఇంజనీరింగ్, నిర్మాణం, టెక్స్‌టైల్స్‌కు రుణ వితరణ మెరుగైంది'' అని ఆర్‌బీఐ తెలిపింది. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు సైతం రుణ సాయం నిదానించింది. 6.8 శాతం వృద్ధికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే పక్షం రోజుల్లో ఈ రంగాలకు రుణ వితరణ 17.4 శాతం పెరిగినట్టు ఆర్‌బీఐ డేటా స్పష్టం చేసింది. సేవల రంగానికి రుణ వితరణ 9.6 శాతం పెరిగింది. క్రితం ఏడాది ఇదే కాలంలో 15.1 శాతం వృద్ధితో పోల్చి చూస్తే తగ్గుముఖం పట్టింది.

## కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

1-8-2025

| | |
|---|---|
| విశాఖ | 460-00 |
| చిత్తూరు | 493-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 460-00 |
| విజయవాడ | 475-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 420-00 |
| వరంగల్ | 422-00 |
| రిటైల్ ధర | 4.80 |

## నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| HINDUNILVR | 2,524.00 | 3.55 |
| JIOFIN | 329 | 2.72 |
| JSWSTEEL | 1,057.90 | 1.93 |
| ETERNAL | 308.85 | 1.78 |
| KOTAKBANK | 1,980.00 | 1.04 |

## నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| ADANIENT | 2,430.00 | -4.06 |
| TATASTEEL | 157.3 | -2.52 |
| SUNPHARMA | 1,700.00 | -1.95 |
| DRREDDY | 1,267.10 | -1.93 |
| NTPC | 333.7 | -1.51 |

## స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 7,302 |
| ఎన్ఎస్ఈ | 1,07,992 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 4,03,265 |
| ఎఫ్ఐఐ | - 5,589 |
| డీఐఐ | + 6,373 |

## ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 68.95 (రాత్రి 11.30కు) | $ 70.00 (క్రితం ముగింపు) |
| బ్రెంట్ | 71.47 (రాత్రి 11.30కు) | $ 72.47 (క్రితం ముగింపు) |

# 17.9 శాతానికి ద్రవ్యలోటు

జూన్ చివరికి రూ.2.80 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు రూ.2,80,732 కోట్లుగా నమోదైంది. తొలి త్రైమాసికం చివరికి ద్రవ్యలోటు పూర్తి ఆర్థిక సంవత్సరం అంచనాల్లో 17.8 శాతానికి చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికి జీడీపీలో 4.4 శాతం మేర ద్రవ్యలోటు (రూ.15.69 లక్షల కోట్లు) ఉంటుందన్నది కేంద్రం అంచనా. ప్రభుత్వ వ్యయాలు-ఆదాయాల మధ్య అంతరమే ద్రవ్యలోటు.



జూన్ త్రైమాసికంలో ప్రభుత్వానికి సమకూరిన ఆదాయం రూ.9.41 లక్షల కోట్లుగా ఉంది. ఇందులో రూ.5.4 లక్షల కోట్లు పన్నుల రూపంలో, రూ.3.73 లక్షల కోట్లు పన్నేతర మార్గంలో వచ్చింది. రుణేతర పత్రాల రూపంలో రూ.28,018 కోట్లు సమకూరింది. పన్నుల వాటా రూపంలో రాష్ట్రాలకు రూ.3,26,941 కోట్లను కేంద్రం బదిలీ చేసింది. క్రితం ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంతో పోల్చి చూస్తే రూ.47,439 కోట్లు పెరిగింది. ఇక కేంద్ర ప్రభుత్వ వ్యయం జూన్ క్వార్టర్‌లో రూ.12.22 లక్ష కోట్లుగా నమోదైంది. 2025-26 బడ్జెట్ అంచనాల్లో 24.1 శాతానికి సమానం. వ్యయాల్లో రూ.3.86 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకే వెళ్లింది. సబ్సిడీలపై రూ.83,554 కోట్లు ఖర్చు చేసింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూస్తే మూలధన వ్యయాలు 52 శాతం పెరిగాయి.

## రెట్టింపు ఆదాయంపై ఫ్యూచర్ జనరాలి కన్ను

- 2030 నాటికి రూ.10వేల కోట్ల ప్రీమియం
- సంస్థ ఎండీ అనూప్ రావు

**న్యూఢిల్లీ:** ఫ్యూచర్ జనరాలి ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ (ఎఫ్‌జీఐఐ) తన ప్రీమియం ఆదాయాన్ని వచ్చే ఐదేళ్లలో రెట్టింపు చేసుకోవాలనుకుంటోంది. 2024-25 మార్చి చివరికి రూ.5,547 కోట్లుగా ఉన్న స్థూల రిటన్ ప్రీమియం (జీడబ్ల్యూపీ)ను 2030 మార్చి చివరికి రూ.10,000 కోట్లకు పెంచుకోనున్నట్టు సంస్థ ఎండీ, సీఈవో అనూప్‌రావు ప్రకటించారు. ఏటా 13-15 శాతం స్థాయిలో వృద్ధి లక్ష్యంతో పనిచేయనున్నట్టు చెప్పారు. పరిశ్రమ సగటుకు మించి మంచి వృద్ధి సాధించనున్నట్టు, జీడీపీ వృద్ధి రేటుకు రెట్టింపు నమోదు చేయనున్నట్టు తెలిపారు. టాప్-10 జనరల్ ఇన్సూరర్స్ కంపెనీల్లో వేగవంతమైన వృద్ధితో మూడో స్థానంలో ఉన్నట్టు పేర్కొన్నారు. దివాలా పరిష్కార చట్టం కింద ఇటీవలే ఫ్యూచనరల్ జనరాలిలో ఫ్యూచర్ గ్రూప్ వాటాను సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేయడం, వృద్ధికి ప్రేరణగా నిలుస్తుందని అనూప్‌రావు తెలిపారు. సెంట్రల్ బ్యాంక్‌కు 4,500 శాఖలు ఉండడంతో మరింత మందికి చేరువ కావొచ్చన్నారు. పంపిణీ వ్యయాలు తగ్గుతాయన్నారు. తమ మొత్తం అమ్మకాల్లో బ్యాంకుల ద్వారా 6-7 శాతం వాటా ఉండగా, సెంట్రల్ బ్యాంక్ అండతో 10-12 శాతానికి వచ్చే ఐదేళ్లలో పెంచుకోగలమని చెప్పారు. హెల్త్, మోటారు ఇన్సూరెన్స్ ఇక ముందూ తమ వృద్ధికి ప్రధానంగా ఉంటాయన్నారు. అదే సమయంలో పెద్దగా ప్రజాదరణలో లేని పెంపుడు జంతువులకు బీమా, లయబిలిటీ ఇన్సూరెన్స్, ప్రొఫెషనల్ ఇండెమ్నిటీ, హౌసింగ్ ఇన్సూరెన్స్‌లో వేగంగా విస్తరించొచ్చని భావిస్తున్నట్టు చెప్పారు.

## నాలెడ్జ్ రియల్టీ ట్రస్ట్ @ రూ. 95-100

- ఆగస్ట్ 5-7 మధ్య పబ్లిక్ ఇష్యూ
- రూ. 4,800 కోట్ల సమీకరణకు రెడీ



**ముంబై:** నాలెడ్జ్ రియల్టీ ట్రస్ట్(కేఆర్‌టీ) పబ్లిక్ ఇష్యూకి ఒక్కో యూనిట్ ధరల శ్రేణి రూ. 95-100గా ప్రకటించింది. ఇష్యూ ఆగస్ట్ 5న ప్రారంభమై 7న ముగియనుంది. సత్వా గ్రూప్, పీఈ దిగ్గజం బ్లాక్‌స్టోన్‌కు పెట్టుబడులున్న కంపెనీ ఐపీవోలో భాగంగా రూ. 4,800 కోట్ల విలువైన యూనిట్ల(రీట్స్)ను తాజాగా జారీ చేయనుంది. తొలుత కంపెనీ ఐపీవో ద్వారా రూ. 6,200 కోట్లు సమీకరించే ప్రణాళికలు వేసింది. అయితే గత నెలలో ఇన్వెస్టర్ల నుంచి రూ. 1,400 కోట్లు సమకూర్చుకుంది. దీంతో ఇష్యూ పరిమాణం తగ్గింది. స్థూల అసెట్ విలువ(రూ. 62,000 కోట్లు) రీత్యా కేఆర్‌టీ దేశంలోనే అతిపెద్ద రీట్‌గా నిలవనుంది. గతేడాది(2024-25) రూ. 3,432 కోట్ల నిర్వహణ ఆదాయం సాధించింది. ముంబై, బెంగళూరు, హైదరాబాద్‌సహా ఆరు నగరాలలో 46 మిలినన్ల చదరపు అడుగులలో దాదాపు 30 కార్యాలయ ఆస్తులను కలిగి ఉంది. రీట్‌లో బ్లాక్‌స్టోన్, సత్వా గ్రూప్ 80 శాతం వాటాను కలిగి ఉంటాయి. దేశీయంగా ప్రస్తుతం బ్రూక్‌ఫీల్డ్ రియల్టీ ట్రస్ట్, ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్, మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్, నెక్సస్ సెలక్ట్ ట్రస్ట్.. స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ పొందాయి. నెక్సస్ సెలక్ట్ రిటైల్ రియల్టీ విభాగంలో పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంటే.. మిగిలిన మూడు సంస్థలు అద్దె ఆదాయాన్ని ఆర్జించే కార్యాలయ ఆస్తులను నిర్వహిస్తున్నాయి.

## ఈవీ రంగంలో మరిన్ని అవకాశాలపై మీడియాటెక్ కన్ను

పెరుగుతున్న ఏఐ వినియోగం

**న్యూఢిల్లీ:** సెమీకండక్టర్ల తయారీ దిగ్గజం మీడియాటెక్ భారత్‌లో మరిన్ని వ్యాపార అవకాశాలు లభించగలవని భావిస్తోంది. ఏఐ నిపుణుల లభ్యత మెరుగ్గా ఉండటంతో పాటు ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థలు కృత్రిమ మేధను ఉపయోగించుకోవడంపై ఆసక్తి చూపుతుండటమనేది విక్రయాల వృద్ధికి దోహదపడగలదని ఆశిస్తోంది. ఏఐ, కొత్త తరం కనెక్టివిటీ సొల్యూషన్స్‌పై దృష్టి పెడుతూ ఆటోమోటివ్ రంగంలో మరింతగా కార్యకలాపాలు విస్తరించే యోచనలో ఉన్నట్లు మీడియాటెక్ డైరెక్టర్



రీటా వూ తెలిపారు. ఏఐ వినియోగం, హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ సామర్థ్యాలకు డిమాండ్, తక్కువ విద్యుత్ శక్తితో నడిచే ఎలక్ట్రిక్ వాహనాలను రూపొందించడం వంటి అంశాలు పరిశ్రమలో కీలక మార్పులు తెస్తున్నాయని ఆమె తెలిపారు.

# జోరుగా గృహ వినియోగం

- వచ్చే 2-3 త్రైమాసికాల్లో పుంజుకుంటుంది
- యూబీఎస్ సెక్యూరిటీస్ అంచనా

**ముంబై:** భారత్‌లో గృహ వినియోగం వచ్చే రెండు నుంచి మూడు త్రైమాసికాల్లో పుంజుకుంటుందని స్విస్ బ్రోకరేజీ సంస్థ యూబీఎస్ సెక్యూరిటీస్ అంచనా వేసింది. గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం బలపడుతుండడం మద్దతుగా నిలుస్తుందని పేర్కొంది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఇది కొనుగోలు శక్తిని పెంచుతుందని తెలిపింది. అలాగే మంచి వర్షపాతం అంచనాలు పంటల దిగుబడిపై ఆశలను పెంచుతున్నాయని, మహిళల సామాజిక భద్రతపై ప్రభుత్వాలు 20 బిలియన్ డాలర్లు వ్యయం చేస్తుండడం.. ఇవన్నీ గ్రామీణ వినియోగాన్ని బలోపేతం చేస్తాయని తన నివేదికలో యూబీఎస్ సెక్యూరిటీస్ వివరించింది. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించడం, వ్యక్తిగత ఆదాయ పన్నులో మార్పుల ద్వారా 10 బిలియన్ డాలర్ల మేర ఆర్థిక ఉద్దీపనలు కల్పించడం, రుణాల లభ్యత పెరగడం.. ఇవన్నీ పట్టణ వినియోగాన్ని కుదురుకునేలా చేస్తాయని తెలిపింది. ''గ్రామీణ వినియోగం పుంజుకున్నప్పటికీ.. మొత్తం వాటాలో



గ్రామీణ వినియోగం సగానికంటే తక్కువగా ఉన్నందున, గృహ వినియోగం అన్ని రకాలుగా కోలుకుందని ఇప్పుడే చెప్పడం తొందరపాటే అవుతుంది. గ్రామీణ వినియోగం క్రమంగా బలపడుతున్న కొద్దీ ఎంతలేదన్నా వచ్చే 2-3 త్రైమాసికాల్లో గృహ వినియోగం పుంజుకోవడం మొదలవుతుంది'' అని యూబీఎస్ సెక్యూరిటీస్ భారత ముఖ్య ఆర్థికవేత్త తన్వీ గుప్తా జైన్ తెలిపారు.

**మాస్ మార్కెట్లో స్తబ్దత**

గ్రామీణ మార్కెట్లలో చౌక ఉత్పత్తుల వినియోగంలో స్తబ్దత నెలకొనగా, ప్రీమియం ఉత్పత్తుల అమ్మకాలు మాత్రం పెరుగుతున్నట్టు యూబీఎస్ సెక్యూరిటీస్ వెల్లడించింది. గ్రామీణ వేతనాల్లో వృద్ధి (ఆహార ద్రవ్యోల్బణంతో సర్దుబాటు చేసిన) ఆరేళ్ల గరిష్ట స్థాయి అయిన 4.5 శాతానికి చేరుకున్నట్టు తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో ద్విచక్ర వాహన అమ్మకాలు జూన్ త్రైమాసికంలో 9 శాతం, ట్రాక్టర్ల అమ్మకాలు 35 శాతం చొప్పున పెరిగినట్టు పేర్కొంది. పట్టణ ప్రాంతాల్లో ప్యాసింజర్ కార్ల అమ్మకాలు, డ్యూరబుల్స్ గూడ్స్ ఉత్పత్తి మాత్రం జూన్ త్రైమాసికంలో తగ్గినట్టు తెలిపింది. ఎనిమిదో వేతన కమిషన్ సిఫారసులకు అనుగుణంగా 2026 నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు 55 బిలియన్ డాలర్ల చెల్లింపులు మొదలైతే అప్పుడు పట్టణ డిమాండ్ సైతం ఊపందుకుంటుందని అంచనా వేసింది.

## క్యూ1 ఫలితాలు

## కోల్ ఇండియా 5.50 డివిడెండ్

లాభం 20 శాతం డౌన్



**న్యూఢిల్లీ:** కోల్ ఇండియా జూన్ త్రైమాసికంలో బలహీన పనితీరు నమోదు చేసింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 20 శాతం తగ్గి రూ.8,734 కోట్లకు పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.10,944 కోట్లుగా ఉండడం గమనార్హం. ఆదాయం సైతం ఈ కాలంలో రూ.39,388 కోట్ల నుంచి రూ.37,458 కోట్లకు తగ్గింది. ముఖ్యంగా వ్యయాలు రూ.25,327 కోట్ల నుంచి రూ.25,893 కోట్లకు పెరిగాయి. బొగ్గు సరఫరా 4 శాతం తగ్గి 191 మిలియన్ టన్నులుగా నమోదైంది. ఉత్పత్తి సైతం 189.28 మిలియన్ టన్నుల నుంచి 183.32 మిలియన్ టన్నులకు పరిమితమైంది. వాటాదారుల వద్దనున్న ప్రతి ఒక్క షేరుకు రూ.5.50 చొప్పున తొలి మధ్యంతర డివిడెండ్ ఇచ్చేందుకు కంపెనీ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఇందుకు ఆగస్ట్ 6 రికార్డు తేదీగా ప్రకటించింది. ఆ రోజు నాటికి రికార్డుల్లో వాటాదారులుగా నమోదైన వారికి ఆగస్ట్ 30లోపు డివిడెండ్ చెల్లించనున్నట్టు తెలిపింది.

ఫలితాల నేపథ్యంలో కోల్ ఇండియా షేరు ఒక శాతం నష్టంతో రూ.376 వద్ద ముగిసింది.

## సన్ ఫార్మా లాభం క్షీణత

రూ. 2,279 కోట్లు



**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ఔషధ రంగ దిగ్గజం సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 20 శాతం క్షీణించి రూ. 2,279 కోట్లకు పరిమితమైంది. అయితే అనుకోని పద్దులను మినహాయిస్తే నికర లాభం 6 శాతం పుంజుకుని రూ. 2,996 కోట్లను తాకింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 2,836 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 13,185 కోట్ల నుంచి రూ. 14,316 కోట్లకు బలపడింది. దేశీయంగా ఫార్ములేషన్ల అమ్మకాలు 14 శాతం ఎగసి రూ. 4,721 కోట్లకు చేరగా.. యూఎస్‌లో అమ్మకాలు 47.3 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. వర్ధమాన మార్కెట్లలో అమ్మకాలు 5 శాతం వృద్ధితో 29.8 కోట్ల డాలర్లకు చేరాయి. కాగా.. ఏపీఐ విక్రయాలు 9 శాతం పెరిగి రూ. 540 కోట్లకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో సన్ ఫార్మా షేరు బీఎస్ఈలో 1.7% బలహీనపడి రూ. 1,706 వద్ద ముగిసింది.

## టీవీఎస్ మోటార్ లాభం జూమ్

రూ. 610 కోట్లు



**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ద్విచక్ర వాహన రంగ దేశీ దిగ్గజం టీవీఎస్ మోటార్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 32 శాతం జంప్‌చేసి రూ. 610 కోట్లను తాకింది. ఒక త్రైమాసికంలో కంపెనీ చరిత్రలోనే అత్యధిక అమ్మకాలు సాధించడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 461 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 10,355 కోట్ల నుంచి రూ. 12,250 కోట్లకు ఎగసింది. మోటార్‌సైకిళ్ల విక్రయాలు 21 శాతం అధికంగా 6.21 లక్షల యూనిట్లకు చేరగా.. స్కూటర్ అమ్మకాలు 19% ఎగసి 4.99 లక్షల యూనిట్లను తాకాయి. త్రిచక్ర వాహనాలు మరింత అధికంగా 46% జంప్‌చేసి 45,000 యూనిట్లకు చేరాయి. ఈ బాటలో ఎలక్ట్రిక్ స్కూటర్ల విక్రయాలు 35% ఎగసి 70,000 యూనిట్లుగా నమోదయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో టీవీఎస్ మోటార్ షేరు 0.4 శాతం లాభంతో రూ. 2,802 వద్ద ముగిసింది.

## జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ లాభం ఆకర్షణీయం

ఆదాయంలోనూ మెరుగైన వృద్ధి



**న్యూఢిల్లీ:** జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ జూన్ త్రైమాసికంలో పనితీరు పరంగా ఇన్వెస్టర్లను మెప్పించింది. రూ.743 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో నమోదైన లాభం రూ.552 కోట్లతో పోల్చి చూస్తే 42 శాతం ఎగసింది. ఆదాయం సైతం ఇదే కాలంలో 78 శాతం పెరిగి రూ.5,411 కోట్లకు చేరుకుంది. అదనపు సామర్థ్యాలు అందుబాటులోకి రావడం, మహానంది, ఓ2 పవర్ పనితీరు ఇందుకు దోహదపడినట్టు కంపెనీ ప్రకటించింది. ''వ్యూహాత్మక కొనుగోళ్లు ఎబిట్డా వృద్ధికి ఎగిసేలా చేశాయి. మహానంది ప్లాంట్ నుంచే రూ.867 కోట్లు రాగా, ఓ2 పవర్ నుంచి రూ.219 కోట్లు సమకూరింది'' అని కంపెనీ వెల్లడించింది. కంపెనీ విద్యుదుత్పత్తి 71 శాతం పెరిగి 13.5 మిలియన్ యూనిట్లకు చేరింది. పునరుత్పాదక ఇంధన వనరుల రూపంలో విద్యుదుత్పత్తి 54 శాతం వృద్ధితో 5 బిలియన్ యూనిట్లుగా నమోదైంది.

బీఎస్ఈలో జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ షేరు ధర 2 శాతంపైగా నష్టంతో రూ.515 వద్ద ముగిసింది.

## స్విగ్గీ నష్టాలు రెట్టింపు

రూ. 1,197 కోట్లు



**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ఫుడ్, ఈకామర్స్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర నష్టం రెట్టింపునకు పెరిగి రూ. 1,197 కోట్లను తాకింది. ప్రధానంగా క్విక్‌కామర్స్ విభాగం ఇన్‌స్టామార్ట్ నుంచి నమోదైన రూ. 896 కోట్ల భారీ నష్టం ఇందుకు కారణమైంది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 611 కోట్ల నష్టం ప్రకటించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 3,310 కోట్ల నుంచి రూ. 5,048 కోట్లకు జంప్‌చేసింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 3,908 కోట్ల నుంచి రూ. 6,244 కోట్లకు భారీగా పెరిగాయి. గత రెండేళ్లుగా ఫుడ్ డెలివరీ స్పీడందుకున్నట్లు కంపెనీ పేర్కొంది. ఈ బాటలో గత 9 త్రైమాసికాలలోనే 18.8 శాతం వేగవంత వృద్ధిని సాధించినట్లు తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో స్విగ్గీ షేరు బీఎస్ఈలో 0.6 శాతం బలపడి రూ. 404 వద్ద ముగిసింది.

## వేదాంతా లాభం అప్

రూ. 5,000 కోట్లు



**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో మెటల్స్, మైనింగ్ రంగ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం సర్దుబాటు తదుపరి 13 శాతం వృద్ధితో రూ. 5,000 కోట్లను తాకింది. ఓఎల్‌ఏపీ బ్లాకులలో కెయిర్న్ ఇంధన వెలికితీత వ్యయాలు రైటాఫ్ ప్రభావం చూపింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 4,433 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 35,239 కోట్ల నుంచి రూ. 37,434 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 30,772 కోట్ల నుంచి రూ. 32,756 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో వేదాంతా షేరు బీఎస్ఈలో 2.2 శాతం క్షీణించి రూ. 425 వద్ద ముగిసింది.

## అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభం వీక్

రూ. 734 కోట్లు



**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్ నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 49 శాతం క్షీణించి రూ. 734 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 1,458 కోట్లు ఆర్జించింది. విమానాశ్రయాలు, మైనింగ్ యూనిట్ల బిజినెస్ పుంజుకున్నప్పటికీ కోల్ డిమాండ్ నీరసించడం ప్రభావం చూపింది. వివిధ కారణాలతో థర్మల్ పవర్ నుంచి డిమాండ్ క్షీణించినట్లు కంపెనీ తెలియజేసింది. దీంతో ఆదాయంలో 36 శాతం వాటా ఆక్రమిస్తున్న కోల్ ట్రేడింగ్ విభాగం అమ్మకాల పరిమాణం 17 శాతం వెనకడుగు వేసి 12.8 మిలియన్ టన్నులకు పరిమితమైనట్లు వెల్లడించింది. వెరసి మొత్తం ఆదాయం 14 శాతం తక్కువగా రూ. 22,437 కోట్లకు చేరినట్లు పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు బీఎస్ఈలో 4 శాతం పతనమై రూ. 2,431 వద్ద ముగిసింది.

## జైడస్ వెల్‌నెస్ లాభం డౌన్

రూ. 128 కోట్లు

**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో హెల్త్‌కేర్ రంగ దిగ్గజం జైడస్ వెల్‌నెస్ ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 13 శాతం క్షీణించి రూ. 128 కోట్లకు పరిమితమైంది. అధిక వ్యయాలు, సీజనల్ బ్రాండ్ల అమ్మకాలు క్షీణించడం ప్రభావం చూపాయి. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 148 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 841 కోట్ల నుంచి రూ. 861 కోట్లకు బలపడింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 694 కోట్ల నుంచి రూ. 719 కోట్లకు ఎగశాయి. గ్లూకోన్-డి, న్యూట్రాలైట్, కాంప్లాన్, నైసిల్, ఎవర్‌యూత్ నేచురల్స్ బ్రాండ్ల కంపెనీ ప్రకటనలు, ప్రమోషన్ వ్యయాలు రూ. 124 కోట్ల నుంచి రూ. 133 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో జైడస్ వెల్‌నెస్ షేరు 1.5% నష్టపోయి రూ. 2,028 వద్ద ముగిసింది.

# న్యూజిలాండ్ 307 ఆలౌట్

బులవాయో (జింబాబ్వే): బౌలర్ల కృషికి బ్యాటర్ల సహకారం తోడవడంతో... జింబాబ్వేతో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ మంచి స్థితిలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 92/0తో గురువారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ చివరకు 96.1 ఓవర్లలో 307 పరుగులకు ఆలౌటైంది. డెవాన్ కాన్వే (170 బంతుల్లో 88; 12 ఫోర్లు), డారిల్ మిచెల్ (119 బంతుల్లో 80; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలతో రాణించగా... విల్ యంగ్ (70 బంతుల్లో 41; 4 ఫోర్లు), హెన్రీ నికోల్స్ (34; 6 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. రచిన్ రవీంద్ర (2), బ్లండెల్ (2), బ్రేస్‌వెల్ (9) విఫలమయ్యారు. జింబాబ్వే బౌలర్లలో ముజరబాని 3, చివాంగ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన జింబాబ్వే ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 13 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 31 పరుగులు చేసింది. బెనెట్ (18), బెన్ కరన్ (11) పెవిలియన్ చేరగా... నిక్ వెల్చ్ (2 బ్యాటింగ్), మసెకెసా (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. కివీస్ బౌలర్లలో హెన్రీ, రూర్కె చెరో వికెట్ పడగొట్టారు. చేతిలో 8 వికెట్లు ఉన్న జింబాబ్వే... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 127 పరుగులు వెనుకబడి ఉంది.



## మాల్టాలో 2027 కామన్వెల్త్ యూత్ గేమ్స్

న్యూఢిల్లీ: కామన్వెల్త్ యూత్ గేమ్స్–2027కు మాల్టా దేశం ఆతిథ్యమివ్వనుంది. 74 దేశాలకు చెందిన 14 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు గల వెయ్యి మందికి పైగా అథ్లెట్లు ఈ క్రీడల్లో పాల్గొననున్నారు. 8 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. ‘8వ కామన్వెల్త్ యూత్ గేమ్స్–2027 మాల్టాలో జరగనున్నాయి. 1150 మంది అథ్లెట్లు పాల్గొంటారు. ద్వీపదేశంలో నిర్వహించనున్న ఈ టోర్నమెంట్‌లో నాలుగు ప్రధాన వేదికలపై పోటీలు జరుగుతాయి’ అని కామన్వెల్త్ స్పోర్ట్ ఒక ప్రకటనలో వెల్లడించింది.






# గురువును గుర్తు చేసుకుంటూ..

## దివ్య దేశ్‌ముఖ్ భావోద్వేగం ● స్వస్థలంలో ఘన స్వాగతం

నాగ్‌పూర్: దివ్య దేశ్‌ముఖ్... ప్రస్తుత చెస్ సంచలనం. 19 ఏళ్ల వయసులో మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకొని సత్తా చాటిన ఘనాపాటీ. జార్జియాలో జరిగిన ఫైనల్లో కోనేరు హంపిని ఓడించిన అనంతరం చాంపియన్‌గా నిలిచిన అనంతరం దివ్య బుధవారం రాత్రి స్వదేశానికి తిరిగి వచ్చింది. సొంత ఊరు నాగ్‌పూర్ విమానాశ్రయంలో ఆమె తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు, సన్నిహితులతో అంతా సందడిగా ఉంది. దివ్య రాగానే వారంతా బాజా భజంత్రీలతో ఆమెకు ఘన స్వాగతం పలికారు. అప్పుడే దివ్య తన వద్ద ఉన్న ఒక ఫోటో ఫ్రేమ్‌ను బయటకు తీసి ప్రదర్శించింది. అది ఆమె మొదటి కోచ్ రాహుల్ జోషి చిత్రం. దానిని చూపిస్తూ దివ్య భావోద్వేగానికి లోనైంది. చెస్‌లో రాహుల్ వద్దే దివ్య ఓనమాలు నేర్చుకుంది. కేవలం కోచ్‌గానే కాకుండా తన సొంత ఇంట్లో మనిషిగా చూస్తూ రాహుల్ ఆమెకు శిక్షణనందించాడు. కెరీర్ ఆరంభంలో అండర్–9 స్థాయి నుంచి అండర్–14 వరకు పలు విజయాలు రాహుల్ కోచ్‌గా ఉండగానే వచ్చాయి. ఆమె మరింత ఎదుగుతున్న దశలో 2020లో కరోనా మహమ్మారి వచ్చింది. దీనికి 40 ఏళ్ల వయసులోనే జోషి బలయ్యాడు. కొన్ని విజయాలు సాధించగానే గతాన్ని మరిచిపోయే క్రీడాకారులు మనకు ఎంతో మంది కనిపిస్తుంటారు. కానీ ఆదిగురువును ఆమెకు గౌరవించిన తీరు దివ్యను ప్రత్యేకంగా చూపించింది. ‘నేను ఈ స్థాయికి చేరడంతో మొదటి కోచ్ రాహుల్ జోషి సర్ పాత్ర ఎంతో ఉంది. నేను గ్రాండ్‌మాస్టర్ కావాలని ఆయన ఎంతో కోరుకునేవారు. ఈ విజయం ఆయనకే అంకితం’ అని దివ్య తన మనసులో భావాన్ని వెల్లడించింది.

### నా ఆటపైనే దృష్టి పెట్టాను...

హంపితో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తనపై ఎలాంటి ఒత్తిడీ లేదని, తాను ఓడినా కోల్పోయేదేమీ లేదనే ఆలోచనతోనే బరిలోకి దిగినట్లు దివ్య పేర్కొంది. ప్రత్యర్థికి ఎంతో అనుభవం ఉన్నా... దాని గురించి ఆందోళన చెందకుండా తన ఆటపైనే దృష్టి పెట్టానని ఆమె వెల్లడించింది. ‘నేను ఓడిపోతాననే ఆలోచన కూడా ఎప్పుడూ రాలేదు. నిజానికి హంపి చేసిన పెద్ద తప్పుతోనే విజయం నా సొంతమైంది. నేను వేయబోయే ఎత్తుల గురించే తప్ప తుది ఫలితం ఎలా వస్తుందని పట్టించుకోలేదు. కాబట్టి ఒత్తిడికి లోను కాలేదు. అంతర్జాతీయ చెస్‌లో భారత మహిళలు సాధించే విజయాలు ఇక్కడ మరింత మంది అమ్మాయిలు ఈ ఆట వైపు ఆకర్షితులయ్యేందుకు స్ఫూర్తినిస్తాయి. అయితే నా ఉద్దేశం ప్రకారం తల్లిదండ్రుల మద్దతే అన్నింటికంటే అవసరం. ముఖ్యంగా విజయాలు సాధించినప్పుడు కాకుండా ఓటములు ఎదురైనప్పుడు కూడా అండగా నిలవాల్సి ఉంటుంది’ అని దివ్య అభిప్రాయ పడింది.



### సెప్టెంబర్‌లో తర్వాతి టోర్నీ...

ప్రపంచకప్‌ను గెలుచుకోవడంతో తనకు దక్కిన కొత్త గుర్తింపు పట్ల దివ్య దేశ్‌ముఖ్ సంతోషం వ్యక్తం చేసింది. మున్ముందు ఇలాంటి విజయాలను కొనసాగిస్తానని ఆమె ఆత్మవిశ్వాసంతో చెప్పింది. స్వస్థలం నాగపూర్‌లో లభించిన ఘన స్వాగతాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని దివ్య పేర్కొంది. ‘నా కోసం ఇంత మంది ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది. వారంతా నన్ను సన్మానించిన తీరు చూస్తే గర్వంగా అనిపిస్తోంది. నాతో పాటు చెస్‌కు లభించిన గుర్తింపుగా దీనిని భావిస్తున్నాను. తల్లిదండ్రులు నాకు అండగా నిలిచి ప్రోత్సహించడంతోనే ఇది సాధ్యమైంది. నా విజయంలో వారి పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే. నెల రోజుల పాటు విశ్రాంతి తీసుకొని మళ్లీ బరిలోకి దిగుతాను. సెప్టెంబర్ 2 నుంచి ఉజ్బెకిస్తాన్‌లో జరిగే గ్రాండ్ స్విస్ నా తర్వాతి టోర్నీ కానుంది’ అని దివ్య వెల్లడించింది. తాను వరల్డ్ కప్ గెలుచుకోవడంలో సహకరించిన మాజీ ఆటగాళ్లు, కోచ్‌లు అభిజిత్ కుంతే, అభిమన్యు పురాణిక్, సబా బలోగ్ (హంగేరీ)లకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# బుచార్డ్ వీడ్కోలు

## ఓటమితో టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన కెనడా ప్లేయర్



మాంట్రియల్: కెనడాకు చెందిన టెన్నిస్ ప్లేయర్ జెనీ బుచార్డ్ ఆటకు వీడ్కోలు పలికింది. సొంతగడ్డపై అభిమానుల సమక్షంలో కెరీర్‌లో చివరి మ్యాచ్ ఆడేసింది. నేషనల్ బ్యాంక్ ఓపెన్‌లో భాగంగా గురువారం మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో బుచార్డ్ 2–6, 6–3, 4–6తో 17వ సీడ్ బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడింది. తొలి రౌండ్‌లో పోరాడి గెలిచిన బుచార్డ్... రెండో రౌండ్‌లో అదే ఆట తీరు కనబర్చలేకపోయింది. 2 గంటల 16 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో... తొలి సెట్‌లో ఓడిన బుచార్డ్... ఆ తర్వాత పుంజుకుంది. రెండో సెట్ గెలిచి... మూడో సెట్‌లోనూ చక్కటి పోరాటం కనబర్చినా... కీలక సమయాల్లో ఆధిక్యం కనబర్చిన బెన్‌చిచ్ విజయం సాధించింది. ‘మాంట్రియల్‌తో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. కెరీర్ ఆరంభించినప్పటి నుంచి ఏదో ఒక రోజు ఇదే మైదానంలో ఆటకు వీడ్కోలు పలకాలని బలంగా అనుకునే దాన్ని. ఇప్పుడు ఆ రోజు వచ్చేసింది. ఇదో భావోద్వేగ సందర్భం. కెరీర్‌లో సాధించిన దాంతో సంతృప్తిగా ఉన్నా’ అని బుచార్డ్ పేర్కొంది. 2014లో కెరీర్ అత్యుత్తమ దశలో ఉన్న సమయంలో బుచార్డ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా 5వ స్థానానికి చేరింది. ఆ ఏడాదే కెరీర్‌లో ఏకైక డబ్ల్యూటీఏ సింగిల్స్ టైటిల్ నెగ్గిన ఆమె.... ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో సెమీఫైనల్‌కు చేరింది. 2014లో వింబుల్డన్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచింది. ఆ తర్వాత ఆ స్థాయి ప్రదర్శన కనబర్చలేకపోయిన బుచార్డ్... తిరిగి పుంజుకోలేకపోయింది. ‘ఎన్నో కష్టనష్టాలు ఓర్చి ఇక్కడి వరకు వచ్చా. టెన్నిస్ ధ్యాసలో పడి చదువుకు దూరమయ్యా. ఇష్టాలను వదులుకొని ఎంతో కష్టపడితేనే ఈ స్థాయికి చేరుకున్నా. నేను ఆటకు ఎంతో ఇచ్చాను. ఇక ఆటకు వీడ్కోలు పలికి ఇతర విషయాలపై దృష్టి పెట్టాలనుకుంటున్నా. టెన్నిస్ నాకు తిరిగిచ్చిన దాంతో సంతృప్తిగా ఉన్నా. చిన్నప్పుడు ఈ మైదానంలో కూర్చొని మ్యాచ్‌లు వీక్షించేదాన్ని. ఏదో ఒక రోజు ఈ కోర్టులో అడుగు పెట్టాలని కలలు కనేదాన్ని. అది నిజం చేసుకొని సగర్వంగా ఇక్కడే ఆటకు వీడ్కోలు పలుకుతున్నా’ అని మ్యాచ్ అనంతరం బుచార్డ్ కన్నీటి పర్యంతమైంది.







# రచన, అశ్విని బంగారం

## ప్రపంచ అండర్‌-17 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఐదు పతకాలు

ఏథెన్స్ (గ్రీస్): అంతర్జాతీయ స్థాయిలో మరోసారి భారత ‘పట్టు’ చాటుకుంటూ... ప్రపంచ అండర్–17 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో మహిళా రెజ్లర్లు ఐదు పతకాలతో అదరగొట్టారు. ఇందులో రెండు స్వర్ణాలు, రెండు రజతాలు, ఒక కాంస్యం ఉన్నాయి. 43 కేజీల విభాగంలో రచన... 65 కేజీల విభాగంలో అశ్విని విష్ణోయ్ బంగారు పతకాలు సొంతం చేసుకోగా... 57 కేజీల విభాగంలో మోనీ, 73 కేజీల విభాగంలో కాజల్ రజత పతకాలు గెలిచారు. 49 కేజీల విభాగంలో కోమల్ వర్మ కాంస్య పతకాన్ని హస్తగతం చేసుకుంది. గురువారం జరిగిన ఫైనల్స్‌లో రచన 3–0తో జిన్ హువాంగ్ (చైనా)పై, అశ్విని 3–0తో ముఖాయో రఖీమ్‌జొనోవా (ఉజ్బెకిస్తాన్)పై విజయం సాధించారు. మద్‌ఖియా ఉస్మనోవా (కజకిస్తాన్)తో జరిగిన తుది పోరులో మోనీ 5–6 పాయింట్ల తేడాతో... వెన్‌జిన్ కియు (చైనా)తో జరిగిన ఫైనల్లో కాజల్ 5–8 పాయింట్ల తేడాతో ఓడిపోయారు. కాంస్య పతక బౌట్‌లో కోమల్ వర్మ 8–3 పాయింట్ల తేడాతో అన్‌హెలీనా బుర్కినా (రష్యా)పై గెలిచింది. మరోవైపు భారత్‌కే చెందిన యశిత (61 కేజీలు) స్వర్ణ పతకం కోసం... మనీషా (69 కేజీలు) కాంస్య పతకం కోసం ఈ రోజు పోటీపడనున్నారు.

# మెకింటోష్ పసిడి ‘హ్యాట్రిక్’

## ఫెల్ప్స్ రికార్డుపై కెనడా స్టార్ స్విమ్మర్ గురి ● మర్చండ్ ఖాతాలో స్వర్ణం



సింగపూర్: ఈత కొలనులో తనకు తిరుగులేదని కెనడా టీనేజ్ స్టార్ స్విమ్మర్ సమ్మర్ మెకింటోష్ మరోసారి చాటుకుంది. ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తన జోరు కొనసాగిస్తూ 18 ఏళ్ల మెకింటోష్ మూడో స్వర్ణ పతకాన్ని తన ఖాతాలో జమ చేసుకుంది. గురువారం జరిగిన మహిళల 200 మీటర్ల బటర్‌ఫ్లయ్ ఫైనల్లో మెకింటోష్ 2 నిమిషాల 01.99 సెకన్లలో గమ్యానికి చేరి విజేతగా నిలిచింది. ఈ చాంపియన్‌షిప్‌లో ఇప్పటికే మెకింటోష్ 400 మీటర్ల ఫ్రీస్టయిల్, 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ విభాగాల్లో బంగారు పతకాలు సొంతం చేసుకుంది. 800 మీటర్ల ఫ్రీస్టయిల్, 400 మీటర్ల మెడ్లీ ఈవెంట్స్‌లో మెకింటోష్ బరిలోకి దిగాల్సి ఉంది. ఈ రెండింటిలోనూ మెకింటోష్ స్వర్ణాలు సాధిస్తే... ఒకే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అత్యధికంగా 5 స్వర్ణ పతకాలు సాధించిన స్విమ్మర్‌గా మైకేల్ ఫెల్ప్స్ (అమెరికా; 2007లో) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును మెకింటోష్ సమం చేస్తుంది. గత ఏడాది జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో మెకింటోష్ 200 మీటర్ల బటర్‌ఫ్లయ్, మెడ్లీ, 400 మీటర్ల మెడ్లీ ఈవెంట్స్‌లో స్వర్ణాలు గెలిచి, 400 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో రజతం సాధించింది. 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం నెగ్గిన మెకింటోష్... 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణాలు, రెండు కాంస్యాలు సాధించింది. మూడోసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పోటీపడుతున్న మెకింటోష్ ఇప్పటి వరకు మొత్తం ఏడు స్వర్ణాలు, ఒక రజతం, మూడు కాంస్యాలతో కలిపి 11 పతకాలు గెలిచింది.




మరోవైపు పురుషుల 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లీలో ఫేవరెట్ లియోన్ మర్చండ్ స్వర్ణ పతకాన్ని గెల్చుకున్నాడు. బుధవారం సెమీఫైనల్ రేసులో కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పిన 23 ఏళ్ల మర్చండ్... గురువారం జరిగిన ఫైనల్ రేసును 1 నిమిషం 53.68 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. పురుషుల 100 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో డేవిడ్ పొపోవిచి (రొమేనియా; 46.51 సెకన్లు)... మహిళల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో కేథరీన్ బెర్కోఫ్ (అమెరికా; 27.08 సెకన్లు) బంగారు పతకాలు గెలిచారు. మహిళల 4×200 మీటర్ల ఫ్రీస్టయిల్ రిలేలో ఆస్ట్రేలియా బృందం స్వర్ణ పతకం సొంతం చేసుకుంది. మరో మూడు రోజులపాటు కొనసాగనున్న ఈ మెగా ఈవెంట్‌లో పతకాల పట్టికలో ఆస్ట్రేలియా (5 స్వర్ణాలు, 1 రజతం, 5 కాంస్యాలు) 11 పతకాలతో అగ్రస్థానంలో... అమెరికా (4 స్వర్ణాలు, 10 రజతాలు, 4 కాంస్యాలు) 18 పతకాలతో రెండో స్థానంలో... కెనడా (3 స్వర్ణాలు, 2 కాంస్యాలు) ఐదు పతకాలతో మూడో స్థానంలో ఉన్నాయి. గెలిచిన స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంకింగ్స్‌ను నిర్ణయిస్తారు.




# నేటి నుంచి మహిళల జూనియర్ హాకీ టోర్నీ

సాక్షి, కాకినాడ: ప్రతిభకు ప్రోత్సాహం అందించేందుకు హాకీ ఇండియా (హెచ్‌ఐ)... మహిళల జూనియర్ జాతీయ చాంపియన్‌షిప్ నిర్వహిస్తోంది. శుక్రవారం ప్రారంభం కానున్న ఈ టోర్నమెంట్‌లో 30 జట్లు పాల్గొంటున్నాయి. ఇటీవల కొత్తగా ప్రవేశపెట్టిన ఫార్మాట్‌లో పోటీలు జరగనున్నాయి. ప్రదర్శన ఆధారంగా జట్లను ‘ఎ’, ‘బి’, ‘సి’ గ్రూప్‌లుగా విభజించారు. ‘సి’ గ్రూప్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన జట్టు... వచ్చే ఏడాది ‘బి’ గ్రూప్‌లో బరిలోకి దిగనుంది. అలాగే ‘బి’ గ్రూప్ అగ్రస్థానంలో నిలిచిన జట్టు ‘ఎ’ గ్రూప్‌కు చేరనుంది. ఇదేవిధంగా ‘ఎ’ గ్రూప్‌లో పేలవ ప్రదర్శన కనబర్చిన జట్టు ‘బి’ గ్రూప్‌కు... అందులో ఆఖర్లో నిలిచిన జట్టు ‘సి’ గ్రూప్‌కు చేరుతుంది. ఈ నెల 12తో చాంపియన్‌షిప్ ముగియనుంది. డిఫెండింగ్ చాంపియన్ జార్ఖండ్‌తో సహా జాతీయ ర్యాంకింగ్స్‌లో తొలి 12 స్థానాల్లో ఉన్న జట్లు గ్రూప్ ‘ఎ’ నుంచి పోటీ పడుతుండగా... వాటిని తిరిగి నాలుగు పూల్స్‌గా విభజించారు. ఆంధ్రప్రదేశ్ జట్టు డివిజన్ ‘ఎ’లో ఉండగా... తెలంగాణ హాకీ జట్టు డివిజన్ ‘సి’లో ఉంది.



# బుమ్రా ఎంత కాలం ఇలా..!

## మరో టెస్టుకు దూరమైన పేసర్



టెస్టు బౌలర్‌గా జస్‌ప్రీత్ బుమ్రాపై మరోసారి చర్చ మొదలైంది. సిరీస్ ఫలితాన్ని తేల్చే కీలకమైన టెస్టులో ఆడించకుండా ‘పని భారం’ పేరుతో అతడిని పక్కన పెట్టడం మళ్లీ అతని ఫిట్‌నెస్‌పై సందేహాలు రేకెత్తించింది. నిజానికి సిరీస్‌కు ముందే అతను మూడు టెస్టులు మాత్రమే ఆడతాడని టీమ్ మేనేజ్‌మెంట్ చేసిన ప్రకటనే తప్పు. ప్రతీ మ్యాచ్‌కు ముందు పరిస్థితిని బట్టి తుది జట్టును ఎంపిక చేసే సమయంలో నిర్ణయం తీసుకోవాల్సింది. కానీ ‘మూడే టెస్టులు’ అంటూ మళ్లీ మళ్లీ చెప్పడం అర్థరహితం. అలా ప్రకటించినా... పేస్, స్వింగ్‌కు అనుకూలంగా ఉన్న ఓవల్ పిచ్‌పై అతను ఆడతాడని అంతా భావించారు. ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టులో నాలుగు, ఐదు రోజుల్లో బుమ్రాకు బౌలింగ్ చేయాల్సిన అవసరం రాలేదు. మూడు రోజుల విరామం కలిపితే ఐదు రోజుల పాటు అతని పూర్తి విశ్రాంతి లభించింది. లీడ్స్‌తో మొదటి టెస్టు, బర్మింగ్‌హామ్‌లో రెండో టెస్టుకు మధ్య ఏడు రోజుల వ్యవధి వచ్చినా బుమ్రాను ఆడించకపోవడాన్ని మాజీ ఆటగాళ్లు, విశ్లేషకులు తప్పు పట్టగా, ఇప్పుడు అదే పునరావృతమైంది. బుమ్రా అత్యద్భుత బౌలర్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఒంటి చేత్తో అతను జట్టుకు విజయాలు అందించాడు. 48 టెస్టుల కెరీర్‌లో 35 టెస్టుల్లో విదేశాల్లోనే ఆడి కేవలం 20 సగటుతో 172 వికెట్లు పడగొట్టిన రికార్డు అతని సొంతం. అయితే ఇలా అప్పుడప్పుడు ఆడుతూ 31 ఏళ్ల బుమ్రా ఎంత కాలం టెస్టు కెరీర్‌ను కొనసాగించగలడనేదే చర్చనీయాంశం. టెస్టుల్లో అతను రిటైర్ కావడం మంచిదనే సూచనలు వస్తున్నాయి. అయితే ఇప్పుడు అతను పూర్తిగా తప్పుకోవడంకంటే ఇదే తరహాలో వ్యూహాత్మకంగా వాడుకోవడం సరైందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సరిగ్గా చెప్పాలంటే బుమ్రాను నమ్ముకొని మ్యాచ్‌లు గెలవాలనుకునే ఆలోచనను టీమ్ మేనేజ్‌మెంట్ పక్కన పెట్టాల్సిందే. అతను అందుబాటులో ఉంటే మంచిదే కానీ లేకపోయినా అన్ని రకాలుగా సిద్ధం కావడం సరైన ప్రణాళిక అవుతుంది. ఇతర బౌలర్లతో పోలిస్తే బుమ్రా తక్కువ ఓవర్లు ఏమీ వేయలేదు. ఆస్ట్రేలియా సిరీస్‌లో 151.2 ఓవర్లు వేసిన అతను...ప్రస్తుత సిరీస్‌లో మూడు టెస్టుల్లో 5 ఇన్నింగ్స్‌లోనే 119.4 ఓవర్లు బౌలింగ్ చేశాడు. అతని భిన్నమైన బౌలింగ్ శైలితోనే సమస్య. అదే అతని వెన్నుభాగంపై తీవ్ర ఒత్తిడి పెంచుతుంది. బౌలింగ్ సమయంలో శరీరాన్ని ఒక వైపు వంచే ‘లేటరల్ ఫ్లెక్సియాన్’తో అతను ఇంత కాలం కొనసాగడమే గొప్ప. నిజానికి ఈ సిరీస్‌లో అతను ఆడిన మూడు టెస్టు తొలి ఇన్నింగ్స్‌లలో 140 కిలోమీటర్లకు పైగా వేసిన బంతుల శాతం 42.7 నుంచి 22.3కి, ఆపై 0.5 శాతానికి తగ్గుతూ వచ్చింది. మాంచెస్టర్‌లో ఇన్నింగ్స్‌లో 33 ఓవర్లు వేసిన బుమ్రా తొలిసారి 100కు పైగా పరుగులు ఇచ్చాడు. కాబట్టి అతడిని ఓవల్‌లోనూ ఆడిస్తే సమస్య తీవ్రంగా మారేదేమో! ఇలాంటి స్థితిలో బుమ్రాకు విరామాలు ఇవ్వడంలో తప్పు లేదనేది మేనేజ్‌మెంట్ వాదన.

– సాక్షి క్రీడా విభాగం



ఆగ్రాలోని ప్రఖ్యాత తాజ్‌మహల్ వద్ద గురువారం వర్షం కురుస్తున్న వేళ కేరింతలతో డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు



చత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇంద్రావతి నదీ పొంగి ప్రవహిస్తుండగా చిత్రకొటె జలపాతం వద్ద వరద పరవళ్లు

# చైనాలో గోల్డ్ రష్..!

## వరదల్లో కొట్టుకుపోయిన దుకాణంలోని నగలు, నగదు

**దుకాణం సిబ్బందితోపాటు బురదలో స్థానికుల అన్వేషణ ● దొరికింది తెస్తే బహుమానం ఇస్తానని యజమాని ప్రకటన**

**బీజింగ్:** ఒకటీరెండూ కాదు..ఏకంగా 20 కిలోల బంగారం, వెండి నగలు...బంగారం, డబ్బు నిండుగా ఉన్న ఇనుప బీరువా..! చైనాలోని ఓ ఊళ్లో జనం వీటిని సొంతం చేసుకునేందుకు తెగ వెతుకుతున్నారు. కొందరు బురద మట్టిని తవ్వి మరీ చూస్తున్నారు. మరికొందరైతే ఏకంగా మెటల్ డిటెక్టర్లను పట్టుకుని తిరుగుతున్నారు. ఇదంతా నిధీ నిక్షేపాల కోసం మాత్రం కాదు..వరదల్లో కొట్టుకుపోయిన సొత్తు కోసం సాగుతున్న ఎడతెగని అన్వేషణ..! ఏం జరిగిందంటే.. జూలై 25వ తేదీన షాంగ్జి ప్రావిన్స్‌లోని వుక్వి కౌంటీలో భారీ వర్షాలతో అనూహ్యంగా వరదలు వచ్చాయి. కొన్ని నిమిషాల వ్యవధిలోనే మీటరు ఎత్తున వరద ఉప్పొంగి పట్టణాన్ని ముంచెత్తింది. ఆ వరద లావోఫెంగ్ జియాంగ్ దుకాణంలోకి కూడా ప్రవేశించింది. అధికార యంత్రాంగం వరద హెచ్చరికలతో ఆ రాత్రంగా జాగారం చేసిన దుకాణం సిబ్బంది, ఉదయం పూట యథా ప్రకారం దుకాణం తెరిచేందుకు ఉద్యుక్తులవుతున్నారు. బంగారం, ఇతర విలువైన సామగ్రిని సురక్షితంగా భద్రపర్చడం మర్చిపోయారు. సరిగ్గా ఆ సమయంలో ఎవరూ ఊహించని విధంగా ఒక్కసారిగా వేగంగా వరద ప్రవాహం దుకాణంలోకి చేరింది. తెరుకునే లోపే నగలున్న ట్రేలు, కాబిన్‌లను ఊడ్చిపెట్టుకుపోయింది. నగదు, నగలతోపాటు ఒక ఐరన్ సేఫ్ సైతం వరదతో పాటు మాయమైంది. బంగారం గొలుసులు, ఉంగరాలు, గాజులు, బ్రాస్‌లెట్లు, వజ్రపు ఉంగరాలు, వెండి ఆభరణాలు, పచ్చలు పోయిన వాటిల్లో ఉన్నాయి. ఐరన్ సేఫ్‌లో పెద్ద మొత్తంలో నగదుతోపాటు, కరిగించిన బంగారం, కొత్త బంగారు వస్తువులు ఉన్నాయి. వెరసి దుకాణదారుకు వాటిల్లిన నష్టం మార్కెట్ ధర ప్రకారం రూ.12 కోట్లని అంచనా. ఈ సొత్తు కోసం దుకాణం యజమాని కుటుంబంతోపాటు సిబ్బంది రెండు రోజులుగా కాళ్లకు బలపం కట్టుకుని మరీ ఆ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. పోయిన వాటిలో సుమారు కిలో బంగారు ఆభరణాలు దొరికినట్లు అధికారులు చెబుతున్నారు. వరదల కారణంగా పట్టణంలో కరెంటు సరఫరా నిలిచిపోయింది. దీంతో, సీసీటీవీ ఫుటేజీ వ్యవస్థ దెబ్బతింది. దీనివల్ల వరద సమయంలో దుకాణంలో ఏం జరిగిందో తెలుసుకునేందుకు సరైన ఆధారమంటూ లేకుండా పోయింది. ఎవరైనా ఈ వస్తువులను తీసుకెళ్లారా? లేక వరదలోనే కొట్టుకుపోయాయా అనేది నిర్ధారించడం సైతం కష్టంగా మారింది. తమ నగల దుకాణానికి సంబంధించిన విలువైన వస్తువులను ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తీసుకున్నట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని యజమాని హెచ్చరిస్తున్నారు. దుకాణంలోని వస్తువులు వరదల్లో కొట్టుకుపోయినట్లు సమాచారం తెలుసుకున్న స్థానికులు సైతం గాలింపు మొదలుపెట్టారు. వరదలకు కొట్టుకు పోయిన బురద, మట్టిని తవ్వి మరీ చూస్తున్నారు. కొందరు మెటల్ డిటెక్టర్‌లతోనూ వెదుకుతున్నారు. ఈ గోల్డ్ రష్‌కు సంబంధించిన వీడియోలు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమవుతున్నాయి. అయితే, స్థానికులెవరూ దొరికిన వస్తువులను తమకివ్వలేదని దుకాణం యజమాని చెబుతున్నారు. అలా ఎవరైనా తీసుకుపోయినట్లు తెలిస్తే సమాచారమివ్వాలని స్థానికులను కోరుతున్నారు. తెచ్చిన వారికి ఆ వస్తువు విలువను బట్టి బహుమతులను సైతం ఇస్తామని ఆశచూపుతున్నారు.

### బీజింగ్‌లో వర్షాలు, వరదల్లో 44 మంది మృతి

చైనా రాజధాని బీజింగ్‌ను భారీ వర్షాలు, వరదలు కకావికలం చేశాయి. శనివారం కురిసిన కుండపోత వానలు, వరదల్లో కనీసం 44 మంది చనిపోగా, 9 మంది గల్లంతయ్యారు. గత నాలుగు రోజులుగా బీజింగ్ సహాయక, రక్షణ కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో మరోసారి భీకరంగా వాన కురియడంతో రహదారులు తెగిపోవడంతో పాటు, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని జనాన్ని సురక్షిత ప్రాంతాలకు యంత్రాంగం తరలిస్తోంది. బీజింగ్‌లో ఉత్తరాన ఉన్న పర్వతప్రాంత మియున్, యాంగ్వింగ్ జిల్లాల్లో అత్యధిక నష్టం వాటిల్లిందని అధికార వార్తా సంస్థ జిన్హువా తెలిపింది.

# అమెరికాలో కూలిన యుద్ధ విమానం

**సురక్షితంగా బయటపడ్డ పైలట్**

**కాలిఫోర్నియా:** అమెరికాలో నేవీ యుద్ధ విమానం ఎఫ్-35సీ కూలిపోయింది. సెంట్రల్ కాలిఫోర్నియాలోని లెమూర్‌లో ఉన్న నేవీ ఎయిర్ స్టేషన్ సమీపంలో అమెరికా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 4.30 గంటలకు ఈ ఘటన జరిగింది. అయితే.. శిక్షణలో ఉన్నప్పుడు జరిగిన ఈ ప్రమాదం నుంచి పైలట్ సురక్షితంగా బయటపడ్డాడు. విమానంలో అదనపు సిబ్బంది ఎవరూ లేరు. రెస్క్యూ టీమ్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది. అయితే.. జెట్ కూలిపోవడానికి కారణాలు ఇంకా తెలియరాలేదు. జెట్ కూలిపోయిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విమానం క్రాష్ కాగానే జెట్ శిథిలాల నుంచి భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి. ఆ ప్రాంతమతా నల్లటి పొగ దట్టంగా అలుముకుంది. ఏ మేరకు నష్టం సంభవించింది? బేస్ కార్యకలాపాలపై ప్రభావం పడిందా? అనే విషయాలను నేవీ వెల్లడించలేదు. నావల్ ఎయిర్ స్టేషన్ లెమూర్, సెంట్రల్ కాలిఫోర్నియాలోని ఫ్రెస్నో నగరానికి 64 కిలోమీటర్ల దూరంలో ఉంది.

ఈ స్టెల్త్ ఫైటర్ ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన వాటిలో ఒకటి. దీని ధర దాదాపు 115 మిలియన్ల డాలర్లు ఉంటుంది. అమెరికా రక్షణ దిగ్గజం లాక్‌హీడ్ మార్టిన్ అభివృద్ధి చేసింది. ఇది మల్టీరోల్ యుద్ధ విమానం. ఇది వైమానిక ఆధిపత్యం, గ్రౌండ్ అటాక్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్‌తో సహా విస్తృత శ్రేణి మిషన్ల ప్రయోగం కోసం రూపొందించారు. ఈ విమానం అధునాతన స్టెల్త్ టెక్నాలజీ, సెన్సార్లు, అత్యాధునిక ఏవియానిక్స్‌ను కలిగి ఉంది. ఇటీవల, వాతావరణం అనుకూలించక, తక్కువ ఇంధనం కారణంగా బ్రిటిష్ రాయల్ నేవీ ఎఫ్35బీ వేరియంట్ కేరళలో నెలరోజులపైగా నిలిచిపోయిన విషయం తెలిసిందే.

# ప్రజలతో సున్నితంగా వ్యవహరించండి

**వైద్యులకు రాష్ట్రపతి ముర్ము పిలుపు**

**దియోగఢ్:** వైద్యులను దేవుళ్లుగా భావించే ప్రజలతో సున్నితంగా వ్యవహరించాలని రాష్ట్రపతి ముర్ము వైద్య నిపుణులకు పిలుపునిచ్చారు. జార్ఖండ్‌లోని దియోగఢ్ ఎయిమ్స్‌లో గురువారం జరిగిన మొట్టమొదటి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముర్ము పాల్గొన్నారు. నైతిక విలువలను పాటిస్తూ రోగుల పట్ల సహానుభూతితో ప్రేమతో మెలగాలన్నారు. వారి జీవితాల్లో చీకట్లు తొలగించాలని కోరారు. 'గిరిజనుల ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ పెట్టే ఎయిమ్స్ దియోగఢ్ ఇప్పటికే ఉన్న ఐదింటితోపాటు మరిన్ని గ్రామాలను దత్తత తీసుకోవాలని సూచించారు. ఇతర ఎయిమ్స్‌లకు ఒక ఆదర్శంగా మారేందుకు కృషి చేయాలని కోరారు. గిరిజన ప్రాంతాల మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని, పిల్లలలో పోషకాహార లోపం సర్వసాధారణంగా మారిందని రాష్ట్రపతి తెలిపారు. ఈ నేపథ్యంలో వైద్యులు సామాజిక సేవపైనా దృష్టిసారించాలన్నారు. సుదూర గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు యాంటీ వీనమ్ ఔషధాలను డ్రోన్ల ద్వారా అందిస్తున్న దియోగఢ్ ఎయిమ్స్‌ను రాష్ట్రపతి ముర్ము ప్రశంసించారు. ఈ సంస్థతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందంటూ ఆమె..జార్ఖండ్ గవర్నర్ తాను వ్యవహరించిన సమయంలోనే ప్రధాని మోదీ 2018లో ఎయిమ్స్ దియోగఢ్‌కు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. రాష్ట్రపతి జార్ఖండ్‌లో రెండు రోజుల పర్యటనలో ఉన్నారు. శుక్రవారం ఐఐటీ ధన్‌బాద్ స్నాతకోత్సవంలో పాల్గొననున్నారు.

# ఎఫ్‌డీఏ నుంచి వైదొలిగిన భారత సంతతికి చెందిన శాస్త్రవేత్త

**మూడు నెలల్లోనే బయటికి వచ్చిన వినయ్ ప్రసాద్**

**వాషింగ్టన్:** భారతీయ సంతతికి చెందిన శాస్త్రవేత్త, ఆంకాలజిస్ట్ డాక్టర్ వినయ్ ప్రసాద్ ఎఫ్‌డీఏ నుంచి వైదొలిగారు. యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) వేక్సిన్ చీఫ్ అయిన వినయ్.. సెంటర్ ఫర్ బయోలాజిక్స్ ఎవాల్యుయేషన్ అండ్ రీసెర్చ్ (సీబీఈఆర్) డైరెక్టర్‌గా నియమితులైన నియమితులైన ఆయన మూడు నెలల్లోనే బయటికి వచ్చారు. డుచెన్ కండరాల బలహీనతకు జన్యు చికిత్సను ఇటీవల సారెప్టా థెరప్యూటిక్స్ నుంచి ఏజెన్సీ నిర్వహించింది. ఎఫ్‌డీఏ-ఆమోదించిన చికిత్సను వ్యాధితో బాధపడుతున్న ఇద్దరు టీనేజర్లపై ప్రయోగించారు. వారిద్దరూ మరణించారు. ఇటీవలే జూలై 18న మరో మరణం సంభవించింది. దీంతో ఆమోదించిన డీఎండీ చికిత్సతోపాటు అన్ని సరుకులను నిలిపివేయమని సారెప్టాను ఎఫ్‌డీఏ కోరింది. దీనికి భద్రతా సమస్యలు ఉన్నాయని పేర్కొంది. దీంతో.. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మిత్రురాలు లారా లూమర్ తన బ్లాగులో ఓ పోస్ట్‌చేశారు. అందులో ఆమె ప్రసాద్‌ను ప్రగతిశీల వామపక్ష విధ్వంసకారుడని అభివర్ణించారు. అంతేకాదు.. అతను ఏజెన్సీ పనిని బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. ఈ సంవత్సరం ప్రారంభంలో లూమర్ విమర్శలు జాతీయ భద్రతా అధికారులను తొలగించటానికి దారితీశాయి. దీంతో ప్రసాద్‌ను విమర్శిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ అభిప్రాయ విభాగం రెండు వ్యాసాలు ప్రచురించింది. ఈ విమర్శలు, ఆరోపణల నేపథ్యంలో వినయ్ ప్రసాద్ పదవి నుంచి వైదొలిగారు. ప్రసాద్.. శాన్‌ఫ్రాన్సిస్కోలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం నుంచి ఏజెన్సీలో చేరిన వైద్యుడు. ఆయన నేషనల్ కేన్సర్ ఇనిస్టిట్యూట్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌లో పనిచేశారు. యూఎస్ కోవిడ్-19 వేక్సిన్, మాస్క్ ఆదేశాలను ఆయన తీవ్రంగా విమర్శించారు.



గాజాలో ఆహారపదార్థాల జారవేత కొనసాగుతోంది. గురువారం జువైదాలో కిందికి వస్తున్న సాయం కోసం పరుగులు తీస్తున్న జనం

# అన్నార్థులపై బ్రహ్మాస్త్రం

- ఆహారం కోసం అలమటిస్తున్న పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ దాడులు
- గాజాలో 48 మంది మృతి, 300 మందికి గాయాలు

**డెయిర్ అల్ - బలాహ్:** వ్యూహాత్మకంగా కాల్పుల విరమణ పాటిస్తామని ఇటీవల ప్రకటించిన ఇజ్రాయెల్.. గాజాలో వ్యూహాత్మకంగానే దాడులు చేస్తోంది. గాజా స్ట్రిప్‌లోని జికిమ్ క్రాసింగ్ వద్ద ఆహారం కోసం ఎదురుచూస్తున్న వారిపై బుధవారం ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఈ దాడుల్లో 48 మంది మరణించారు. 300 మందికి పైగా గాయపడ్డారు. తమ ఆస్పత్రికి 35 మృతదేహాలు వచ్చాయని అల్-షిఫా హాస్పిటల్ డైరెక్టర్ మొహమ్మద్ అబూ సల్మియా తెలిపారు. కాల్పుల స్థలం నుంచి గాయపడిన వారిని చెక్క బండ్లలో దూరంగా తీసుకెళ్తున్న, అలాగే పిండి సంచులను మోసుకెళ్తున్న జనసమూహం మీడియా ఫుటేజీలో కనిపించాయి. 100 మందికి పైగా గాయాలతో తమ ఆస్పత్రికి వచ్చారని అల్-సరయా ఫీల్డ్ హాస్పిటల్ తెలిపింది. కొన్ని మృతదేహాలను ఇతర ఆసుపత్రులకు తరలించామని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని గాజా ఆరోగ్య శాఖ అత్యవసర సేవల చీఫ్ ఫేర్స్ అవద్ తెలిపారు.

### పోషకాహార లోపంతో మరణాలు..

మరోవైపు పోషకాహార లోపంతో ఒక చిన్నారితో సహా మరో ఏడుగురు పాలస్తీనియన్లు బుధవారం మరణించారు. గాజాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి పిల్లలు పోషకాహార లోపంతో మొత్తం 89 మంది మరణించారు. జూన్ చివరి నుంచి పోషకాహార లోపం సంబంధిత కారణాలతో గాజా అంతటా 65 మంది పాలస్తీనియన్ పెద్దలు కూడా మరణించారని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇదిలా ఉంటే.. గాజాలో ఆకలి చావులు లేవని ఇజ్రాయెల్ చెబుతోంది. గాజాలో ఆకలిపై దృష్టి పెట్టడం హమాస్‌తో కాల్పుల విరమణ ప్రయత్నాలను బలహీనపరుస్తుందని చెబుతోంది. ఈ గందరగోళం మధ్యనే.. అమెరికా మిడిల్ ఈస్ట్‌రాయబారి ఇజ్రాయెల్‌కు వెళుతున్నారు. గాజాలో కాల్పుల విరమణ, హమాస్ చెరలో ఉన్న బంధీల విడుదలపై ఇజ్రాయెల్‌తో చర్చలు నిర్వహించనున్నారు.

**నిరాకరించిన ఇజ్రాయెల్..**

అయితే దాడులను ఇజ్రాయెల్ తోసిపుచ్చింది. తన దళాలను సమీపించే వ్యక్తులపై మాత్రమే ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరిక కాల్పులు జరిపిందని తెలిపింది. ఇక జీహెచ్‌ఎఫ్ సహాయ కేంద్రాల వద్దకు వచ్చిన జన సమూహాన్ని వారించడానికి సాయుధ కాంట్రాక్టర్లు పెప్పర్ స్ప్రే ఉపయోగించడం, కాల్పులతో హెచ్చరికలు మాత్రమే చేశారని చెబుతోంది. కాల్పుల వల్ల ప్రాణ నష్టం జరిగిందేమో తమకు తెలియదని ఐడీఎఫ్ స్పష్టం చేసింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఇంకా పరిశీలిస్తున్నామని పేర్కొంది.

**అంతంత మాత్రంగా సహాయం..**

రోజుకు కొన్ని గంటల పాటు వ్యూహాత్మక కాల్పుల విరమణ అమలు చేస్తామని ఇజ్రాయెల్ ప్రకటించినప్పటికీ.. మానవతా సహాయం సరఫరాకు అడ్డంకులు మాత్రం అలాగే ఉన్నాయి. స్ట్రిప్‌లోకి ప్రవేశించే సహాయాన్ని అందించడంలో ఐక్యరాజ్యసమితి ఇప్పటికీ ఇబ్బంది పడుతోంది. ఇజ్రాయెల్ సైన్యం నియంత్రణలో ఉన్న మండలాల్లో చాలా ట్రక్కులను దింపుతోంది. ఇక మరోవైపు ఇజ్రాయెల్ మద్దతుగల జీహెచ్‌ఎఫ్ నిర్వహిస్తున్న ప్రత్యామ్నాయ సహాయ వ్యవస్థ వల్ల హింస పెరుగుతోంది. విమానాల ద్వారా అంతర్జాతీయ సహాయాన్ని పడేయడం కూడా తిరిగి ప్రారంభమైంది. కానీ.. చాలా పార్శిళ్లు పాలస్తీనియన్లు ఖాళీ చేసిన ప్రాంతాల్లో, మరికొన్ని మధ్యధరా సముద్రంలో పడిపోయాయి. ఆ తడిసిన పిండి సంచులను తెచ్చుకోవడానికి కూడా ప్రజలు ఈత కొడుతూ వెళ్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



యుద్ధ నౌక ఐఎన్‌ఎస్ విశాఖపట్టణంను గురువారం బాలీవుడ్ స్టార్ అమితాబ్ సందర్శించారు. ఈ సందర్భంగా నౌక డెక్‌పై పిడికిలి బిగించి భారత్ మాతాకీ జై అంటూ నినదించారు.

# ఐర్లాండ్‌లో భారతీయుడిపై జాత్యహంకారుల దాడి

**డబ్లిన్:** ఐర్లాండ్ రాజధాని డబ్లిన్‌లో సంతోష్ యాదవ్(32)అనే భారత సంతతి వ్యక్తిపై జాత్యహంకారుల దాడి జరిగింది. దాడిలో సంతోష్ ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. తల్లాఘ్ట్ ప్రాంతంలో జూలై 19వ తేదీన టీనేజర్ల గ్యాంగ్ ఓ భారతీయుడిని బట్టలూడదీసి కొట్టిన ఘటనను మరువకమునుపే తాజా దురంతం చోటుచేసుకుంది. ఆదివారం ఆరుగురు టీనేజర్లు విచక్షణారహితంగా తనను ఇనుప చైన్‌తో తీవ్రంగా కొట్టారని, గాయాలతో రోడ్డు పక్కనే వదిలేసి వెళ్లారన్నారు. దురహంకార వ్యాఖ్యలు చేశారని యాదవ్ ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు.

# సాధారణానికి మించి వర్షాలు: ఐఎండీ

**న్యూఢిల్లీ:** రుతుపవన సీజన్ రెండో అర్ధభాగంలో దేశ వ్యాప్తంగా సాధారణానికి మించి వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అంచనా వేసింది. ఈశాన్య భారతంతోపాటు పశ్చిమ భారతంలోని కొన్ని ప్రాంతాల్లో మినహా దేశంలోని మిగతా ప్రాంతాల్లో ఆగస్టులో సాధారణం కంటే ఎక్కువగా వర్షాలు కురిసే ఛాన్సుందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర గురువారం మీడియాకు తెలిపారు. సెప్టెంబర్‌లోనూ సాధారణానికి మించి వానలు పడే అవకాశాలున్నాయన్నారు. 'దేశంలో నైరుతి రుతుపవన కాలం రెండో అర్ధభాగంలో మొత్తమ్మీద దీర్ఘకాలం సరాసరి వర్షపాతం 422.8 మిల్లీమీటర్లకు మించి వానలు కురిసే అవకాశాలు 106 శాతం మేర ఉన్నాయని వివరించారు. మధ్య భారతం, నైరుతి భారతంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువగా వానలు కురుస్తాయని మహాపాత్ర పేర్కొన్నారు. ఈ రుతుపవన సీజన్ మొదటి అర్ధభాగంలో జూన్, జూలైల్లో హిమాచల్ ప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాల్లో మాత్రం సాధారణం కంటే ఎక్కువగా వానలు కురియడంతో ఆకస్మిక వరదలు సంభవించాయని ఆయన తెలిపారు.

# ధర్మస్థల కేసులో పురోగతి

- 6వ ప్రదేశంలో పాక్షిక అస్థిపంజర అవశేషాలు లభ్యం
- ఈ కేసులో ఇవే మొదటి ఆధారాలు

**బనశంకరి:** ధర్మస్థల సామూహిక ఖననం కేసులో గురువారం పురోగతి కనిపించింది. తవ్వకాలు జరిపిన 6వ ప్రదేశంలో పాక్షిక అస్థిపంజర అవశేషాలు లభించాయి. ఈ కేసులో అటువంటి ఆధారాలను అందించిన మొదటి ప్రదేశం ఇదే. అయితే.. అస్థిపంజర అవశేషాలు పురుషుడివి అయి ఉండవచ్చని పోలీసులు వర్గాల సమాచారం. 1998 నుంచి 2014 మధ్య ఆలయ పట్టణంలో మహిళలు, మైనర్ల మృతదేహాలను బలవంతంగా ఖననం చేశారని, వారిలో చాలా మంది లైంగిక వేధింపులకు గురైన గుర్తులున్నాయని ఆలయ మాజీ పారిశుధ్య కార్మికుడు ఆరోపించిన విషయం తెలిసిందే. ఆరోపణలపై సిట్ దర్యాప్తులో భాగంగా జరిపిన తవ్వకాల్లో ఈ అవశేషాలు బయటపడ్డాయి. సంఘటనా స్థలంలో ఉన్న ఫోరెన్సిక్ బృందం అవశేషాలను తదుపరి పరీక్ష కోసం భద్రపరిచింది. బుధవారం, ఈ కేసులో తవ్విన ఐదు ప్రదేశాలలో మానవ అవశేషాలకు సంబంధించిన ఆధారాలు లభించలేదని పోలీసు వర్గాలు ధ్రువీకరించాయి. కార్మికుడు చెప్పిన 15 ప్రదేశాల్లో ఎనిమిది నేత్రావతి నది ఒడ్డున, నాలుగు ప్రదేశాలు నదికి సమీపంలోని హైవే పక్కన ఉన్నాయి. 13వ స్థలం నేత్రావతిని ఆజుకురికి కలిపే రహదారిపై, మిగిలిన రెండు హైవే సమీపంలోని కన్యాడి ప్రాంతంలో ఉన్నాయి. ఇప్పటివరకు 6 ప్రదేశాల్లో తవ్వకాలు జరిగాయి. మిగిలిన ప్రదేశాల్లో కొనసాగుతున్నాయి.

# ఇమ్రాన్ పార్టీకి చెందిన 166 మందికి పదేళ్ల జైలు

**లాహోర్:** పదవీచ్యుత పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సారథ్యంలో పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్(పీటీఐ)కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇమ్రాన్ ఖాన్ ఇప్పటికే వివిధ ఆరోపణలపై జైలు జీవితం అనుభవిస్తున్న విషయం తెల్సిందే. ఖాన్ నిర్బంధాన్ని నిరసిస్తూ 2023 మే 9వ తేదీన పీటీఐ శ్రేణులు దేశవ్యాప్త నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు డజను వరకు సైనిక కార్యాలయాలపై దాడులకు పాల్పడ్డారు. ఈ చర్యలపై ఫైసలాబాద్‌లోని యాంటీ టెర్రరిజం కోర్టు(ఏటీసీ) ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. ఫైసలాబాద్‌లోని ఐఎస్ఐ కార్యాలయ భవనంపై జరిగిన దాడికి సంబంధించి 108 మందికి, పోలీస్ స్టేషన్‌పై దాడికి పాల్పడిన 58 మందికి పదేళ్ల చొప్పున జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. శిక్ష పడిన వారిలో నేషనల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఒమర్ అయూబ్, సెనేట్‌లో ప్రతిపక్ష నేత షిబ్లి ఫరాజ్, కీలక నేతలు జర్తాజ్ గుల్, సాహిబ్‌జాదా హమీద్ రజా ఉన్నారు. దోషులుగా ప్రకటించిన వారిలో ఆరుగురు నేషనల్ అసెంబ్లీ సభ్యులు కాగా ఒకరు పంజాబ్ అసెంబ్లీ సభ్యుడు, ఒక సెనేటర్ ఉన్నారు. ఇప్పటికే పీటీఐకి చెందిన 14 మందిని దోషులుగా ప్రకటిస్తూ మే 9వ తేదీన వెలువరించిన తీర్పులో పేర్కొంది. తీర్పును లాహోర్ హైకోర్టులో సవాల్ చేస్తామని పీటీఐ తాత్కాలిక అధ్యక్షుడు గొహార్ అలీ చెప్పారు. ఆగస్టు 5వ తేదీ నుంచి 'ఫ్రీ ఇమ్రాన్ ఖాన్ మూవ్‌మెంట్'చేపట్టేందుకు పీటీఐ ప్రయత్నాలు చేస్తున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

# కర్ణాటకలో చిరుతపులి దాడి

- ఐదుగురికి గాయాలు
- ఎట్టకేలకు పులిని బంధించిన అటవీ అధికారులు

**తుమకూరు:** కర్ణాటకలోని తుమకూరు జిల్లాలో గ్రామాలను ఒక చిరుతపులి భయాందోళనలకు గురిచేసింది. మూడు గ్రామాల్లోని ఐదుగురిపై దాడి చేయడంతో గాలయ్యాయి. రోజంతా ఆపరేషన్ నిర్వహించిన అటవీశాఖ అధికారులు ఎట్టకేలకు రాత్రికి చిరుతను బంధించారు. మొదట గోనితుమకూరు గ్రామంలో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో మొదటిసారి పులి కనిపించింది. అక్కడ ముగ్గురు నివాసితులపై దాడి చేసింది. అరగంటలోపు, చిరుతపులి దేవేహళ్లి గ్రామం వైపు కదిలి, మరో ఇద్దరు వ్యక్తులను గాయపరిచింది. శేఖర్ అనే వ్యక్తి ఇంటికి వెళ్లింది. చిరుతను ఇంట్లోనే బంధించిన శేఖర్ తాను మాత్రం బయటపడగలిగాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న అటవీ అధికారులు, చిరుతను విజయవంతంగా శాంతింపజేసి అదుపులోకి తీసుకున్నారు. అదుపు చేయడానికి ముందు, చిరుతపులి నవువనహళ్లి గ్రామంలోకి కూడా ప్రవేశించి ఆ గ్రామంలో కొద్దిసేపు అలజడి రేపింది.

# ఎలక్టోరల్ కాలేజీ జాబితా ఖరారు: ఈసీ

**న్యూఢిల్లీ:** ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా నేపథ్యంలో నూతన ఉపరాష్ట్రపతి ఎన్నికకు అవసరమైన ఎలక్టోరల్ కాలేజీ జాబితాను ఖరారు చేసినట్లు ఎన్నికల కమిషన్(ఈసీ) గురువారం తెలిపింది. లోక్‌సభ, రాజ్యసభ నామినేటెడ్ సభ్యులు, ఎన్నికైన సభ్యులు ఎలక్టోరల్ కాలేజీలో ఉంటారు. వీరు ఉపరాష్ట్రపతి ఎన్నికలో పాల్గొంటారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక నోటిఫికేషన్ వెలువడి నాటి నుంచి ఈ ఎలక్టోరల్ జాబితా తమ కార్యాలయంలో ఏర్పాటు చేసే కౌంటర్‌లో విక్రయానికి అందుబాటులో ఉంచుతామని ఈసీ తెలిపింది. త్వరలోనే నోటిఫికేషన్ వెలువడే అవకాశాలున్నాయని పేర్కొంది. పదవీ కాలం ముగియడానికి రెండేళ్లకు ముందుగానే జూలై 21వ తేదీన ధన్‌ఖడ్ రాజీనామా చేయడం తెల్సిందే.

# సాంకేతిక లోపంతో నిలిచిన 'డ్రీమ్ లైనర్'

**న్యూఢిల్లీ:** ఢిల్లీ- లండన్ ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ సర్వీసు సాంకేతిక లోపం తలెత్తడంతో గురువారం ఢిల్లీ విమానాశ్రయంలోనే నిలిచిపోయింది. ఉదయం టేకాఫ్ తీసుకోవాల్సి ఉంది. సాంకేతిక లోపాన్ని గుర్తించిన పైలట్ విమానాన్ని తిరిగి బే వద్దకు తీసుకువచ్చారు. ప్రయాణికులందరినీ కిందికి దించివేసి పూర్తిస్థాయిలో తనిఖీలు జరుపుతున్నారని ఎయిరిండియా ప్రతినిధి ఒకరు తెలిపారు. మరో విమానంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు ఏర్పాట్లు వేగంగా చేపడుతున్నామన్నారు. విమానంలో ప్రయాణికులెందరున్నారనే విషయం వెల్లడించలేదు. జూన్‌లో లండన్‌కు టేకాఫ్ తీసుకుని అహ్మదాబాద్‌లో కుప్పకూలి 260 మంది మృతికి కారణమైన విమానం కూడా బోయింగ్ డ్రీమ్‌లైనర్ కావడం గమనార్హం.

# చేతిరాత బాలేదని చేయి కాల్చిన ట్యూటర్

**ముంబై:** చేతి రాత సరిగా లేదని 8 ఏళ్ల బాలుడి చేయిని కొవ్వొత్తితో కాల్చిందో ట్యూటర్. ముంబైలోని మలాడ్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మలాడ్ ఈస్ట్‌లోని జేపీ డెక్స్ బిల్డింగ్‌లో ఉంటున్న ముస్తాకీన్ ఖాన్ కొడుకు మహ్మద్ హంజా ఖాన్ 3వ తరగతి చదువుతున్నాడు. అదే బిల్డింగ్‌లో ఉంటున్న రాజశ్రీ రాథోడ్ దగ్గరికి రోజూ రెండు గంటలపాటు ట్యూషన్‌కు పంపిస్తారు. జూలై 28న సాయంత్రం 7 గంటలకు వెళ్లాడు. రాత్రి 9 గంటల ప్రాంతంలో శ్రీమతి రాథోడ్ ఫోన్ చేసి.. హంజా ఏడుస్తున్నాడని, వెంటనే తీసుకెళ్లాలని చెప్పింది. ఇంటికి తిరిగి వచ్చిన హంజా చేతి రాత బాగలేనందుకు శిక్షగా టీచర్ కొవ్వొత్తితో కాల్చారంటూ చేతిని చూపించాడు. కుడి అరచేతికి కాలిన గాయాలు కావడంతో వెంటనే హంజాను బాబాసాహెబ్ అంబేద్కర్ ఆసుపత్రి (శతాబ్ది)కి తరలించారు. ఖాన్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు రాథోడ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

# భారత, అమెరికా సమాఖ్యలకు ఉన్న సాధారణ లక్షణం ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

## అంతర్రాష్ట్ర సంబంధాలు

ఒక సమాఖ్య వ్యవస్థ విజయవంతంగా పనిచేయడానికి కేంద్ర, రాష్ట్ర సంబంధాలు ఎంత ముఖ్యమో, అంతర్రాష్ట్ర సంబంధాలూ అంతే ముఖ్యం అనే వాస్తవాన్ని గుర్తించిన రాజ్యాంగ నిర్మాతలు అంతర్రాష్ట్ర వివాదాలను పరిష్కరించడానికి, స్నేహపూరిత వాతావరణాన్ని కల్పించడానికి రాజ్యాంగంలో కొన్ని ఏర్పాట్లు చేశారు. అందులో ముఖ్యమైనవి..

- అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల పరిష్కార ట్రైబ్యునళ్లు
- అంతర్రాష్ట్ర మండళ్లు
- పబ్లిక్ చట్టాలు, రికార్డులు, న్యాయస్థానాల ఆదేశాలను పరస్పరం గుర్తించే పద్ధతులు
- అంతర్రాష్ట్ర వాణిజ్య వ్యాపార సంబంధాలు

## అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల పరిష్కారం

ప్రకరణ 262 ప్రకారం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాలను సత్వరమే పరిష్కరించడానికి పార్లమెంటు ఒక చట్టం ద్వారా ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేయవచ్చు. అలాంటి వివాదాలను నేరుగా ట్రైబ్యునలే పరిష్కరిస్తుంది. ఇందుకోసం 1956లో అంతర్రాష్ట్ర జలాల వివాదాల పరిష్కార చట్టం, రివర్ బోర్డు చట్టాన్ని రూపొందించారు. వీటికి పాక్షిక న్యాయాధికారాలు (Quasi-Judicial) ఉంటాయి.

ప్రకరణ 262(2) ప్రకారం పార్లమెంటు చేసిన చట్టాలపై సుప్రీంకోర్టుకు న్యాయసమీక్ష అధికారం ఉండదు. కానీ, కేంద్రం తన శాసన విధులను నిర్వర్తించేలా ఆదేశించవచ్చు.

ఈ ట్రైబ్యునళ్ల ప్రధాన ఉద్దేశం వివాదాలను సత్వరమే పరిష్కరించడం. సాధారణంగా అంతర్రాష్ట్ర వివాదాలు సుప్రీంకోర్టు ప్రారంభ పరిధిలోకి వస్తాయి. అయితే నదీ జలాల పంపిణీ వివాదాలను పరిష్కరించడానికి ప్రత్యేక ట్రైబ్యునళ్లు ఏర్పాటైతే, ఆయా రాష్ట్రాలు ట్రైబ్యునళ్లలోనే వివాదాలను పరిష్కరించుకోవాలి. వీటి తీర్పులపై సుప్రీంకోర్టులో కేవలం సలహా పూర్వకమైన అప్పీలు చేసుకోవచ్చు.

ఇప్పటివరకు దేశంలో ఎనిమిది అంతర్రాష్ట్ర నదీ జలాల ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేశారు.

- కృష్ణా నదీ జలాల ట్రైబ్యునల్ -1969 (దీని పరిధిలోకి వచ్చే రాష్ట్రాలు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ).
- గోదావరి నదీ జలాల ట్రైబ్యునల్ - 1969 (మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, తెలంగాణ)
- నర్మదా నదీ జలాల ట్రైబ్యునల్- 1969 (రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర)
- రావి, బియాస్ నదీ జలాల ట్రైబ్యునల్- 1986 (పంజాబ్, హర్యానా)
- కావేరి నదీ జలాల ట్రైబ్యునల్- 1990 (కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి)
- కృష్ణా నదీ జలాల ట్రైబ్యునల్ 2-2004 (మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)
- వంశధార నదీ జలాల ట్రైబ్యునల్-2010 (ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)
- మహాదాయి నదీ జలాల ట్రైబ్యునల్-2010 (గోవా, కర్ణాటక, మహారాష్ట్ర).

## అంతర్రాష్ట్ర మండలి

ప్రకరణ 263 ప్రకారం అంతర్రాష్ట్ర మండలిని (Inter State Council) ఏర్పాటు చేస్తారు. ఇది కేంద్ర-రాష్ట్రాలు, అంతర్రాష్ట్రాల మధ్య వివిధ అంశాలపై విచారణ చేసి తగిన సూచనలు చేస్తుంది.

**నిర్మాణం:**

సర్కారియా కమిషన్ నివేదిక (1983-87) మేరకు జనతాదళ్ ప్రభుత్వం (వి.పి.సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు) 1990లో అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేసింది. దీని నిర్మాణం కింద పేర్కొన్న విధంగా ఉంటుంది.

- ప్రధానమంత్రి - అధ్యక్షుడు
- అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు - సభ్యులు
- కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు (శాసనసభలు ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలు) -సభ్యులు
- కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలకులు -సభ్యులు
- కేంద్ర ప్రభుత్వ హోంమంత్రి సహా ఆరుగురు కేబినెట్ మంత్రులు - సభ్యులు

**విధులు:**

- కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉమ్మడి ప్రయోజన విషయాలను పరిశీలించి, చర్చించి నివేదిక ఇవ్వడం.
- అంతర్రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని సాధించే పద్ధతిని, చర్యలను సూచించడం.
- కౌన్సిల్‌కు నివేదించిన ఇతర సాధారణ విషయాలపై చర్చించి సూచనలు చేయడం.

కౌన్సిల్ ఏడాదికి మూడు పర్యాయాలు సమావేశం కావాలి. దీని విధులన్నీ సలహా విధులే. సమావేశంలో వివిధ అంశాలను ఏకాభిప్రాయ సాధన పద్ధతిలో నిర్ణయిస్తారు.

1996లో నిరంతర సలహాల కోసం ఒక స్థాయి సంఘాన్ని కూడా ఏర్పాటు చేశారు. దీనికి కేంద్ర హోం శాఖా మంత్రి చైర్మన్‌గా ఉంటారు. అయిదుగురు కేంద్ర కేబినెట్ మంత్రులు, తొమ్మిది మంది ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉంటారు. అంతర్రాష్ట్ర మండలికి ప్రత్యేక సచివాలయం ఉంది. దీనికి అధిపతిగా కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి ఉంటారు. ఈ సచివాలయమే జోనల్ కౌన్సిళ్లకు కూడా ఉమ్మడి సచివాలయంగా పనిచేస్తుంది.

ప్రకరణ 263 ప్రకారం రాష్ట్రపతి కింద పేర్కొన్న కౌన్సిళ్లను కూడా ఏర్పాటు చేశారు.

- రాష్ట్రపతి సెంట్రల్ హెల్త్ కౌన్సిల్
- సెంట్రల్ లోకల్ గవర్నమెంట్ కౌన్సిల్
- అర్బన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్
- నాలుగు ప్రాంతీయ అమ్మకపు పన్ను కౌన్సిళ్లను కూడా ఏర్పాటు చేశారు.

ఆదేవిధంగా 2003లో సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్, సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ హోమియోపతి అనే సంస్థలను కూడా ఏర్పాటు చేశారు.

## పబ్లిక్ రికార్డ్‌లు-న్యాయ ప్రక్రియలు

రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర అధికార పరిధి రాష్ట్ర భూభాగానికే పరిమితం కాబట్టి, రాష్ట్రాలు జారీ చేసిన చట్టాలను, రికార్డులను, ఇతర సర్టిఫికెట్లను ఇతర రాష్ట్రాలు కూడా గౌరవించే విధంగా ప్రకరణ 261లో కొన్ని ఏర్పాట్లు చేశారు. దీనికి సంబంధించి పార్లమెంటు చట్టాలను రూపొందిస్తుంది.

## అంతర్రాష్ట్ర వ్యాపార, వాణిజ్య సంబంధాలు

రాజ్యాంగంలోని 13వ భాగంలో ప్రకరణ 301 నుంచి 307 వరకు అంతర్రాష్ట్ర వ్యాపార, వాణిజ్య అంశాలకు సంబంధించి కొన్ని రక్షణలు పేర్కొన్నారు. ప్రకరణ 301 ప్రకారం దేశంలో ఎక్కడైనా వాణిజ్యం, వ్యాపారం, వృత్తిని చేసుకోవడానికి స్వేచ్ఛ ఉంటుంది. అయితే కొన్ని రాష్ట్రాల ప్రత్యేక ప్రయోజనాల కోసం ఈ స్వేచ్ఛలపై కూడా పరిమితులు విధించవచ్చు.

## ప్రాంతీయ మండలాలు

జోనల్ కౌన్సిళ్లు చట్టపర సంస్థలు. 1956లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా వీటిని ఏర్పాటు చేశారు. దేశాన్ని 5 జోన్లుగా విభజించారు. వీటికి రాజ్యాంగ ప్రతిపత్తి లేదు. కేవలం చట్ట ప్రతిపత్తి (Statutory Status) మాత్రమే ఉంది. అవి:

- **ఉత్తర మండలం:** ఇందులో జమ్ము-కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాలు ఉన్నాయి. దీని ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ఉంది.
- **దక్షిణ మండలం:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి. దీని ప్రధాన కార్యాలయం చెన్నైలో ఉంది.
- **పశ్చిమ మండలం:** గుజరాత్, మహారాష్ట్ర, గోవా, దాద్రా & నగర్ హవేలి, డామన్ & డయ్యూ. దీని ప్రధాన కార్యాలయం ముంబైలో ఉంది.
- **తూర్పు మండలం:** బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా. దీని ప్రధాన కార్యాలయం కోల్‌కతాలో ఉంది.
- **మధ్య మండలం:** ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్. దీని ప్రధాన కార్యాలయం అలహాబాద్‌లో ఉంది.
- **ఈశాన్య మండలం:** పైన పేర్కొన్న 5 జోన్లకు అదనంగా ఈశాన్య మండలాన్ని ప్రత్యేకంగా పార్లమెంటు చట్టం ద్వారా 1971లో ఏర్పాటు చేశారు. ఇందులో అసోం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్,మణిపూర్,మేఘాలయ, మిజోరాం, త్రిపుర, సిక్కిం రాష్ట్రాలున్నాయి. సిక్కిం రాష్ట్రాన్ని ఎనిమిదో రాష్ట్రంగా (ఈశాన్య రాష్ట్రాల్లో) 1994లో ఈశాన్య మండలంలో చేర్చారు. దీని ప్రధాన కార్యాలయం షిల్లాంగ్ (మేఘాలయ)లో ఉంది.



**నిర్మాణం:**

ప్రతి జోనల్ కౌన్సిల్‌లో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇద్దరు ఇతర మంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలకులు, ప్రణాళికా సంఘం నామినేట్ చేసిన ఒక సభ్యుడు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు, ఆయా రాష్ట్రాల అభివృద్ధి కమిషనర్లు సభ్యులుగా ఉంటారు. కేంద్ర హోం శాఖా మంత్రి జోనల్ కౌన్సిళ్లకు ఉమ్మడి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అదేవిధంగా ఆ జోన్‌లోని రాష్ట్ర ముఖ్యమంత్రులు రొటేషన్ పద్ధతిలో ఒక సంవత్సర కాలానికి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

**విధులు:**

- దేశంలో ప్రజల మధ్య భావ సమగ్రతను సాధించడం.
- మితిమీరిన ప్రాంతీయ వాదాన్ని, భాషా వాదాన్ని, రాష్ట్ర వాదాన్ని నియంత్రించడం
- రాష్ట్రాల విభజన తర్వాత ఏర్పడిన పరిణామాలను పరిష్కరించి, ఆర్థిక అభివృద్ధి, సమగ్రత మధ్య సమన్వయాన్ని సాధించడం.
- కేంద్రం సహకారంతో సామాజిక, ఆర్థిక అంశాల్లో ఏకరూపకతను సాధించడం.
- విభిన్న ప్రాంతాల మధ్య ఒకే రకమైన రాజకీయ సమానత్వాన్ని సాధించడం.
- జోనల్ కౌన్సిల్ విధులన్నీ సలహాపూర్వకమైనవే.

### గతంలో అడిగిన ప్రశ్నలు

1. కిందివాటిలో కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి రాష్ట్రాలకు ఇచ్చే పన్ను ఏది?
   ఎ) ఎగుమతి, దిగుమతి సుంకాలు
   బి) స్టాంపు డ్యూటీ
   సి) ఆదాయ పన్ను
   డి) రైలు చార్జీలపై విధించే పన్ను
2. శాంతి భద్రతలు ఏ జాబితాకు చెందినవి?
   ఎ) రాష్ట్ర జాబితా
   బి) కేంద్ర జాబితా
   సి) ఉమ్మడి జాబితా
   డి) ఏదీకాదు
3. అవశిష్ట అధికారం ఎవరికి ఉంటుంది?
   ఎ) కేంద్రం
   బి) రాష్ట్రం
   సి) రాష్ట్రపతి
   డి) ఏదీకాదు
4. భారత, అమెరికా సమాఖ్యలకు ఉన్న సాధారణ లక్షణం ఏది?
   ఎ) ఏక పౌరసత్వం
   బి) రాజ్యాంగంలో మూడు జాబితాలు
   సి) ద్వంద్వ న్యాయ వ్యవస్థ
   డి) రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించడానికి ఒక సమాఖ్య న్యాయ వ్యవస్థ
5. భారత రాజ్యాంగం సమాఖ్యపూరితమని తెలియజేసేది?
   ఎ) లిఖిత, దృఢ రాజ్యాంగం
   బి) స్వతంత్ర న్యాయవ్యవస్థ
   సి) కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన
   డి) పైవన్నీ
6. భారత దేశంలోని రాష్ట్రాల మధ్య సహకారం సమన్వయాలకు ఉన్న రాజ్యాంగేతర, చట్టపరంకాని సాధనాలు ఏవి?
   1. జాతీయాభివృద్ధి మండలి
   2. గవర్నర్ల సమావేశం
   3. మండల కౌన్సిళ్లు
   4. అంతర్రాష్ట్ర మండలి
   ఎ) 1, 2 బి) 1, 2, 3
   సి) 3, 4 డి) 4
7. ఆదాయ పన్ను విధింపు, వసూలు, పంపిణీకి సంబంధించి కిందివాటిలో సరైంది?
   ఎ) కేంద్రం విధించి, వసూలు చేసి, ఆ మొత్తాన్ని కేంద్రం, రాష్ట్రాల మధ్య పంపిణీ చేస్తుంది
   బి) అన్ని పన్నులను కేంద్రమే విధించి, వసూలు చేసిన మొత్తాన్ని ఖర్చు చేస్తుంది
   సి) అన్ని పన్నులను కేంద్రం విధించి, వసూలు చేసిన మొత్తాన్ని రాష్ట్రాలకు పంపిణీ చేస్తుంది
   డి) ఆదాయపు పన్నుపై వసూలు చేసిన సర్‌చార్జీని మాత్రం కేంద్రం రాష్ట్రాల మధ్య పంపిణీ చేస్తుంది

#### సమాధానాలు

1) డి; 2) ఎ; 3) ఎ; 4) డి; 5) డి; 6) డి; 7) ఎ.

# అభ్యుదయ కవిగా 'భువనఘోష'ను వినిపించిన కవి?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

1. 'కొండవీటి పొగ మబ్బు - తెలుగువాళ్ల గోల్డునిబ్బు' అని శ్రీశ్రీతో ప్రశంసలు పొందినవారు?
   1) జాషువా
   2) విశ్వనాథ సత్యనారాయణ
   3) గురజాడ అప్పారావు
   4) రాయప్రోలు సుబ్బారావు
2. 'శ్లేష కవితా చమత్కృతి' ఎవరి కవితా గుణం?
   1) చేమకూర వేంకటకవి
   2) రామరాజ భూషణుడు
   3) తెనాలి రామకృష్ణుడు
   4) పింగళి సూరన
3. కాళ్లకూరి నారాయణరావు రచించిన 'వరవిక్రయం' నాటకం ఒక ?
   1) పౌరాణికం 2) చారిత్రకం
   3) కల్పితం 4) సాంఘికం
4. 'తెలుగు సాహిత్య విమర్శ అవతరణ-వికాసం' అనే సిద్ధాంత గ్రంథాన్ని రచించిన విమర్శకుడెవరు?
   1) కె.వి.ఆర్. నరసింహం
   2) ఎస్వీ రామారావు
   3) గుంటూరు శేషేంద్రశర్మ
   4) కోవెల సుప్రసన్నచార్య
5. 'అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతి' అని పేర్కొన్న అలంకారికుడు?
   1) ఆనందవర్ధనుడు 2) అభినవ గుప్తుడు
   3) విశ్వనాథుడు 4) భరతుడు
6. రామరాజ భూషణుడు రచించిన 'హరిశ్చంద్రనలోపాఖ్యానం' అనేది ఒక
   1) ద్వ్యర్థి కావ్యం 2) చంపూ కావ్యం
   3) త్ర్యర్థి కావ్యం 4) శాంతరస కావ్యం
7. ఈ ఏడాది తుఫాను వచ్చి పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఇది ఏ రకమైన వాక్యం?
   1) కర్మణి వాక్యం 2) హేత్వర్థక వాక్యం
   3) శత్రర్థక వాక్యం 4) చేదర్థక వాక్యం
8. 'స్త్రీల రామాయణ పాటలు' అనే గ్రంథాన్ని సంకలనం చేసిందెవరు?
   1) శ్రీపాద గోపాలకృష్ణమూర్తి
   2) నండూరి సుబ్బారావు
   3) విశ్వనాథ సత్యనారాయణ
   4) ఆరుద్ర
9. 'ఎ గ్రామర్ ఆఫ్ తెలుగు లాంగ్వేజ్' అనే పేరుతో ఆంగ్లంలో తెలుగు భాషకు వ్యాకరణం రాసిందెవరు?
   1) కాల్డ్‌వెల్ 2) క్యాంప్‌బెల్
   3) సి.పి.బ్రౌన్ 4) మెకంజీ
10. వ్యక్తిని కానీ, వ్యవస్థను కానీ విమర్శించడం ఏ ప్రక్రియలో సాధారణం?
    1) కథానిక 2) నవల
    3) గల్పిక 4) వైజ్ఞానిక కల్పనా వ్యాసం
11. 1965-68 మధ్య కాలంలో తెలుగు సాహితీ లోకాన్ని దిగ్భ్రమకు గురి చేసినవారు?
    1) భావ కవులు 2)అభ్యుదయ కవులు
    3) స్త్రీవాద కవయిత్రులు
    4) దిగంబర కవులు
12. విభక్తి పరమైనప్పుడు 'గోయి' మొదలైనవాటి తుది అక్షరం?
    1) 'ఇ' వర్ణమగును 2) 'టి' వర్ణమగును
    3) 'ంటి' వర్ణమగును 4) 'తి'వర్ణమగును
13. మనస్తత్వ శాస్త్రం ఆధారంగా 'గోపీచంద్' రాసిన నవల?
    1) యమపాశం
    2) పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా
    3) చీకటి గదులు
    4) అసమర్థుని జీవయాత్ర
14. 'పసిడి పలుకులు, మిన్నేరు, సెలయేరు' అనే జానపద రచనలు ఎవరు చేశారు?
    1) బిరుదురాజు రామరాజు
    2) ఆర్.వి.ఎస్. సుందరం
    3) నేదునూరి గంగాధరం
    4) జి.ఎస్. మోహన్
15. అభ్యుదయ కవిగా 'భువనఘోష'ను వినిపించిన కవి?
    1) కె.వి. రమణారెడ్డి 2) శ్రీశ్రీ
    3) రెంటాల గోపాలకృష్ణ
    4) ఆవంత్స సోమసుందర్
16. 'శోకాగ్ని' అనే పదంలోని సమాసం?
    1) షష్ఠీ తత్పురుష
    2) విశేషణ పూర్వపద కర్మధారయం
    3) ఉపమాన పూర్వపద కర్మధారయం
    4) రూపక సమాసం
17. కట్టమంచి రామలింగారెడ్డి 'ముసలమ్మ మరణం' ఒక?
    1) వీరగాథా కావ్యం
    2) జానపద కథా కావ్యం
    3) శాంతరస కావ్యం
    4) కరుణ రసాత్మక కావ్యం
18. 'భారతామృతం కర్ణపుటంబుల నారగ్రోలి యాంధ్రావళి మోదము బొరయునట్లు'గా భారతాంధ్రీకరణ చేసినవారు?
    1) నన్నయ 2) తిక్కన
    3) ఎర్రన 4) అథర్వణుడు
19. మూల ద్రావిడ 'క' కారం 'చ' కారంగా మారడం?
    1) వర్ణ వ్యత్యయం 2) తాలవ్యీకరణం
    3) వర్ణలోప దీర్ఘత 4) వర్ణ సమీకరణం
20. మహ్మదీయ ప్రభువులకు తెలుగు కావ్యాలను అంకితమిచ్చిన ప్రథమ కవి?
    1) పొన్నగంటి తెలగనార్యుడు
    2) అద్దంకి గంగాధరుడు
    3) కందుకూరి రుద్రకవి
    4) చింతలపూడి ఎల్లనార్యుడు
21. ముద్దు పళని రాసిన మోహన శృంగార ప్రబంధం?
    1) సత్యభామా సాంత్వనం
    2) రాధికా సాంత్వనం
    3) ఇళాదేవి సాంత్వనం
    4) రాధాగోపాళం
22. 1943లో తెనాలిలో జరిగిన అరసం ప్రథమ మహాసభకు అధ్యక్షత వహించినవారు?
    1) శ్రీరంగం శ్రీనివాసరావు
    2) తాపీ ధర్మారావు
    3) సురవరం ప్రతాపరెడ్డి
    4) దాశరథి కృష్ణమాచార్యులు
23. 'భావ కవిత్వానికి నవ్య మార్గ ప్రవక్త' అని ఎవరిని అంటారు?
    1) రాయప్రోలు సుబ్బారావు
    2) దేవులపల్లి కృష్ణశాస్త్రి
    3) నండూరి సుబ్బారావు
    4) కట్టమంచి రామలింగారెడ్డి
24. తొలి తెలుగు మైనారిటీ వాద కవిత, దాని రచయిత?
    1) జల్‌జలా - స్కైబాబా
    2) వలస - అఫ్సర్
    3) పుట్టుమచ్చ- ఖాదర్ మొహియుద్దీన్
    4) వెండి మేఘం- సలీం
25. 'తెలుగు బాలెడ్ పొయిట్రీ' అనే పేరుతో జానపద వ్యాసాలు ప్రకటించిన పాశ్చాత్యుడు?
    1) జె.ఎ.బోయల్ 2) సి.పి.బ్రౌన్
    3) ఆర్.ఎస్. బాగ్స్
    4) డబ్ల్యు.జె.థామ్స్
26. 'అమలోదాత్త మనీష నేను భయ కావ్య ప్రౌఢి పాటించు శిల్పమునంబార గుడ కళావిదుడ' అని చెప్పుకొన్న కవి?
    1) నన్నయ 2) తిక్కన
    3) శ్రీనాథుడు 4) భట్టుమూర్తి
27. 'జలరుహ నాభుడిట్లు రభసంబున నందన పారిజాతముం' అనే పద్య పాదం ఏ వృత్తానికి చెందింది?
    1) మత్తేభం 2) శార్దూలం
    3) చంపకమాల 4) ఉత్పలమాల
28. సంగీత, సాహిత్య, నాట్య సంకేతాల సమ్మేళనం కలిగిన పుట్టపర్తి నారాయణాచార్యుల రచన?
    1) శివ తాండవం 2) సాక్షాత్కారం
    3) మేఘదూతం 4) పండరీ భాగవతం
29. వంగూరు సుబ్బారావు ఆంధ్ర పత్రికలో ప్రకటించిన వ్యాసం?
    1) సువర్ణ లేఖలు 2) శారద లేఖలు
    3) ప్రేమ లేఖలు 4) వసంత లేఖలు
30. 'అనంతం' అనేది శ్రీశ్రీ రాసిన
    1) రేడియో నాటిక
    2) వ్యంగ్య కవితలు
    3) ప్రామాణిక విమర్శ వ్యాసాలు
    4) చారిత్రాత్మక ఆత్మకథ
31. 'పెళ్లి-దాని పుట్టు పూర్వోత్తరాలు' ఎవరి రచన?
    1) ఆచార్య తిరుమల రామచంద్ర
    2) తాపీ ధర్మారావు
    3) అయ్యగారి వీరభద్రరావు
    4) గుడిపాటి వెంకటాచలం
32. త్రిపురనేని శ్రీనివాస్ వెలువరించిన గురి చూసి పాడే పాట ఒక?
    1) భావకవితా సంకలనం
    2) దళిత సంకలనం
    3) స్త్రీవాద కవితా సంకలనం
    4) అనుభూతివాద కవితా సంకలనం
33. 'నేనింత ఒక పిడికెడు మట్టే కావచ్చు. కానీ కలమెత్తితే నాకు ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది' అని పేర్కొన్న కవి?
    1) తిలక్ 2) మోహన్ ప్రసాద్
    3) శేషేంద్రశర్మ 4) సినారె
34. 'మొక్కజొన్న, చక్రకేళి' అనే పదాలు ఏ అర్థ పరిమాణానికి ఉదాహరణ?
    1) అర్థ గౌరవం 2) మృదూక్తి
    3) అలంకారిక ప్రయోగం
    4) లోక నిరుక్తి
35. 'అభినవ వాగను శాసనుడు' అని ఎవరిని అంటారు?
    1) గురజాడ అప్పారావు
    2) కందుకూరి వీరేశలింగం
    3) గిడుగు రామ్మూర్తి పంతులు
    4) ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి
36. 'Poetry we will call musical thought' ఈ వాక్యానికి తెలుగు అనువాదం?
    1) మధురమైన భావమే కవిత్వం
    2) ఛందోబద్ధమైన లయ కవిత్వం
    3) మనోహరమైన అర్థమే కవిత్వం
    4) భావనా వ్యక్తీకరణమే కవిత్వం
37. సుప్రసిద్ధ మైనారిటీవాద కవి స్కైబాబా సంపాదకత్వంలో వెలువడిన కథల సంపుటి?
    1) జల్ జలా 2) వతన్
    3) వలస 4) పుట్టుమచ్చ
38. 'ఇందీవరం' అనే పదానికి పర్యాయ పదాలు?
    1) నల్లకలువ, నీలోత్పలం
    2) పొలం, శాలిక్షేత్రం, వరిమడి
    3) పర్వతం, నగం, అద్రి
    4) మలయం, ధరణీధరం
39. 'హేతువాదాన్ని స్వీకరించే భాష కూడా జన్మసిద్ధం' అని ప్రకటించిన భాషావేత్త?
    1) బ్లూంఫీల్డ్ 2) మాక్స్‌ముల్లర్
    3) యాస్కాచార్యుడు 4) నోమ్‌ఛామ్‌స్కీ
40. 'మాట్లాడే భాషకు, రాసే భాషకు ఎక్కువ తేడా ఉండరాదు' అనేది ఏ భాష ముఖ్య ఉద్దేశం?
    1) గ్రాంథికం 2) ప్రామాణికం
    3) వ్యవహారికం 4) శిష్ట వ్యవహారికం
41. బోధనను ప్రభావితం చేసి, చురుకైన అభ్యసనకు తోడ్పడేవి?
    1) బోధనోపకరణాలు
    2) బోధనా లక్ష్యాలు
    3) బోధనా నైపుణ్యాలు
    4) కనీస అభ్యసన స్థాయిలు
42. 'నేడు విద్యా విధానం ఉపాధ్యాయుడు కేంద్రంగా కాకుండా, శిశు కేంద్రంగా సాగాలని' ఎవరు చెప్పారు?
    1) రూసో 2) పెస్టాలజీ
    3) బెంజిమన్ బ్లూమ్
    4) ఫ్రోబెల్
43. ఉపాధ్యాయుడి బోధనా సాఫల్యం ఏ సోపానంపై ఆధారపడి ఉంటుంది?
    1) మూల్యాంకనం 2) ప్రదర్శనం
    3) ఉన్ముఖీకరణ 4) పఠనాపాటవం
44. దేశంలో ఒకే విద్యా ప్రమాణాలను సాధించడానికి ప్రాథమిక దశ విద్యార్థుల కోసం వేటిని ప్రవేశపెట్టారు?
    1) బోధనోపకరణాలు
    2) బోధనా సోపానాలు
    3) కనీస అభ్యసన స్థాయిలు
    4) బోధనా లక్ష్యాలు
45. ఉపాధ్యాయుడు విద్యార్థులతో కత్తి గొప్ప దా? కలం గొప్పదా? లాంటి విషయాలపై వ్యాస రచన చేయించడం ఏ రకమైంది?
    1) విమర్శనాత్మక వ్యాసాలు
    2) ఆలోచనాత్మక వ్యాసాలు
    3) సంవాదాత్మక వ్యాసాలు
    4) వర్ణనాత్మక వ్యాసాలు
46. ఏ విధానంలో 'బాలబాలికలు స్వయంగా అభ్యసిస్తారు. ఉపాధ్యాయులు కేవలం మార్గదర్శులు' గా ఉంటారు?
    1) డాల్టన్ పద్ధతి 2) మాంటిస్సోరి పద్ధతి
    3) క్రీడా పద్ధతి 4) ప్రాజెక్టు పద్ధతి
47. 1956లో త్రిభాషా సూత్రాన్ని రూపొందించినవారు?
    1) యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్
    2) జాతీయ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ
    3) జాతీయ విద్యా పరిశోధన శిక్షణా సంస్థ
    4) కేంద్రీయ విద్యా విషయక సలహా సంఘం
48. ఉపవాచకం అధ్యయనం చేయాలంటే ఏ పఠనం ఆమోదయోగ్యం?
    1) బాహ్య పఠనం 2) క్షుణ్ణ పఠనం
    3) ప్రకాశ పఠనం 4) విస్తార పఠనం
49. సి.పి.బ్రౌన్ అభిప్రాయం ప్రకారం, ఏ జిల్లాలో మాట్లాడే తెలుగు భాషా రూపం ఆధునిక ప్రామాణిక భాషగా గుర్తింపు పొందింది?
    1) కృష్ణా, గుంటూరు
    2) కృష్ణా, ఉభయ గోదావరి
    3) కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి
    4) కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి
50. సహపాఠ్య కార్యక్రమాలు అనేవి?
    1) బోధనను సులువు చేస్తాయి.
    2) పాఠ్యప్రణాళికకు సన్నిహితంగా ఉండవు.
    3) భాషా సామర్థ్యాల ప్రకటనకు అవకాశం కల్పిస్తాయి.
    4) విద్యార్థుల్లో భాషాజ్ఞానం పెంపొందిస్తాయి.

#### సమాధానాలు

| | | | | |
|---|---|---|---|---|
| 1) 2 | 2) 2 | 3) 4 | 4) 2 | 5) 1 |
| 6) 1 | 7) 2 | 8) 1 | 9) 2 | 10) 3 |
| 11) 4 | 12) 4 | 13) 4 | 14) 3 | 15) 1 |
| 16) 4 | 17) 4 | 18) 2 | 19) 2 | 20) 2 |
| 21) 2 | 22) 2 | 23) 4 | 24) 3 | 25) 1 |
| 26) 2 | 27) 3 | 28) 1 | 29) 4 | 30) 4 |
| 31) 2 | 32) 3 | 33) 3 | 34) 4 | 35) 3 |
| 36) 1 | 37) 2 | 38) 1 | 39) 4 | 40) 3 |
| 41) 1 | 42) 3 | 43) 3 | 44) 3 | 45) 3 |
| 46) 1 | 47) 4 | 48) 4 | 49) 2 | 50) 3 |

# భారతదేశంపై దండెత్తిన మొదటి ముస్లిం రాజు ఎవరు?

**కుతుబ్‌షాహీలు గోల్కొండను రాజధానిగా చేసుకొని సుమారు 171 ఏళ్లపాటు పరిపాలించారు. వీరు ఆంధ్రదేశాన్ని సమైక్యం చేసి ఆంధ్ర సంస్కృతిని పోషించారు. తెలుగు ప్రజల ఆదరాభిమానాలను పొందారు. గోల్కొండ రాజ్యంలోని ప్రజల్లో మూడో వంతు హిందువులేనని గుర్తించి, వారి హృదయాలను చూరగొంటే తప్ప సుస్థిర పాలన చేయలేమని భావించారు. జాతి, మత భేదాలను పాటించకుండా అర్హత, సామర్థ్యం ఉన్న వారికి ఉన్నత ఉద్యోగాలిచ్చి ప్రోత్సహించారు.**

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

## కుతుబ్‌షాహీల పాలనా వ్యవస్థ

కుతుబ్‌షాహీలు పరదేశీయులు, ఇతర మతస్థులు అనే భావన ప్రజల్లో రానీయకుండా పరిపాలన చేసినట్లు దక్కన్‌లో వెలువడిన సమకాలీన సాహిత్యం వల్ల తెలుస్తోంది. కుతుబ్ షాహీల పాలనా విధానం, రాజకీయ, ఆర్థిక, మత పరిస్థితులను సమగ్రంగా పరిశీలించడానికి ఇండో-పారశీక చరిత్ర, అబ్దుల్లా కుతుబ్‌షా, ఔరంగజేబు మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, అక్బర్ నుంచి ఔరంగజేబు వరకు లభిస్తున్న మొగలుల చరిత్ర, గోల్కొండ కవుల సాహిత్యం దోహదపడుతున్నాయి. వీటితో పాటు గోల్కొండను సందర్శించిన బౌరే, టవర్నియర్, తెవ్‌నాట్, బెర్నియర్, మెత్తవోల్డ్, మనుస్సీ, మూర్‌లాండ్ లాంటి విదేశీ యాత్రికుల కథనాలు, వారి యాత్రానుభవాలు వీరి పాలన గురించి తెలియజేస్తున్నాయి. మధ్యయుగ చరిత్రను తెలియజేసే క్రానికల్లు, మెకంజీస్ సేకరించిన కైఫీయతులు, సుల్తానులు జారీచేసిన ఫర్మానాలు కూడా ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి.

కుతుబ్‌షాహీలు బహమనీ సుల్తానుల పాలనా విధానాన్నే అనుసరించారు. ప్రభుత్వ యంత్రాంగంలో సుల్తాన్ ప్రధానపాత్ర పోషించేవాడు. రాజ్యాధిపతిగా ఆయనే శాసనకర్త. సుల్తాన్ తనకు తాను దేవుని ప్రతిబింబం (జిలుల్లా)గా, దైవాంశ సంభూతుడిగా విశ్వసించి నిరంకుశంగా రాజ్యపాలన చేసేవాడు. రాజే సర్వాధికారి, సైన్యాధిపతి, ఉన్నత న్యాయాధిపతి. ప్రభుత్వ విధానాలను రూపొందించి ఫర్మానాలు జారీ చేయడంతోపాటు రాయబారులను, ఉన్నతోద్యోగులను సుల్తానే నియమించేవాడు. రాజ ఆస్థానం ఎల్లప్పుడూ ఆడంబర విలాసాలతో నిండి ఉండేదని సమకాలీన సాహిత్యం ద్వారా తెలుస్తోంది.

సుల్తాన్ సర్వాధికారి అయినప్పటికీ దైవానికే సమాధానకర్తగా వ్యవహరించేవారు. ఖురాన్ గ్రంథం, సూఫీ మత ప్రభావం వల్ల ప్రజల యోగక్షేమాలు చూసేవారు. రాజధానిలో రాజ్య వ్యవహారాలు చర్చించి, విధాన నిర్ణయాలను అమలు చేయడానికి మజ్లిస్-దివాన్‌దారీ, మజ్లిస్-ఇ-కింగాష్ అనే పండిత పరిషత్తులు ఉండేవి. ఇందులో మతాచార్యులు, విద్వాంసులు, రాజనీతిజ్ఞులు, ఉన్నత ఉద్యోగులు సభ్యులుగా ఉండి సుల్తాన్‌కు రాజ్య వ్యవహారాల్లో సూచనలు, సలహాలు ఇస్తుండేవారు.

సుల్తాన్ తర్వాతి స్థానం ప్రధానమంత్రిది. కుతుబ్‌షాహీల కాలంలో ప్రధానమంత్రిని వకీల్-ఇ-ముకాలఖ్ (లేదా) పీష్వా అని పిలిచేవారు. ఇతడు రాజ్యంలో సాధారణ పరిపాలనతో పాటు బహిర్గత, అంతర్గత వ్యవహారాలు నిర్వహించేవాడు. ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో ముస్తాఫాఖాన్ ఆర్దిస్థానీ, మహమ్మద్ కులీకుతుబ్‌షా కాలంలో మీర్ మెమిన్ అస్త్రాబాది, అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో షేక్ మహమ్మద్ ఇబన్‌ఖాతున్ లాంటి వారు ప్రధాన మంత్రులుగా పేరు పొందారు. ప్రధానమంత్రి తర్వాతి స్థానం మీర్ జుమ్లా (మంత్రి)కు ఉండేది. ఇతడు ఆర్థిక, రెవెన్యూ శాఖలతోపాటు రాజ్యంలో రాబడి, ఖర్చులకు సంబంధించిన కార్యకలాపాలను ప్రధానంగా నిర్వహించేవాడు. కొన్ని సందర్భాల్లో పీష్వా కంటే ఎక్కువ అధికారం చెలాయించేవాడు. హైదరాబాద్ నగర నిర్మాత మహమ్మద్ కులీ కుతుబ్‌షా కాలంలో మీర్జామహమ్మద్ అమీన్, అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో మీర్ మహమ్మద్ సయీద్ లాంటి వారు ఆర్థికశాఖా మంత్రులుగా గొప్ప పేరు గడించారు. పీష్వా (లేదా) ప్రధానమంత్రి పేరును అబుల్ హసన్ తానీషా కాలంలో దివాన్‌గా మార్చారు. మాదన్న దివాన్‌గా పేరు గడించాడు. కోశాధికారిని 'ఖజాన్‌దార్'గా, గణాంక శాఖాధికారిని 'మజుందార్'గా, పోలీస్ కమిషనర్‌ను 'కొత్వాల్'గా, పౌర ఉద్యోగిని 'హవల్దార్'గా పిలిచేవారు. ప్రధాన రెవెన్యూ ఉద్యోగిని 'సర్‌ఖేల్' అని పిలిచేవారు. అన్ని రాష్ట్రాలపై ఇతడు పర్యవేక్షణాధికారిగా వ్యవహరించేవాడు. ప్రభుత్వ ఉత్తర, ప్రత్యుత్తరాలను పర్యవేక్షించడానికి డబీరులు అనే ఇద్దరు కార్యదర్శులు ఉండేవారు. డబీర్ అంటే పండితుడు అని అర్థం. వీరిలో ఒకరు తప్పనిసరిగా హిందువు ఉండేవాడు. ఇతడు సుల్తాన్ జారీ చేసిన ఫర్మానాలను స్థానిక భాషల్లోకి అనువాదం చేసేవాడు. కొత్వాల్ రక్షక భటాధికారి. రాజ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ ఇతడి ప్రధాన విధి.

రాజ్యాన్ని తరఫ్‌లు (రాష్ట్రాలు)గా విభజించారు. అబుల్ హసన్ తానీషా కాలంలో ఆరు తరఫ్‌లు ఉండేవి. వీటిలో తెలంగాణా ప్రాంతం ఒకటి. రాష్ట్రాలను సర్కార్లు(జిల్లాలు)గా, సర్కార్లను పరగణాలు(తాలూకాలు)గా విభజించారు. రాష్ట్రానికి తరఫ్‌దార్ (గవర్నర్) అధిపతి. జిల్లా-తాలూకా అధికార్లను ఫౌజ్‌దార్లు అనేవారు. వీరికి సహాయంగా హవల్దార్లు ఉండేవారు. మచిలీపట్నం లాంటి రేవు పట్టణానికి హవల్‌దార్లు ఉండేవారు. ప్రధాన రేవు అధికారిని షా బందర్ అని పిలిచేవారు. సర్కార్లను సీమలు అని కూడా పిలిచేవారు. బెల్లంకొండ, వినుకొండ, నిజాంపట్నం, కొండపల్లి, మచిలీపట్నం, ఏలూరు, రాజమండ్రి మొదలైన 22 సీమలు ఉండేవి. అబుల్ హసన్ కాలంలో 37 సర్కారులు, 517 పరగణాలు ఉండేవి.

రేవు పట్టణాల్లో షాబందర్, హవల్‌దార్లు సుంకాలు వసూలుచేసేవారు. రాజ్యంలో శిస్తు వసూళ్లను వేలంపాటల ద్వారా అమ్మేవారు. సర్కార్లను కొన్ని ప్రాంతాలుగా విభజించి ఇష్టమైన వారికి శిస్తు వసూలు అధికారాన్ని ఇచ్చేవారు. ప్రభుత్వానికి, రైతుకు మధ్య ఇద్దరు లేదా ముగ్గురు మధ్యవర్తులు ఉండటంతో రైతుపై శిస్తుభారం విపరీతంగా పెరిగింది. దేశ్‌పాండే, ఠాణేదార్లు, దేశ్‌ముఖ్‌లు, మజుందార్లు, తలస్‌కర్ణి లాంటి వారి పాత్ర నిరంకుశంగా ఉండేది. వీరు గ్రామీణ రైతులను దోచుకు తినేవారు. అబుల్ హసన్ పాలనా కాలంలో మజ్లిస్-ఇ-దివాన్ (ప్రివీ కౌన్సిల్) ఏర్పడింది. ఇది రోజూ క్రమం తప్పకుండా సమావేశం అయ్యేది. ఈ సంఘంలో 20 మంది సభ్యులు ఉండేవారు. వీరికి వేతనాల కింద జాగీర్లు ఇచ్చేవారు.



## వాస్తు, స్మారక నిర్మాణాలు

వాస్తుపరంగా విశిష్టమైన కుతుబ్ షాహీ శైలి వెలుగులోకి వచ్చింది. వీరు బహమనీ సుల్తాన్ల వాస్తు విధానాన్నే అనుసరించారు. పెద్ద గుమ్మటాలు, విశాలమైన ప్రవేశ ద్వారాలు, ఎత్తైన మినార్లు, అష్టకోణాకృతి నిర్మాణాలు ఈ శైలికి సంబంధించిన ముఖ్య లక్షణాలు. చార్మినార్, చార్‌కమాన్, మక్కామసీదు, టోలీ మసీదు, గోల్కొండ కోట, గోల్కొండ సమాధులు తదితరాలను ముఖ్యమైన వాస్తు కట్టడాలుగా పేర్కొనవచ్చు.

కుతుబ్‌షాహీ మూడో సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో మూసీ నదిపై పురానాపూల్ (పాత వంతెన)ను 1578లో నిర్మించారు. ఇతడి కాలంలోనే హుస్సేన్‌సాగర్, బద్వేల్, ఇబ్రహీంపట్నంతో పాటు గోల్కొండ కోటలో ఇబ్రహీం మసీదును నిర్మించారు. మహమ్మద్ కులీకుతుబ్ షా 1591లో మూసీనది ఒడ్డున 'చిచలం' గ్రామంలో ప్లేగు వ్యాధి నివారణకు గుర్తుగా చార్మినార్‌ను నిర్మించాడు. 1594లో హైదరాబాద్‌లో జమామసీదు, బాదుషాహీ అసూర్ ఖానా (పత్తర్‌గట్టీ), దారుల్‌షిఫా, చార్‌కమాన్ లాంటివాటిని నిర్మించారు. వీటిని రాయి, సున్నంతో నిర్మించారు. మహమ్మద్ కుతుబ్‌షా(1612-26)కాలంలో 1617లో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్దదైన మక్కామసీదును నిర్మించారు. కుతుబ్‌షాహీల స్మారక నిర్మాణాలు, గోల్కొండ కోట అంతర్భాగంలో భక్త రామదాసు బందీఖానా, రాణీమహల్, సుల్తానుల మరణానంతరం ఖననానికి ముందు స్నానం చేయించే గదులు నేటికీ ఉన్నాయి. కుతుబ్‌షాహీల సమాధులు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వాస్తు స్మారక నిర్మాణాలు. కుతుబ్‌షాహీల నిర్మాణాలన్నింటిలో అత్యంత విశాలమైన మైదానంలో నిర్మించినవి ఇవే. ఒకే రాజవంశానికి చెందిన సుల్తానుల సమాధులన్నీ ఒకే ప్రాంగణంలో నిర్మించడం ప్రపంచచరిత్రలో ఇక్కడ మాత్రమే కనిపిస్తుంది. సమాధి డోమ్ అంతర్భాగాన్ని కోణాకృతిలో ప్రత్యేక సాంకేతిక పద్ధతిలో నిర్మించారు.

### గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఇంగ్లిష్ తూర్పు ఇండియా వర్తక సంఘానికి మచిలీపట్నంలో ఫ్యాక్టరీని స్థాపించడానికి అనుమతి ఇచ్చినవారెవరు? (గ్రూపు-2, 2008)
   జవాబు: అబ్దుల్లా కుతుబ్ షా
2. బీరారు రాజ్యాన్ని స్థాపించిన వంశస్థులు? (గ్రూపు-2, 2005)
   జవాబు: ఇమాద్ షాహీలు
3. ఆది మహాదేవుని దేవాలయం సమీపాన జన్మించిన నది ఏది? (గ్రూపు-2, 2005)
   జవాబు: గోదావరి
4. భగవద్గీతను పర్షియన్ భాషలోకి తర్జుమా చేసినవారెవరు? (గ్రూపు-1, 2003)
   జవాబు: దారాషికో
5. ప్రాకృత భాషలో సంకలనం చేసిన 'గాథా సప్తశతి' వేటి గురించి వివరిస్తుంది? (సివిల్స్ ప్రిలిమ్స్-2002)
   జవాబు: శృంగారగాథలు
6. భారతదేశంపై దండెత్తిన మొదటి ముస్లిం రాజు ఎవరు? (గ్రూపు-2, 2000)
   జవాబు: మహమ్మద్‌బిన్ కాశిమ్
7. కిందివాటిలో సరికాని జత ఏది? (నాన్ గెజిటెడ్ జనరల్ స్టడీస్-2005)
   ఎ) నిజాం షాహీ - అహమ్మద్‌నగర్
   బి) ఆదిల్ షాహీ - బీజాపూర్
   సి) కుతుబ్ షాహీ - గోల్కొండ
   డి) ఇమాద్ షాహీ - బీదర్
   జవాబు: డి
8. కిందివాటిలో మహమ్మద్ కులీకుతుబ్ షా నిర్మించని కట్టడం? (గ్రూప్-1, 2003)
   ఎ) గోల్కొండ బి) హైదరాబాద్
   సి) చార్మినార్ డి) జమా మసీద్
   జవాబు: ఎ
9. 'చార్మినార్'ను దేనికి గుర్తుగా నిర్మించారు? (గెజిటెడ్-2005)
   జవాబు: ప్లేగు వ్యాధి నిర్మూలనలో విజయం
10. ఔరంగజేబు గోల్కొండను జయించిన సంవత్సరం? (గెజిటెడ్-2005)
   జవాబు: క్రీ.శ. 1687

# Whose rank is first in a class test?

BANK EXAMS

REASONING



## MODEL QUESTIONS

***Directions (Q. No. 1-5):*** Study the following information carefully and answer the following questions.

P, Q, R, S, T and U are six members of a group in which there are three female members. Females work in three departments - Accounts, Administration and HR - and sit on three different floors - Ground floor, first floor and second floor. Person working in the same department are not on the same floor. On each floor two persons work. No two females work in the same department or sit on the same floor. Q and T work in the same department but not in HR. S works in Administration. T and P are on the ground floor and second floor respectively and work in the same department. S, a female does not sit on the first floor. R, a male works on ground floor. U, works on the first floor; and S and P work on the same floor.

1. Which of the following group of members are female?
   1) S, T, U 2) R, S, T
   3) Q, T, U 4) P, S, U
   5) Can't be determined
2. Which of the following pair of person work in Administration?
   1) R, S 2) Q, S 3) R, T
   4) Data inadequate
   5) None of these
3. Which of the following pair works on second floor?
   1) P, S 2) R, S 3) Q, U
   4) S, T 5) None of these
4. U works in which department?
   1) Accounts 2) HR
   3) Administration
   4) Either HR or Administration
   5) None of these
5. If U is transferred to Accounts and T is transferred to Administration, who is to be transferred to HR to maintain the original distribution of female on each floor.
   1) R 2) S 3) Q or S
   4) Data inadequate
   5) None of these

***Directions (Q. No. 6-8):*** Study the following information carefully and answer the given questions.

Six students A, B, C, D, E and F wrote an exam and the following is the data regarding their marks (maximum marks is 20).

- E got twice as much as A.
- A got one-and-a-half times as much as C.
- B got one-third of the marks scored by E.
- D got double that of C.
- F scored 6 marks more than A but is not the topper of the class.

(All marks are integers)

6. Who is the topper of the class & how many marks did he obtain?
   1) D - 15 2) E - 12 3) A - 18
   4) D - 12 5) E - 18
7. How much more marks does A have to score to be the topper? (if only one person is on 1st position.)
   1) 9 2) 6 3) 8 4) 10 5) 12
8. What is the difference between the marks obtained by C and F?
   1) 6 2) 7 3) 5 4) 8 5) 9

***Directions (Q. No. 9-13):*** Each of the questions below consists of a question and three statements numbered I, II and III given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question and then mark the appropriate option as answer.

9. Six friends M, T, S, R, U and W are sitting around a circular table facing the centre. What is the position of S with respect to M?
   I) M is between R and T.
   II) R sits second to the left of W.
   III) U does not sit on the immediate right of R.
   1) Only I and II
   2) Only II and III
   3) Only III 4) Only I and III
   5) All I, II and III together
10. What is the code for 'cold' in a code language?
   I) 'icecream is cold' is written as 'tic jic lic'.
   II) 'fruits are healthy' is written as 'mic fic eic'.
   III) 'healthy is icecream' is written as 'jic mic lic'.
   1) Only I 2) Only II
   3) Only I and II 4) Only III and I
   5) None of these
11. Among P, Q, R, S, T and U, whose rank is first in a class test?
   I) P scored more than only R and S.
   II) T's rank is 3rd highest.
   III) U did not score the highest marks.
   1) Only I 2) Only II 3) Only III
   4) I, II and III even together are not sufficient to answer the question. 5) All I, II and III
12. Five persons Jitesh, Jeevan, Jeet, Jai and Jeena sit on a straight line, facing north, but not necessarily in the same order. How many persons sit between Jitesh and Jai?
   I) Jeet sits second to the right of Jitesh. Jai is not an immediate neighbour of Jitesh.
   II) Jeena sits on the extreme end of the line.
   III) Jeet sits on the immediate right of Jeevan.
   1) Only II 2) Only III
   3) Only I and II 4) Only I and III
   5) All I, II and III together
13. How is N related to X?
   I) M is brother of N; M is grandson of W.
   II) S is sister of N.
   III) X is mother of M's father.
   1) Only I 2) Only II 3) Only III
   4) All I, II and III together
   5) Even I, II and III together are not sufficient

***Directions (Q. No. 14 - 18):*** Study the following information carefully and answer the given questions:

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement. (All the numbers are two-digit numbers.)

**Input:** set near 14 19 went 20 78 ago 80 toy 36 pink 42 colour
**Step I:** went set near 19 20 78 ago 80 toy 36 pink 42 colour 14
**Step II:** went toy set near 20 78 ago 80 36 pink 42 colour 14 19
**Step III:** went toy set pink near 78 ago 80 36 42 colour 14 19 20
**Step IV:** went toy set pink near colour 78 ago 80 42 14 19 20 36
**Step V:** went toy set pink near colour ago 78 80 14 19 20 36 42
**Step VI:** went toy set pink near colour ago 80 14 19 20 36 42 78
**Step VII:** went toy set pink near colour ago 14 19 20 36 42 78 80

Step VII is the last step of the above input, as the desired arrangement is obtained.

As per the rule followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

**Input:** one 15 and 90 two 88 12 make 18 so 21 thus 56 near.

(All the numbers are two-digit numbers.)

14. Which step number is the following output?
   two thus so one near and 90 88 make 56 12 15 18 21
   1) Step V 2) Step VI
   3) Step IV 4) Step III
   5) There is no such step
15. How many elements (words or numbers) are there between 'make' and '18' as they appear in last but one step?
   1) 3 2) 4 3) 5 4) 2 5) 6
16. How many steps would be required to get the final output?
   1) Five 2) Six 3) Four
   4) Seven 5) None of these
17. Which of the following represents the position of 'and' in the fifth step?
   1) Sixth from the left
   2) Seventh from the left
   3) Fourth from the right
   4) Eighth from the left
   5) Sixth from the right
18. Which word/number would be at fifth position from the right in Step VI?
   1) 12 2) 18 3) 90
   4) and 5) 15

### Answers With Explanations

**(1-5):**


| Person | Sex | Floor | Department |
|---|---|---|---|
| P | Male | Second floor | Accounts |
| Q | Male | First floor | Accounts |
| R | Male | Ground floor | HR/Administration |
| S | Female | Second floor | Administration |
| T(-) | Female | Ground floor | Accounts |
| U(-) | Female | First floor | HR |

1) 1; 2) 4; 3) 1; 4) 2; 5) 2.

**(6-8):**
E → 18
F → 15
D → 12
A → 9
B/C → 6

6) 5; 7) 4; 8) 5;

9) 5;





From all three statements, M sits second to the left of S. So, all three statements are necessary to answer the question.

**10.** 4; From I and III,
icecream is cold → tic jic lic ...(1)
healthy is icecream → jic mic lic ...(2)
icecream → jic or lic
is → lic or jic
So, the code for 'cold' is 'tic'.
Thus, statements **I** and **III** are sufficient


**11.** 5; From I. P > R, S
**From I and II.** – > – > T > P > R, S
**From I, II and III.**
Q > U > T > P > R, S
Hence all together are sufficient

**12.** 3; **Form I.**




Thus I and II together are sufficient.

**13.** 5; **From I.** M is Brother of N and Grand-son of W and M is male.
**From II.** S is female and Sister of M,
**From III.** X is Grand mother of M.
So, in family tree, the sum of all three statements is as follows:
Here N's gender is not defined So, we




can't say whether N is Grandson or Granddaughter of X.

**(14-18):**

The machine rearranges words and numbers in such a way that numbers are arranged from right side and words are arranged from left side. While numbers are arranged in ascending order, words are arranged in reverse alphabetical order.

**Input:** one 15 and 90 two 88 12 make 18 so 21 thus 56 nears.
**Step I:** two one 15 and 90 88 make 18 so 21 thus 56 near 12
**Step II:** two thus one and 90 88 make 18 so 21 56 near 12 15
**Step III:** two thus so one and 90 88 make 21 56 near 12 15 18
**Step IV:** two thus so one near and 90 88 make 56 12 15 18 21
**Step V:** two thus so one near make and 90 88 12 15 18 21 56
**Step VI:** two thus so one near make and 90 12 15 18 21 56 88
**Step VII:** two thus so one near make and 12 15 18 21 56 88 90

**14.** 3;
**15.** 2;
Sixth step is the last but one.
There are four elements between 'make' and '18'.
The elements are : and, 90, 12 and 15
**16.** 4;
**17.** 2; **Step V:** two thus so one near make and 90 88 12 15 18 21 56
Thus, Seventh from the left is 'and'.
**18.** 5;
**Step VI:** two thus so one near make and 90 12 15 18 21 56 88.
Thus fifth from the right is 15